اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 2 సంచిక 5 & 6 డిశంబర్ 2010 - జనవరి 2011 రూ. 34/-



ప్రవక్త(స)వారి కాలంలోనే ఖుర్'ఆన్‌ను వేరే భాషలోకి అనువదించినది ఎవరు?

## మునాఫిక్ అంటే ఎవరు?

## హలాల్ వ్యాపారం

ఇస్లామ్‌లో పాలకుడు అంటే ప్రజలకు సేవ చేసేవాడేగాని సేవ చేయించుకునేవాడు కాదు

## ఇల్మ్ ప్రత్యేక సంచిక

ఓ అల్లాహ్! ప్రయోజనం లేని జ్ఞానం నుండి, స్వీకరించబడని వేడుకోలు నుండి, (మీకు) భయపడని హృదయం నుండి, తృప్తినొందని ఆత్మ నుండి మీ రక్షణ కోరుతున్నాను"

هُوَ اللَّهُ الْخَالِقُ الْبَارِئُ الْمُصَوِّرُ لَهُ الْأَسْمَاءُ الْحُسْنَىٰ
يُسَبِّحُ لَهُ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ وَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ

**He is ALLAH, the Creator, the Inventor, the Fashioner; to Him belong the best names. Whatever is in the heavens and earth is exalting Him. And He is the Exalted in Might, the Wise (Qur'an 59:24)**

# సృష్టికర్త

**అల్-ముసవ్విర్**

# الْمُصَوِّرُ

**రూపాలను తీర్చిదిద్దేవాడు**

***THE FASHIONER***

# الله

**అల్-బారీ**

# الْبَارِئُ

**ప్రతిదానిని సృజించేవాడు**

***THE INVENTOR***

# అల్లాహ్

**ఆయనే అల్లాహ్! విశ్వ సృష్టికర్త, ప్రతిదానిని సృజించేవాడు మరియు రూపాలను తీర్చిదిద్దేవాడు. ఆయనకు సర్వ శ్రేష్ఠమైన పేర్లున్నాయి. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న సమస్తమూ, ఆయన పవిత్రతను కొనియాడుతుంటాయి. మరియు ఆయనే సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (ఖుర్'ఆన్ 59:24)**

జిల్ హిజ్జా 1431 - సఫర్ 1432

# శాంతిబాట

మాసపత్రిక రూ. 34/-

సంపుటి 2 సంచిక 5&6 డిశంబర్'10-జనవరి'11

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Email:velugubaata@gmail.com

Cell : 9491103017

4 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ ప్రారంభం : 8 - 20 ఆయత్‌ల వివరణ ...

11 **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - వ్యాపారం ...

14 **హదీస్ విజ్ఞానం :** హదీస్ యొక్క సనద్ మరియు మతన్ బట్టి వర్గీకరణ ...

18 **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర**

19 **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం - సల్మాన్ ఫార్సీ (రజి)

32 **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** ప్రవక్త(స)వారి జననం ...

38 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

40 **బాలబాలికలకు ప్రత్యేకం :** దైవ ప్రవక్త ఆదమ్(అ) ...

47 **ఇల్మ్ (జ్ఞానం) :** ప్రత్యేక వ్యాసం ...

55 **ధర్మసందేశ ప్రచారం :** ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం. మునాఫిఖ్ అంటే ఎవరు? ...

63 **పాఠకుల అభిప్రాయాలు**

ఎడిటర్:
**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**
డా॥ సలీమ్ పాషా
డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు
ఎమ్‌డి. అఫ్జాన్ ఉమ్రీ

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440
and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440
and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)

**సంవత్సర చందా:**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:
**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440
**మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్రాయండి**

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు
మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి
**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

M.O. పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# బలహీనత

మనిషిలో బలహీనతలు ఉండడం సహజమే! కాని జ్ఞానం సంపాదించుకున్నవాడు ఇన్షాఅల్లాహ్ ఆ బలహీనతలను జయించ గలుగుతాడు. ఎందుకంటే జ్ఞానం గలవాడు మాత్రమే తనను సృష్టించిన అల్లాహ్‌కు ఎక్కువగా భయపడతాడు. దైవభీతి మరియు జ్ఞానం రెండింటిని గలవాడు ఈ లోకంలో సంతోషంగా బ్రతకడమే కాకుండా పరలోకంలోనూ మంచి సాఫల్యాన్ని పొందుతాడు. కాని మనిషి సాఫల్యం పొందకుండా ఉండేందుకు మానవుని ఆగర్భ శతృవైన షైతాన్ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాడు.

మనిషి అభివృద్ధికి మూలం జ్ఞానమే కాబట్టి, ఆ జ్ఞానాన్ని మనిషికి అందకుండా చేస్తే షైతాన్ విజయం సాధించినట్లే! శారీరకంగా బలహీనమైతే చుట్టూ ఉండే తోటి మనుష్యుల నుండి సానుభూతి అయినా లభిస్తుంది. కాని మానసిక బలహీనతలుంటే మాత్రం సమాజంలో సానుభూతికి బదులు, అవమానం లభిస్తుంది. ఐశ్వర్యం సంపాదించుకోవచ్చు. కాని ఆ ఐశ్వర్యం అతని మనస్సుకు తృప్తిని కలిగించదు.

మనిషిని మానసికంగా బలహీనపరిచే సాధనాలెన్నో నేడు ఉన్నాయి. మరెన్నింటినో కనిపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక వ్యక్తిలోని బలహీనతను గమనించి, అతనికి మేలు చేయాలని ఖుర్'ఆన్ మరియు సున్నత్ జ్ఞానాన్ని వినిపిస్తే, అతనికి అది నచ్చదు. అలా కాకుండా అతని బలహీనతను ఎవరైనా సమర్థిస్తే, ఆ సమర్థించిన వాడినే జ్ఞానం గలవానిగా, తన శ్రేయోభిలాషిగా స్వీకరించడాన్ని చూస్తున్నాము.

ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాలు చాలా భాషలలోకి అనువదించబడ్డాయి. ఎవరైనా తనకు కావలిసిన సమాచారాన్ని వాటిలో చదివి సులభంగా తెలుసుకోవచ్చు. కాని వాటిని చదవరు. ఎందుకంటే చదివిన తరువాత తాము చేసే పని పాపమని తెలిస్తే, శిక్షించబడతారనే భయం కొందరిలో ఉంది. చదవకపోతే తప్పు చేసినా అది పాపం క్రిందకు రాదు అనేది మరి కొందరి అభిప్రాయం. అందుకని తాము చేసే పని మంచిదేనని ఎవరైనా సమర్థిస్తారేమో నని ఎదురు చూస్తుంటారు. ఇటువంటి వారి బలహీనతను సొమ్ము చేసుకోవడానికి దొంగ బాబాలు, దొంగ గురువులు జోలె పట్టుకుని ఎల్లప్పుడూ రెడీగా ఉంటారు. "గురువు గారూ! నేను చేసే వ్యాపారంలో హరామ్ సంపాదన బాగా కలిసిపోతుంది. నేనేమీ చెయ్యాలి" అని ఓ వ్యాపారస్తుడు అడిగితే, సమాధానంగా "ఏం ఫర్వాలేదు! నీ సంపాదన నుండి కొంత సదఖా (దానం) ఇచ్చేస్తే నీ పాపం క్షమించబడుతుంది" అని గురువుగారు చెబుతారు. విన్నవారికి అది చాలా గొప్పగా అనిపిస్తుంది. అలా గొప్పగా అనిపించడానికి ఆ దొంగ జ్ఞాని ఖుర్'ఆన్‌లోని వాక్యాన్ని గాని లేదా ముహమ్మద్(స)వారి బోధనను గాని వక్రీకరించి చెబుతాడు. అది సహీహ్ హదీసేనని నమ్మిస్తాడు. ఇంత సులభంగా పాపపరిహారం అయిపోతుందని సంబరపడిపోయి ఆ దొంగ జ్ఞాని గారి జేబులు నింపేస్తున్నారు. కాని ఎంత దానం ఇచ్చినా సరే 'హరామ్' సంపాదన 'హలాల్' (ధర్మ సమ్మతం) కాదు.

ధర్మం గురించి పదిమందికి చెప్పి, వారికి మేలు చేసి తాము పుణ్యం సంపాదించు కోవాలనే కోరిక కొందరికి ఉంటుంది. కాని వారికుండే పని ఒత్తిడి వలన ఆ విధంగా చేయలేకపోతారు. ఇంకేముంది, వారి దగ్గరకు బెల్లం దగ్గర చీమలు చేరినట్లు దొంగ జ్ఞానులు చేరిపోతారు. మీరు సంపాదించి మాకు ఇస్తూ ఉండండి. మీ తరపున మేము ధర్మ ప్రచార బాధ్యతను మోస్తాము అని నమ్మబలుకుతారు. వారు చెప్పింది నిజమేననుకుని కష్టపడి సంపాదించి, ఆ ధనాన్ని వీరి చేతుల్లో పోస్తుంటారు. దాని వలన పుణ్యం వస్తుందని ఇచ్చిన వారు భ్రమలో ఉంటారు. కాని ఈ దొంగలు అది తినేసి, ఇస్లామ్‌కు వ్యతిరేకంగా పనిచేస్తూ ఉంటారు. పుణ్యానికి బదులు పాపాన్ని కొనితెచ్చుకున్నట్లు అవుతుంది ఇచ్చే దాతల పరిస్థితి. ఇలాంటి వారికి ఇవ్వకుండా, ఓ పేద కుటుంబానికి సహాయం చేస్తేనో, ఓ పేద విద్యార్థికి సహాయం చేస్తేనో, ఓ విధవరాలికి లేదా ఓ అభాగ్యురాలికి సహాయం చేస్తేనో పుణ్యం లభిస్తుందని వారు తెలుసుకుని ఉంటే ఎంత బాగుండేది! ఖుర్'ఆన్ మరియు హదీస్‌లు అవే బోధిస్తున్నాయి.

లక్షలు ఖర్చుపెట్టి (బిర్యానీ) ప్రోగ్రామ్‌లు ధర్మం పేరుతో జరుపుతారు. దాని కొరకు అన్ని ఊర్ల నుండి చందాలు వసూలు చేస్తారు. ఓ మోస్తరు పట్టణం నుండి కనీసం పదివేలో, ఇరవై వేలో చందా పంపిస్తారు. కాని చందా పంపిన అదే పట్టణంలో తిండికి కష్టమై, వైద్యానికి కష్టమై బాధలు పడేవారికి ఒక్క రూపాయి కూడా సహాయం అందదు. ఇది ధర్మమా? ఇదేనా ఖుర్'ఆన్ మనకు బోధించింది? ముహమ్మద్(స)వారు పేదవాడిని చూస్తే చలించిపోయేవారు. పేదవారికి సహాయం అందడం చూసేవరకూ ఆయన ముఖంలో సంతోషం కనిపించేది కాదు. మరి ఈ ప్రోగ్రామ్‌లు ఎవరిని సంతోషపెట్టడానికి?

రాజకీయ నాయకుడికి ఎప్పుడూ అధికారం కావాలి. అధికారం లేకపోతే ఉండలేడు. అది వాడి బలహీనత. కాబట్టి అధికార పార్టీ నాయకుడిని కుర్చీ నుండి క్రిందికి దించెయ్యాలని ఎల్లప్పుడూ ఆలోచిస్తూనే ఉంటాడు. అందుకోసం ఏ గడ్డి అయినా కరవడానికి సిద్ధమే. ఈ మధ్యనే ఒక జాతీయ ఇంగ్లీష్ దినపత్రికలో 'వికీలీక్స్' వెబ్‌సైట్ బహిర్గతం చేసిన కొన్ని కేబుల్స్‌ను ప్రచురించారు. అది చూసి ప్రతిపక్షంవారు అధికార పక్షాన్ని దుయ్యబట్టారు. అమెరికా దేశానికి చెందిన రాయబారి, మన దేశంలోని విషయాలను తన దేశానికి వ్రాసి పంపిస్తే, వాటినే నూటికి నూరు శాతం నిజాలుగా తీసుకుని సదరు నాయకులు పార్లమెంట్‌లో విలువైన సమయాన్ని వృధా చేయడం జరిగింది.

ప్రపంచంలో విశ్వసనీయత లేని మరియు దౌర్జన్యం చేసే దేశాలలో మొట్టమొదటి దేశం అమెరికా అని ప్రపంచ ప్రజలకు బాగా తెలుసు. అటువంటి దేశపు సమాచారాన్ని ఏ విధంగా ప్రామాణికమని నమ్ముతారు? ఇది జరిగిన తరువాత ప్రతిపక్షంవారి భాగోతాన్ని తెలిపే మరో కేబుల్ అదే దినపత్రికలో ప్రచురించబడగానే, ఈసారి అధికార పక్షం వారు తిరగబడ్డారు. ఈ నాయకులకు తాము కోరుకున్నట్లు, తమకు అనుకూలంగా ఉంటే చాలు, అది నిజమా? లేక అబద్ధమా? అని నిర్ధారించుకోవలసిన అవసరం లేదు.

స్విస్ బ్యాంకుల్లో కోట్లాది రూపాయల నల్లధనం మన వారిది ఉందని, దానిని మన దేశానికి తీసుకురావాలని ప్రతిపక్షాలు తీవ్రంగా పోరాడాయి. ఆ విధంగా పోరాడే నాయకులలో ఎవరికీ కూడా ఆ బ్యాంకుల్లో నిజంగా డబ్బు లేదంటారా? నల్లధనంపై పోరాటం చేస్తే, తమ దగ్గర నల్లధనం లేదని ప్రజలు నమ్ముతారని వారి భ్రమ అయివుంటుంది. ఆ విధంగా ప్రజలను నమ్మించ గలిగామని వారు అనుకోవచ్చేమో! స్విస్ బ్యాంకుల్లో తమ సంపదతో పాటు అధికార పక్షంవారి నల్లధనం కూడా ఉంటుందనేది వారికి తెలుసు. కాబట్టి వీరు ఎంత పోరాటం చేసినా అధికార పక్షం నల్లధనం జోలికి వెళ్లదనే ధీమాతో తమ పోరాటం వలన అంతా లాభమేనని భావించారు. కాని కథ అడ్డం తిరిగింది.

ఆందోళన చేసిన నాయకుల దురదృష్టం కొద్దీ, సుప్రీమ్ కోర్టు ప్రభుత్వాన్ని చీవాట్లు పెట్టింది. తప్పదు కాబట్టి హసన్ అలీ అనే ఒక వ్యక్తిని పట్టుకున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నారా? అని ఆశ్చర్యపోనవసరం లేదు. ఎందుకంటే వీరేమీ కష్టపడి అతనిని పట్టుకోలేదు. నిజంగా కష్టపడి పట్టుకుంటే, ఆ పట్టుబడిన వారి పేర్లతో ఓ మోస్తరు న్యూస్‌పేపర్ పూర్తిగా నిండిపోతుందేమో! ఇతడు ఎందరో రాజకీయ నాయకుల నల్లధనాన్ని, సినిమా హీరోల నల్లధనాన్ని స్విస్ బ్యాంకులకు తరలించి, ఆ కార్యక్రమాల ద్వారా కమీషన్‌గా వేల కోట్లు సంపాదించాడట. దీనిని బట్టి దాచుకున్న నాయకుల సొమ్ము ఏ మేర ఉంటుందో ఆలోచించండి. ఇతనిని అరెస్ట్ చేసి చాలా కాలమైంది. మిగిలిన వారి పేర్లు ఎందుకు బయటికి రాలేదు? నల్లధనాన్ని రప్పించండి అంటూ గోలగోల చేసిన ప్రతిపక్షాలు ఎందుకు మౌనంగా ఉన్నాయి?

పేదవాడినైతే థర్డ్ డిగ్రీ ఉపయోగించి, పోలీస్ స్టేషన్లో కుమ్మేసి నిజం చెప్పిస్తారు కదా! మరి బడాబాబులకు ఆ డిగ్రీ ఎందుకు ఉపయోగించరు? ఈ మధ్యనే అన్నా హజారేగారు అవినీతి వ్యతిరేక పోరాటం చేస్తే, ఎందరో మద్దతు తెలిపారు. రోడ్డు ప్రక్కన ఉండే పెద్ద పెద్ద హోర్డింగ్‌లపై మీతో మేమున్నాము అంటూ స్లోగన్స్ ఏర్పాటు చేసారు. మనం ఏమరుపాటులో గనుక వాటిని చూస్తే నిజంగా మన దేశానికి మంచి రోజుల వచ్చాయని అనిపిస్తుంది. కాని అది సత్యదూరమైన విషయం. ఎందుకంటే అన్నాహజారేగారికి మద్దతిచ్చిన వారిలో ఎంతోమంది అవినీతి నాయకులు, అధికారులు కూడా ఉన్నారు. వీరిలో ఎవరినైనా అవినీతి అంటే ఏమిటని ప్రశ్నిస్తే వారు ఏమి చెబుతారు? అవినీతిని అందరూ ఒకే విధంగా నిర్వచించగలరా?

ఏది ధర్మం? ఏది అధర్మం? ఏది నీతి? ఏది అవినీతి? ఇవి తెలియాలంటే దైవధర్మం ఏమిటో తెలుసుకోవాలి. దైవ ధర్మం ఒకేరకమైన ప్రమాణాన్ని సూచిస్తుంది. దానిని బట్టి నిర్ణయించాలి - ఏది నీతో మరి ఏది అవినీతో! ఈ బడాబాబులకు ***తమకు నచ్చినదే నీతి! తమకు నచ్చనిది అవినీతి!***

పాశ్చాత్య దేశాలకు ఆయిల్ బలహీనత ఉంది. ఈజిప్టులో ఎన్నో రోజులపాటు ముబారక్‌ను గద్దె దింపాలని ప్రజలు ఆందోళన చేశారు. కాని ఆ దేశ వ్యవహారాలలో ధూర్త దేశాలు మాటలతోనే గాని, చేతల ద్వారా ఎటువంటి జోక్యం చేసుకోలేదు. కారణం అక్కడ ఆయిల్ లేదు. కాని లిబియా విషయంలో మాత్రం, వెంటనే దాడులకు దిగిపోయాయి. తమ బలహీనతను కప్పిపుచ్చుకోవడానికి, లిబియాలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం కోసమే దాడులు చేస్తున్నామని చెబుతున్నారు. ఈ సందర్భంగా గదాఫీగారు దీనిని ఇస్లామ్‌పై క్రైస్తవుల దాడిగా అభివర్ణించారు. అమెరికావాని ద్వంద్వ నీతి గురించి అందరికీ తెలిసిందే! దానిని కాస్సేపు పక్కన పెట్టండి. మీ పరిపాలన ఇస్లామ్ ప్రకారంగా జరుగుతుందా? నిజంగా ఇస్లామ్ ప్రకారమే జరిగితే ప్రజలెందుకు తిరుగుబాటు చేస్తారు? అందరికీ ఆమోదయోగ్యమయ్యే అసలైన ప్రజాస్వామ్యం ఇస్లామ్‌లోనే ఉంది. ఇస్లామ్ ప్రకారం జీవించే వారికి అల్లాహ్ సహకారం ఉంటుంది. బద్ర్ యుద్ధ విజయం గురించి మరచిపోయారా? లేక అటువంటి విషయాలు తెలియవా?

రోజూ ఖుర్ఆన్ మరియు హదీస్ గ్రంథాలను చదివితే బలహీనతలను జయించి సంతోషంగా ఎలా బ్రతకాలో తెలుస్తుంది. కాని వాటిని చదవకుండా ఆపేందుకు *'శ్రమపడకుండా ఐశ్వర్యాన్ని సంపాదించాలనుకునే కొందరు సోమరిపోతులు'* ప్రజలను ఖుర్ఆన్‌కు దూరం చేస్తున్నారు. వీరిలో కొందరు ఖుర్ఆన్ వాక్యాలను వక్రీకరిస్తుంటే, మరికొందరు ప్రోగ్రామ్‌ల పేరుతో ప్రజల విలువైన సమయాన్ని, డబ్బుని వృధా చేస్తూ, ప్రజలకు ఖుర్ఆన్ చదివే సమయం లేకుండా చేస్తున్నారు. అజ్ఞానులు ప్రసంగిస్తుంటే, జ్ఞానులు అసహాయులై చూస్తున్నారు. జమియత్‌లకు నాయకత్వాన్ని వహించేవారికి ఏదీ అవసరం లేదు - కాస్త కూర్చోబెట్టి పొగిడితే చాలు, ఏ హరామ్ పనిచేసినా వారు అడ్డుకోరు. అందుకే జమియత్‌లు కోమాలోకి వెళ్ళిపోయాయి.

పైన చెప్పినవే కాకుండా, ఎన్నో రకాల బలహీనతలకు పరిష్కార మార్గాల కోసం ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలు చదవండి. మీరు ధర్మంగా బ్రతుకుతూ, మీకు ఖాళీ ఉన్న సమయంలో మీ కుటుంబం వారికి మీపై ఉన్న హక్కు ప్రకారంగా వారికి సరియైన సమయాన్ని కేటాయించి, మిగిలిన కొద్ది సమయాన్ని ఖుర్ఆన్ చదవడానికి ప్రయత్నించండి. ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం. ఎంతో వివేకంతో కూడిన ప్రసంగమది. దాని నుండి జ్ఞానాన్ని సముపార్జించుకోండి. అది మిమ్మల్ని సరియైన దారిలో ఉంచుతుంది. ఖుర్ఆన్ కేవలం అలంకారం కొరకు, సలాత్(నమాజ్)లో చదవడానికి మాత్రమే అవతరించబడలేదు. దానిని చదవడమే కాకుండా, అధ్యయనం చేసి, అర్థం చేసుకుని తదనుగుణంగా ఆచరించడం కొరకే అవతరించబడింది. ఆ విధంగా చేయకపోతే ఖుర్ఆన్‌ను గౌరవించనట్లే! తెలుగు అనువాదాలలో 'అల్లాహ్'పేరును తొలగించని ఖుర్ఆన్ అనువాదాలనే చదవండి.

ఏవో కొన్ని క్రోడీకరించబడిన ఆయత్‌లను మాత్రమే చదవడం కాకుండా, సంపూర్ణ ఖుర్ఆన్‌ను మీరు చదువుతూ ఇతరుల చేత చదివిస్తుండండి. సమయం మరియు సంపాదన చాలా విలువైనవి. వాటిని వృధా చేసుకోవద్దు. ఖుర్ఆన్ కేవలం పండితులకే అర్థమౌతుందని అనుకోవడం పొరపాటు. మీ మస్జిద్‌లలో హదీస్ గ్రంథాలు, ఖుర్ఆన్ తఫ్సీర్ (వివరణ) గ్రంథాలు లేకపోతే, చందాలు వేసుకుని ముందుగా వాటిని సమకూర్చుకుని, మీ స్నేహితులతో, మీ తోటి ముస్లిములతో కూర్చుని చదివి, **అధ్యయనం చేయండి**. ఇన్షా అల్లాహ్! ఆకాశాలనుండి ప్రశాంతత మీపై దిగుతుంది.

అందరికీ **అల్-హిక్మా** (ఖుర్ఆన్ మరియు సున్నత్ జ్ఞానం) అందాలని, అందరూ బలహీనతలను జయించి ధర్మంగా బ్రతకాలని కోరుకుంటూ -

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో
# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

15

## ఖుర్'ఆన్ తఫ్సీర్

**2. సూరహ్ అల్-బఖరా**

(గత సంచిక తరువాయి)

8. మరియు ప్రజలలో కొందరు : "మేము అల్లాహ్‌నూ మరియు అంతిమ దినాన్నీ విశ్వసించాము." అని అనే వారున్నారు. కానీ (వాస్తవానికి) వారు విశ్వసించేవారు కారు.

9. వారు తాము అల్లాహ్‌నూ మరియు విశ్వసించిన వారిని మోసగిస్తున్నారని (అనుకుంటున్నారు), కానీ వారు తమను తాము తప్ప మరెవ్వరినీ మోసగించడం లేదు. కాని వారది గ్రహించటం లేదు!

10. వారి హృదయాలలో రోగముంది. కాబట్టి అల్లాహ్ వారి రోగాన్ని మరింత అధికం చేశాడు. మరియు వారు అసత్యం పలుకుతూ ఉండటం వలన, వారికి బాధాకరమైన శిక్ష ఉంది.

| | | | | |
|---|---|---|---|---|
| ءَامَنَّا | يَقُولُ | مَن | ٱلنَّاسِ | وَمِنَ |
| మేము విశ్వసించాము | చెబుతారు | (కొందరు) వారు | ప్రజలు | మరియు నుండి |
| هُم | وَمَا | ٱلْءَاخِرِ | وَبِٱلْيَوْمِ | بِٱللَّهِ |
| వారు | మరియు కాదు | అంతిమ | మరియు దినంపై | అల్లాహ్‌పై |
| وَٱلَّذِينَ | يُخَـٰدِعُونَ ٱللَّهَ | | ۝٨ | بِمُؤْمِنِينَ |
| మరియు వారు(ని) | వారు అల్లాహ్‌ను మోసగించాలను కుంటున్నారు | | 8 | విశ్వసించేవారు |
| أَنفُسَهُمْ | إِلَّآ | يَخْدَعُونَ | وَمَا | ءَامَنُوا۟ |
| స్వయంగా వారినే | తప్ప | వారు మోసగిస్తారు | మరియు కాదు | విశ్వసించా(రో) |
| قُلُوبِهِم | فِى | ۝٩ | يَشْعُرُونَ | وَمَا |
| వారి హృదయాలు | లో | 9 | వారు అది గ్రహిస్తారు | మరియు కాదు |
| وَلَهُمْ | مَرَضًا | فَزَادَهُمُ ٱللَّهُ | | مَّرَضٌ |
| మరియు వారికొరకు | రోగం(లో) | కాబట్టి అల్లాహ్ వారిని అధికం చేస్తాడు | | రోగం (ఉంది) |
| يَكْذِبُونَ | كَانُوا۟ | بِمَا | أَلِيمٌۢ | عَذَابٌ |
| వారు అబద్ధాలు పలుకుతారు | చేసేవారు | ఎందుకంటే (అందువలన) | బాధాకరమైన | శిక్ష (ఉంది) |

11. మరియు భూమిలో కల్లోలం రేకెత్తించకండి.'' అని వారితో అన్నప్పుడు, వారు : ''మేము సంస్కర్తలము మాత్రమే!'' అని అంటారు.

12. జాగ్రత్త! నిశ్చయంగా, (భువిలో) కల్లోలం రేకెత్తిస్తున్న వారు వీరే, కాని వారది గ్రహించటం లేదు.

13. మరియు ''ప్రజలు విశ్వసించినట్లు మీరూ విశ్వసించండి.''అని వారితో అన్నప్పుడు, వారు: ''మూర్ఖులు విశ్వసించినట్లు మేమూ విశ్వసించాలా?'' అని జవాబిస్తారు. జాగ్రత్త! వాస్తవానికి వారే మూర్ఖులు. కాని వారికది తెలియదు.

14. మరియు విశ్వాసులను కలిసినప్పుడు, వారు : ''మేము విశ్వసించాము.'' అని అంటారు. కానీ తమ షైతానుల (దుష్ట నాయకుల) దగ్గర ఏకాంతంలో ఉన్నప్పుడు వారు: ''నిశ్చయంగా, మేము మీతోనే ఉన్నాము కేవలం (వారిని) ఎగతాళి చేస్తున్నాము'' అని అంటారు.

۝١٠ وَإِذَا قِيلَ لَهُمْ لَا تُفْسِدُوا۟

కల్లోలాన్ని వ్యాపించ(ం) (చేయ) వద్దు వారికి చెప్పబడింది మరియు అప్పుడు (10)

فِى ٱلْأَرْضِ قَالُوٓا۟ إِنَّمَا نَحْنُ

మేము మాత్రమే వారు చెబుతారు భూమి లో

مُصْلِحُونَ ۝١١ أَلَآ إِنَّهُمْ هُمُ

వారే స్వయంగా వాస్తవానికి వారు జాగ్రత్త (11) సంస్కర్తలము

ٱلْمُفْسِدُونَ وَلَـٰكِن لَّا يَشْعُرُونَ ۝١٢

(12) వారు (దానిని) గ్రహిస్తారు లేదు మరియు కాని కల్లోలాన్ని రేకెత్తించేవారు

وَإِذَا قِيلَ لَهُمْ ءَامِنُوا۟ كَمَآ ءَامَنَ

విశ్వసించారు గా, నట్టు (విశ్వసించినట్లు) విశ్వసించండి వారికి చెప్పబడింది మరియు అప్పుడు

ٱلنَّاسُ قَالُوٓا۟ أَنُؤْمِنُ كَمَآ ءَامَنَ

విశ్వసించారు | గా, నట్టు (విశ్వసించినట్లు) మేము విశ్వసించాలా? వారు చెబుతారు ప్రజలు

ٱلسُّفَهَآءُ أَلَآ إِنَّهُمْ هُمُ ٱلسُّفَهَآءُ

మూర్ఖులు వారే వాస్తవానికి వారు జాగ్రత్త! మూర్ఖులు ?

وَلَـٰكِن لَّا يَعْلَمُونَ ۝١٣ وَإِذَا لَقُوا۟

వారు కలుస్తారు మరియు అప్పుడు (మరియు వారు కలిసినప్పుడు) (13) వారు తెలుసుకుంటారు లేదు మరియు కాని

ٱلَّذِينَ ءَامَنُوا۟ قَالُوٓا۟ ءَامَنَّا وَإِذَا

మరియు అప్పుడు | మేము విశ్వసించా(ము) | వారు చెబుతారు | విశ్వసించా(రు) ఎవరైతే

خَلَوْا۟ إِلَىٰ شَيَـٰطِينِهِمْ قَالُوٓا۟ إِنَّا

నిశ్చయంగా వారు చెబుతారు వారి షైతానులు దగ్గర | వారు ఏకాంతంగా (ఉన్నారు)

مَعَكُمْ إِنَّمَا نَحْنُ مُسْتَهْزِءُونَ ١٤

(14) ఎగతాళిచేసేవారము | మేము | మాత్రమే | మీతో (ఉన్నాము)

ٱللَّهُ يَسْتَهْزِئُ بِهِمْ وَيَمُدُّهُمْ فِى

లో | మరియు వారిని అధికం చేస్తున్నాడు | వారిని | ఎగతాళి చేస్తున్నాడు | అల్లాహ్

طُغْيَٰنِهِمْ يَعْمَهُونَ ١٥ أُو۟لَٰٓئِكَ

వారు | (15) గుడ్డిగా తిరుగుతున్నారు | వారి తలబిరుసుతనం

ٱلَّذِينَ ٱشْتَرَوُا۟ ٱلضَّلَٰلَةَ بِٱلْهُدَىٰ

సన్మార్గంతో | దుర్మార్గాన్ని | కొనుక్కుంటారు | ఎవరైతే

فَمَا رَبِحَت تِّجَٰرَتُهُمْ وَمَا كَانُوا۟

చేసేవారు | మరియు కాదు | వారి బేరం | లాభదాయకం | కాబట్టి కాదు

مُهْتَدِينَ ١٦ مَثَلُهُمْ كَمَثَلِ ٱلَّذِى

అతడే | ఉదాహరణ వంటి | వారి ఉదాహరణ | (16) సన్మార్గాన్ని పొందినవారు

ٱسْتَوْقَدَ نَارًا فَلَمَّآ أَضَآءَتْ مَا حَوْلَهُۥ

అతని చుట్టుప్రక్కల | అది వెలిగింది | అప్పుడు, తరువాత | అగ్ని | కాల్చాడు

ذَهَبَ ٱللَّهُ بِنُورِهِمْ وَتَرَكَهُمْ فِى

లో | మరియు వారిని వదిలాడు | వారి కాంతి | అల్లాహ్ తీసుకున్నాడు

ظُلُمَٰتٍ لَّا يُبْصِرُونَ ١٧ صُمٌّۢ بُكْمٌ

మూగ | చెవుడు | (17) వారు చూడలేరు | చీకట్లు

عُمْىٌ فَهُمْ لَا يَرْجِعُونَ ١٨ أَوْ كَصَيِّبٍ

పెనుతుఫాను వంటి | లేక | (18) మరలి రాలేరు | కాబట్టివారు | గ్రుడ్డి

مِّنَ ٱلسَّمَآءِ فِيهِ ظُلُمَٰتٌ وَرَعْدٌ

మరియు ఉరుము | చీకట్లు | అందులో | ఆకాశం | నుండి

15. అల్లాహ్ వారిని ఎగతాళి చేస్తున్నాడు మరియు వారి తల బిరుసుతనాన్ని అధికం చేస్తున్నాడు (అందులో వారు) గుడ్డి వారై తిరుగుతున్నారు.

16. ఇలాంటి వారే, సన్మార్గానికి బదులుగా దుర్మార్గాన్ని కొనుక్కున్న వారు, కాని వారి బేరం వారికి లాభదాయకం కాలేదు మరియు వారు మార్గదర్శకత్వం పొందినవారు కాదు.

17. వారి ఉపమానం ఇలా ఉంది : ఒక వ్యక్తి అగ్నిని వెలిగించగా, అది పరిసరాలను ప్రకాశింపజేసిన తరువాత అల్లాహ్ వారి వెలుగును తీసుకొని వారిని అంధకారంలో విడిచిపెట్టడం వల్ల వారు ఏమీ చూడలేక పోతారు.

18. (వారు) చెవిటివారు, మూగవారు, గ్రుడ్డివారు, ఇక వారు (ఋజుమార్గానికి) మరలి రాలేరు.

19. లేక, (మరొక ఉపమానం): ఆకాశం నుండి ఘోరంగా వర్షం కురుస్తున్నది, చిమ్మచీకట్లలో ఉరుములు, మెరుపులు మెరుస్తున్నాయి. ఆ ఉరుముల భీకరధ్వని విని, మృత్యు భయం చేత వారు తమ వ్రేళ్ళను చెవులలో దూర్చు కుంటున్నారు. మరియు అల్లాహ్ సత్య తిరస్కారులను అన్ని వైపుల నుండి ఆవరించి ఉన్నాడు.

20.ఆ మెరుపు వారి దృష్టిని ఇంచుమించు ఎగురవేసుకు పోయి నట్లుంటుంది. ప్రతిసారి అది మెరిసినప్పుడు, వారు ముందుకు నడుస్తారు మరియు వారిపై చీకటి క్రమ్ము కొనగానే వారు ఆగిపోతారు. మరియు అల్లాహ్ కోరితే వారి వినికిడినీ మరియు వారి చూపునూ తొలగించేవాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| فِىٓ | | أَصَٰبِعَهُمْ | | يَجْعَلُونَ | وَبَرْقٌ |
| లో | | వారి వ్రేళ్ళను | | వారు ఉంచుతారు | మరియు మెరుపు |
| ٱلْمَوْتِ | | حَذَرَ | ٱلصَّوَٰعِقِ | مِّنَ | ءَاذَانِهِم |
| చావు | | భయం | ఉరుముల భీకర ధ్వని | నుండి | వారి చెవులు |
| يَكَادُ | (19) | بِٱلْكَٰفِرِينَ | | مُحِيطٌۢ | وَٱللَّهُ |
| దాదాపు | 19 | తిరస్కారులతో | | పరివేష్ఠించి ఉన్నాడు | మరియు అల్లాహ్ |
| كُلَّمَآ | | أَبْصَٰرَهُمْ | | يَخْطَفُ | ٱلْبَرْقُ |
| ఎప్పుడైనా | | వారి దృష్టి | | ఎగురవేసుకు పోతుంది | మెరుపు |
| أَظْلَمَ | وَإِذَآ | فِيهِ | مَّشَوْا۟ | لَهُم | أَضَآءَ |
| అది చీకటి అయింది | మరియు అప్పుడు | దానిలో | వారు నడిచారు | వారి కొరకు | అది మెరిస్తే |
| لَذَهَبَ | ٱللَّهُ | شَآءَ | وَلَوْ | قَامُوا۟ | عَلَيْهِمْ |
| ఆయన ఖచ్చితంగా తీసుకుపోతాడు | అల్లాహ్ తలచుకుంటే | | మరియు అయితే | వారు నిలబడ్డారు | వారిపై |
| ٱللَّهَ | إِنَّ | | وَأَبْصَٰرِهِمْ | | بِسَمْعِهِمْ |
| అల్లాహ్ | నిశ్చయంగా | | మరియు వారి దృష్టి | | వారి వినికిడి |
| (20) | قَدِيرٌ | شَىْءٍ | كُلِّ | | عَلَىٰ |
| 20 | సర్వశక్తిమంతుడు | వస్తువు | ప్రతీ | | పై |

(**ముఖ్య గమనిక :** ఖుర్‌ఆన్ అవగాహనను ప్రతీ ఒక్కరికీ సులభం చేయాలనే ఉద్దేశ్యంతో అరబీ పదాలకు పదాలవారీగా తెలుగులో అర్థాలనిస్తున్నాము. ఖుర్‌ఆన్ డిక్షనరీ కూడా దీనితో పాటు అందిస్తున్నాము. అరబీ పదానికి ఖచ్చితంగా సరిపోయే పదాన్ని తెలుగులో ఇవ్వడం సాధ్యం కాదు. అరబీ భాషను నేర్చుకోవడానికి ప్రయత్నించండి. అరబీ భాషను నేర్చుకోవడం కష్టమేమీ కాదు.)

## సూరహ్ అల్-బఖరా (8 నుండి 20 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| | | |
|---|---|---|
| 71. | ప్రజలు / మానవులు | اَلنَّاسُ |
| 72. | ఎవరు | مَنْ |
| 73. | అతడు చెబుతాడు/మాట్లాడుతాడు | يَقُوْلُ |
| 74. | మేము విశ్వసించాము, మేము విశ్వాసం కలిగి ఉన్నాము | اٰمَنَّا |
| 75. | వారు కాదు | مَاهُمْ |
| 76. | వారు మోసగిస్తారు | يُخَادِعُوْنَ (خ د ع) |
| 77. | కాని, తప్ప | إِلَّا |
| 78. | వారి వ్యక్తి/ఆత్మ | أَنْفُسَهُمْ (ن ف س) |
| 79. | వారు గ్రహించరు/తెలుసుకోరు | مَايَشْعُرُوْنَ |
| 80. | రోగం, జబ్బు, నీరసం | مَرَضٌ |
| 81. | కాబట్టి, అప్పుడు | فَ |
| 82. | అధికమైంది | زَادَ |
| 83. | బాధాకరమైన | أَلِيْمٌ |
| 84. | ఎందుకంటే | بِمَا |
| 85. | వారు (చేసేవారు) | كَانُوْا |
| 86. | వారు అబద్ధం చెబుతారు | يَكْذِبُوْنَ (ك ذ ب) |
| 87. | ఎప్పుడు, ఎప్పుడైనా | إِذَا |
| 88. | చెప్పబడింది | قِيْلَ |
| 89. | వారిపై, వారికి | لَهُمْ |
| 90. | మీరు కల్లోలం రేకెత్తించవద్దు | لَا تُفْسِدُوْا (ف س د) |
| 91. | భూమిపై | فِي الْأَرْضِ |
| 92. | వారు చెప్పారు | قَالُوْا (ق و ل) |
| 93. | మాత్రమే, వాస్తవానికి, నిశ్చయంగా | إِنَّمَا |
| 94. | మేము | نَحْنُ |
| 95. | సంస్కర్తలు | مُصْلِحُوْنَ (ص ل ح) |
| 96. | జాగ్రత్తగా ఉండు, బాగా తెలుసుకో | أَلَا |
| 97. | కల్లోలాన్ని రేకెత్తించేవారు | مُفْسِدُوْنَ (ف س د) |
| 98. | కాని | لٰكِنْ |
| 99. | వారు విశ్వసించారు | اٰمِنُوْا |
| 100. | వంటి, గా, అట్లు | كَمَا |
| 101. | ఏమిటి (ప్రశ్నార్థ సూచకం) | أَ |
| 102. | మూర్ఖులు | سُفَهَآءُ |
| 103. | వారు కలిశారు | لَقُوْا (ل ق ي) |
| 104. | మేము విశ్వసించాము / విశ్వాసులమయ్యాము | اٰمَنَّا |
| 105. | వారు ఒంటరివారు | خَلَوْا |
| 106. | షైతాన్‌లు, షైతాన్ వంటి ప్రవర్తన | شَيَاطِيْن |
| 107. | వెక్కిరించేవారు | مُسْتَهْزِءُوْنَ (ه ز ء) |
| 108. | పెంచుతున్నాడు (వదిలేస్తున్నాడు) | يَمُدُّ |
| 109. | మోసపూరిత | طُغْيَانْ |
| 110. | సందేహంలో గుడ్డిగా తిరుగుతారు | يَعْمَهُوْنَ (ع م ه) |
| 111. | వారు కొన్నారు | اِشْتَرَوْا (ش ر ي) |
| 112. | మోసం, దుర్మార్గం | ضَلَالَةٌ |
| 113. | సన్మార్గం | هُدٰى |
| 114. | కాబట్టి (అది) కాదు | فَمَا |
| 115. | లాభదాయకం | رَبِحَتْ |
| 116. | వ్యాపారం, బేరం | تِجَارَةٌ |
| 117. | సన్మార్గం పొందినవారు | مُهْتَدِيْنَ |
| 118. | ఉదాహరణ | مَثَلٌ |
| 119. | (అటు)వంటి | كَ |
| 120. | ఎవరైతే | الَّذِيْ |
| 121. | వెలిగించాడు | اِسْتَوْقَدَ (و ق د) |
| 122. | అగ్ని | نَارٌ |
| 123. | ఎప్పుడు | فَلَمَّا |
| 124. | వెలిగింది | أَضَآءَتْ (ض و ء) |

| | | | |
|---|---|---|---|
| 125. అతని చుట్టూ, అతని పరిసరాలు | حَوْلَهُ | 143. వ్రేళ్ళు | أَصَابِعْ |
| 126. తీసుకువెళ్ళాడు | ذَهَبَ | 144. చెవులు | اٰذَانٌ |
| 127. వదిలివెళ్ళాడు | تَرَكَ | 145. ఉరుముల రాపిడి ధ్వని | صَوَاعِقُ |
| 128. లో, మధ్యలో | فِيْ | 146. భయం, ప్రమాదం | حَذَرٌ |
| 129. చీకట్లు | ظُلُمَاتٌ | 147. చావు | مَوْتٌ |
| 130. వారు చూడరు | لَا يُبْصِرُوْنَ (ب ص ر) | 148. పరివేష్ఠించి ఉండేవాడు, చుట్టివేసేవాడు | مُحِيْطٌ |
| 131. చెవుడు (బహువచనం) | صُمٌّ | 149. దాదాపు, ఇంచుమించు | يَكَادُ |
| 132. మూగ (బహువచనం) | بُكْمٌ | 150. లాక్కున్నాడు, తీసుకువెళ్ళాడు | يَخْطَفُ (خ ط ف) |
| 133. గుడ్డి (బహువచనం) | عُمْيٌ | 151. తరచుగా, ఎప్పుడైనా | كُلَّمَا |
| 134. కాబట్టి వారు | فَهُمْ | 152. వారు నడిచారు | مَشَوْا (م ش ي) |
| 135. వారు వెనుకకు రారు, తిరిగిరారు | لَا يَرْجِعُوْنَ (ر ج ع) | 153. ఎప్పుడు | إِذَا |
| 136. లేక | أَوْ | 154. చీకటి అయింది | أَظْلَمَ (ظ ل م) |
| 137. వంటి | كَ | 155. వారు కదలకుండా నిలుచున్నారు | قَامُوْا |
| 138. ఫెను తుఫాను | صَيِّبٌ | 156. అయితే | لَوْ |
| 139. ఆకాశం | سَمَآءُ | 157. ఇష్టపడ్డ, కోరిన | شَآءَ (ش ي ء) |
| 140. ఉరుము | رَعْدٌ | 158. ప్రతీ వస్తువు | كُلِّ شَيْءٍ |
| 141. మెరుపు | بَرْقٌ | 159. సర్వశక్తిమంతుడు | قَدِيْرٌ |
| 142. వారు ఉంచుతారు | يَجْعَلُوْنَ | | |

**తఫ్సీర్** (2:8-20) :

ఈ వ్యాసంలో ఇచ్చిన 13 ఆయత్‌లలో తొలి రెండు ఆయత్‌లు కపట విశ్వాసుల లక్షణాన్ని నిర్వచిస్తున్నాయి.

**మరియు ప్రజలలో కొందరు : "మేము అల్లాహ్‌నూ మరియు అంతిమ దినాన్నీ విశ్వసించాము." అని అనే వారున్నారు. కానీ (వాస్తవానికి) వారు విశ్వసించేవారు కారు.**
**వారు తాము అల్లాహ్‌నూ మరియు విశ్వసించిన వారిని మోసగిస్తున్నారని (అనుకుంటున్నారు), కానీ వారు తమను తాము తప్ప మరెవ్వరినీ మోసగించడం లేదు. కాని వారది గ్రహించటం లేదు!**
(ఖుర్ఆన్ 2:8,9)

ఈ ఆయత్‌లు ముస్లిములమని వారు చేసే ప్రకటన అబద్ధమని, మోసపూరితమని తెలియజేస్తున్నాయి. వారు తెలివైన వారుగా కనిపించాలని ప్రయత్నిస్తున్నారు. చాలా స్పష్టమైన విషయం ఏమిటంటే - ఎవ్వడూ అల్లాహ్‌ను మోసం చేయలేడు - బహుశా వారే అటువంటి భ్రమను కలిగి ఉండలేరు. కాని ముహమ్మద్(స)వారిని మరియు ముస్లిములను మోసం చేయడానికి వారు చేసే ప్రయత్నాన్ని అల్లాహ్‌ను మోసగించే ప్రయత్నంగా ఖుర్ఆన్ చెబుతుంది.

చివరికి కపట విశ్వాసులు తమను తామే మోసగించుకుంటున్నారు. ముహమ్మద్(స) వారిని అన్నిరకాల కుతంత్రాల నుండి మరియు మోసం నుండి దివ్య సందేశం రక్షిస్తూనే ఉంటుంది. కాబట్టి కపట విశ్వాసులకు వారి దురహంకారానికి ఈ లోకంలోనూ మరియు పరలోకంలోనూ శిక్ష ఉంది.

**వారి హృదయాలలో రోగముంది. కాబట్టి అల్లాహ్ వారి రోగాన్ని మరింత అధికం చేశాడు. మరియు వారు అసత్యం పలుకుతూ ఉండటం వలన, వారికి బాధాకరమైన శిక్ష ఉంది.**

వ్యాధి లేదా రోగం అనేది వైద్యశాస్త్ర పరంగా ఒక స్థితి, ఆ స్థితిలో

అతనిని ఆరోగ్యంగా ఉంచే మూలకాలు సరియైన నిష్పత్తిలో ఉండవు. కాబట్టి ఆ శరీరం సరియైన విధంగా పనిచేయదు. ఆ రోగం పెరిగి పెరిగి నాశనానికి దారితీస్తుంది.

ఖుర్'ఆన్ మరియు హదీస్ పరిభాషలో 'రోగం' అనేది ఓ ప్రత్యేకమైన మానసిక స్థితికి ఉపయోగించ బడినట్లుగా తెలుస్తుంది. ఇది మానవుడిని ఆధ్యాత్మికంగా పరిపూర్ణ స్థాయికి చేరకుండా ఆపుతుంది. ఫలితంగా మంచి పనులు చేసే సామర్థ్యం క్రమక్రమంగా లేకుండా చేసి, సాధారణ మర్యాద సయితం కోల్పోవడం జరుగుతుంది ఆధ్యాత్మిక మరణం వరకూ. ఒకడు తన ప్రాపంచిక కోరికలకు లోబడి పోయినప్పుడు హృదయానికి సంబంధించిన రోగాలు వస్తాయి.

ప్రస్తుత ఆయత్‌ను బట్టి వారి హృదయాలలో దాగి ఉన్న రోగం 'అవిశ్వాసం' మరియు 'సత్యాన్ని తిరస్కరించడం'. ఈ రోగం భౌతికం మరియు ఆధ్యాత్మికం కూడా.

తనను సృష్టించి పోషించే వానికి కృతఘ్నత చూపడం మరియు ఆయన ఆదేశాలకు వ్యతిరేకంగా నడవడం ఆధ్యాత్మిక రోగమే. అంతేకాకుండా, ఈ 'అవిశ్వాసాన్ని' ప్రాపంచిక ప్రయోజనాల కోసం దాచుకోవడం మరియు మనస్సులో నున్నది ధైర్యంగా చెప్పుకోలేక పోవడం కూడా 'ఆత్మ' యొక్క రోగమే.

కపటత్వం అనేది భౌతికంగా కూడా రోగమే అనడానికి కారణం - కపట విశ్వాసి ఎల్లప్పుడూ భయపడుతూ ఉంటాడు. తన గురించి నిజం బహిరంగ పరచబడుతుందేమోనని. అసూయ అనేది కపటత్వంలో ఓ ముఖ్యమైన అంశం. ముస్లిములు ఈ ప్రపంచంలో బలంగా ఎదగడాన్ని కపట విశ్వాసి చూసి సహించలేడు. హృదయంలో ఉండే విషం వలన వాడు తృప్తి పొందలేడు. కాబట్టి అతనిలోని ఈ మానసిక ఒత్తిడి భౌతిక రోగాలకు దారితీయడంలో ఆశ్చర్యమేమీ లేదు.

"అల్లాహ్ వారి రోగాన్ని మరింత అధికం చేశాడు". దానర్థం ఏమిటంటే - ముస్లిములు బలోపేతం కావడాన్ని చూచి కపట విశ్వాసలు అసూయ చెందుతున్నారు. ముస్లిములను బలోపేతం చేయడమన్నది అల్లాహ్ యొక్క ఇష్టం. ఆయన ఇష్టపడితే వారిని మరింత బలోపేతం చేస్తారు. ఆ విధంగా వారి అసూయ మరియు దాని పర్యవసానంగా వారి రోగం పెరుగుతుంది.

**మరియు భూమిలో కల్లోలం రేకెత్తించకండి." అని వారితో అన్నప్పుడు, వారు : "మేము సంస్కర్తలము మాత్రమే!" అని అంటారు. జాగ్రత్త! నిశ్చయంగా, (భువిలో) కల్లోలం రేకెత్తిస్తున్న వారు వీరే, కాని వారది గ్రహించటం లేదు.**

పై రెండు ఆయత్‌లు కపట విశ్వాసుల కుతర్కాన్ని (వ్యంగ్యాన్ని) బహిర్గతం చేస్తున్నాయి. మరియు వారి అజ్ఞానాన్ని వారి బూటకతత్వాన్ని వర్ణిస్తున్నాయి. వారు తమ దోషాలను తమ యోగ్యతలుగా భావిస్తున్నారు.

**మరియు : "ప్రజలు విశ్వసించినట్లు మీరూ విశ్వసించండి."అని వారితో అన్నప్పుడు, వారు: "మూర్ఖులు విశ్వసించినట్లు మేమూ విశ్వసించాలా?" అని జవాబిస్తారు. జాగ్రత్త! వాస్తవానికి వారే మూర్ఖులు. కాని వారికది తెలియదు.**

పై ఆయత్‌లో 'ప్రజలు విశ్వసించినట్లు మీరూ విశ్వసించండి' అని ఉంది. ప్రజలు అంటే ఎవరు? వ్యాఖ్యాతలు ఈ విషయంలో చాలా స్పష్టంగా వివరించారు. ఇక్కడ 'ప్రజలు' అంటే ముహమ్మద్(స)వారి సహచరులు.

8వ ఆయత్‌లో 'అల్లాహ్‌ను మరియు అంతిమ దినాన్నీ విశ్వసించాము' అని చెప్పే ప్రజల గురించి ఉంది. యూదులు అల్లాహ్‌ను మరియు అంతిమ దినాన్ని విశ్వసిస్తారు. కాని వారు ముహమ్మద్(స)వారిని విశ్వసించరు. అప్పుడు వారు విశ్వాసులు ఎలా అవుతారు?

అల్లాహ్‌పై మరియు అంతిమదినంపై యూదులకు ముందు నుండి విశ్వాసం ఉంది. అందుకనే అటువంటి వారితో 'ప్రజలు విశ్వసించినట్లు మీరూ విశ్వసించండి' అని అన్నప్పుడు వారు 'మూర్ఖులు విశ్వసించినట్లు మేము విశ్వసించాలా?' అని అంటారు.

సహాబీలు (ముహమ్మద్(స)వారి సహచరులు) ఖుర్'ఆన్ వాక్యాలు అవతరిస్తూ ఉండగానే వాటిని విశ్వసించేవారు. వారిది నిజమైన విశ్వాసం. అల్లాహ్ అనుగ్రహం పొందిన సహచరులను కపట విశ్వాసులు 'మూర్ఖులు' అని సంబోధిస్తున్నారు. స్పష్టమైన సూచనలు చూచి కూడా విశ్వసించని కపట విశ్వాసులే నిజానికి మూర్ఖులు.

**మరియు విశ్వాసులను కలిసినప్పుడు, వారు : "మేము విశ్వసించాము." అని అంటారు. కానీ తమ షైతానుల (దుష్ట నాయకుల) దగ్గర ఏకాంతంలో ఉన్నప్పుడు వారు: "నిశ్చయంగా, మేము మీతోనే ఉన్నాము కేవలం (వారిని) ఎగతాళి చేస్తున్నాము" అని అంటారు.**

పై ఆయత్‌లో వారి రెండు నాలుకల ధోరణి మరియు కుతంత్రాన్ని చూడవచ్చు.

ముస్లిములతో ఉన్నప్పుడు వారు విశ్వాసంలో ఉన్నామని ప్రకటిస్తారు. కాని తమ వారి దగ్గరికి వెళ్ళినప్పుడు తాత ముత్తాతల విధానాలను ఎన్నటికీ వదిలేది లేదని భరోసా ఇస్తారు. మరియు ముస్లిములను కలిసేది కేవలం వారిని ఎగతాళి చేయడానికేనని చెబుతారు.

అంటే వీరు ముస్లిములతో ఉండేటప్పుడు 'ముస్లిము'లమని, వేరే వాళ్ళతో ఉంటే, ఆ ధర్మమే తమదని చెప్పుకుంటారని తెలుస్తుంది.

ఈ కపట విశ్వాసుల లక్షణాలు ఏ విధంగా ఉంటాయి? వారి పన్నాగాలు ఏ విధంగా ఉంటాయి? మొదలైన ఎన్నో విషయాలతో ఇదే సంచికలో 'ధర్మసందేశ ప్రచారం' శీర్షికలో 'మునాఫిఖ్ అంటే ఎవరు?' అనే ప్రత్యేక వ్యాసంలో తెలియజేశాము.

**(ఖుర్'ఆన్ తఫ్సీర్‌లో మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో...)**

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

ప్రపంచ శాంతి దూత

# ముహమ్మద్ (స) వారి

## బోధనలు ఆచరణలు

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత డిశంబర్'10 - జనవరి'11 అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్'ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

---

# ఉత్తమ సమాజం

**13**

**ఈ నెల ప్రత్యేకం : వ్యాపారం**



**(గత సంచిక తరువాయి)**

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిరోధించే వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..."**

**(ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)

ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా ఆగష్టు సంచికలో వివరించడం జరిగింది. గత 2 సంచికలనుండి వాటిని పూర్తిగా కాకపోయినా, కాస్త విపులంగా తెలియజేస్తామని చెప్పాము. ముందుగా వ్యాపారంతో ప్రారంభించాము.

## వ్యాపారం (వ్యవసాయ ఉత్పత్తులు)

(గత సంచిక తరువాయి)

### వ్యాపార భాగస్వాములు (Business Partners)

కొన్ని వ్యాపారాలు ఒక్కరే చూసుకోవడం కష్టమౌతుంది. అటువంటప్పుడు వేరొకరిని భాగస్వామిగా చేసుకోవలసి వస్తుంది. ఆ ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఒకరినొకరు మోసగించుకోకుండా వ్యాపారం చేస్తే, అందులో శుభాలు ఉంటాయి. కాని ఒక భాగస్వామి మరొక భాగస్వామిని మోసగిస్తే, ఆ వ్యాపారం నుండి శుభాలు దూరమౌతాయి. ఇక్కడ ముఖ్యంగా తెలుసుకోవలసింది ఆ వ్యాపారం హలాల్ (ధర్మసమ్మతమైన) వ్యాపారం అయితేనే. ఈ విషయం క్రింది హదీస్ ద్వారా స్పష్టంగా తెలుస్తుంది.

అబూహుర్రైరా(రజి) ఉల్లేఖనం. (ప్రవక్త(స) చెప్పారు) : అల్లాహుతాలా చెబుతున్నారు : ''ఇద్దరు భాగస్వాములలో నేను మూడవవాడను, వారిలో ఒకరు తన భాగస్వామిని మోసగించనంత వరకూ. ఎప్పుడైతే అతడు తన భాగస్వామిని మోసగిస్తాడో వారిలో నుండి నేను వైదొలుగుతాను. **(అబూదావూద్- హసన్, 3383, పుస్త.22, అధ్యా.26, సంపుటి 4)**

### వ్యవసాయ భూమిని కౌలుకి ఇవ్వడం

కొన్ని అనివార్య కారణాల వలన కొందరికి వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ, దానిని సాగుచేసుకోలేరు. అటువంటప్పుడు దానిని అద్దెకు (కౌలుకు) ఇస్తుంటారు. కౌలుకు తీసుకున్న వ్యక్తి, దానిని సాగుచేసి పంటను పండిస్తాడు. పంట దిగుబడి చేతికి రాగానే దానిలో నుండి భూమి యజమానితో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం, కొన్ని బస్తాలను భూమి యజమానికి ఇస్తాడు. ఇదే విధంగా ఇస్లామ్‌కి పూర్వం అరేబియాలో జరుగుతూ ఉండేది. కాని ఆ పద్ధతిలో ముహమ్మద్(స) వారు మార్పులు చేశారు. ప్రవక్త(స)వారు చెప్పినట్లుగా చేస్తే ఆ వ్యవసాయంలో మనకు శుభాలు కలుగుతాయి (ఇతర విషయాలన్నీ కూడా ఇస్లామ్ ప్రకారంగా ఉంటే).

రాఫి'అ బిన్ ఖదీజ్(రజి) ఉల్లేఖనం. మేము పొలాలలో మదీనాలో వేరెవరికంటే కూడా ఎక్కువగా పనిచేసేవారము. పొలంలోని ఓ నిర్ణీతభాగంలో వచ్చే దిగుబడిని భూమి యజమానికి ఇచ్చే విధంగా భూమిని అద్దెకు తీసుకునేవారము. కొన్నిసార్లు ఆ భాగం పంట నాశనమయ్యేది పీడ మొదలైన వాటివలన, మిగిలిన భాగం క్షేమంగా ఉండగా ఒకొక్కసారి ఈ భూభాగానికి పీడ కలిగి నాశనమై, ఆ భూభాగం క్షేమంగా ఉండేది. కాబట్టి ప్రవక్త(స)వారు ఈ ఆచరణను నిరోధించారు. ఆ సమయంలో బంగారం మరియు వెండి ఉపయోగించ లేదు (భూమి అద్దె కొరకు).
**(సహీహ్ బుఖారీ, 2327, పుస్తకం 41, అధ్యా.7, సంపుటి 3)**

**ముజారఆ** (sharecropping)

అమ్ర్ బిన్ దీనార్ (రజి) చెప్పారు : నేను ఇబ్నె ఉమర్(రజి) చెప్పగా విన్నాను. పంటను పంచుకోవడంలో తప్పు ఏమీ కనిపించలేదు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) దానిని నిరోధించారని రాఫి'అ బిన్ ఖదీజ్ చెప్పేవరకూ.

నేను తావూస్‌తో(రజి) ప్రస్తావించాను మరియు అతను అన్నాడు: ఇబ్నె అబ్బాస్(రజి) నాకు చెప్పారు రసూలుల్లాహ్(స) దానిని నిరోధించ లేదు, కాని ఆయన(స) చెప్పారు:

**''మీలో ఒకరు తన భూమిని తన సోదరునికి ఇవ్వడమే ఉత్తమం, దానికి అద్దెగా కొంత సొమ్మును తీసుకోవడం కంటే''** (అబూదావూద్, సహీహ్, 3389, సంపుటి 4)

ఉర్వా బిన్ అజ్జుబైర్ (రజి) చెప్పారు : జైద్ బిన్ సాబిత్(రజి) చెప్పారు: 'అల్లాహ్ రాఫి'అ బిన్ ఖదీజ్‌ను క్షమించు గాక! అల్లాహ్ సాక్షి! (ఆ) హదీస్ గురించి ఆయన కంటే నాకు ఎక్కువ జ్ఞానముంది. ఇద్దరు వ్యక్తులు - ముసద్దద్ అన్సారీ *(ఉల్లేఖకులలో ఒకరు) చెప్పారు :* - ఆయన(స) దగ్గరికి వచ్చారు వారి మధ్య తగాదా ఉంది. రసూలుల్లాహ్(స) చెప్పారు, ఇదే మీ సమస్య అయితే వ్యవసాయ భూమిని అద్దెకు ఇవ్వకండి. ముసద్దద్ అదనంగా చెప్పారు : మరియు అతడు ఆయన చెప్పిన పదాలను విన్నాడు **'వ్యవసాయ భూమిని అద్దెకివ్వ కూడదు'** (అబూదావూద్ - హసన్, 3390, పుస్త.22, అధ్యా.30, సంపుటి 4)

ముజాహిద్ నుండి మన్సూర్ ఉల్లేఖించారు. ఉసైద్ బిన్ జుహైర్ చెప్పారు : రాఫి'అ బిన్ ఖదీజ్ మా దగ్గరికి వచ్చి చెప్పారు : రసూలుల్లాహ్(స) మీకు మేలు కలిగించే దాని నుండి మిమ్మల్ని నిరోధించారు. కాని అల్లాహ్‌కు విధేయత మరియు అల్లాహ్ యొక్క సందేశహరునికి విధేయత చూపడం మీకు ఇంకా ఎక్కువ మేలైనది. రసూలుల్లాహ్(స)వారు పంట దిగుబడిలోని భాగం కొరకు భూమిని అద్దెకివ్వడాన్ని నిరోధించారు. ఆయన అన్నారు : **ఎవరికైతే తన భూమి అవసరం లేదో, దానిని అతని సోదరునికి ఇవ్వనీయండి లేకపోతే దానిని అలాగే వదిలెయ్యాలి.** (అబూదావూద్ - సహీహ్, 3398, పుస్త. 22, అధ్యా.31, సంపుటి 4)

**ముహాఖలా మరియు ముజాబనా నిరోధించారు.**

రాఫి'అ బిన్ ఖదీజ్(రజి) నుండి స'ఈద్ బిన్ ముసయ్యబ్(రజి) వారి నుండి తారిఖ్ బిన్ అబ్దుర్-రహ్మాన్ ఉల్లేఖించారు. (రాఫి'అ బిన్ ఖదీజ్) చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) **''ముహాఖలా''** మరియు **''ముజాబనా''** నుండి నిరోధించారు.

**కేవలం ముగ్గురు మాత్రమే సాగు చేయాలి :**

1. ఎవరికైతే భూమి ఉందో అతడు మరియు దానిని స్వయంగా సాగుచేయాలి 2. ఇంకొకరు ఎవరికైతే భూమి ఇవ్వబడిందో. కనుక అతడు తన కిచ్చిన భూమిని సాగుచేయాలి మరియు 3. అతడు ఎవరైతే బంగారం మరియు వెండితో (దీనార్లు, దిర్హములు అంటే రొఖ్ఖంతో) భూమిని అద్దెకు తీసుకున్నాడో''

**(అబూదావూద్ - హసన్, 3400, పుస్తకం 22, అధ్యా. 31, సంపుటి 4)**

**ముఖాబరా**

జైద్ బిన్ సాబిత్ (రజి) చెప్పారు : రసూలుల్లాహ్(స) 'ముఖాబరా' నుండి నిరోధించారు. నేను (ఉల్లేఖకులలో ఒకరు) అడిగాను : 'ముఖాబరా' అంటే ఏమిటి? ఆయన అన్నారు : ''**భూమిని తీసుకొని దానికి బదులుగా సగం లేదా మూడవవంతు లేదా 4వ వంతు ఇచ్చే విధంగా** (అబూదావూద్, హసన్, 3407, సంపుటి 4)

సయీద్ బిన్ జుబైర్ (రజి)ఉల్లేఖనం. ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పారు : ''**మీరు చేయగలిగిన ఉత్తమమైనది మీలో ఒకరికి తన భూమిని అద్దెకు ఇవ్వడరి బంగారం మరియు వెండికి బదులుగా.** (నసాయీ - సహీహ్, 3965, పుస్తకం 36, అధ్యా.46, సంపుటి 4)

**పండ్ల తోటలను కౌలుకి ఇవ్వడం**

ముసాఖా అంటే ఖర్జూరపు తోటను అద్దెకివ్వడం - దానికి నీరు పెట్టి, ఫలవంతం చేసి, రక్షణ బాధ్యతలు తీసుకున్నందుకు ప్రతిఫలంగా పండ్ల ఉత్పత్తిలో నుండి నిర్ణీత భాగాన్ని ఇవ్వడం.

ఉమర్ బిన్ అయ్యూబ్ (రజి) ఉల్లేఖనం. ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పారు: రసూలుల్లాహ్(స) ఖైబర్‌ని జయించారు. మరియు భూమి మరియు మొత్తం పసుపు(బంగారం) మరియు తెలుపు (వెండి) తనకే చెందు తుందని షరతు పెట్టారు.

ఖైబర్ ప్రజలు అన్నారు : ''మీకంటే ఈ భూమి గురించి మాకు బాగా తెలుసు. కాబట్టి దానిని మాకివ్వండి. పంట దిగుబడిలో మీకు సగం మరియు మాకు సగం. ఆ షరతు మీద వారికిస్తున్నామని ఆయన చెప్పారు.

ఖర్జూరపు చెట్ల (పంట దిగుబడి) సమయం దగ్గరైనప్పుడు, ప్రవక్త(స) అబ్దుల్లాహ్ బిన్ రవాహా(రజి)ను పంపారు ఖర్జూరపు చెట్లు ఎంత కావచ్చో అంచనా వేయడానికి, దీనినే మదీనా ప్రజలు అల్-ఖర్స్ (అంచనా) అంటారు.

ఆయన (వారితో) అన్నారు : ''ఈ చెట్టుకి, ఫలానా ఫలానా (మొత్తం)''.

వారు (ఖైబర్ ప్రజలు) అన్నారు: ''మీరు మా నుండి చాలా ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు, ఓ ఇబ్నె రవాహా!''

ఆయన అన్నారు : ''నేను అంచనా వేసే బాధ్యతను తీసుకున్నాను. మరియు నేను చెప్పినదాంట్లో మీకు సగం ఇస్తాను''.

వారు అన్నారు : ''**ఇదే న్యాయం మరియు న్యాయంపైనే ఆకాశం మరియు భూమి ఆధారపడి ఉన్నాయి**''. వారు చెప్పారు : ''మీరు చెప్పిన దానిని తీసుకోవడానికి మేము ఒప్పుకుంటున్నాము''

**(అబూదావూద్ - హసన్, 3410, పుస్తకం 22, అధ్యా. 34, సంపుటి 4)**

**హరామ్ మరియు నహీ**

హరామ్ అంటే నిషేధం. నహీ అంటే నిరోధం. ఈ రెండింటికి మధ్య చాలా తేడా ఉంది. హరామ్ వ్యాపారం ఎట్టి పరిస్థితులలోనూ చేయకూడదు. ఉదా: వడ్డీ వ్యాపారం. ఇది హరామ్.

అయితే హలాల్ వ్యాపారాలలో ఏ ఏ పనుల నుండి ప్రవక్త(స)వారు మనల్ని నిరోధించారో, వాటి నుండి కూడా మనం దూరంగా ఉండాలి. ఆ విధంగా వాటికి దూరంగా ఉండకపోతే అది పాపం కాదు, కాని ఆ వ్యాపారంలో శుభాలు ఉండవు.

చాలామంది చెబుతుంటారు ఎంత కష్టపడినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని. శుభాలు కలగాలంటే ప్రవక్త(స)వారు నిరోధించిన వాటి జోలికి మనం పోకూడదు.

**కాబట్టి కౌలుకు తమ భూములను ఇచ్చే ముస్లిమ్ సోదరులు ఆలోచించండి. వచ్చిన దిగుబడిలో కొంత భాగం కాకుండా, రొఖ్ఖానికి** (for money) **మాత్రమే మీ భూమిని అద్దెకివ్వండి.**

**అల్లాహ్ చట్ట ప్రకారం వ్యాపారం చేయండి.**
**వ్యాపారంలో ఇన్శా అల్లాహ్ అన్నీ శుభాలే!**

(ఇంకావుంది...)

స్థలాభావం వలన ఈ సారి కూడా కొన్ని శీర్షికలను అందించలేక పోతున్నాము.

క్రిందటి సంచికలో తక్కువైన పేజీలను ఇన్శాఅల్లాహ్ వచ్చే సంచికలో అందించడానికి ప్రయత్నిస్తాము.

మాకు పోస్టల్ మనియార్డర్ ద్వారా చందా పంపేవారు తప్పనిసరిగా ఫోన్ నంబర్ తెలియజేయండి. మనియార్డర్ ఫార్మ్‌పై పూర్తి ఎడ్రస్ లేకపోవడం వలన పత్రికను పంపడం ఇబ్బంది అవుతుంది. కనీసం ఫోన్ నెంబర్ ఉంటే, ఫోన్ చేసి ఎడ్రస్ వివరాలు తెలుసుకోగలుగుతాం.

దయచేసి మనియార్డర్ ఫార్మ్‌పై మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వండి. మనియార్డర్ చేసినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా క్రింది నంబర్‌కి ఫోన్ చేసి తెలియజేయండి.

9491103017

# Science of Hadith
# హదీస్ విజ్ఞానం

(గత సంచిక తరువాయి)

5

**సనద్ మరియు మతన్ లక్షణాన్ని బట్టి వర్గీకరణ**
**షాజ్ - మున్కర్ - ముద్‌రజ్**

ఈ శీర్షికలోని వ్యాసాలను మీరు బాగా అధ్యయనం చేయగలిగితే, హదీస్‌లను వక్రీకరించి ప్రసంగించేవారిని మీరు సులభంగా గుర్తుపట్ట గలుగుతారు, ఇన్షాఅల్లాహ్!

## షాజ్ (شاذ)

ఒక విశ్వసనీయమైన వ్యక్తిచే ఉల్లేఖించబడిన ఓ ఉల్లేఖనం ఈ ఉల్లేఖకుని కంటే విశ్వసనీయమైన మరో వ్యక్తి ఉల్లేఖనాన్ని విభేదిస్తే, అటువంటి హదీస్‌ను 'షాజ్' హదీస్ అంటారు.

ఉదాహరణకు క్రింది రెండు బలహీనమైన (దయీఫ్) హదీస్‌లను అధ్యయనం చేయండి.

---

حَـدَّثَـنـا بِشْـرُ بْـنُ مُـعَـاذٍ العَقَدِيُّ : حَدَّثَنَا عَبْدُ الواحِدِ بْنُ زِيَادٍ: حَدَّثَنَا الأَعْمَشُ عَنْ أَبي صَالِحٍ، عَنْ أَبي هُرَيْرَةَ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ : ((اِذا صَـلَّـى أَحَـدُكُمْ رَكْعَتَي الفَجْرِ فَلْيَضْطَجعْ عَلَى يَمِينِهِ)).

బిష్ర్ బిన్ ము'ఆజ్ అఖదీ - **అబ్దుల్ వాహిద్ బిన్ జియాద్** - అల్ అ'మష్ - అబూ సాలిహ్ - అబూ హురైరా చెప్పారు :

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "**మీలో ఎవరైనా రెండు రకాత్‌ల సలాత్ ఫజర్ నమాజ్‌కు ముందుగా చేస్తే అతనిని తన కుడివైపున పడుకో నివ్వండి**"

(తిర్మిజీ, **దయీఫ్**, 420, పుస్తకం 2, అధ్యా.194, సంపుటి1)

---

حَـدَّثَـنا مُسَدَّدٌ وَأَبُو كَامِلٍ وَ عُبَيْدُاللهِ بنُ عُمَرَ بنِ مَيْسَرَةَ قَـالُـوا: حَـدَّثَـنـا عَبْـدُ الْـوَاحِدِ : حَدَّثَنا الأَ عْمَشُ عن أَبِي صَـالِـحٍ، عن أَبي هُرَيْرةَ قالَ : قالَ رَسُولُ اللهِ ﷺ : ((اِذا صَـلَّـىٰ أَحَـدُكُـمُ الـرَّكْـعَتَيْنِ قَبْلَ الصُّبْحِ فَلْيَضْطَجِعْ عَلَىٰ يَـمِـيـنِهِ)). فَقالَ لَهُ مَرْوَانُ بنُ الْحكَمِ : أَمَا يُجْزِىءُ أَحَدَنَا مَـمْشَـاهُ اِلَى المَسْجِدِ حَتَّى يَضطَجعَ عَلَىٰ يَمِينِهِ ؟ – قالَ عُبَيْـدُاللهِ فـي حَـدِيثِهِ : – قَالَ : لَا. قالَ : فَبَلَغَ ذَٰلِکَ ابنَ عُـمَـرَ فَقالَ : أَكْثَرَ أَبُو هُرَيْرَةَ عَلَى نفْسِهِ قالَ: فقيلَ لابنِ عُـمَـرَ هَـلْ تُـنْـكِـرُ شَيْـئًا مِمَّا يَقُولُ؟ قالَ لا، وَلَكِنَّهُ اجْتَرَأَ وَجَبُـنَّـا. قـالَ : فَبَلَغَ ذَٰلِکَ أَبَا هُرَيْرَةَ. قالَ: فَمَا ذَنْبي اِنْ كُنْتُ حَفِظْتُ وَنَسُوا.

సనద్ :

ముసద్దద్ - అబూ కామిల్ - ఉబైదుల్లాహ్ బిన్ 'ఉమర్ బిన్ మైసరా - **అబ్దుల్ వాహిద్** - అల్ అ'మష్ - అబూ సాలిహ్ - అబూహురైరా(రజి) చెప్పారు :

మతన్ :

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : మీలో ఒకరు రెండు రకాత్‌ల సలాత్ ఫజర్ నమాజ్‌కి ముందు చేస్తే, (ఆ తరువాత) అతనిని తన కుడివైపు పడుకోనివ్వండి".

మర్వాన్ బిన్ అల్-హకమ్ (రజి) ఆయనను అడిగారు : మనలో ఒకరికి మస్జిద్‌కు నడుచుకుని వెళ్ళడం సరిపోదా, అతడు తన కుడివైపు పడుకో (కుండా) ఉండేలా? ఉబైదుల్లాహ్ సమాధానమిచ్చారు : "లేదు". ఇబ్నె ఉమర్(రజి) దీని గురించి విని ఆయన అన్నారు : "అబూ హురైరా స్వయంగా (సమస్యలను) పెంచుకుంటున్నారు". ఇబ్నె ఉమర్(రజి) అడగబడ్డారు : "**ఆయన చెప్పిన దానిలో ఏదైనా మీరు ఖండిస్తున్నారా?**" ఆయన సమాధానమిచ్చారు, "**లేదు**, కాని ఆయన ధైర్యం చేస్తున్నారు మరియు మేము జాగ్రత్త వహిస్తున్నాం". అబూహురైరా(రజి) ఇది విని, ఆయన అన్నారు, "నేను జ్ఞాపకం ఉంచుకుని మరియు వారు మరచి పోయినట్లయితే అది నా దోషమా?"

(అబూదావూద్, **దయీఫ్**, 1261, పుస్తకం 5, అధ్యా.4, సంపుటి 2)

ఇదే విషయంపై అబూదావూద్ హదీస్ గ్రంథంలోని రెండు **సహీహ్** హదీస్‌లను ఇక్కడ అందిస్తున్నాము.

సనద్ :

యహ్యా బిన్ హకీమ్ - బిష్ర్ బిన్ ఉమర్ - మాలిక్ బిన్ అనస్ - సాలిమ్ అబూ నజ్ర్ - అబూ సలమా బిన్ - అబ్దుర్ రహ్మాన్ - **ఆయిషా**(రజి) చెప్పారు :

మతన్ :

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) రాత్రి నమాజ్ పూర్తి చేశాక, నేను మెళుకువగా ఉంటే - ఆ స్థితిలో ఆయన నాతో మాట్లాడేవారు - లేక నేను పడుకుని ఉంటే నన్ను మేల్కొలిపే వారు. మరియు ఆయన రెండు రకాత్‌లు సలాత్ చేసుకునేవారు. తరువాత ము'అజ్జిన్ ఉదయం (ఫజర్) నమాజ్ కొరకు అజాన్ ఇచ్చే వరకూ పడుకునేవారు. ఆ తరువాత ఆయన(స) రెండు తేలికపాటి రకాత్‌లతో సలాత్ చదువుకుని, ఫజర్ సలాత్ కొరకు (మస్జిద్‌కు) వెళ్ళేవారు.

(అబూదావూద్, **సహీహ్**, 1262, పుస్తకం 5, అధ్యా. 4, సంపుటి 2)

حَـدَّثَـنـا يَـحْـيَـى بـنُ حَكِيم : حَدَّثَنا بِشْرُ بنُ عُمَرَ : حَدَّثَنا مَـالِكُ بـنُ أَنَـسٍ عن سَالِمٍ أبي النَّضرِ، عن أَبِي سَلَمَةَ بن عَبْـدِ الـرَّحْمَنِ، عن عَائِشَةَ قالت : كَانَ رَسُولُ اللهِ ﷺ اِذَا قَـضَـىٰ صَـلاتَـهُ مِـنْ آخِرِ اللَّيْلِ نَظَرَ، فَإِنْ كُنْتُ مُسْتَيقِظَةً حَـدَّثَـنِـي وَإِنْ كُـنْـتُ نَـائِمَةً أَيْقَظَنِي، وَصَلَّى الرَّكْعَتَيْنِ ثُمَّ اضْـطَـجَـعَ، حَتَّـى يَـأْتِيَـه الـمُؤَذِّنُ فَيُؤْذِنَهُ بِصَلاةِ الصُّبحِ، فَيُصَلِّي رَكْعَتَيْنِ خَفِيفَتَيْنِ ثُمَّ يَخْرُجُ اِلَى الصَّلاةِ.

పై హదీస్ తరువాయి హదీస్‌ను జియాద్ బిన్ సాద్ గారు ఉల్లేఖించారు (అబూదావూద్, సహీహ్, 1263). **ఆయిషా**(రజి) చెప్పారు : **"ఫజర్ సలాత్‌కి (ముందు) రెండు రకాత్‌లు చదివాక ఆయన పడుకునేవారు నేను నిద్రపోయి ఉంటే. అలాకాకుండా నేను మెళుకువగా ఉంటే నాతో మాట్లాడేవారు".**

ఈ వ్యాసం ప్రారంభంలో ఇచ్చిన తొలి రెండు దయీఫ్ (బలహీనమైన) హదీస్‌లలో **అబ్దుల్ వాహిద్ బిన్ జియాద్** గారి పేరు మార్క్ చేయబడింది. ఈయన అల్-అ'మాష్ గారి శిష్యులలో ఏకైక విశ్వసనీయమైన శిష్యుడు. ఈయన బలహీన ఉల్లేఖకుడు కాదు.

కాని ఈయన ఉల్లేఖించిన ఉల్లేఖనం ఎందరో అందించిన ఉల్లేఖనాలతో విభేధిస్తుంది. కాబట్టి ఆ హదీస్ షాజ్ హదీస్ అవుతుంది.

ఇప్పటి వరకూ చెప్పిన హదీస్‌లలో పడుకోవడం అంటే నిద్రపోవడం కాదు.

పై హదీస్‌లను బట్టి ముఖ్యంగా తెలిసేది ఏమిటంటే ప్రవక్త(స)వారు ఫజర్ సలాత్‌కి ముందు కాస్సేపు కుడివైపుకు వాలి విశ్రాంతి తీసుకునే వారు లేదా ఆయిషా(రజి)వారితో మాట్లాడేవారు. అంతేకాకుండా, ఫజర్ నమాజ్‌లో చేసే రెండు రకాత్‌ల సున్నత్ నమాజ్‌కు ముందు మాత్రమే విశ్రాంతి తీసుకునేవారు.

కాబట్టి ఏ ముస్లిమైనా 'అజాన్'కు ముందుగా రెండు రకాత్‌ల సలాత్ చేసి ఉంటే అవసరమనుకుంటే విశ్రాంతి తీసుకోవచ్చు. లేదా తనవారితో మాట్లాడుకోవచ్చు.

కాబట్టి 'షాజ్' హదీస్‌లో ఉల్లేఖకులంతా విశ్వసనీయమైన వారే. కాబట్టి సనద్ 'సహీహ్' అవుతుంది. మతన్‌లోని భావం ఇతర ఉల్లేఖనాలతో విభేదిస్తుంది.

కాబట్టి ఈ హదీస్ సనద్ మరియు మతన్ రెండింటి ప్రకారం వర్గీకరించబడింది.

'షాజ్' హదీస్ 'సనద్'లో అందరూ విశ్వసనీయులే! కాని వారిలో ఒకరు బలహీన ఉల్లేఖకుడు ఉంటే, అప్పుడు ఆ హదీస్ మున్‌కర్ హదీస్ అవుతుంది.

## మున్‌కర్ (منكر)

ఇబ్నె హజర్‌గారు చెప్పిన దానిని బట్టి, బలహీన ఉల్లేఖకుడు అందించిన ఓ హదీస్ ఒక ప్రామాణిక ఉల్లేఖనాన్ని విభేదిస్తే, ఆ హదీస్ 'మున్‌కర్' హదీస్ అవుతుంది.

అహ్మద్(ర) వంటి ముహద్దిస్‌లు ప్రతీ బలహీన ఉల్లేఖనాన్ని మున్‌కర్‌గానే తీసుకున్నారు. ఒక హదీస్‌లోని విషయాలు ప్రవక్త(స)వారి సర్వ సాధారణ బోధనలకు వ్యతిరేకంగా ఉంటే, కొన్నిసార్లు అటువంటి హదీస్‌లను కూడా మున్‌కర్‌గానే చెబుతారు.

అల్-ఖాతిబ్‌గారి మాటలలో కొన్ని హదీస్‌లు పగటి వెలుగులా కాంతిని కలిగి ఉంటాయి. వాటిని మనం గుర్తిస్తాము. మరికొన్ని చీకటిని కలిగి ఉంటాయి రాత్రిలా అవి మనల్ని తిరస్కరించేలా చేస్తాయి.

ఉదాహరణకు క్రింది హదీస్‌ను గమనించండి.

అనస్(రజి) చెప్పారు : **ఎప్పుడైనా కాలకృత్యాలు తీర్చుకోవడానికి ప్రవేశిస్తే, ఆయన(స) తన ఉంగరాన్ని తీసి పక్కన పడేసి (వెళ్ళే) వారు.** (అబూదావూద్ - **దయీఫ్**, 19, సంపుటి 1).

అబూదావూద్ అన్నారు : ఈ హదీస్ మున్‌కర్. ఈ హదీస్‌ను తెలియ జేసిన ఉల్లేఖకులు ఇలా ఉన్నారు : ఇబ్నె జురైజ్ - జియాద్ బిన్ సా'ద్

- అజ్జుహ్రి - అనస్. ఈ హదీస్ ద్వారా వెండి ఉంగరాన్ని తీసి దూరంగా పడవేసేవారు. కాని ఈ పదాలతో హమ్మామ్ తప్ప వేరెవరూ రిపోర్ట్ చేయలేదు. ఇక్కడ 'హమ్మామ్' - విమర్శకు లోనైన ఉల్లేఖకుడు.

ఒకవేళ ఓ విశ్వసనీయమైన ఉల్లేఖకుడు హదీస్‌లో ఏదైనా అదనంగా కలిపితే, అది ఇతర ప్రామాణిక మూలాలలో ఉల్లేఖించబడనిది అయితే, ఆ అదనంగా కలిపిన విషయం ఆ ఉల్లేఖనాలను ఖండించకపోతే, ఆ హదీస్‌ను స్వీకరిస్తారు. ఈ విధంగా అదనంగా కలపడాన్ని 'జియాదతు స్సిఖా' అంటారు.

దీనికి ఉదాహరణ:

ఇబ్నె మస్'ఊద్(రజి)గారి ఉల్లేఖనం. **నేను రసూలుల్లాహ్(స)వారిని అడిగాను, 'ఏ ఆచరణ ఎక్కువ ఉత్తమమైనది?'. ఆయన(స) అన్నారు: 'సలాత్ దాని**(కి నిర్దేశించిన) **సమయంలో'.**

ఈ హదీస్ సహీహ్ బుఖారీ (7534) మరియు సహీహ్ ముస్లిమ్(252) గ్రంథాలలో ఉంది.

ఇద్దరు ఉల్లేఖకులు : అల్-హసన్ బిన్ మక్షమ్ మరియు బిందర్ ఈ హదీస్‌కు "**సమయం ప్రారంభంలో**" అనే మాటలను కలిపి ఉల్లేఖించారు. అల్-హాకీమ్ మరియు ఇబ్నె హిబ్బాన్ ఈ కలపడాన్ని సహీహ్‌గానే తీసుకున్నారు.

పై హదీస్‌లో అదనపు మాటలను ఆమోదించారు. కాని ఒకవేళ ఈ విధంగా వివరణ కోసం కలపబడిన పదాలు, ముహమ్మద్(స)వారి బోధనకు వ్యతిరేకంగా ఉంటే స్వీకరించకూడదు. అటువంటి హదీస్ గురించి ఉదహరించడానికి ముందుగా ఓ హసన్ హదీస్‌ను ఇక్కడ అందిస్తున్నాము.

అమ్ర్ బిన్ షు'ఐబ్ ఉల్లేఖనం ఒక వ్యక్తి ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి అన్నాడు : "ఓ రసూలుల్లాహ్!(స) నాకు సంపద మరియు సంతానం ఉంది. మరియు నా తండ్రికి నా సంపద అవసరముంది. ఆయన(స) చెప్పారు : నీవు మరియు నీ సంపద నీ తండ్రికి చెందుతుంది. మీ సంతానం మీరు స్వచ్ఛంగా సంపాదించిన వాటిలోని వారు. కాబట్టి మీరు మీ సంతానం యొక్క సంపదల నుండి తీసుకోవచ్చు. (అబూదావూద్ - హసన్, 3530, సంపుటి 4)

పై హసన్ (good) హదీస్‌ను బట్టి స్పష్టంగా తెలిసేది ఏమిటంటే, ఏ తండ్రియైనా తన కుమారుని సంపదలో నుండి తీసుకోవచ్చు. తన తండ్రికి అవసరం అని ఆ వ్యక్తి చెప్పాడు కనుక తండ్రికి అవసరమైతేనే తీసుకోవాలి అని భావించ కూడదు. ఎందుకంటే ప్రవక్త(స)వారు ఆ పదాలను అనలేదు.

ఇదే విషయం స్పష్టంగా క్రింది హదీస్‌లో కూడా చెప్పబడింది.

సనద్ : అల్-హకమ్ - ఉమారా బిన్ ఉమైర్ తన తల్లి నుండి - ఆయిషా(రజి).

మతన్ : ప్రవక్త(స)వారు చెప్పారు, 'ఒక వ్యక్తి యొక్క కుమారుడు అతని సంపాదనలో భాగమే, అతని సంపాదనలోని స్వచ్ఛమైన వాటిలో, కాబట్టి నీవు వారి ఐశ్వర్యంలో నుండి తీసుకోవచ్చు.
(అబూదావూద్ - సహీహ్, 3529, సంపుటి 4)

حَدَّثَنَا عُبَيْدُ اللهِ بنُ عُمَرَ بنِ مَيْسَرَةَ وَعُثْمَانُ بنُ أَبِي شَيْبَةَ الْمَعْنَى قَالَا : حَدَّثَنَا مُحَمَّدُ بنُ جعفرٍ عن شُعْبَةَ، عن الْحَكَمِ، عن عُمَارَةَ بنِ عُمَيْرٍ، عن أُمِّهِ، عن عَائِشَةَ عن النَّبِيِّ ﷺ أَنَّهُ قَالَ : ((وَلَدُ الرَّجُلِ مِنْ كَسْبِهِ مِنْ أَطْيَبِ كَسْبِهِ فَكُلُوا مِنْ أَمْوَالِهِمْ)).

పై సహీహ్ హదీస్ క్రింద అబూ దావూద్ గారు ఇలా వ్యాఖ్య చేశారు:

قَالَ أَبُو دَاوُدَ : حَمَّادُ بنُ أَبِي سُلَيْمَانَ زَادَ فِيهِ :
((إِذَا احْتَجْتُمْ)) وَهُوَ مُنْكَرٌ.

**హమ్మాద్** బిన్ సులైమాన్ అదనంగా కలిపారు : "**మీకు అవసరమైతే**" ఈ విధంగా కలపడం 'మున్కర్' అవుతుంది.

అయితే పై సహీహ్ హదీస్‌లో హమ్మాద్ బిన్ సులైమాన్‌గారి పేరు లేదు. కాబట్టి ఇటువంటి వేరే ఉల్లేఖనంలో ఆయన అటువంటి అదనపు పదాలను కలిపి ఉల్లేఖించి ఉన్నారు.

ఈ అదనపు మాటలు ప్రవక్త(స)వారి బోధనకు విరుద్ధంగా ఉన్నాయి. కాబట్టి ఈ విధంగా విరుద్ధంగా ఉండే మాటలు కలిగిన హదీస్ - మున్కర్.

ఈ వ్యాసం కోసం మేము టీమ్ సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్ హదీస్‌లను రిఫర్ చేస్తుండగా హమ్మాద్ గారివి కొన్ని ఉల్లేఖనాలు గమనించాము. వాటిలో ఆయన అదనపు మాటలను కలిపారు. హదీస్ వినేవారికి అర్థం కావాలనే ఉద్దేశ్యంతో అలా చెప్పి ఉండవచ్చు. అయితే ఆ అదనపు మాటలు ప్రామాణిక ఉల్లేఖనాలను ఖండించ లేదు కనుక వాటిని స్వీకరించారు.

అయితే మేము ఈ హదీస్‌లలో గమనించిన 'హమ్మాద్' గారు ఒక వ్యక్తేనా? లేక వేర్వేరు వ్యక్తులా అనేది ఇంకా నిర్ధారించుకోవలసి ఉంది.

మున్కర్ హదీస్ గురించి ఇంకా చాలా ఉదాహరణల ద్వారా వివరించవచ్చు. కాని స్థలాభావం వలన ఇక్కడితో సరిపెడుతున్నాము.

## ముద్‌రజ్ (مدرج)

ఉల్లేఖనంలో అదనంగా ఏదైనా చొప్పిస్తే, ఆ హదీస్‌ను 'ముద్‌రజ్' అంటారు. ఉదాహరణకు అల్-ఖాతిబ్ ఉల్లేఖిస్తున్నారు క్రింది సనద్ ద్వారా :

అబూ ఖత్తాన్ మరియు షబబా - షు'బా - ముహమ్మద్ బిన్ జియాద్ - అబూహురైరా.

ప్రవక్త(స)వారు చెప్పారు: **వుజూను సంపూర్ణంగా చేయండి, అగ్ని నుండి చీలమండలకు బాధ ఉంది.**

اِسبغوا الوضوءَ ، وَيلٌ لِلأعقابِ مِنَ النَّار

(అంటే చీలమండలను అగ్ని నుండి కాపాడుకోమని).

అల్-ఖాతిబ్ ఈ విషయంపై ఇలా వ్యాఖ్యానించారు :

పై హదీస్‌లో వుజూ 'సంపూర్ణంగా చేయండి' అనే స్టేట్‌మెంట్ అబూహురైరా(రజి) వారిది. ఆ స్టేట్‌మెంట్ తరువాత ఉన్న స్టేట్‌మెంట్ ప్రవక్త(స)వారు చెప్పినది.

ఇక్కడ రెండూ వేర్వేరు. కాని పై హదీస్‌ను చదివిన వారు రెండు స్టేట్‌మెంట్లు కూడా ప్రవక్త(స)వారివే అనుకుంటారు.

ఈ విషయం స్పష్టంగా తెలియాలంటే 'సహీహ బుఖారీ' గ్రంథంలోని హదీస్ చూడవలసి ఉంది. ఆ హదీస్‌ను ఇక్కడ అందిస్తున్నాము.

ముహమ్మద్ బిన్ జియాద్ చెప్పారు: ఒక పాత్రలోని నీటి నుండి ప్రజలు వుజూ చేస్తుండగా అబూహురైరా(రజి)వారు మా వైపు నుండి వెళుతూ చెప్పగా నేను విన్నాను : 'వుజూ పరిపూర్ణంగా చేయండి. ఎందుకంటే అబుల్ ఖాసిమ్ (ప్రవక్త(స)వారు) చెప్పారు : మీ చీలమండలకు అగ్ని నుండి బాధ ఉంది'.

**(సహీహ బుఖారీ, 165, పుస్తకం 4, అధ్యా.29, సంపుటి 1)**

ఈ విధంగా పదాలను చొప్పించడమన్నది హదీస్ ప్రారంభంలోగాని, మధ్యలోగాని లేక చివరలోగాని గమనించవచ్చు. తరచుగా హదీస్‌లో చెప్పిన ఓ పదాన్ని వివరించడం కొరకు అదనంగా చెప్పడం జరుగుతుంది. ఇద్‌రాజ్ (చొప్పించడం) ఎక్కువగా 'మతన్' (Text)లో కనిపిస్తుంది. అయితే కొన్ని ఉదాహరణల ద్వారా అటువంటి చొప్పించడాలు ఇస్నాద్‌లో కూడా ఉన్నాయని తెలుస్తుంది. అంటే ఓ ఉల్లేఖకుడు వేరే ఇస్నాద్‌లోని భాగాన్ని చొప్పించాడు.

ఏ ఉల్లేఖకుడైనా ఉద్దేశపూర్వకంగా 'ఇద్‌రజ్'కు పాల్పడితే, అతనిని అసత్యవాదిగా పరిగణిస్తారు.

అయితే ఈ విషయంలో ముహద్దిస్‌లు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ఎందుకంటే ఎవరైనా మరచిపోయిగాని, ఓ కష్టమైన పదాన్ని వివరించడంలో గాని అలా చేసి ఉండవచ్చు.

**(ఇన్షా అల్లాహ్! మరొక వర్గీకరణ వచ్చే సంచికలో ...)**

చాలా మంది ముస్లిమ్ సోదరులు,
సహీహ హదీస్ అంటే నిజమైనదని,
దయీఫ్ హదీస్ అంటే అబద్ధమని
భావిస్తున్నట్లు తెలుస్తుంది. వాస్తవానికి
**సహీహ** - అంటే **బలమైనది** (STRONG)
**దయీఫ్** - అంటే **బలహీనమైనది** (WEAK)
**మౌజూ** - అంటే **కల్పితం** (FABRICATED)

హదీస్‌లను వర్గీకరించి చెప్పడానికి ఉపయోగించే టెక్నికల్ పదాలకు సాధారణ అర్థాలను ఆపాదించవద్దు.

హదీస్ వర్గీకరణలను పూర్తిగా తెలుసుకుని, టెక్నికల్ పదాలన్నింటనీ అర్థం చేసుకుంటే, ఒక హదీస్‌ను దయీఫ్ హదీస్ అని ఏ విధంగా నిర్ధారించారో అర్థమౌతుంది.


## ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ
**విశాఖపట్నం - 530 017**

**ప్రకటన**

గత సంవత్సర కాలం నుండి మేము ఎవరి దగ్గర చందాలు గాని విరాళాలు గాని సేకరించలేదు. కేవలం సమ్మర్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్స్‌ని మాత్రమే నిర్వహించేవారం. ఈ సంవత్సరం నుండి ఎటువంటి ప్రోగ్రామ్స్‌ను మేము నిర్వహించ దలచుకోలేదు. బహిరంగంగా జరిగే ఏ ఇతర కార్యక్రమాలకు మాకూ ఎటువంటి సంబంధమూ లేదు. ప్రస్తుతం ఓ లైబ్రరీని మాత్రమే నిర్వహించడం జరుగుతుంది. మా సొసైటీ గురించి వివరించేందుకుగాని, విరాళాలు తీసుకోవడానికి గాని మేము ఎవరినీ పంపించలేదు. ఒకవేళ మా సొసైటీ కొరకు ఎవరైనా చందాలుగాని, విరాళాలుగాని ఎవరికైనా ఇచ్చి ఉంటే, వారికి మాకు ఎటువంటి సంబంధమూ లేదు. ఈ సొసైటీ తరపున ఏ విధమైన స్టిక్కర్స్, పాంప్లెట్స్‌గాని, ఎటువంటి పబ్లిసిటీ మెటీరియల్‌గాని ముద్రించ లేదు. ఎవరైనా సొసైటీ పేరును తమ స్వలాభం కోసం ఉపయోగించుకొనిన యెడల మేము బాధ్యులు కాము.

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

3

రజి అల్లాహుతాలా అన్హూ

● అతి నిరాడంబరుడు

● ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు

అవినీతి అధికారులకు సింహస్వప్నం ●

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(గత సంచిక తరువాయి ...)

అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి) చెప్పారు, "ఉమర్(రజి)వారు ఇస్లామ్ స్వీకరించినప్పటి నుండి మాకు బలం చేకూరింది. నాకు గుర్తుంది ఆ కాలం కాబా చుట్టూ తవాఫ్ చేయలేని, (బహిరంగంగా) సలాత్ చేయలేని కాలం. అది ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరణకు ముందు, ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించిన తరువాత, వారు మమ్మల్ని ఒంటరిగా వదిలేంత వరకూ వారితో పోరాడారు. ఆ విధంగా మేము (బహిరంగంగా) సలాత్ చేయగలిగాము మరియు (కాబా చుట్టూ) తవాఫ్ చేసేవాళ్ళము.

అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి) ఇంకా చెప్పారు, "ఉమర్(రజి)వారి ఇస్లామ్ ఓ విజయం (ముస్లిము కొరకు) ఆయన హిజ్రత్ (మదీనాకు వలస) ఘనవిజయం మరియు అతని ఖలీఫత్ (పరిపాలన) కారుణ్యం".

సుహైబ్ బిన్ సినాన్(రజి) చెప్పారు, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఇస్లామ్ స్వీకరించిన తరువాత, ఇస్లామ్ బహిరంగంగా ఆచరించబడింది మరియు ప్రజలను బహిరంగంగా దానివైపు ఆహ్వానించడం జరిగింది. కాబా చుట్టూ వలయాకారంలో కూర్చోవడం మొదలుపెట్టాము. (కాబా) గృహం చుట్టూ తవాఫ్ చేయడం ప్రారంభించాము. మరియు మాతో కఠినంగా ఉన్నవారి నుండి న్యాయాన్ని అధికారంతో అడిగేవాళ్ళం.

ఉమర్(రజి)వారు ప్రవక్త(స)వారి కంటే వయస్సులో 13 సంIIలు చిన్నవారు. ఈయన హమ్జా(రజి) ఇస్లామ్ స్వీకరించిన 3 రోజుల తరువాత ఇస్లామ్ స్వీకరించారు. అప్పటికి ఇస్లామ్ స్వీకరించినవారి సంఖ్య 100 కంటే తక్కువే.

### ఉమర్(రజి)వారి వలస

ఉమర్(రజి)వారు మదీనాకు రహస్యంగా వెళ్ళడానికి ఇష్టపడలేదు. ఆయన మక్కాను వదిలి మదీనా వలస వెళుతున్నట్లు బహిరంగంగానే ప్రకటించారు మరియు ఖురైష్ నాయకులతో తనను ఆపగలరేమో ప్రయత్నించుకోమని సవాల్ విసిరారు.

అలీ బిన్ అబూతాలిబ్(రజి) ఒకసారి తనకు చెప్పారని ఇబ్నె అబ్బాస్ (రజి) చెప్పారు : "నాకు తెలిసినంత వరకూ ప్రతీ ముహాజిర్ రహస్యంగానే మదీనాకు వలస వెళ్ళారు.

ఇక ఉమర్(రజి)వారి విషయానికొస్తే, ఆయన తనకు కత్తిని కట్టుకుని, విల్లును సిద్ధం చేసుకుని, తన చేతిలో చాలా బాణాలను మరియు 'అనాజా'ను ఉంచుకున్నారు (అనాజా అంటే బళ్ళెం కంటే బలంగానూ మరియు చిన్నదిగా ఉంటుంది. చేతికర్ర కంటే పెద్దదిగా ఉంటుంది). ఇవన్నీ సిద్ధం చేసుకుని ఆయన కాబా దిశగా వెళ్ళారు. ఇదిలా ఉండగా ఖురైష్ నాయకులు కాబా దగ్గర సమావేశ మయ్యారు.

ఉమర్(రజి)వారు తవాఫ్ చేశారు. తరువాత (ఇబ్రాహీమ్(అ)) స్థానం దగ్గరకు వెళ్ళి సలాత్ చేశారు. ఖురైషీ గుంపుల ఒకొక్క దాని దగ్గరికి వెళ్ళి, ఆ గుంపులో ఉన్నవారితో అనేవారు "మీ ముఖాలు వికృతం అగుగాక! మీలో ఎవరైనా తన తల్లి తన కొడుకు కోసం శోకించాలను కుంటే లేక తమ సంతానాన్ని అనాథలుగా మార్చాలనుకుంటే లేక తన భార్య విధవరాలు కావాలని కోరుకుంటే, ఈ లోయ వెనుక నన్ను కలవండి".

అలీ(రజి)వారు తరువాత గుర్తు చేసుకున్నారు. ఖురైషీయల నుండి కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా ఆయన చేసిన సవాల్‌ను స్వీకరించడానికి ఆయనను అనుసరించ లేదు.

మదీనాకు ఉమర్(రజి)వారి కంటే ముందు వెళ్ళినవారు ముసాఁబ్ (రజి), ఇబ్నె ఉమ్మ్ మఖ్తూమ్(రజి), బిలాల్(రజి) మరియు కొందరు సహచరులు. ఆ తరువాత ఉమర్(రజి)వారు వెళ్ళారు. అబూబకర్ సిద్దీఖ్(రజి) మరియు ముహమ్మద్(స)వారు మదీనాకు రాకముందే ఉమర్(రజి)వారు మదీనా చేరుకున్నారు.

ఉమర్(రజి)వారు ఒక్కరే ప్రయాణించలేదు. ఆయన(రజి) తనతో పాటు ఎంతోమంది తమ బంధువులను మరియు తోటి వంశస్థులైన - అతని సోదరుడు, జైద్ బిన్ అల్-ఖత్తాబ్(రజి), 'అమ్ర్ మరియు అబ్దుల్లా, సురాఖా బిన్ అల్-మోతమిర్ కుమారులిద్దరూ, తన కుమార్తె హఫ్సా(రజి) వారి భర్త - ఖునైస్ బిన్ హుదాఫా అస్సహ్మీ(రజి), స'ఈద్ బిన్ జైద్ (స్వర్గ శుభవార్తను అందుకున్న పదిమందిలో ఒకరు), వాఖిద్ బిన్ అబ్దుల్లాహ్ అత్తమీమీ(రజి), ఖౌలా బిన్ అబూ ఖౌలా(రజి) మరియు మాలిక్ బిన్ అబూ ఖలా(రజి) (వీరు బనూ ఇజ్ల్ మరియు బనూ అల్-బుఖైర్ వంశాలకు చెందినవారు) మరియు బనూ సా'ద్ బిన్ లైత్ వంశానికి చెందిన ఖాలిద్(రజి), 'ఆఖిల్(రజి) మరియు 'ఆమిర్(రజి)వారిని తీసుకుని వెళ్ళారు.

(మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో)

అబూజర్(రజి) చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పగా విన్నాను. **ఉమర్ యొక్క నాలుకపై అల్లాహ్ సత్యాన్ని ఉంచారు. మరియు ఆయన ఆ సత్యంతో మాట్లాడుతారు."** (ఇబ్నెమాజా - సహీహ్, 108, పుస్తకం 1, అధ్యా.11, సంపుటి 1)

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

**నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం – 4**

*ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ నవముస్లిమ్ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్‌ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** గత రెండు నెలలుగా కొన్నింటికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. ఈ నెల ముందుగా సల్మాన్ ఫార్సీ (రజి) వారి గురించి తెలియజేసి, మరికొన్నింటికి పరిష్కారాలను తెలుసుకుందాం, ఇన్షా అల్లాహ్.

సత్యాన్వేషణలో

## బహుదూరపు బాటసారి

# సల్మాన్ ఫార్సీ (రజి)



పూర్వం రెండు మహా సామ్రాజ్యాలుండేవి. ఒకటి పర్షియా సామ్రాజ్యమైతే మరొకటి రోమన్ సామ్రాజ్యం. భూమిపై నివశించే దాదాపు సగం ప్రజలు పర్షియా సామ్రాజ్య పాలనలో ఉండేవారు. ఈ ప్రజలు అగ్నిని పూజించేవారు. అంతేకాకుండా వెలుగుకు మరియు జ్ఞానానికి ఆ అగ్ని మూలమని వారు మూఢంగా నమ్మేవారు. రాజ్యంలో అగ్ని దేవాలయాలను నిర్మించి వాటిని నిర్వహించడానికి అధిక మొత్తంలో డబ్బు ఖర్చుపెట్టేవారు.

మిగతా సగం ప్రజలను రోమన్ సామ్రాజ్యం పాలించేది. వీరు క్రైస్తవ మత ధర్మాన్ని అనుసరించేవారు. ప్రస్తుత ఇరాన్‌లో నున్న ఇస్ఫహాన్ ప్రాంతంలో 'జేయ్యన్' అనే ఊరు ఉండేది. ఆ ఊరిని పాలించే (అధికారి) యొక్క ఏకైక కుమారుడు సల్మాన్ అల్-ఫార్సీ. ఈ బాలుడు తనను

ఎంతగానో ప్రేమించే తన తండ్రి సంరక్షణలో చాలా ఆహ్లాదకరమైన కష్టాలు లేని జీవితాన్ని అనుభవిస్తున్నాడు. తన కుమారుడిని ఎక్కడ కోల్పోతానేమోననే భయంతో సల్మాన్‌ని కంటికి రెప్పలా చూసు కునేవాడు ఆ తండ్రి. అల్లాహ్ యొక్క సృష్టిలో ఆ తండ్రికి అత్యంత ప్రియమైనవాడు అతని కుమారుడే! ఒక ఆడపిల్లను ఇంట్లోనే ఉంచి పెంచినట్లు తన కుమారున్ని ఆయన పెంచారు. ఆయన ధనవంతుడు. అల్లారుముద్దుగా పెరిగినా, సల్మాన్‌గారిలో చెడు లక్షణాలు కలుగలేదు.

ఆ బాలుడు పెరిగాక, అతని తండ్రి అగ్ని దేవాలయంలో సేవ కొరకు తన కుమారున్ని ఆదేశించి జొరాష్ట్రియన్ మత ఆచారాలను నేర్చుకోమన్నారు. కాబట్టి ఆ యువకుడు రోజులో ఎక్కువ భాగం దేవాలయంలోనే గడుపుతూ గుడిలో అగ్ని సంరక్షణ బాధ్యతను నిర్వహించే స్థాయికి చేరుకున్నారు. కాస్సేపు కూడా ఆ అగ్ని ఆరిపోకుండా చూసుకోవాలి.

ఇక ఆయనకు అటూ ఇటూ తిరగడానికి కాస్త స్వేచ్ఛ దొరికింది. తన చుట్టూ ఉండే ప్రపంచం గురించి బాగా తెలుసుకునే అవకాశం వచ్చింది. అతను ప్రతీరోజూ దేవాలయానికి వెళుతున్నా, అతను మనస్సులో మాత్రం ఏదో అల్పమైన దానిపై భక్తిని పెంచుకున్నానేమో అని మధనపడుతుండేవారు. మాట్లాడలేని ఈ అగ్నికంటే తనలో నైతిక విశ్వాసం కలిగించే మరొక శక్తి కొరకు వెతకాలని అతని ఆత్మ తీవ్రంగా కోరేది. పచ్చని తోటలు ఆయనను ఆలోచింపజేసేవి. ఏదో ఒక శక్తి ఉందని, అదే పచ్చదనాన్ని ఇస్తుందని, అది అగ్ని మాత్రం కానే కాదని, అది పచ్చదనాన్ని కాల్చివేస్తుందని... ఇలా ఆయన ఆలోచనలు సాగేవి.

అతని తండ్రిగారికి పెద్ద తోట ఉండేది. ఒకరోజు ఆయన నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నం కావలిసి రావడంతో, 'ఓ నా కుమారా! ఈ గృహ నిర్మాణంలో బాగా నిమగ్నమై ఉన్నాను, వెళ్ళి నా తోటను చూడు'' అని చెప్పి అక్కడ ఏమేమి చేయాలో కుమారునికి చెప్పి పంపారు.

సల్మాన్(రజి)వారి మాటలలో :

''నేను తోట వైపు బయలుదేరాను. నేను ఓ చర్చ్ ప్రక్కగా వెళు తుండగా ప్రార్ధన చేస్తున్నవారి స్వరాలను వినగలిగాను. నా తండ్రి నన్ను ఇంటిలోనే ఉంచేవారు కనుక వారి గురించి నాకేమీ తెలియదు. వారి కంఠస్వరాలు వినగానే నేను లోపలికి ప్రవేశించాను వారు ఏమి చేస్తున్నారో చూద్దామని. నేను వారిని చూసినప్పుడు, వారి ప్రార్ధనను చూచి నేను ప్రభావితుడి నయ్యాను. మరియు వారి విధానం వైపు ఆకర్షించబడ్డాను. నేను అన్నాను: ''అల్లాహ్ సాక్షి, మేము అనుసరించే మతం కంటే ఇది ఉత్తమమైనది. అల్లాహ్ సాక్షి, సూర్యాస్తమయం అయ్యేవరకూ నేను వారిని వదిలి వెళ్ళలేదు. మరియు నేను నా తండ్రి తోట గురించి మరిచిపోయాను. మరియు నేను అక్కడకు వెళ్ళలేదు.

నేను వారితో అన్నాను : 'ఈ మతం ఎక్కడ పుట్టింది? వారు చెప్పారు, 'సిరియాలో'. తరువాత నేను నా తండ్రి దగ్గరకు తిరిగివెళ్ళాను. ఆయన కొందరిని నన్ను వెతకడం కొరకు పంపారు. నేను ఆయన చేసే పని నుండి ఆయన ఏకాగ్రత పోగొట్టాను. నేను ఆయన దగ్గరకు వచ్చినప్పుడు, ఆయన అన్నారు : ''ఓ నా కుమారా! నీ వెక్కడున్నావు? నేనేది చెయ్యమని అడిగానో అది నీకు చెప్పలేదా?' నేను చెప్పాను, 'ఓ నా తండ్రీ! కొందరు చర్చ్‌లో ప్రార్ధనలు చేసుకుంటుండగా ప్రక్కనుండి వెళ్ళాను. అల్లాహ్ సాక్షి! సూర్యాస్తమయం వరకూ వారితో నేను ఉన్నాను. ఆయన చెప్పారు, 'ఓ నా కుమారా! ఆ మతంలో మంచి ఏమీ లేదు. నీ మతం మరియు నీ పూర్వీకుల మతం దాని కంటే ఉత్తమమైనది'. నేను చెప్పాను: 'లేదు, అల్లాహ్ సాక్షి, అది మన మతం కంటే ఉత్తమమైనది' ''.

కుమారుని నిర్ణయాన్ని తెలుసుకున్న తండ్రికి తన కుమారున్ని శాశ్వతంగా కోల్పోతాననే భావన కలిగింది. కుమారుని సత్యాన్వేషణ తనకు తన బిడ్డను దూరం చేస్తుందని తెలుసుకున్నారు. అంతకు ముందే తాను చనిపోతే బావుండునని ఆవేదన చెందారు.

తన కుమారుని కాళ్ళకు గొలుసులు కట్టి ఓ ఒంటరి గదిలో బంధించమని తన వారికి ఆదేశించారు. ఆ మందమైన గోడలు మరియు మూసివేసిన తలుపుల మధ్య సల్మాన్ చాలారోజులు గడిపారు.

చర్చ్‌లో మతబోధకుడు క్రైస్తవత్వ నియమాలను వివరించి చెప్పి ఉన్నాడు. అతని మాటలు సల్మాన్ మనస్సును తాకాయి. అయినప్పటికీ ఆ మతబోధకుడు ప్రజలు క్రైస్తవ నియమాలను మార్చివేశారని, ఒకవేళ నిజమైన నియమాలను తెలుసుకోవాలని మరియు వాటిని అనుసరించాలని ఆసక్తి ఉంటే, 'సిరియా' దేశానికి వెళ్ళమని సల్మాన్ గారికి ఆయన సలహా ఇచ్చారు.

''నేను క్రైస్తవులకు కబురు పంపాను, 'ఎవరైనా క్రైస్తవ వ్యాపారులు సిరియా నుండి వచ్చి ఉంటే, వారి గురించి నాకు తెలపమని. కొందరు క్రైస్తవ వ్యాపారులు వచ్చారు. ఆ సమాచారం సల్మాన్‌గారికి అందజేయబడింది. నేను వారితో అన్నాను, 'వారు తమ వ్యాపారాన్ని ముగించుకుని వారి దేశానికి తిరిగి వెళ్ళేటప్పుడు, దాని గురించి నాకు తెలపండి''. వారు అలాగే చేశారు.

''నేను నా కాళ్ళకున్న ఇనుప (సంకెళ్ళను) విసిరివేసి వారితో బయలు దేరాను''

ప్రయాణం 1

## సిరియా

సిరియా చేరగానే, ఆయన ఓ కొత్త ప్రపంచాన్ని మరియు కొత్త ముఖాలను చూచారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. కొత్త ధర్మం గురించి తెలిపే వ్యక్తి గురించి అక్కడి వారిని అడిగారాయన.

'' 'మీ మతంలో ఉన్నతుడు ఎవరు?'

వారు చెప్పారు, 'చర్చ్‌లోని బిషప్'. ఓ చర్చ్ వివరాలను చెప్పారు.

ఆయన ఆ బిషప్‌గారి దగ్గరికి వెళ్ళారు. 'నేను ఈ మతాన్ని ఇష్టపడుతున్నాను మరియు మీతో ఉండాలను కుంటున్నాను. మీ చర్చ్‌లో మీకు సేవ చేయాలని అనుకుంటున్నాను. మరియు మీ దగ్గర నేర్చుకుని మీతో పాటు ప్రార్ధన చేయాలను కుంటున్నాను''.

ఆయన లోపలికి రమ్మన్నారు. సల్మాన్‌గారు ఆయనతో పాటు లోపలికి వెళ్ళారు. ఆ కొత్త ధర్మం గురించి కొత్త విషయాలను సల్మాన్ నేర్చుకోవడం ప్రారంభించారు. ఆయన గురువుగారిని చాలా ప్రశ్నలు అడిగేవారు. వారి గ్రంథాన్ని చదివేవారు. దురదృష్టవశాత్తూ, కొంతకాలానికి తన సేవలందుకునే ఆ మత బోధకుడు మంచివాడు కాదని తెలుసుకున్నారు.

అతడు ప్రజలను ఆదేశించే వాడు మరియు బోధించేవాడు, పేదవారి కొరకు దానాలు ఇవ్వమని. కాని దానిలో పెద్ద మొత్తాన్ని తన కొరకే ఉంచుకునేవాడు. దానిని పేదవారికి ఇచ్చేవాడు కాదు. అతను చేసేది చూశాక, సల్మాన్‌గారు అతనిని చాలా ఎక్కువగా ద్వేషించారు.

**ప్రస్తుతం మన ముస్లిమ్ సమాజంలో కూడా అదే జరుగుతుంది. పేద ప్రజలకు అందవలసిన జకాత్ (విధి దానాన్ని) ధర్మ ప్రచారం పేరుతో దాయీలు దోచుకుంటున్నారు.**

ఆ బోధకుడు మరణించాడు. అతని అంత్య సంస్కారాల విషయంలో అతని అనుచరులు నిమగ్నమై ఉన్నారు. కాని అతనిని సమాధి గావించే లోపు, ఆ బోధకునికి సంబంధించిన నిజాన్ని వారికి సల్మాన్ తెలియ జేశారు. అంతవరకూ ధర్మ పరాయణతకు ఉదాహరణగా భావించి ప్రేమించిన ఆ వ్యక్తి గురించి అటువంటి మాటలు విని, వారు ఆశ్చర్యపోయారు.

వారు అన్నారు, "నీకెలా తెలుసు? మాకు చూపించు అతని ఖజానా ఎక్కడుందో". సల్మాన్‌గారు వారికి ఆ ప్రదేశం చూపించారు. ఏడు పెద్ద పెట్టెల నిండా బంగారం, వెండి ఉంది. వాటిని బయటకు తెచ్చారు. వారు అది చూసి అన్నారు, "**అల్లాహ్ సాక్షి, మేము ఎన్నటికీ అతనిని సమాధి గావించము**".

తరువాత అతనిని శిలువపై వేసి రాళ్ళతో కొట్టారు. తరువాత మరో వ్యక్తిని తీసుకువచ్చి అతని స్థానంలో నియమించారు.

అతనిని నిజాయితీగల వ్యక్తిగా మరియు పూర్తి సమయం ఆరాధనలో గడిపేవారుగా సల్మాన్ తెలుసుకో గలిగారు. ఈయన విషయంలో సల్మాన్(రజి) ఇలా చెప్పారు, "నేను ఇంతకు పూర్వం ఎవరినీ ప్రేమించనంతగా ఆయనను ప్రేమించాను. ఆయనతో పాటు నేను కొంతకాలం ఉన్నాను. ఆయన మరణించడానికి ముందు నేను చెప్పాను, "ఓ ఫలానా! నేను మీతో ఉన్నాను మరియు ఇంతకు పూర్వం ఎవరినీ ప్రేమించనంతగా మిమ్మల్ని ప్రేమించాను. ఇప్పుడు మీరు చూస్తున్నట్లుగా అల్లాహ్ యొక్క ఆదేశం వచ్చింది. ఎవరి దగ్గరికి వెళ్ళమని నాకు మీరు సలహా ఇస్తారు? ఏమి చేయమని మీరు నన్ను ఆదేశిస్తారు? ఆయన అన్నారు, 'ఓ నా కుమారా! అల్లాహ్ సాక్షి! ఈ రోజుల్లో నేను అనుసరించిన దానిని అనుసరించే వారెవరి గురించి నాకు తెలియదు. ప్రజలు దుర్గతి పట్టించారు. వారు మారిపోయారు మరియు ఏదైతే అనుసరిస్తూ ఉండేవారో దానిలో ఎక్కువ వదిలేసారు. మోసుల్‌లో ఉన్న ఓ వ్యక్తి తప్ప. అతడు ఫలానా ఫలానా. అతడు నేను అనుసరించిన దానినే అనుసరిస్తాడు. కాబట్టి అతని దగ్గరకు వెళ్ళి అతనితో ఉండు."

ఆయన మరణించారు. ఆయన సమాధి కావించబడ్డాక, సల్మాన్‌గారు మోసుల్ బయలుదేరారు.మరో కొత్త ప్రదేశానికి ఓ సరికొత్త ప్రయాణం.

## ప్రయాణం 2 మోసుల్

మోసెల్‌లోని ఆ వ్యక్తిని వెతకడానికి సల్మాన్ సిరియా వదిలిపెట్టారు. ఒంటెపై ఆయన చాలా దూరం ప్రయాణించారు. చాలా రోజులకు సల్మాన్ తనకు వర్ణించబడిన ఆ వ్యక్తిని కలిశారు. ఆయనకు తన వృత్తాంతాన్ని తెలిపి, ఆయన సాంగత్యంలో ఉండేందుకు అనుమతి కోరారు. సల్మాన్‌ని ఆయన స్వాగతించి ప్రేమగా చూశారు.

అతని నుండి ఎంత జ్ఞానాన్ని నేర్చుకోవాలో అంత నేర్చుకోకుండానే ఆ మత బోధకుడు కూడా మరణించారు. సల్మాన్ తన దురదృష్టానికి చింతించారు. ఆ గురువుగారు చనిపోయే ముందు 'నసయ్యీబీన్'లో ఉండే మరో వ్యక్తి గురించి సల్మాన్‌కు చెప్పారు.

## ప్రయాణం 3 నసయ్యీబీన్

సల్మాన్ నసయ్యీబీన్ వెళ్ళి ఆయనను కలిశారు. ఆయన వయస్సులో చాలా పెద్దవారు. సదా మామూలే! ఆయనకి కూడా ముందరి గురువు గార్లకి చెప్పినట్లే తన వృత్తాంతాన్ని చెప్పి అనుమతి నడిగారు. ఆయన సల్మాన్‌ని కౌగలించుకుని నీవు నా శిష్యుడివి మరియు స్నేహితుడివి అని అన్నారు. ఆయనతో పాటు సల్మాన్ చాలా సంవత్సరాలు ఉన్నారు.

ఒకరోజు ఆయన కూడా జబ్బుపడ్డారు. మూడవసారి మరలా ఒంటరి వాడిని అవుతున్నాననే భావన కలిగింది. గురువుగారు 'అమ్మూరియా' వెళ్ళమని అక్కడ ఉండే ఓ గురువుగారిని ఆశ్రయించమని సలహా ఇచ్చి మరణించారు.

## ప్రయాణం 4 చివరి క్రైస్తవ మఠం – అమ్మూరియా

ఇప్పుడు సల్మాన్ జ్ఞానపరిపక్వత పొందిన వ్యక్తి. అమూరియాలో సదరు గురువుగారిని కలిశాక ఎప్పటిలాగే రోజులు గడుస్తున్నాయి.

సల్మాన్‌గారు అక్కడ కొన్ని ఆవులను మరియు గొఱ్ఱెలను సంపాదించుకో గలిగారు. ఈ గురువు గారు కూడా మరణానికి చేరువయ్యారు.

ఆయన క్షీణించిన స్వరంతో ఇలా చెప్పారు, "ఓ నా కుమారా! అల్లాహ్ సాక్షి, నిన్ను ఎవరి దగ్గరకైనా వెళ్ళమని చెప్పడానికి మన విధానాన్ని అనుసరించే వారెవరి గురించి నాకు తెలియదు. కాని **ఒక ప్రవక్త వచ్చే సమయం ఆసన్నమైంది.** ఆయన ఇబ్రాహీమ్(అ) వారి ధర్మంతో పంపబడతారు. ఆయన అరబ్బు భూభాగంలో కనిపిస్తారు మరియు రెండు 'హర్రా'ల మధ్య నున్న భూభాగానికి వలస వస్తారు. వాటి మధ్య ఖర్జూరపు చెట్లు ఉంటాయి. **ఆయనను**

**నీవు కలిసి అతని ధర్మాన్ని నీవు అనుసరించగలిగితే నీవు చాలా అదృష్టవంతుడవు. నా కుమారా! నీవు వెతికే వ్యక్తి ఆయనే అని తెలిపే సూచనలు ఆయనకు సంబంధించి మూడు ఉన్నాయి:**

వాటిని నీవు పరీక్షించుకో.

| |
|---|
| **ఆయన తన కొరకు దానాన్ని స్వీకరించరు.** |
| **కాని బహుమతులను స్వీకరిస్తారు** |
| **ఆయన వీపుపై భుజాల మధ్య ఆయన ప్రవక్త అని తెలిపే సీల్ ముద్రించబడి ఉంటుంది.** |

నీవు ఆయనను చూసినప్పుడు నిశ్చయంగా నీవు ఆయనను తెలుసుకుంటావు.''

గురువుగారు మరణించారు.

అరేబియాకు ఎవరితో కలిసి వెళ్ళాలి? ఎలా వెళ్ళాలి? ఇదీ ఆయన ముందున్న ప్రస్తుత సమస్య.

### బానిసగా మక్కా నగరంలో ప్రవేశం

కల్బ్ తెగకు చెందిన ఓ వర్తక బిడారం మక్కాకు వెళుతుందని తెలుసుకుని, తన ఆవులను మరియు గొర్రెలను తీసుకుని, తనను అరబ్ భూభాగానికి వారిని తీసుకెళ్ళమని సల్మాన్‌గారు అడిగారు. వారు సరేనన్నారు. అయితే 'వాది అల్-ఖురా'కు చేరుకున్నాక వారు సల్మాన్‌గారిపై దౌర్జన్యం చేసి, ఆయనను మక్కాలోని ఒక యూదుడికి బానిసగా అమ్మివేశారు. అక్కడ విస్తారంగా ఖర్జూరపు చెట్లు ఉన్నాయి. బానిసత్వంలో ఉన్నప్పటికీ తన బోధకుడు వర్ణించిన ప్రదేశం అదే కావచ్చుని, అక్కడకు ప్రవక్త(స)వారు వలస వస్తారనే ఆశతో ఉన్నారు.

ఆ ఆశతోనే చాలా సంవత్సరాలు బానిసత్వంలో ఉండిపోయారు. కాని ఆయన కష్టాలకు తోడు, తన గురువుగారు వర్ణించిన ప్రదేశం అది కాదని తెలుసుకున్నాక చాలా నిరుత్సాహ పడ్డారు.

ఒకరోజు యస్రిబ్ (మదీనా) నుండి 'బనూ ఖురైజ్' తెగకు చెందిన ఓ యూదుడు తన యజమాని దగ్గరికి వచ్చాడు. సల్మాన్‌గారిని తనకు అమ్మివేయమని అతను తన యజమానిని అడిగాడు. సల్మాన్ గారు మరలా అమ్మబడ్డారు.

ఆ కొత్త యజమాని సల్మాన్‌గారిని యస్రిబ్‌కు తీసుకువెళ్ళాడు. మదీనాలో విస్తారంగా ఉన్న ఖర్జూర చెట్లను సల్మాన్ చూశారు. ఈ సందర్భంగా సల్మాన్(రజి)వారు ఇలా అన్నారు, "**అల్లాహ్ సాక్షి! నేను అది చూడగానే నా గురువుగారు వర్ణించిన భూభాగం అదేనని గుర్తించాను.**"

సహీహ్ బుఖారీలోని ఓ ఉల్లేఖనం ప్రకారం సల్మాన్(రజి)గారు పదిసార్లు కంటే ఎక్కువ ఒకరి నుండి ఒకరికి బానిసగా అమ్మబడ్డారు.

అల్లాహ్ ఆయన యొక్క సందేశహరుడిని పంపారు. ఆయన ఎంతకాలం మక్కాలో ఉన్నారో, అంతకాలం నేను మదీనాలో ఉన్నాను. నేను ఆయన గురించి ఏ విషయమూ వినలేదు ఎందుకంటే, బానిసగా ఎప్పుడూ పనిలో నిమగ్నమై ఉండేవాడిని. తరువాత ఆయన(స) మదీనాకు వలస వచ్చారు. అల్లాహ్ సాక్షి! నేను నా యజమానికి చెందిన ఖర్జూరపు చెట్టు పై భాగాన పనిచేస్తున్నాను మరియు మా యజమాని (చెట్టు క్రింద) కూర్చుని ఉన్నాడు. తరువాత ఆయన బంధువు వచ్చి అతని ప్రక్కగా నిలుచుని చెప్పాడు, "బనూ ఖైలాను (మదీనా వాసులు) అల్లాహ్ చంపుగాక! అల్లాహ్ సాక్షి, ఇప్పుడేవారు ఖుబా దగ్గర ప్రోగవుతున్నారు ఈ రోజు మక్కా నుండి వచ్చే ఓ వ్యక్తికి స్వాగతం పలకడానికి మరియు వారు చెబుతున్నారు, ఆయన ఒక ప్రవక్తని".

"అది వినగానే, నాలో కంపనం మొదలైంది అది ఎంత ఎక్కువుగా నంటే నేను నా యజమానిపై పడిపోతాననుకున్నాను. నేను చెట్టు దిగి అతనిని అడిగాను : "మీరేమి చెబుతున్నారు, మీరేమి చెబుతున్నారు?" నా యజమాని కోపించి తన పిడికిలితో గుద్ది చెప్పాడు, 'దీనితో నీకేంటి పని? వెళ్ళి నీ పనిచూసుకో!' నేను అన్నాను, 'ఏమీ లేదు, ఆయన ఏమి చెబుతున్నారో తెలుసుకుందామనుకున్నాను' ".

కొత్త ప్రవక్త గురించి ఆ రబ్బీ చెప్పిన మాటల గురించే ఆ రోజంతా ఆలోచిస్తూ గడిపారు. ఆ ప్రవక్త(స)వారిని ఎలాగైనా కలిసి, క్రైస్తవ బోధకుడు చెప్పిన ఆ మూడు సూచనలను పరీక్షించుకోవాలి.

### తొలి దర్శనం

సల్మాన్‌గారు సూర్యుడు అస్తమించే వరకూ నిరీక్షించారు. ఆయన కొన్ని ఖర్జూరాలను తీసుకుని ఖుబా దగ్గర ప్రవక్త(స)వారిని కలుసుకున్నారు. ప్రవక్త(స)వారు కొందరు అనుచరులతో అక్కడ కూర్చుని ఉన్నారు. సల్మాన్‌గారు వారికి అభివాదం చేసి చెప్పారు : "నేను విన్నాను మీరు ధర్మపరాయణుడైన వ్యక్తి అని మరియు మీ సహచరులు కొత్త వారని మరియు అవసరంలో ఉన్నారని. నేను కలిగిన ఈ కొంచెం దానంగా ఇస్తున్నాను మరియు ఎవరికంటే కూడా మీకు దీని అవసరం ఎక్కువ అని అనుకుంటున్నాను".

ప్రవక్త(స)వారి దగ్గరగా ఖర్జూరాలు ఉంచి, ప్రవక్త(స)వారు ఏమి చేస్తారోనని చూస్తున్నారు. ప్రవక్త(స)వారు తన అనుచరులతో వాటిని తీసుకోమని చెప్పారుగాని, ప్రవక్త(స)వారు తీసుకోలేదు. సల్మాన్‌గారు ఆశ్చర్య చకితులయ్యారు.

ఆయన వెళ్ళి మరికొంచెం (ఖర్జూరాలు) సేకరించారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మదీనా వెళ్ళారు. ఆయన ప్రవక్త(స)వారి వద్దకు వెళ్ళి చెప్పారు, 'మీరు దానాన్ని తినకపోవడం చూశాను. ఇది కానుక. దీనితో నేను మిమ్మల్ని గౌరవిస్తున్నాను.' రసూలుల్లాహ్(స) దానిలో కొంత తిన్నారు మరియు అనుచరులకు కూడా తినమని చెప్పారు. సల్మాన్‌గారి ఆనందానికి అవధులు లేవు. సల్మాన్‌గారు తనలో తను అనుకున్నారు, "రెండవది ఇది".

కాని 3వ సూచన ఇంకా మిగిలే ఉంది. కొన్నాళ్ళకి ఆయన మరలా ప్రవక్త(స)వారి దగ్గరికి వచ్చారు. ఆయన(స) 'బఖీ' స్మశాన వాటిక దగ్గర ఒకరి జనాజా నిమిత్తం హాజరై ఉన్నారు. ఆయన రెండు వస్త్రాలను ధరించి సహచరుల మధ్యలో కూర్చుని ఉన్నారు. సల్మాన్‌గారు ఆయనకు

సలామ్ చెప్పి ఆయన వెనుకకు కదిలారు, తన గురువుగారు వర్ణించిన సీల్ ఆయన వీపుపై చూడటానికి ప్రయత్నిస్తూ. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) సల్మాన్‌గారు వెనుకకు వెళ్ళడం చూసి సీల్‌ను ధృవపరచు కోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్నారు. అకస్మాత్తుగా, భుజాల పైనున్న వస్త్రాన్ని ఆయన(స) క్రిందికి జారవిడిచారు.

**'నేను ఆ గుర్తును చూసి గుర్తు పట్టాను. నేను ఆయనను కౌగలించు కున్నాను. (ఆ సీల్‌ని) ముద్దుపెట్టుకుని విలపించాను."**

ఒకటీ రెండూ కాదు, ఎన్నో సంవత్సరాల సుధీర్ఘ అన్వేషణ. ఆ అన్వేషణ ఫలించింది. ఆయన కళ్ళు వర్షించాయి. అతి సుకుమారంగా పెంచుకున్న తన తండ్రి ప్రేమను, ఐశ్వర్యాన్ని అన్నీ వదులుకుని సత్యం కోసం ఎన్నో కష్టాలు పడ్డారు. ఆయన కష్టం ఊరికినే పోతుందా? అనంత కరుణామయుడైన అల్లాహ్ ఇటువంటి తన దాసున్ని ఊరికినే ఎలా వదులుతారు? అనుగ్రహ వర్షాన్ని కురిపించారు.

ప్రవక్త(స)వారు ఆయనను ఇటు తిరగమని చెప్పారు. ఆయన ప్రవక్త(స)వారి వైపు తిరిగి తన వృత్తాంతాన్ని అంతా చెప్పారు. ముహమ్మద్(స)వారు తన అనుచరులు కూడా అది వినాలనుకున్నారు.

సల్మాన్‌గారు ప్రవక్త(స)వారికి మరియు ఆయన అనుచరులకి తన సుదూర ప్రయాణం గురించి చెప్పారు. ఆయన ప్రవక్త(స)వారిని సమీపించి ఆయన(స)తో చెప్పారు, '**ఇస్లామ్‌ను తన ధర్మంగా స్వీకరించానని**'. 'మబా' అనే అతని పూర్వపు పేరును సల్మాన్‌గా ప్రవక్త(స)వారు మార్చారు.

**అప్పటి వరకూ సల్మాన్‌గారు ఆ మూడు సూచనల గురించి ఎవరితోనూ ప్రస్తావించలేదు. కాని ప్రవక్త(స)వారికి ఆయన మూడవ సూచన గురించి వెతుకుతున్నారని తెలిసిపోయింది. అంటే ప్రవక్త(స)వారికి సల్మాన్‌గారి గురించి అప్పటికే అల్లాహుతాలా తెలియజేశారు.**

అయితే, సల్మాన్(రజి)వారు ఇంకా బానిసగానే ఉన్నారు. తన తోటి ముస్లిమ్‌లతో ఇస్లామ్ రాజ్య నిర్మాణంలో కృషి చేసే అవకాశం లేకపోవడం ఆయనకు విచారం కలిగించింది. ఎల్లప్పుడూ బానిసత్వ పనిలో ఆయన నిమగ్నులై ఉండేవారు. ఆయన బద్ర్ మరియు ఉహద్ యుద్ధాలలో పాల్గొనలేక పోయారు. ముహమ్మద్(స)వారు సల్మాన్(రజి)వారితో చెప్పారు, "ఓ సల్మాన్! బానిస విమోచన ఒప్పందాన్ని వ్రాయించుకో". కాబట్టి ఆయన తన యజమానితో బానిసత్వ విమోచన ఒప్పందాన్ని వ్రాయించుకున్నారు. బదులుగా మూడు వందల ఖర్జూరపు మొక్కలను అతని కొరకు సల్మాన్(రజి)వారు నాటాలి మరియు 40 ఊకియాల బంగారం ఇవ్వాలి. ఇవి చేస్తే ఆయనకు బానిసత్వం నుండి విముక్తి లభిస్తుంది.

సల్మాన్(రజి)వారికి ఇది చాలా కష్టమైన పని. ప్రవక్త(స)వారు తన సహచరులతో చెప్పారు, "మీ సోదరునికి సహకరించండి". కాబట్టి వారు ఖర్జూరపు మొక్కలతో సహకరించారు. ఒకరు 30 మొక్కలను మరియు మరొకరు 20 మొక్కలను, ఇంకొకరు 15 మొక్కలను మరియు మరొకరు పది, అంటే ప్రతీ ఒక్కరూ తను కలిగిన దానిని బట్టి ఇచ్చారు, అవి మూడు వందలు అయ్యేవరకూ.

తరువాత ప్రవక్త(స)వారు సల్మాన్(రజి)తో చెప్పారు: "వెళ్ళు, ఓ సల్మాన్! ఎక్కడైతే వీటిని నాటాలో అక్కడ గోతులు తవ్వు. నీవు ఆ పని పూర్తిచేయగానే నా దగ్గరకు రా. మరియు నేను వీటిని నా చేతులతో నాటుతాను". ఆయన సహచరుల సహకారంతో గోతులు తవ్వి ప్రవక్త(స)వారి దగ్గరకు వచ్చి చెప్పారు. రసూలుల్లాహ్(స)వారు వచ్చారు. ఆయన(స) దగ్గరకు మొక్కలను తీసుకెళ్ళి అందిస్తుంటే, ఆయన తన హస్తాలతో వాటిని నాటారు. సల్మాన్(రజి) చెప్పారు, "**ఎవరి చేతులలో సల్మాన్ ఆత్మ ఉందో ఆయన సాక్షి! ఒక్కటంటే ఒక్క చెట్టు కూడా చనిపోలేదు.**" చెట్టు నాటే పని పూర్తి అయిపోయింది. ఇక ధనం ఇవ్వాలి.

యుద్ధప్రాప్తిలో ఒకసారి గుడ్డు సైజులో ఉండే కొంత బంగారం ప్రవక్త(స)వారి దగ్గరకు తీసుకురావడం జరిగింది. ఆయన(స) అన్నారు: "బానిసత్వ విముక్తికి ఒప్పందం చేసుకున్న ఆ పర్షియన్‌కి ఏమైంది?". సల్మాన్(రజి) ఆయన(స) దగ్గరికి పిలువబడ్డారు మరియు ఆయన(స) చెప్పారు : "ఇది తీసుకుని నీవు ఒప్పందం చేసుకున్న దానిని చెల్లించు, ఓ సల్మాన్!".

సల్మాన్(రజి) అన్నారు, "నేను ఒప్పందం చేసుకున్నదంతా దీనితో ఎలా చెల్లించగలను? ఓ రసూలల్లాహ్(స)!". ఆయన(స) అన్నారు, "ఇది తీసుకో మరియు నీవు ఒప్పందం చేసుకున్న దానిని చెల్లించడంలో అల్లాహ్ నీకు సాయం చేస్తారు".

కాబట్టి ఆయన దానిని తీసుకుని తూకం వేయించారు. ఆ సందర్భంగా సల్మాన్(రజి) ఇలా చెప్పారు, "**ఎవరి చేతులలో సల్మాన్ ఆత్మ ఉందో ఆయన సాక్షి! అది నలభై ఊకియాలు ఉంది.**" అంటే ఖచ్చితంగా చెల్లించవలసినంతే ఉంది. కాబట్టి ఆయన తాను చెల్లించవలసినది చెల్లించి స్వేచ్ఛను పొందారు. కందక్ యుద్ధంలో ఆయన ప్రవక్త(స)వారితోనే ఉన్నారు. అప్పటి నుండి ఇక ఏ పెద్ద కార్యక్రమానికీ ఆయన దూరం కాలేదు.

తన మాతృభూమిని వదిలి, ఎంతో ఐశ్వర్యాన్ని, అధికారాన్ని, ప్రాణంగా చూసుకునే తండ్రిని వదిలి సత్యం కొరకు ఎన్నో కష్టాలు అనుభవించి చివరకు గమ్యాన్ని చేరుకున్నారు. విశ్వాసుల కుటుంబంలో చేరారు. ఎన్నో పల్లెలు, పట్టణాలు దాటి సుదూర ప్రయాణం గావించారు. ఎందరో మంచివారిని, చెడ్డవారిని చూశారు.

చివరకు ఆయన కోరుకున్నది దొరికింది. ఈ సత్యం అతని హృదయాన్ని ప్రకాశవంతం చేసింది. ఈయన ఇప్పుడు స్వేచ్ఛాజీవి. **అతనికి లభించిన స్వేచ్ఛ కేవలం బానిసత్వం నుండి మాత్రమే కాదు, ఆయన సందేహాల నుండి మరియు ఆధ్యాత్మిక సంక్షోభం నుండి కూడా.**

ఆయన కిప్పుడు కొత్త జీవితం లభించింది. పరస్పరం అర్థం చేసుకుని సోదరభావాన్ని నెలకొల్పే ఓ గొప్ప సత్య ధర్మాన్ని తెలుసుకున్నారు. జాతి, వర్గ, వర్ణ విచక్షణ చూపని, సమాన హక్కులను కలిగిన ఓ గొప్ప మానవతను ఆయన కనుగొన్నారు.

ఎవరి కుమారుడివి అని ఎవరైనా అడిగితే ఆయన సమాధానం - 'నేను సల్మాన్‌ని. ఆదమ్(అ)వారి సంతానంలో ఇస్లామ్ కుమారుడిని'.

అప్పట్లో బానిసత్వం కారణంగా బద్ర్ యుద్ధంలో పాల్గొన లేకపోయినా, అల్లాహ్ విశ్వాసులకు అందించిన సహాయాన్ని గ్రహించారు. మదీనా పొలిమేరలలో ఉండే యూదులతో పరస్పర సహకారం కొరకు ముహమ్మద్(స)వారు ఒప్పందాలు చేసుకున్నారు. కాని యూదులు మాటపై నిలబడే వ్యక్తులు కాదు.

ఉహద్ యుద్ధం మక్కావారికి అనుకూలంగా మారడంతో, వారు మరింత పుంజుకుని మదీనాపై దండెత్తి ఇస్లామ్ పిలుపును భూస్థాపితం చేద్దామనుకున్నారు. వారు పదివేల మంది సైన్యంతో, మదీనాలోని యూదుల సహకారంతో ముస్లిములపై గట్టి దెబ్బ వెయ్యడానికి పథకం పన్నారు. ఆ అరబ్ తెగలన్నింటికి అబూ సుఫ్యాన్ నాయకత్వం వహించాడు. వారు మంచి యుద్ధ సామాగ్రిని కలిగి ఉన్నారు.

ప్రవక్త(స)వారు తన పినతండ్రి అబ్బాస్(రజి)వారి ద్వారా శతృవుల పథకాలు తెలుసు కున్నారు. ఉహద్ యుద్ధం తరువాత తనవారిని యుద్ధంలో దింపడానికి ముహమమద్(స)వారికి సమయంగాని వనరులుగాని లేవు. 3000 మంది కంటే ఎక్కువ సైన్యాన్ని సన్నాహం చేయడం కష్టం.

అరబ్బులు మరియు యూదులు చాలాకాలంగా ఈ యుద్ధం కొరకు సిద్ధమౌతున్నారు. ఆ సమయానికి అందుబాటులో నున్న అధునాతనమైన ఆయుధాలను వారు సమకూర్చుకున్నారు. ప్రవక్త(స)వారు ఎప్పటిలాగే తన సహచరులను వారి సలహా కొరకు సంప్రదించారు. మదీనా బయట బహిరంగంగా యుద్ధం చేయడానికి కొందరు ప్రతిపాదించారు. బద్ర్‌లో అల్లాహ్ సహాయం అందించినట్లు, సహాయం అందుతుందనే నమ్మకంలో ఉన్నారు. కొందరు మదీనాలోనే ఉండి పట్టణాన్ని రక్షించుకునే విధంగా యుద్ధ ప్రతిపాదన చేశారు.

ప్రవక్త(స)వారికి కూడా అదే మేలనిపించింది. బహిరంగ యుద్ధంలో ప్రస్తుత పరిస్థితిలో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. ఒక ప్రక్క అబ్దుల్లా బిన్ ఉబయ్ వంటి కపటవిశ్వాసులు (మునాఫిక్‌లు) ఉన్నారు. వారు తమ అనుచరులతో ఇదే అదనుగా పట్టణాన్ని యూదుల సహాయంతో స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. తమతో ఒప్పందం చేసుకున్న బనూ ఖురైజా తెగ యూదులు కూడా తమకు సహకరించరు. వారు రహస్యంగా అవిశ్వాసులతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

మదీనా ఫెన్సింగ్ లోపల ఉండి యుద్ధం చేస్తే, సైనికులపై ఒత్తిడి పెరుగుతుంది, పట్టణంలోని మహిళలకు మరియు పిల్లలకు ప్రమాదం జరగవచ్చు. శతృవులకు బందీలు కావచ్చు.

ప్రతీ ప్రతిపాదనలో ఏదో ఒక లోపం కనిపించింది. ప్రమాదం సమీపిస్తుంటే సమయం తగ్గిపోతుంటే ముస్లిములపై ఒత్తిడి పెరిగిపోతుంది.

ఇటువంటి పరిస్థితిలో సల్మాన్(రజి) ఓ మంచి ప్రతిపాదనను వారి ముందుంచారు. ఆయన తన మాతృభూమిలో ఉన్నప్పుడు పర్షియన్లు రోమన్ల దాడినుండి తమ నగరాలను ఎలా కాపాడుకునేవారో చూసి ఉన్నారు. ఆ మెళుకువ (టెక్నిక్)నే ప్రతిపాదించారు. దాని ప్రకారం ముస్లిమ్ సైన్యమంతా ఊరి పొలిమేరల చుట్టూ ఓ వెడల్పైన మరియు లోతైన గొయ్యి (కందకం) తవ్వాలి. శతృ సైనికులకు మరియు వీరికి మధ్య ఆ పెద్ద అగాధం అడ్డుగా ఉంటుంది.

యుద్ధంలో ముఖాముఖి పోరాడటం తప్ప అరబ్బులకు ఇటువంటి యుద్ధం గురించి తెలియదు.

చర్చల అనంతరం ప్రవక్త(స)వారు 'కందకం' ప్రతిపాదనకు సరేనన్నారు. కందకం తవ్వడానికి ముస్లిములను ఆదేశించారు. ఉత్సాహంతో ముస్లిములు పని ప్రారంభించారు. సల్మాన్(రజి)వారికి సహాయం చేస్తూ, ఈ కందకాల వలన జరిగిన అద్భుతాల గురించి చెప్పారు. పని జరుగుతూ ఉంది.

సాధారణంగా ప్రతీ మానవ ప్రయత్నంలో కొన్ని కష్టాలు తప్పవు కదా! ముస్లిములు రాతి నేలలో తవ్వుతుండగా, ఓ పెద్ద బండరాయి వారి పనికి ఆటంకం అయింది. తొమ్మిది మంది ఆ రాయిని పగలగొట్టడానికి శాయశక్తులా ప్రయత్నించారుగాని సాధ్యం కాలేదు. చివరికి వారు ప్రవక్త(స)వారికి తెలియజేశారు.

## జరుగబోవు అద్భుత విజయాల గురించి ముందస్తు శుభవార్త

ప్రవక్త(స)వారు సల్మాన్(రజి)వారి గొడ్డలిని తీసుకుని కందకంలోకి దిగి గొడ్డలితో రాయిపై దెబ్బ వేశారు. ఆ దెబ్బకు మెరుపులు వచ్చాయి. ప్రవక్త(స)వారు '**అల్లాహు అక్బర్**' అని గట్టిగా అన్నారు. అది విని కందకంపైనున్న ముస్లిములు కూడా 'అల్లాహు అక్బర్' అన్నారు. ప్రవక్త(స)వారు వేసిన రెండవ దెబ్బకు చీకటి గదిలో దీపాన్ని వెలిగిస్తే వచ్చేటటువంటి వెలుగు కనిపించింది.

ప్రవక్త(స)వారు 'అల్లాహు అక్బర్' అన్నారు. మిగతా ముస్లిములు కూడా 'అల్లాహు అక్బర్' అన్నారు. మూడవ దెబ్బకు ఆ రాయి ముక్కలు ముక్కలు అయిపోయింది. ప్రవక్త(స)వారు కందకం బయటకు వచ్చారు.

సల్మాన్(రజి)వారు ఆశ్చర్యంతో అడిగారు :

**"ఓ రసూలుల్లాహ్! నేను ఇంతకు ముందెన్నడూ చూడని దానిని చూశాను". ప్రవక్త(స)వారు మిగిలిన ముస్లిమ్‌లను అడిగారు : "సల్మాన్ చూసిన దానిని మీరు చూశారా?"**

వారు సమాధాన మిచ్చారు : ''ఔను, మేము చూశాము రాయిని కొట్టడం మరియు వెలుగు రావడం''.

ప్రవక్త(స) చెప్పారు : ''నేను మొదటి సారి రాయిని కొట్టినప్పుడు పర్షియా రాజ భవనాలను మరియు సీజర్ కోటలను చూశాను. దైవదూత జిబ్రీల్(అ) నాకు చెప్పారు, నా అనుచరులు ఆ భూభాగాన్ని జయిస్తారని. రెండవసారి కొట్టినప్పుడు, రోమన్ల రాజభవనాలను చూశాను. జిబ్రీల్(అ) నాతో చెప్పారు, నా అనుచరులు ఆ భూభాగాన్ని జయిస్తారని. మూడవ సారి కొట్టినప్పుడు యమన్‌లోని సనా రాజభవనాలు కనిపించాయి. జిబ్రీల్(అ) చెప్పారు, నా అనుచరులు ఆ భూభాగాన్ని జయిస్తారని''.

ఇది ఎంత వింతగా ఉంది! ఓ వ్యక్తి తన పట్టణాన్ని కాపాడు కోవడానికి గోతిని తవ్విస్తూ, అతి పెద్ద సామ్రాజ్యాలపై విజయం గురించి చెప్పడం!

**ఇవి కపట విశ్వాసుల (మునాఫిక్‌ల) సందేహాలు.** వారు ప్రవక్త(స)వారి మాటలను జోక్‌గా తీసుకున్నారు. వారు అంటున్నారు : "మనలో ఎవరూ తమ ఇంటిలో నుండి బయటికి రావడానికి ధైర్యం చేయలేని సమయంలో పర్షియా మరియు రోమ్ సామ్రాజ్యాలను జయిస్తామని ముహమ్మద్(స)వారు చెబుతున్నారు".

కాని నిజమైన ముస్లిమ్‌కి ప్రవక్త(స)వారి నోటి వెంట వెలువడే ప్రతీ మాటపై పూర్తి విశ్వాసం ఉంది. ప్రవక్త(స)వారి మాట తప్పనిసరిగా నిజమౌతుందని సల్మాన్(రజి)వారికి ధృడనమ్మకం.

వాస్తవానికి, అది ముస్లిములకి చాలా కష్టకాలం కాబట్టి ఆ సందేశం వారిలో సందేహంలో పడవేయడం సహజం, అందులోనూ వారు శతృవులచే దాడిచేయబడ బోతున్నారు. కాని వారు సందేహ పడలేదు. ఆ సమయంలో మహా సామ్రాజ్యాలను జయించడం అనే విషయాలు ఊహలో కూడా అసాధ్యమే!

ప్రవక్త(స)వారి మాటలు విన్నాక వారి భావాలు ఎలా ఉన్నాయో క్రింది ఖుర్'ఆన్ వాక్యం తెలియజేస్తుంది.

"మరియు విశ్వాసులు, దాడిచేసిన వర్గాల వారిని చూసినపుడు ఇలా పలికారు : "అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు సత్యం పలికారు". ఇది వారి విశ్వాసాన్ని మరియు అల్లాహ్ పట్ల వారి విధేయతను మరింత అధికమే చేసింది" (ఖుర్'ఆన్ 33:22)

కందకం దగ్గరికి వచ్చిన శత్రు వర్గాలు ఆ సైనిక మెళుకువను చూచి ఆశ్చర్యపోయారు. వారు గోతి వెనుకే నిలుచుండిపోయారు. ముస్లిములు ధీటుగా నిలుచున్నారు. మదీనా నలువైపుల నుండి యూదుల సహకారంతో దాడిచేయడానికి వచ్చిన వారంతా గోతి దగ్గర తోడేళ్ళులా నిలబడి పోయారు.

అంతా అల్లాహ్ ఇష్టప్రకారమే జరుగుతుంది. **విశ్వాసులు ఏమీ చేయకుండా కూర్చుంటే విజయం సాధించలేరు.** ప్రయత్నం చేయాలి. ప్రయత్నం చేసే విశ్వాసులకు అల్లాహ్ యొక్క సహాయసహకారాలు అందుతాయి.

**ప్రస్తుత ముస్లిమ్ సమాజంలో మంచిని బోధించి, చెడును నిరోధించడమంటే ఈ రోజుల్లో చేయలేమని అసమర్థత వ్యక్తం చేస్తున్న వారినెందరినో చూస్తున్నాం. కాని వారు అందుకొరకు ఎప్పుడైనా కొంచెమైనా ప్రయత్నించారా? లేదు. ప్రయత్నం చేస్తే అల్లాహ్ అనుగ్రహంతో ఇన్నా అల్లాహ్ సాధించగలుగుతారు.**

అసంఖ్యాకంగా వచ్చే శతృవులను ఎదుర్కోవడానికి తమకు సాధ్యమైన విధంగా విశ్వాసులు కష్టపడ్డారు. ఇక వారికి అల్లాహ్ సహాయం ఆగదు కదా!

ఒకవైపు మక్కా అవిశ్వాసులు, మరోవైపు యూదులు దాడిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. చాలా చల్లటి వీదురుగాలులు శతృవుల గుడారాల (టెంట్ల)పై వీచాయి. నిరాశతో వారు వెనుదిరిగి పోవలసి వచ్చింది. అల్లాహ్ విశ్వాసులకు సాయం చేశారు.

అల్లాహ్ చెబుతున్నారు :

"ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి. మీ పైకి సైన్యాలు వచ్చినప్పుడు, మేము వారిపైకి ఒక తుఫాను గాలిని మరియు మీకు కనబడని సైన్యాలను పంపాము మరియు అల్లాహ్ మీరు చేసేదంతా చూస్తున్నాడు" (ఖుర్'ఆన్ 33:9)

సల్మాన్(రజి)గారు ఇప్పుడు సల్మాన్ అల్ ఖైర్ (Salman the Good) అయ్యారు. ఆయనకు ఓ వస్త్రం ఉండేది. దానిని ధరించి మరియు దానిపైనే పడుకునేవారు. ఆయన ఇల్లు కోసం చూసుకునేవారు కాదు. ఓ చెట్టు క్రింద లేదా ఓ గోడ నీడన పడుకునేవారు.

### జ్ఞానం

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. మేము ప్రవక్త(స)వారితో కూర్చుని ఉండగా సూరహ్ జుము'ఆ ఆయనపై అవతరించింది. మరియు ఆయత్ "మరియు ఇంకా వారిలో చేరని ఇతరులకు కూడా (బోధించటానికి) ... (ఖుర్'ఆన్ 62:3)" ప్రవక్త(స)వారిచే పఠించబడినప్పుడు, నేను అన్నాను, "వారు ఎవరు, ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా(స)?" నేను నా ప్రశ్నను 3 సార్లు పునరావృత్తం చేసినా ప్రవక్త(స)వారు సమాధాన మివ్వలేదు. ఆ సమయంలో సల్మాన్ అల్-ఫార్సీ మాతో ఉన్నారు. కాబట్టి అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఆయన చేతిని సల్మాన్(రజి)పై ఉంచి చెప్పారు, "విశ్వాసం అత్‌తురైయ్యా (బాగా పైనున్న నక్షత్రం) దగ్గర ఉన్నా, అప్పుడు సైతం వీరిలో (కొందరు) (అంటే సల్మాన్(రజి)వారి తెగ) దానిని తీసుకుంటారు". **(సహీహ్ బుఖారీ, 4897, సంపుటి 6)**

ప్రవక్త(స)వారంటే సల్మాన్(రజి)వారికి చాలా ప్రేమ. ప్రవక్త(స)వారి నుండి ఆయన చాలా జ్ఞానాన్ని పొందారు. విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారి నుండి తెలియజేయబడింది ఏమిటంటే, ఒకొక్కసారి ఆయన రాత్రుళ్ళు చాలా సేపు ప్రవక్త(స)వారితో మాట్లాడుతూ ఉండేవారు. విశ్వాసుల మాతృమూర్తులు అనుకునేవారు ఆ రాత్రంతా సల్మాన్(రజి)వారితో మాట్లాడుతూనే ఉంటారని.

అలీ(రజి) ఆయన గురించి చెప్పారు ఆయన 'లుఖ్మాన్, జ్ఞాని' వంటివారు అని. కాబ్ అల్-అహ్‌బార్ అన్నారు : "సల్మాన్(రజి) జ్ఞానం మరియు వివేకంతో నిండి ఉన్నారు - ఎప్పటికీ ఎండిపోని సముద్రం".

సల్మాన్(రజి)వారు ప్రారంభంలో అగ్ని పూజారిగా ఉండేవారు. ఆ ఆచారాలన్నీ ఆయనకు బాగా తెలుసు. తరువాత క్రైస్తవుడు అయ్యాక ఆ గ్రంథాలను బాగా అధ్యయనం చేశారు. తరువాత ఇస్లామ్ స్వీకరించాక ఖుర్'ఆన్ అధ్యయనం చేసారు. ముహమ్మద్(స) జీవించి ఉన్నప్పుడే, ఖుర్'ఆన్‌లోని కొన్ని భాగాలను 'పర్షియా' భాషలోకి అనువాదం చేశారు. ఆ విధంగా ఈయన ఖుర్'ఆన్ గ్రంథాన్ని మరొక భాషలోకి అనువదించిన తొలి వ్యక్తి.

ముహాజిరీన్‌లు, అన్సారులు సల్మాన్(రజి)వారిని తమ కుటుంబ సభ్యునిగా చేసుకోవడానికి పోటీ పడ్డారు. కాని ముహమ్మద్(స)వారు ఇరువైపు వారికి ఇలా చెప్పారు : "**సల్మాన్ ప్రవక్త(స) కుటుంబ సభ్యుడు**".

ప్రవక్త(స)వారు మరణించాక సల్మాన్(రజి)వారు అబూబకర్ సిద్దీఖ్(రజి)వారితో ఉండేవారు. ప్రవక్త(స)వారు కందక యుద్ధం సమయంలో ముందుగా చెప్పిన ఆ మహాసామ్రాజ్యలపై విజయం పొందే రోజు కొరకు ఎదురు చూస్తున్నారు.

ప్రవక్త(స)వారి తరువాత ఉమర్(రజి) మరియు ఇతర సహచరులు(రజి) ఆయనను సలహాలు అడిగేవారు. ఆయన తీర్పుకు గౌరవమిచ్చేవారు.

ఆయన ఎదురుచూస్తున్న ఆ రోజు రానే వచ్చింది.

ఉమర్(రజి)వారి పాలనలో సల్మాన్(రజి)వారు సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ వారి నాయకత్వంలో ఇరాఖ్ వైపు మరియు ఆ తరువాత అక్కడి నుండి తన మాతృభూమి పర్షియా వైపు దండయాత్రకు వెళ్ళారు. మద'ఇన్‌పై విజయం సాధించాక, సల్మాన్(రజి)వారిని అక్కడ గవర్నర్‌గా ఉమర్(రజి)వారు నియమించారు.

ఎన్నో సంవత్సరాల క్రితం వదిలి వెళ్ళిన తన మాతృభూమికి తిరిగి వచ్చారు. మామూలుగా రాలేదు. ఈనాడు అదే ప్రాంతానికి ఆయన గవర్నర్. ఒట్టి చేతులతో సత్యాన్వేషణ కోసం వెళ్లిపోయిన ఆయన తన మాతృభూమికి సత్యంతో తిరిగి వచ్చారు. ఇస్లామ్ సల్మాన్(రజి)కొరకు ఏమి చేసిందో సమయమే ప్రజలకు నిరూపించి చూపింది.

అల్లాహ్ కరుణామయుడు. నీవు అల్లాహ్ వైపు ఒక అడుగు వేస్తే, అల్లాహ్ నీవైపు పది అడుగులు వేస్తారు. అల్లాహ్ మార్గంలో నీవు ఒక కష్టాన్ని భరిస్తే, అల్లాహ్ నీకు ఎన్నో రెట్లు సంతోషాన్నిస్తాడు. చాలా మంది అనకుంటూ ఉంటారు, 'నేను ఎన్నో కష్టాలు పడినా సరే అల్లాహ్ నుండి నాకు సహాయం అందలేదని'. ఇది ఎలా ఉంటుంది అంటే కొంత పెట్టుబడి పెట్టి వ్యాపారం మొదలుపెట్టిన రోజునే విపరీతమైన లాభాలు రాలేదని గోలపెట్టే వ్యాపారస్థుడులా ఉంటుంది. లాభాలు రాలేదని వ్యాపారం వదిలేస్తే, పెట్టిన పెట్టుబడి కూడా పోతుంది.

ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. 'అల్లాహ్ తన దాసుల్ని వదిలేస్తారని ఎలా అనుకుంటున్నారు, ఆయన అనంత కరుణామయుడని స్పష్టంగా తెలిసాక కూడా?'. మన సంకల్పంలో నిజాయితీ ఉంటే, అల్లాహ్‌పై నిజమైన విశ్వాసం ఉంటే ఊహకందని కరుణ ఇహలోకంలో కూడా లభిస్తుంది. ఈ విషయంపై ఎన్నో చారిత్రక ఉదాహరణలు మనముందున్నా సరే మనిషి నమ్మలేకపోతున్నాడు.

ఇదేనేమో! కళ్ళుండి చూడలేకపోవడమంటే!

ఓ వ్యక్తి ఆయనను అడిగాడు : 'నీవు నివశించేందుకు నీకొక ఇంటిని నిర్మించనా?' 'నాకు ఇంటి అవసరం లేదు' అన్నారు. కాని అతను వదల లేదు మరియు అన్నాడు, "నాకు తెలుసు నీకు ఎటువంటి ఇల్లు నప్పుతుందో". సల్మాన్(రజి) అన్నారు, "దానిని నాకు వర్ణించు".

"అందులో మీరు నిలుచుంటే పైకప్పు మీ తలకు తగులుతుంది మరియు మీరు కాళ్ళు చాపుకుంటే గోడలు వాటికి ఇబ్బంది పెడతాయి" (అంటే అతి చిన్న ఇల్లు).

**ఆదర్శ గవర్నర్**

ఓ ప్రాంతానికి అధిపతి. ఓ మహాసామ్రాజ్యంలో ఓ ప్రభుత్వ ప్రతినిధి. పెద్ద హోదా. కాని ఆ హోదాకు మించిన నైతిక బలం, విశ్వాస బలం ఆయనలో ఉన్నాయి. అహంకారం లేదు. ఎటువంటి ఆర్భాటమూ లేదు. మరి ఆయన పాలన ఏవిధంగా ఉందో చూద్దాం!

ఆయన ఎంతో అణుకువతో, దయతో గవర్నర్‌గా పనిచేశారు. **గవర్నర్ అంటే సేవచేసేవాడు, అంతేగాని సేవ చేయించుకునేవాడు కాదు** అని నేర్పిన వ్యక్తి సల్మాన్(రజి).

ఒకచోట ముగ్గురు విశ్వాసులున్నా, అందులో ఒకరు అమీర్ (నాయకుడు)గా ఉండడం ప్రవక్త(స)వారి సాంప్రదాయం. లీడర్ కావాలని ఈ రోజుల్లో ఎందరో పోటీ పడుతున్నారు. కాని ఇస్లామ్‌లో నాయకత్వం వహించాలంటే భయపడతారు.

ఇద్దరికి సైతం నాయకునిగా ఉండడం కూడా చాలా కష్టమైన పని అని సల్మాన్(రజి)వారు చెప్పేవారు. ఒకసారి ఉమర్(రజి)వారితో ఆయన అన్నారు: "**మీ ఆదేశాలను పాటించడం తప్పనిసరి కాకపోతే, నేను ఎన్నటికీ గవర్నర్‌గా ఉండడానికి అంగీకరించేవాడిని కాను**".

గవర్నర్ అయ్యాక 5000 దిర్హములు జీతం తీసుకునేవారు. కాని ఆ జీతాన్ని దానం చేసేసేవారు. ఆయన చేతులతో పనిచేసి, ఆ విధంగా వచ్చిన సంపాదనతోనే తినేవారు.

ఒకసారి కొందరు మద్యన్ వచ్చి ఆయన తోటలో పనిచేస్తుండగా చూశారు. వారు అన్నారు, "మీరు అమీర్ (నాయకుడు) మరియు మీ జీవనాధారానికి హామీ ఉంది మరియు మీరు ఈ పని చేస్తున్నారు".

"నేను నా చేతి సంపాదన నుండి తినడాన్నే ఇష్టపడతాను" ఆయన సమాధానమిచ్చారు.

**నిరాడంబరత**

సాధారణ వస్త్రంతో తయారైన అంగీని ధరించి ఆయన ప్రసంగించేవారు. ఆయన గాడిదపై జీనులేకుండా ప్రయాణం చేసేవారు. చిన్న చొక్కాను ధరించేవారు. ప్రజల్లో కొందరు ఆయనను చూసి నవ్వేవారు. కాని దానిని ఆయన పట్టించుకునేవారు కాదు.

ఈ రోజు మీరు నవ్వుతారు మీకు ఇష్టమైనంత, కాని నీతి మరియు అవినీతి యొక్క విలువ ఈ జీవితం తర్వాతే (అంటే పరలోకంలో) తెలుస్తుంది.

ఒంటె వెంట్రుకలతో తయారైన ఓ పాత దుప్పటి ఆయన కుండేది. దానిని ఆయన పగలు భుజంపై వేసుకునేవారు మరియు రాత్రి పడుకునేటప్పుడు దానితో తన శరీరాన్ని కప్పుకునేవారు. ఆయన ఆ విధంగా అతి నిరాడంబరుడుగా వెళుతుంటే మద్యన్ లోని కొందరు ప్రజలు గుర్గ్ ఆమద్, గుర్గ్ ఆమద్ (తోడేలు వచ్చింది, తోడేలు వచ్చింది) అని అరిచేవారు.

ఒకరోజు ఆయన బజారులో వెలుతుండగా, ఆ ప్రాంతానికి కొత్తగా వచ్చిన వ్యక్తి ఆయనను కూలివాడనుకొని తన సామాగ్రిని మోయమని అడిగాడు. సల్మాన్(రజి) ఆయన సామాగ్రిని తీసుకుని ఆయన వెనుకే నడిచి వెళుతున్నారు.

దారిలో ప్రజలు ఆ పరిస్థితిలో ఆయనను చూచి, “ఓ రసూలుల్లాహ్ సహచరుడా, ఓ నాయకుడా, మీకేమైంది? మీ భుజంపై ఈ బరువును ఎందుకు తీసుకువెళుతున్నారు? దానిని మాకు ఇవ్వండి, మేము దానిని చేర్చవలసిన చోటుకు చేరుస్తాము”.

దారిలో ప్రజలు మాట్లాడుతున్న ఈ మాటలు విని, ఆ కొత్త వ్యక్తి ఆశ్చర్యపోయి సిగ్గుపడ్డాడు. “క్షమించండి నాయకుడా! మిమ్మల్ని నేను గుర్తు పట్టలేదు” సల్మాన్(రజి) అన్నారు “సోదరా! మీరు మీ సామాగ్రిని మీ చోటుకి తీసుకువెళ్ళమన్నారు, కాబట్టి మీరు కోరిన చోటుకి దీనిని నన్ను తీసుకెళ్ళనివ్వండి”.

ఒకరోజు సల్మాన్(రజి)వారిని కలవడానికి ఆయనింటికి ఓ వ్యక్తి వచ్చాడు. సల్మాన్(రజి)తన చేతులతో పిండి కలపడాన్ని చూచారు. అది చూచాక అతను అడిగాడు, “మీ నౌఖరు ఎక్కడ?”

“అతనిని నేను వేరే పనిమీద బయటకు పంపాను కాబట్టి ఈ పనిని నేను స్వయంగా చేస్తున్నాను”.

“ఒకే సమయంలో ఒక వ్యక్తిపై రెండు బాధ్యతలు పెట్టడం న్యాయం కాదు అని నేను అనుకుంటున్నాను”.

ఒకసారి ఓ వ్యక్తి సల్మాన్(రజి)వారిని దూషించాడు. దానికి సమాధానంగా ఆయన అన్నారు, “సోదరా! ఒకవేళ నేను పాపాత్ముడిగా తీర్పుదినం నాడు ఋజువైతే అప్పుడు నేను ఈరోజు నీవు తిట్టిన దానికంటే చెడ్డవాడిని. మరియు పాపభారం కనుక తక్కువైతే, నీవేమి అన్నారో నేను పట్టించుకోను”.

ఈయన గాడిదపై నిరాడంబర స్థితిలో వెళుతున్నప్పుడు ఓ వ్యక్తి అడిగాడు “ఓ అమీర్! మీరెందుకు అంత ఆశారహితమైన స్థితిలో నున్నారు?”

“సోదరా! నిజమైన విశ్రాంతి మరియు సౌకర్యం రాబోయే జీవితంలో ఉన్నాయి”.

### నిరాడంబరమేగాని - సన్యాసం వంటి అతి కాదు

ఉదాహరణకు ప్రవక్త(స)వారు జీవించి ఉన్న కాలంలో జరిగిన ఓ సంఘటనను తెలియజేస్తున్నాము. ఒకసారి సల్మాన్(రజి)గారు అబూదర్దా అన్సారీ(రజి)వారి దగ్గరికి వెళ్ళారు. ముహమ్మద్(స)వారు సల్మాన్(రజి)గారిని అబూదర్దా(రజి)వారితో సోదరబంధాన్ని ఏర్పాటు చేశారు.

సల్మాన్(రజి)గారు అబూ దర్దా(రజి)వారి భార్యను దయనీయ స్థితిలో చూచి ఆమెను అడిగారు, “మీకేమైంది?”.

“మీ సోదరునికి ఈలోకంలో దేని అవసరమూ లేదు”

అబూదర్దా(రజి) ఇంటికి రాగానే సల్మాన్(రజి)వారిని ఆహ్వానించి ఆహారాన్ని అందించారు. సల్మాన్(రజి)వారు ఆయనను తినమన్నారు. కాని అబూదర్దా(రజి) చెప్పారు, ‘నేను ఉపవాసమున్నాను’.

‘నేను ప్రమాణం చేస్తున్నాను నీవు కూడా తినేవరకూ నేను తినను”

సల్మాన్(రజి)వారు ఆ రాత్రి కూడా అక్కడే గడిపారు. రాత్రి సమయంలో, అబూదర్దా(రజి) లేచారు కాని సల్మాన్(రజి) ఆయనను పట్టుకుని చెప్పారు : “ఓ అబూదర్దా! నీ ప్రభువుకు నీపై హక్కు ఉంది. నీ కుటుంబానికి నీపై హక్కు ఉంది మరియు నీ శరీరానికి నీపై హక్కు ఉంది. వేటికివ్వ వలసినది వాటికివ్వు”.

ఉదయం వారు కలిసి సలాత్ చేసుకున్న తరువాత ప్రవక్త(స)వారిని కలవడానికి వెళ్ళారు. ప్రవక్త(స)వారు సల్మాన్(రజి)వారు చెప్పిన దానినే సమర్థించారు.

### వివాహం

కిందా తెగకు చెందిన స్త్రీని సల్మాన్(రజి)వారు వివాహం చేసుకున్నారు. ఆ తెగ ధనిక తెగ మరియు గౌరవనీయమైన తెగ. వివాహం తరువాత ఓ రాత్రి ఆయన ఇంటికి వెళ్ళినప్పుడు, గోడలకు పెద్ద కర్టెన్లు వ్రేలాడదీసి ఉన్నాయి. అంతటి విలాసాన్ని ఆయన సహించ లేకపోయారు. ఆయన అడిగారు, “ఈ ఇల్లు జ్వరంతో బాధపడుతుందా, వస్త్రంతో కప్పబడి ఉంది? లేక ఇది ‘కాబా’ ఏమైనా మక్కా నుండి కిందా తెగవారికి బదిలీ అయిందా, ఇది వస్త్రంతో కప్పబడి ఉంది?”

ఇది చెప్పి గోడ నుండి కర్టెన్లు తొలగించమని ఆదేశించారు, ద్వారానికి ఉన్న కర్టెన్లు తప్ప. లోపలికి ప్రవేశించగానే లోపల అంతా విలువైన ఫర్నిచర్‌తో నిండి ఉంది. “ఎక్కడి నుండి ఇవి వచ్చాయి?” ఆయన అడిగారు.

“ఇవి మీకు మరియు మీ భార్యకు” ఆయనకు చెప్పబడింది.

“కాని వీటన్నిటి అవసరం నాకు లేదు”

“నేను నా గురువు రసూలుల్లాహ్(స)వారు నాకు చెప్పగా విన్నాను, “ఓ సల్మాన్! ఓ ప్రయాణీకుడు అతనితో ఎంత సామాగ్రిని ఉంచు కుంటాడో అంత సామాగ్రినే నీవు ఉంచుకో”

ప్రవక్త(స)వారు మరణించిన తరువాత అబూదర్దా(రజి) సిరియాకు వెళ్ళిపోయి అక్కడే శాశ్వతంగా సెటిల్ అయిపోయారు. ఆయనక్కడ సంతోషంగా జీవిస్తున్నారు. ఆయన సల్మాన్(రజి)వారికి లేఖ వ్రాశారు, “నేను ఇక్కడ చాలా సంతోషంగా ఉన్నాను, అల్లాహ్ నాకు ఇక్కడ ఐశ్వర్యాన్ని మరియు సంతానాన్ని అనుగ్రహించారు, మరియు నేను పవిత్ర భూమిలో నివశిస్తున్నాను”.

అబూదర్దా(రజి)వారికి సమాధానాన్ని పంపారు, “పవిత్ర భూమిలో నివశించడంగాని లేదా పిల్లలను కలిగి ఉండడంగాని మరియు ఐశ్వర్యాన్ని కలిగిఉండడం గాని వైశిష్టం కాదు. నిజమైన వైశిష్టం నీ ఆచరణ - అది పరలోకంలో నీకు ఏదైనా మంచి చేయవచ్చు.”

సల్మాన్(రజి)వారు ఎల్లప్పుడూ పరలోకం గురించి భయపడేవారు.

ఆయన తరచుగా చెప్పేవారు, “మూడు విషయాలపై ఆలోచన నాకు చాలా విచారాన్ని మరియు భయాన్ని కలిగించేది. మొదటిది నా

గురువు ప్రవక్త(స)వారి నుండి మరియు ఆయన సహచరుల నుండి విడిగా ఉండడం, రెండవది సమాధి శిక్షలు మరియు మూడవది పునరుత్థాన దినం''.

ఈయన వయస్సు విషయంలో స్పష్టత లేదు. కొందరు 80 సం॥ల వయస్సులో మరణించారని చెప్పారు. మరికొందరు ఆయన 150 సంవత్సరాలు జీవించారని చెప్పారు. నిజం అల్లాహ్‌కే తెలుసు.

ఆయన చివరి రోజులలో సాద్ బిన్ వఖ్ఖాస్(రజి) చూడటానికి వచ్చారు. ఆయనను చూచి భోరున విలపించడం ప్రారంభించారు.

''మీరెందుకు విలపిస్తున్నారు, అబూ అబ్దుల్లాహ్?''

''ముఖ్యంగా ఈ సమయంలో మీరు సంతోషంగా ఉండాలి ఎందుకంటే మీరు స్వర్గంలో ప్రవక్త(స)వారిని కలవబోతున్నారు''.

''అల్లాహ్ సాక్షి! నేను చావు గురించి భయపడటం లేదు లేక నాకు ఏ ప్రాపంచిక కోరిక లేదు. నేను విలపిస్తున్నది ఎందుకంటే ప్రవక్త(స) వారు నా నుండి వాగ్దానం తీసుకున్నారు ప్రాపంచిక వస్తువులను ప్రోగు చేసుకోవద్దని మరియు ఈ ప్రపంచం నుండి ఖాళీ చేతులతో వెళ్ళమని, ఏ విధంగా ప్రవక్త(స)వారు వెళ్ళారో, కాని ఇప్పుడు నా చుట్టూ కొన్ని ప్రాపంచిక వస్తువులున్నాయి. కాబట్టి నేను భయపడుతున్నాను, నా గురువు గారి(స)ని కలవక పోతానేమో''.

ఆయన చుట్టూ ఉన్న ఆ ప్రాపంచిక వస్తువులు ఏమిటో తెలుసా?

ఓ కుండ, ఓ కప్, ఓ పాత్ర మరియు ఓ పాత దుప్పటి. వీటి గురించి ఆయన విలపిస్తున్నారు.

సాద్(రజి)వారికి అక్కడున్న ఇతరులకు సలహా ఇచ్చారు.

''ప్రతీ క్షణం అల్లాహ్‌ను జ్ఞాపకం చేసుకోమని, నిజాయితీ లేని స్థితిలో కాకుండా, హజ్జ్ చేస్తుండగా లేదా ధర్మయుద్ధంలో పాల్గొనో లేక పవిత్ర ఖుర్ఆన్ చదువుతుండగా మరణించేలా ప్రయత్నించాలి''.

ఆయన ఎల్లప్పుడూ తన స్నేహితులకు చెప్పేవారు :

''మీరు తప్పక తెలుసుకోవాలి ఓ విశ్వాసి ఈ జీవితంలో వ్యాధిగ్రస్తుడు (రోగి) వంటివాడు. అతనికి ఏది కావాలో మరియు ఏది చెడో తెలిసిన వైద్యుడు పరీక్షించాడు. ఆ రోగి తన ఆరోగ్యాన్ని మరింత పాడుచేసే దానిని కోరుకుంటే ఆ వైద్యుడు అతని ప్రాణాంతకమైన కోరికలనుండి అతనిని ఆపుతాడు అతను మామూలుగా అయ్యేవరకూ. కాబట్టి, అల్లాహ్ విశ్వాసిని నరకంలో నాశనం కావడానికి కారణమయ్యే వస్తువుల నుండి నిషేధించారు''.

చివరికి ఆయన జబ్బుపడి శయ్యకే పరిమితమయ్యారు, కాని ఆయన మనస్సు మేలుకునే ఉంది.

ఉదయం కాబోతుంది. మరణించబోయే ఆయన తన భార్యతో ఏకాంతంగా ఉన్నారు. చాలా రోజుల క్రితం సుదూర ప్రాంతం నుండి కస్తూరి (musk) తీసుకువచ్చారు ప్రత్యేకంగా ఈ క్షణం కొరకే. ఆ కస్తూరి ముక్కను తీసుకురమ్మని భార్యకు చెప్పారు. ఆ కస్తూరిని ఓ గ్లాసు నీటిలో ఉంచి, ఆ నీటిని తన పక్క చుట్టూ చిలకరించమన్నారు. ఆమె అలా చేసిన తరువాత, తనను ఏకాంతంగా ఉంచమని, తనను మంచి సువాసనను ఇష్టపడే కొందరు సందర్శిస్తారని చెప్పారు.

ఆమె తలపు వేసి క్రిందికి వచ్చారు. కాస్సేపటికి గుసగుసలు వినబడ్డాయి. ఆమె వెళ్ళి చూస్తే ఆయన మరణించి ఉన్నారు. ఫరిష్తాలు ఆ స్వచ్ఛమైన ఆత్మను తీసుకు వెళ్ళుంటారు.

కష్టాలు వచ్చినప్పుడు నిరాశ చెందకూడదు.

నిజానికి కష్టాలు సల్మాన్(రజి)వంటి నిజమైన విశ్వాసులను తయారు చేస్తాయి.

**నవముస్లిమ్ సోదర సోదరీమణులారా!**

మీరు ఇస్లామ్ స్వీకరించగానే ఎన్నో కష్టాలు పడుతున్నామని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు కదా! సల్మాన్ ఫార్సీ(రజి)వారు ఎన్ని కష్టాలు పడ్డారో చదివారు కదా! ఎంతో ప్రేమగా చూసుకునే తండ్రిని వదులుకున్నారు. ఐశ్వర్యాన్ని వదులుకున్నారు. మక్కాకు వెళ్ళేందుకు తాను సంపాదించుకున్నదంతా ఇచ్చేసి, అరేబియాకు చేసిన ప్రయాణంలో బానిస అయిపోయినా సరే, ప్రవక్త(స)వారిని కలుస్తాననే ఆశతో బ్రతికారాయన.

సల్మాన్(రజి)వారికి మీకు కలిగినటువంటి ఆవేదన ఎందుకు కలుగలేదు? కారణమేమిటి?

క్రిందటి సంచికలో అబూజర్(రజి)వారి గురించి చెప్పడం జరిగింది. ఆయనకు ఇస్లామ్ స్వీకరించాక ఎంతో ధైర్యం వచ్చింది.

దానికి ముందరి సంచికలో బిలాల్(రజి)వారి గురించి తెలియజేశాం. ఎడారి ఇసుకలో మండుటెండలో పడుకోబెట్టి ఎదపై బండరాయి ఉంచినా సరే, ఆయనకు తాళ్ళు కట్టి వీధుల్లో ఈడ్చుకెళ్ళినా సరే, 'అహద్, అహద్' అన్నారే గాని, నన్నెందుకు అల్లాహ్ వదిలేసారు అనలేదు. ఎందుకని?

వీరందరికీ అల్లాహ్ తమతో ఉన్నారని, ఆయన కరుణ వారిపై ఉందనే విశ్వాసం ఉంది.

అల్లాహ్ తోడుంటే ఎవరి తోడు కోసమైనా ఎందుకు ఆరాటపడాలి. అల్లాహ్ తోడుగా ఉంటే ఆటోమెటిక్‌గా అందరూ వస్తారు.

మరి మీరు ఒంటరి అయిపోయారని భావన కలిగిందంటే అల్లాహ్ మీతో లేరని మీరనుకుంటున్నారా?

అదే నిజమైతే, మీకు అల్లాహ్ గురించి తెలియనట్లే! అల్లాహ్ గురించి తెలియకపోతే అది విశ్వాసం ఎలా అవుతుంది. విశ్వాసం లేకపోతే మిమ్మల్ని మీరు ముస్లిముగా ఎలా భావిస్తున్నారు?

విశ్వాసం అంటే ఏమిటో తెలుసుకోకుండానే, ముస్లిమ్ అయిపోయారా? 'లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్' అని నోటితో చదివేస్తే సరిపోతుందా?

క్రిందటి సంచికలో విశ్వాసం గురించి ప్రత్యేకంగా వివరించాము. మరొకసారి ఆ వ్యాసాన్ని చదివి మీకు నిజంగా అల్లాహ్‌పై విశ్వాసముందో? లేదో? మీరే తెలుసుకోండి.

మీరు విశ్వసించినా, విశ్వసించకపోయినా అల్లాహ్‌కుగాని ఇస్లామ్‌కి గాని నష్టమేమీ లేదు. విశ్వసిస్తే మీకే లాభం. మీ సాఫల్యం కొరకే మీరు విశ్వసిస్తున్నారు. మీరు నిజంగా అల్లాహ్‌ను విశ్వసించి, ఖుర్‌ఆన్ ఆదేశించినట్లు మీ జీవితం ఉన్నట్లయితే, మీలో కొత్తగా కనిపించే ఉత్తమ లక్షణాలను ప్రజలు గమనిస్తారు.

మీ గౌరవం పెరుగుతుంది. మీ హృదయానికి శాంతి లభిస్తుంది. అలా జరుగలేదంటే మీ విశ్వాసంలో ఏదో తేడా ఉంది అని తెలుసుకోండి. అది తెలియాలంటే రోజూ ఖుర్‌ఆన్ చదివి, దానిని అధ్యయనం చేయండి.

దాయీలను వదిలేసి 'ఆలిమ్'నుగాని లేదా ఇస్లామ్‌పై అవగాహన ఉన్న ముస్లిమ్ సోదరసోదరీమణుల దగ్గర సందేహాలను నివృత్తి చేసుకోండి.

శాంతిబాట చదువుతూ ఉండండి. ఆలోచిస్తుండండి.

మీ విశ్వాసస్థాయి ఏమిటో మీకే అర్థమౌతుంది. జమియత్‌ను అంటి పెట్టుకుని ఉండండి.

ఎంతోమంది మునాఫిఖ్‌లు ప్రచారకులుగా పనిచేస్తున్నారు. వారు ఇస్లామ్ ముసుగులో ఇస్లామ్‌కి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. వారు మస్‌జిద్‌లలో కనిపిస్తారు. బయట ప్రసంగాలిస్తుంటారు.

అటువంటివారు మిమ్మల్ని తప్పుడు మార్గంలోకి తీసుకెళతారు. ఈ సంచికలో మునాఫిఖ్ వ్యాసం చదవండి. నిజంగా విశ్వాసం స్వీకరించిన వారెవరూ ఒంటరివారు కారు. ఎటువంటి కష్టాన్నైనా ఎదుర్కొనే ఆత్మ విశ్వాసం ఇస్లామ్ కలుగజేస్తుంది. ఆలోచించండి!

ఈ మధ్యనే కాకినాడ నుండి ఓ మెస్సేజ్ వచ్చింది. 'జమియతె ఖురాన్ హదీస్' అని ప్రారంభిస్తున్నట్లు. అల్లాహ్‌పై విశ్వాసం గలవారు ఖుర్‌ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలనే అనుసరిస్తారు. ప్రత్యేకంగా ఇటువంటి జమియత్‌ల అవసరం లేదు. జమియత్‌లను చీల్చకండి.

ముస్లిములంతా ఒకే జమియత్.

## జమియత్‌లను చీల్చకండి!

స్పష్టమైన ఉపదేశాలను పొందిన తరువాత కూడా ఎవరైతే, (వేర్వేరు తెగలుగా) చీలిపోయారో మరియు విభేదాలకు గురి అయ్యారో, వారి మాదిరిగా మీరూ కావద్దు. మరియు **అలాంటి వారికి ఘోరశిక్ష ఉంటుంది.** (ఖుర్‌ఆన్ 3:105)

ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **"అల్లాహ్ యొక్క చేయి జమ'అత్‌పై ఉంటుంది." (తిర్మిజీ, సహీహ్, 2166, పుస్తకం 31: కితాబుల్ ఫితన్, అధ్యా.7, సంపుటి 4)**

ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, "ఎవరైనా తమ నాయకుడు చేసిన దానిని ఇష్టపడకపోతే, అతనిని దానిపై సహనంతో ఉండమని ఆదేశించారు. **ఎవరైతే జమా'అత్‌ని స్వయంగా ఒక జాన దూరమైనా సరే (షిబన్) విడిచి పెట్టి మరణిస్తే, అతని మరణం అజ్ఞానకాలపు మరణం అవుతుంది."**

**(సహీహ్ బుఖారీ, 7054, పుస్తకం 92: కితాబుల్ ఫితన్, అధ్యా.2, సంపుటి 9)**


**ఇస్లామ్ గురించి ఎవరికైనా పరిచయం చేయాలనుకుంటున్నారా?**

**ఇస్లామ్‌పై మరియు ముస్లిములపై అపోహలను తొలగించాలనుకుంటున్నారా?**

**శాంతిబాట మాసపత్రికను చదివించండి**

**చందాదారులను చేర్పించండి.**

**ఆర్థికంగా మీకు వీలైతే ఒకటి కంటే ఎక్కువ కాపీలను తీసుకుని మీ స్నేహితులకు అందజేయండి.**

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**

2-8-31, కోట బజార్, సామర్లకోట-533440

**ఎక్కువ చందాలను పంపగోరువారు క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**

SBI A/c No. 10428633092

Waltair, Visakhapatnam-530003

Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017

velugubaata@gmail.com

info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**

**(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)**

**కావలిసిన వారు**

**రూ. 165/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**

**మా వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

ఓ సత్యాన్వేషకుడా!

ప్రవక్త(స)వారిని కనుగొనగానే విలపించారు.

మీ నుండి రాలిన ప్రతీ కన్నీటి బొట్టు (ఆనంద భాష్పం)

మిమ్మల్ని ప్రకాశవంతం చేసుంటుంది.

సత్యాన్వేషణ కోసం తండ్రిని వదిలారు.

కాని అల్లాహ్ మిమ్మల్ని తన ప్రియప్రవక్త(స) కుటుంబ సభ్యునిగా చేశారు.

ఒట్టి చేతులతో మీ జన్మభూమినుండి బయలుదేరారు.

కాని ఒట్టి చేతులతో కాకుండా సత్యమనే జ్యోతితో
అదే భూభాగానికి అల్లాహ్ మిమ్మల్ని పంపారు.

ఎంతోమందికి బానిసగా అమ్ముడయ్యారు.

కాని ఓ భూభాగానికే అల్లాహ్ మిమ్మల్ని నాయకుడిగా చేశారు.

'అల్-ఖైర్' మేలు చేసేవాడనే బిరుదును ప్రవక్త(స) మీకు ఇచ్చారు.

పర్షియా నుండి ఇస్లామ్‌కి అందిన తొలి బహుమతి మీరు.

రాబోయే తరాలకు సత్యాన్వేషణకై మిమ్మల్ని ఓ వాస్తవ ఉదాహరణగా అల్లాహ్ మాకిచ్చారు.

మీ జ్ఞానమే మిమ్మల్ని నిరాడంబరుడిగా చేసింది.

మీ జ్ఞానమే మిమ్మల్ని చేతి సంపాదనతో తినేలా చేసింది.

జ్ఞానియైన లుఖ్మాన్ వంటివారని మీ జ్ఞానానికి కితాబివ్వబడింది.

తమ పేర్ల ముందు పెద్ద పెద్ద బిరుదులను తగిలించుకునే అజ్ఞానులకు, ప్రత్యేక వస్త్రధారణతో ఇస్లామ్ ధర్మ ప్రచారకులంటూ తిరిగేవారికి మీ జీవితం కనువిప్పు కావాలి.

మీ గురించి కాస్తయినా తెలియజేసే అవకాశం మాకు దక్కినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, స్వర్గంలో మీరు ప్రవక్త(స)వారితో, మీ సహచరులతో ఉండాలని కోరుకుంటూ

- శాంతిబాట టీమ్


పవిత్ర భూములు విశ్వాసిని ప్రకాశవంతం చేయలేవు

కాని విశ్వాసి అతడే

ఎవరైతే తన మంచి ఆచరణల ద్వారా

భూములను ప్రకాశవంతం చేస్తాడో

- సల్మాన్ ఫార్సీ



జీవిత చరిత్ర

# ముహమ్మద్ محمد

సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి మీపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

7

(గత సంచిక తరువాయి ...)

తన బాబాయి అబూతాలిబ్‌గారి సంరక్షణలో ముహమ్మద్(స)వారు పెరుగుతున్నారు. వంశం ఉన్నతమైనదేగాని ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఆయనచే పోషింప బడవలసిన వారు కూడా ఎక్కువే. వ్యాపారం మాత్రం బాగా సాగటం లేదు. ఇటువంటి పరిస్థితులలో తన బాబాయి గారికి చేదోడుగా ఉండాలని, బాల్యంలో ప్రవక్త(స)వారు గొర్రెల కాపరిగా పనిచేశారు.

అల్లాహ్ పంపిన ప్రతీ ప్రవక్త (ఏదో ఒక సమయంలో) గొర్రెలను మేపారు. సహచరులు(రజి) అడిగారు, "మరి మీరు కూడా?" ఆయన(స) అన్నారు, "ఔను, నేను వాటిని మక్కావారి కోసం ఖరారీత్‌పై మేపాను. (ఇబ్నె హజర్ ప్రకారం ఖరారీత్‌కు విద్వాంసులు రెండు రకాల అర్థాలను ప్రస్తావించారు. ఖరారీత్ అనేది మక్కాలో ఓ ప్రదేశం లేక అది దిర్హమ్‌లోగాని, దీనార్‌లోగాని భాగం అయిఉండవచ్చు.)

ఇస్లామ్‌కి పూర్వపు అజ్ఞాన కాలంలో సైతం, అల్లాహ్ తన ప్రవక్తను విగ్రహాలను పూజించడం నుండి మరియు అన్నిరకాల బహుదైవారాధన నుండి రక్షించారు. ముహమ్మద్(స)వారి బాల్యం గురించి ఇక్కడ చెప్పుకుంటున్నాము. అయినప్పటికీ సందర్భానికి అవసరం కనుక ఆయన వివాహం తరువాత జరిగిన విషయం ఒకటి ఇక్కడ చెప్పవలసి వస్తుంది. అదేమిటంటే, ముహమ్మద్(స)వారి సతీమణి పేరు ఖదీజా(రజి). ప్రవక్త(స)వారు ఖదీజా(రజి)వారికి చెబుతుండగా పొరిగింటి వ్యక్తి విన్నారు. ఆ విషయాన్ని ఉర్వా ఉల్లేఖించారు. **"ఓ ఖదీజా! అల్లాహ్ సాక్షి, నేను ఎన్నడూ లాత్ మరియు ఉజ్జాలను పూజించలేదు."**

ఇవి మక్కా ముష్రిక్‌లు పూజించే విగ్రహాల పేర్లు.

మనం అల్లాహ్ పేరుతో జిబహ్ చేసిన జంతువు మాంసాన్ని మాత్రమే తింటాము. కారణం - ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ మనకు ఆ విధంగా ఆదేశించారు గనుక. కాని ఖుర్‌ఆన్ అవతరించక ముందు కూడా ముహమ్మద్(స)వారు అల్లాహ్ పేరుతో కాకుండా వేరే పేరుతో జిబహ్ చేసిన జంతువుల మాంసాన్ని తినేవారు కాదు. ఆయనే కాకుండా ఆ కాలంలో అమ్ర్ బిన్ నుఫైల్ వారు కూడా తినేవారు కాదు. ఆ విధంగా ముహమ్మద్(స)వారిని అల్లాహ్ కాపాడుతూ ఉండేవారు.

అల్లాహుతాలా ముహమ్మద్(స)వారిని చిన్న చిన్న పాపాలకు కూడా దూరంగా ఉంచారు. అయితే ఆయన జీవితంలో కచేరీ, వినోదాలకు సంబంధించి రెండు సంఘటనలు జరిగాయి. వాటి నుండి కూడా అల్లాహుతాలా ఆయన(స)ను కాపాడారు.

ఒకసారి ప్రవక్త(స)వారు తన గొర్రెలను తన సహవాసికి అప్పగించి, ఆ సాయంత్రం మక్కాలో జరగబోయే కచేరీ మరియు వినోదాన్ని చూడటానికి బయలుదేరారు. కాని వాటిని చూడకుండానే ఆయనకు నిద్ర వచ్చింది. ఉదయం ఎండ ముఖానికి తగిలేవరకూ నిద్రపోయారు.

ఆయన వెనుదిరిగి వచ్చారు. రెండవ రోజు కూడా అలాగే జరిగింది. ఆ తరువాత ఎన్నడూ ఆయన వాటిగురించి ప్రయత్నించలేదు.

### ప్రవక్త(స)వారిని గౌరవించిన ప్రకృతి

ఈ సంచికలో ఇల్మ్ గురించి ఒక ప్రత్యేక వ్యాసాన్ని అందించడం జరిగింది. ఆ వ్యాసంలో మనిషికి ఎక్కువ జ్ఞానం ఇవ్వబడిందా? లేక పశుపక్ష్యాదులకు ఎక్కువ జ్ఞానం ఇవ్వబడిందా? అనే అంశంపై కొంత చర్చించాము.

మాకు అల్లాహ్ ఇచ్చిన జ్ఞానం మేరకు, ముహమ్మద్(స)వారిని అల్లాహ్ యొక్క ప్రవక్తగా మానవులకంటే ముందుగా ప్రకృతే గుర్తించిందని మేము భావిస్తున్నాము. మేము అలా భావించడానికి కారణమైన ఓ సంఘటనను ఇక్కడ అందిస్తున్నాము.

ముహమ్మద్(స)వారికి అప్పటికి దాదాపు పది,పన్నిండేళ్ళు ఉంటాయి. అంటే అప్పటికి ఆయన బాలుడు. ముహమ్మద్(స)వారు తన పినతండ్రి గారి సంరక్షణలో ఉన్నారు కదా! అబూతాలిబ్‌గారు తరచుగా అష్షామ్ (సిరియా మరియు పరిసర ప్రాంతాల)కు మరియు ఇతర ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం వెళ్ళేవారు.

అటువంటి ఓ ప్రయాణంలో ఆయన ప్రవక్త(స)వారిని కూడా తనతో

పాటు తీసుకువెళ్ళారు. అబూతాలిబ్ గారితో పాటు మక్కా ముఖ్య నాయకులు కూడా ఉన్నారు. వారి వర్తక బిడారం క్రైస్తవ సన్యాశి బుహైరా నివశించే మఠాన్ని దాటి, అక్కడ గుడారాలు వేసుకుని వారి సామాగ్రిలోని కొన్నింటిని దింపుకున్నారు.

ఇదిలా వుండగా, వారంతా ఆశ్చర్యపడేలా క్రైస్తవమఠం నుండి బుహైరా వారిని కలవడానికి వచ్చారు. ఆశ్చర్యం ఏమిటంటే వారు వ్యాపారం నిమిత్తం తరచుగా వస్తుంటారు. ఆ మఠం ప్రక్కనే ఆగినా ఏనాడూ వారిని కలవడానికి రాని వ్యక్తి ఆ రోజు వచ్చారు.

వారంతా వ్యాపార సామాగ్రి దింపుతూ ఉన్నారు. వారి మధ్యనుండి నడుస్తూ అల్లాహ్ యొక్క సందేశహరుడు - ముహమ్మద్(స)వారిని చేరుకుని బుహైరా, ముహమ్మద్(స)వారి చేయి పట్టుకుని గట్టిగా అన్నారు:

**"ఈయన సకలలోకాల నాయకుడు. ఉనికిలో ఉన్న వాటి ప్రభువు తరపున సందేశహరుడు. ఉనికిలో ఉన్నవాటి కొరకు అల్లాహ్ ఈయనను కారుణ్యంగా పంపుతాడు".**

ఖురైష్ నాయకులు అడిగారు, "ఏ విషయం మీకు ఇది తెలియ జేసింది?" ఆయన చెప్పారు, "అఖాబా నుండ వస్తూ (ఈ ప్రదేశాన్ని) మీరు దాటినప్పుడు, ప్రతీ చెట్టు మరియు రాయి సజ్దాలో పడిపోయింది. మరియు అవి ఎవరికీ సజ్దా చేయవు ఓ ప్రవక్తకు తప్ప. మరియు వాస్తవానికి, నేను అతని ప్రవక్త పదవిని తెలిపే (ఆకారంలో) యాపిల్‌ను పోలివుండే సీల్ నుండి తెలుసుకున్నాను మరియు అది అతని భుజం క్రింద ఉంది."

అతను తన మఠానికి తిరిగి వెళ్ళారు వారికి ఆహారాన్ని సిద్ధం చేయడానికి. కాస్సేపటికి ఆహారంతో తిరిగివచ్చినప్పుడు ముహమ్మద్(స) తమ ఒంటెలను కాపలా కాస్తున్నారు. తమతో పాటు కలిసి భోజనం చేయడానికి ముహమ్మద్(స)వారిని కూడా పిలవమని ఆయన వారిని కోరారు. ముహమ్మద్(స)వారిపైన ఓ మేఘం నీడగా నిలిచింది. వారంతా చెట్టు నీడన కూర్చున్నారు. ముహమ్మద్(స) కూర్చోగానే నీడ ఆయనవైపు కదిలి పూర్తిగా కప్పివేసింది. దానిని చూచి, బుహైరా అన్నారు, "చూడండి! చెట్టు నీడ ఆయనను కప్పడానికి కదిలింది."

అబూతాలిబ్ గారితో మరియు ఇతర నాయకులతో ప్రవక్త(స)వారిని తమ మాతృదేశానికి తిరిగి తీసుకు వెళ్ళిపొమ్మని చెప్పారు. ప్రత్యేకంగా ఆయన వారిని కోరినదేమిటంటే రోమన్ల భూభాగంవైపు ఆయనను తీసుకువెళ్ళవద్దని. రోమన్లు గనుక ఆయన గురించి తెలుసుకుంటే మరియు ఆయన ప్రవక్తపదవిని తెలిపే సూచనలను చూస్తే, వారు ఆయనను హత్య చేస్తారు.

ఆయన వారికి ఇది వివరిస్తున్నప్పుడు, ఆయన వెనుతిరిగి 7గురు రోమన్లు వారివైపు రావడాన్ని చూశారు. ఆయన వారి దగ్గరికెళ్ళి అడిగారు వారికేమి కావాలని. వారు అన్నారు, "**మాకు సమాచారం అందింది (రాబోయే) ప్రవక్త ఈ నెలలో బయటకు వస్తారని. ప్రతీ దారి భటులతో మూసివేయబడింది మరియు మమ్మల్ని ఈ దారిలో గమనించమని పంపారు**". బుహైరా వారితో అన్నారు, "**అల్లాహ్ ఒక విషయాన్ని పూర్తి చేద్దామని అనుకున్నారనుకుందాం. ఏ వ్యక్తి అయినా దానిని జరుగకుండా ఆపగలడా?**" వారు అన్నారు, "**లేదు**".

ఆయన చెప్పారు, "అప్పుడు అతనికి విధేయత చూపిస్తామని ప్రతిజ్ఞ చేయండి". తరువాత భటులు ఖురైష్ నాయకులను కలిశారు గాని ముహమ్మద్(స)వారికి ఏ హానీ చేయలేదు.

బుహైరా భటులకు ఏదో నచ్చచెప్పి ప్రవక్త(స)వారిని వదిలి వెళ్ళేలా చేయగలిగారు. కాని ఇంకా చాలామంది భటులు దారిలో ఉన్నారేమో! బుహైరా కంగారు పెరిగింది. ఆయన ఖురైష్ నాయకులను పదేపదే అడిగారు, 'ముహమ్మద్(స)వారి సంరక్షకుడెవరని?'

వారు చెప్పారు అబూతాలిబ్ ఆయన సంరక్షకుడని.

బుహైరా ఆయనను కోరారు. చివరకు మనస్ఫూర్తిగా అతని సలహాను స్వీకరించి ప్రవక్త(స)వారిని మక్కా పంపివేశారు అబూతాలిబ్.

ఈ క్రైస్తవ సన్యాశి బహిరంగంగానే ప్రకటించారు, ముహమ్మద్(స)వారు సకలలోకాలకు నాయకుడని, అల్లాహ్‌చే కారుణ్యంగా పంపబడతారని. ఈ సంచికలో తిరగి గూటికి శీర్షికలో ఇప్పటికే చదివి ఉంటారు. సల్మాన్ ఫార్సీ(రజి)వారికి ఆయన గురువు కూడా ఇదే చెప్పారు. ఆయన కూడా ఓ ప్రవక్త రాబోయే సమయం ఆసన్నమైందని చెప్పడం జరిగింది. ఇక్కడైతే బుహైరా చెబుతుండగనే రోమన్ భటులు రావడం జరిగింది.

అంటే ముహమ్మద్(స)వారు ఏ నెలలో తొలిసారిగా ఏ ప్రాంతానికి వస్తారో, ఆయనే ప్రవక్తని తెలిపే సూచనలు మొదలైన విషయాల గురించి గ్రంథప్రజలకు చాలా స్పష్టంగా తెలుసు.

ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా ఇలా తెలియజేస్తున్నారు :

"ఎవరైతే ఈ సందేశహరుణ్ణి నిరక్ష్యరాస్యుడైన ఈ ప్రవక్తను అనుసరిస్తారో! **ఎవరి ప్రస్తావన వారి వద్ద వున్న** తౌరాత్ మరియు ఇంజీల్ గ్రంథాలలో వ్రాయబడి ఉన్నదో, అతను **వారికి ధర్మమును ఆదేశిస్తాడు మరియు అధర్మము నుండి నిషేధిస్తాడు మరియు వారికొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం చేసి అపరిశుద్ధమైన వాటిని నిషేధిస్తాడు. వారిపై మోపబడిన నిర్బంధాలను తొలగిస్తాడు.** కావున అతనిని సమర్థించి, అతనితో సహకరించి, **అతనిపై అవతరింప జేయబడిన జ్యోతిని (ఖుర్ఆన్‌ను) అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందేవారు.**" (ఖుర్ఆన్ 7:157)

**"మేము గ్రంథాన్ని ప్రసాదించినవారు తమ కుమారులను ఏ విధంగా గుర్తిస్తారో ఇతనిని (ముహమ్మద్‌ను) ఆ విధంగా గుర్తిస్తారు. మరియు వాస్తవానికి వారిలోని ఒక వర్గంవారు తెలిసి కూడా సత్యాన్ని దాస్తున్నారు."** (ఖుర్ఆన్ 2:146)

ఆలోచించగలిగే ముస్లిములకు ఇందులో ఓ గొప్ప గుణపాఠం ఉంది. బుహైరాగారు గాని, సల్మాన్ ఫార్సీ (రజి)వారి గురువుగారు గాని, విశ్వాసుల మాతృమూర్తి సఫియా (రజి)వారి తండ్రిగారు కాని

ముహమ్మద్(స)వారిని చూడగానే గుర్తు పట్టారు. కాని అతను శత్రుత్వమే వహించారు. అదే విధంగా ఎంతో మంది గ్రంథ ప్రజలు కూడా ముహమ్మద్(స)వారిని ప్రవక్తగా గుర్తించారు. తమ గ్రంథాలలో వర్ణించిన విధంగానే ఉన్న ప్రవక్తగారు తమ దగ్గరకు రాగానే వీరంతా ఎందుకు తిరస్కరించారు? మక్కాలో విగ్రహారాధకులకు అయితే ఇటువంటి సూచనలు గురించి ఏమీ తెలియదు. వారి దగ్గర ఎటువంటి గ్రంథమూ లేదు. అయినప్పటికీ వారు నమ్మారు.

**కారణమేమిటి?**

ముహమ్మద్(స)వారి కారెక్టర్. ఆయన యొక్క ఉత్తమ లక్షణాలు. ఆయన(స)వారు అబద్ధం చెప్పరని వారికి పూర్తి విశ్వాసం ఉంది. అదే విధంగా మక్కా విజయం తరువాత ప్రవక్త(స)వారు వ్యవహరించిన తీరు చూసి దాదాపు అందరూ ఇస్లామ్ స్వీకరించారు. ఈజిప్టు దేశాన్ని ముస్లిములు జయించాక, ఇస్లామ్ స్వీకరించవచ్చుని లేదా జిజ్‌యా పన్ను కడితే వారి రక్షణ బాధ్యతలు చూస్తామని చెప్పినప్పుడు, ముస్లిముల యొక్క జీవన విధానం మరియు వారి మంచి నడవడిక చూచి ఈజిప్టు దేశం మొత్తం ఇస్లామ్ స్వీకరించింది. ఏవో పురాతన భాషలు, వివిధ సంస్కృతులలో ఉన్న ఈజిప్టు ప్రజలు వాటన్నింటిని వదిలేసి అరబీ భాషను తమ భాషగా చేసుకున్నారు.

కేరళ రాష్ట్రంతో అరబ్బులు వ్యాపారం చేసేవారు. కాని అరబ్బులు వస్తున్నారని తెలియగానే వారు తమ స్త్రీలను దాచివేసి, తమ సంపదను భూమిలో పాతి పెట్టేవారు. అటువంటి అరబ్బులు ముహమ్మద్(స)వారి దగ్గర శిక్షణ పొందిన తరువాత, స్త్రీలు కనిపించగానే తలదించుకుని మాట్లాడటం, నిజాయితీగా వ్యవహరించడం, సత్యమే మాట్లాడటం మొదలైన ఉత్తమ సంస్కారాన్ని చూసి కేరళ ప్రజలు ఆశ్చర్యపోయారు. ఆ విషయం రాజు వరకూ వెళ్ళడం, రాజుగారు విషయం తెలుసుకుని మక్కా వెళ్ళి ఇస్లామ్ స్వీకరించడం, కేరళలో ప్రపంచంలో రెండవ జుమా మస్‌జిద్ స్థాపనకు కారణమైంది.

**ఇస్లామ్ నేర్పిన మంచినడవడికతో జీవనం సాగించే ముస్లిమ్‌ను చూచి, ప్రజలు ఇస్లామ్‌వైపు ఆకర్షితులవ్వడమనేది నిరూపించబడిన సత్యం.** మీ గ్రంథాలు చదువుకోండి, అందులో ప్రవక్త(స)వారి గురించి ఉంటుంది అని చెప్పడం వలన ఒనగూరే ప్రయోజనమేమీ లేదు. ప్రవక్త(స)వారు ఎల్లప్పుడూ మీ ప్రభువు, మా ప్రభువు అల్లాహ్‌యేనని చెప్పారు గాని, వారి గ్రంథంలో తన గురించి ప్రస్తావించిన విషయాలపై ఆధారపడలేదు. ఆ విధంగా చేయాలనుకుంటే, ఆ విధంగా చేస్తే గ్రంథ ప్రజలంతా ఇస్లామ్ స్వీకరిస్తారని భావిస్తే, వారందరిని వారి విద్వాంసులతో సహా హాజరుపరచి నిరూపించి ఉండేవారు. కాని అలా చేయలేదు.

ముహమ్మద్(స)వారు బోధించిన మంచి నడవడికను అలవరచుకుని, అతి నిరాడంబరంగా బ్రతికిన ముస్లిములను చూసి హృదయపూర్వకంగా ఎందరో ఇస్లామ్ స్వీకరించారు.

ఇప్పటికీ సంఖ్యలో తక్కువైనప్పటికీ కొందరు ముస్లిములు మంచి నడవడికతో తోటివారిని ఇస్లామ్ పట్ల ఆకర్షిస్తున్నారు. మంచి నడవడికను అలవరచుకోలేనివారు, స్వార్ధపరులు మాత్రం బహిరంగంగా ధర్మ ప్రచారకులుగా తిరుగుతూ, ఇస్లామ్ పట్ల ద్వేషభావాన్ని పెంచుతూ, దాయీలుగా పిలుపించుకుంటూ, ప్రజలను మార్గభ్రష్టత్వంవైపు తీసుకు వెళుతున్నారు.

ముహమ్మద్(స)వారిని సకలలోకాలకు విశ్వనాయకుడుగా, కారుణ్యంగా బుహైరా గుర్తు పట్టగలిగారు. ప్రవక్త(స)వారికి నోరులేని ప్రాణులు ఏ విధంగా గౌరవించాయో రాబోయే అధ్యాయాలలో ఇన్షా అల్లాహ్ వివరంగా అందజేస్తాము. ప్రవక్త(స)వారు సిరియా వెళ్ళే సమయానికి రోమన్ సామ్రాజ్యం అక్కడ వరకూ వ్యాపించి ఉంది.

రోమన్లకు ముందుగానే తెలుసు, ఆయన రాకతో తమ సామ్రాజ్యం పతన మౌతుందని. ఆ భయం రోమన్లలో ఉండేది.

ముహమ్మద్(స)వారిని బుహైరా కలిసే సమయానికి, ముహమ్మద్(స) వారి వయస్సు 12 సంవత్సరాలలోపే. ముహమ్మద్(స) వారి బాల్యానికి సంబంధించి రెండు ముఖ్యమైన సంఘటనలను తెలిపి బాల్యానికి సంబంధించిన అధ్యాయాన్ని ముగిస్తున్నాము.

## ఫిజార్ యుద్ధం

కినానహ్ తెగ ఖురైష్ మిత్రపక్షాలతో కలిసి, హవాజిన్ తెగపై యుద్ధం జరిపాయి. ఆ యుద్ధమే ఫిజార్ యుద్ధం. ఇస్లామ్‌కు పూర్వం అజ్ఞానకాలంలో జరిగిన ఎన్నో యుద్ధాలలాగే ఈ యుద్ధం కూడా ఓ చిన్న తగాదాతో మొదలై పెద్ద యుద్ధంగా మారిపోయింది.

**నో'మాన్** బిన్ మున్‌దిర్ మరియు అతని వ్యాపార బిడారం ఉకాజ్ వ్యాపార ప్రదేశానికి వెళుతుంది. ఈ నో'మాన్‌కు రక్షణ కల్పిస్తానని **ఉర్వా** బిన్ అర్-రహ్హాల్ బిన్ ఉత్బా బిన్ **హవాజిన్** మాట ఇచ్చాడు. అయితే ఈ విషయం తెలుసుకుని **అల్-బర్రాజ్** బిన్‌ఖైస్ బిన్ **కినానహ్,** ఉర్వాతో అన్నాడు "కినానహ్ తెగకు వ్యతిరేకంగా అతనికి నీవు రక్షణ కల్పిస్తావా?" ఉర్వా చెప్పాడు, "ఔను, మరియు ఆ విషయంలో అతనికి రక్షణ ఇస్తాను మొత్తం మానవజాతికే వ్యతిరేకంగా."

నో'మాన్ వర్తక బిడారంతో ఉర్వా బయలుదేరినప్పుడు, అతని వెనుక అల్-బర్రాజ్ అనుసరించాడు. అవకాశం కోసం మాటువేసి ఎదురు చూస్తున్నాడు, అకస్మాత్తుగా పడి ఉర్వాను చంపాలని. అల్-బర్రాజ్ తెగవారైన కినానహ్ వారికి ఏమి జరుగుతుందో తెలిసింది. కాబట్టి వారు కూడా వాళ్ళ వెంబడి అనుసరించారు. తాము వెంబడించ బడుతున్నారని ఉర్వా మరియు హవాజిన్‌లకు తెలిసి వెనుదిరిగి కినానహ్ తెగవైపు వస్తున్నారు. ఇప్పుడు వేటాడబడవలసిన వారే వేటగాళ్ళు అయ్యారు. వారు కినానహ్ తెగవారిని తరిమి పట్టుకున్నారు వారు పవిత్ర మక్కా నగరాన్ని చేరకమునుపే. ఆ రెండు తెగలు రాత్రయ్యే వరకూ కొట్టుకున్నారు. కినానా తెగవారు మక్కాలో ప్రవేశించగలిగారు. అరబ్బులకు మక్కా పవిత్రం కాబట్టి, హవాజిన్ తెగ శత్రువుల వెంటపడ లేదు. కాని తరువాయి రోజు, మరలా కొత్తగా యుద్ధం మొదలైంది.

కినానహ్ తెగకు మద్దతుగా ఈ పోరాటంలో ఖురైష్‌లు కూడా పాల్గొన్నారు. ఖురైష్‌లతో పాటు ముహమ్మద్(స)వారు కూడా ఈ

యుద్ధంలో పాలుపంచుకున్నారు. కాని ఆయన పాత్ర చాలా చిన్నది.

ఫిజార్ అంటే వికెడ్‌నెస్ (మోసం). మక్కా పవిత్రతను అపవిత్రం చేసే విధంగా అక్కడ యుద్ధం చేశారు. కనుక ఈ యుద్ధానికి ఫిజార్ యుద్ధం అని అన్నారు. మక్కాను అపవిత్రం చేసే పనిని ఘోరమైన నేరంగా భావిస్తారు. తరువాయి కాలంలో ప్రవక్త(స)వారు చెప్పారు, "నేను నా తండ్రిగారి సోదరులకు బాణాలను అందించేవాడిని''. అంటే శత్రువులు విసిరిన బాణాలను ఏరి తన వారికి ఇచ్చేవారు.

ఆ సమయంలో ప్రవక్త(స)వారికి 14 లేదా 15 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు ఏ 20 సంవత్సరాల వయస్సో అయితే ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొన నిచ్చేవారు.

### ఫుజూల్ ఒప్పందం

యమన్‌లోని జుబైద్ అనే ప్రదేశం నుండి మక్కాకు ఓ వ్యక్తి కొంత వ్యాపార సామాగ్రితో వెళ్ళాడు. మక్కాలో అల్-'ఆస్ బిన్ వాయిల్ అతని నుండి సామాగ్రి కొన్నాడు, అతని దగ్గర ఉన్నదంతా తీసుకున్నాడు గాని డబ్బు చెల్లించడానికి తిరస్కరించాడు. జుబైదీ ముఖ్య నాయకులను సహాయం కోరాడు. కాని వారు సహాయమందించ లేదు. కారణం అల్-'ఆస్ కూడా ఉన్నత వంశానికి చెందినవాడు మరియు మక్కాలో ఓ ముఖ్య నాయకుడు.

కాని ఆ జుబైదీ తన ప్రయత్నాన్ని వదులుకోలేదు. కాబా ప్రక్కన నిలుచుని తనకు జరిగిన దౌర్జన్యాన్ని గట్టిగా వినిపించాడు. ప్రవక్త(స)వారి పినతండ్రులలో ఒకరైన జుబైర్ నిలుచుని గట్టిగా అడిగారు, "అతనికి సహాయం చేసేవారెవరూ లేరా!" జుబైర్‌గారి ఆగ్రహ ఫలితంగా అబ్దుల్లాహ్ బిన్ జుద్'అన్‌గారి ఇంట్లో ఓ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో బనూ హాషిమ్, జుహ్రా మరియు తైబ్ బిన్ ముర్రా వంశీయులు పాల్గొన్నారు.

నాలుగు నిషిద్ధ మాసాల్లో ఒకటైన జుల్-ఖాయిదాలో సమావేశం జరిగింది. దౌర్జన్యానికి గురియైన ఏ బాధితునికైనా వారంతా కలిసి సహాయం చేయడానికి అల్లాహ్‌పై ప్రమాణం చేసి శపథం చేశారు. తరువాత వారంతా కలిసి అల్-ఆస్ బిన్ వాయిల్ దగ్గరకు వెళ్ళి, దౌర్జన్యంగా అతను తీసుకున్న వ్యాపార సామాగ్రిని దాని స్వంతదారునికి తిరిగి అప్పగించారు.

ఇబ్నె జు'దాన్ ఇంట్లో జరిగిన ఆ ఒప్పందాన్నే 'ఫుజూల్ ఒప్పందం' అని పిలుస్తారు. ఫుజూల్ అనేది ఫజ్ల్ అనే పదం నుండి ఉత్పన్నమైంది. ఫజ్ల్ అంటే ఉన్నతం, గొప్పదనం, ఆధిక్యత.

ఆ సమావేశంలో ముహమ్మద్(స)వారు కూడా పాల్గొన్నారు.

ప్రవక్త(స)వారు తరువాయి కాలంలో ఈ సమావేశాన్ని తన సహచరుల దగ్గర ప్రస్తావించారు. నేను అల్-ముతీబీన్ ఒప్పందానికి నా పినతండ్రులతో కలిసి హాజరయ్యాను.

"ఆ ఒప్పందాన్ని తెంచడానికి బదులుగా ఎర్ర ఒంటెలను పొందడానికి కూడా నేను ఇష్టపడను''. ఆ రోజుల్లో ఎర్ర ఒంటెలను కలిగి ఉండటం అంటే నేటి కోటీశ్వరునికి సమానం.

మరొక ఉల్లేఖనంలో ప్రవక్త(స)వారు చెప్పారు, "నేను అబ్దుల్లాహ్ బిన్ జుద్'ఆన్ ఇంటిలో హాజరయ్యాను. ఆ ఒప్పందం స్థానంలో నేను ఎర్ర ఒంటెలను కూడా ఇష్టపడను. మరియు ఇస్లామ్ (కాలంలో) దాని ద్వారా ఆహ్వానించబడితే, నేను దానికి సమాధానం చెప్పేవాన్ని" (దానిలో పాలుపంచుకునేవాడిని).

- న్యాయం కొరకు ఒప్పందాన్ని చేసుకునే ఓ సమావేశంలో పాల్గొనడాన్ని ప్రవక్త(స)వారు గౌరవంగా భావించారు. న్యాయం కోసం ఎవరు ప్రయత్నించినా సరే, ఆ ప్రయత్నాన్ని మనం ప్రశంసించాలి మరియు సహకరించాలి.
- ఇస్లామ్‌కి పూర్వం ఉన్న అజ్ఞానకాలంలో ఫుజూల్ ఒప్పందం ఒయాసిస్ వంటిది.
- దౌర్జన్యానికి గురియైనవాడు ముస్లిమ్ కావచ్చు లేదా ముస్లిమేతరుడు కావచ్చు, ధనికుడూ కావచ్చు లేదా పేదవాడు కావచ్చు. కాని సమాజం ముందుకు వచ్చి అతనికి సాయం చెయ్యాలి.
- ఓ ఒప్పందం ద్వారా శాంతి స్థాపన జరుగుతుందంటే, ఆ ఒప్పందాన్ని ముస్లిమేతరులతో చేసుకోవడానికి కూడా ఇస్లామ్ అనుమతినిస్తుంది.

"**... మరియు పుణ్యకార్యాలు మరియు దైవభీతి విషయాలలో, ఒకరికొకరు తోడ్పడండి. మరియు పాపకార్యాలలో గానీ, దౌర్జన్యాలలో గానీ తోడ్పడకండి. అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ శిక్ష విధించడంలో చాలా కఠినుడు.**'' (ఖుర్'ఆన్ 5:2)

అయితే చేసుకునే ఒప్పందం ఇస్లామ్‌కి మరియు ముస్లిమ్‌లకు తాత్కాలికంగా గాని దీర్ఘకాలికంగా గాని మంచిదా? కాదా? అని ఆలోచించాలి.

- ప్రతీ ముస్లిమ్ తను నివశిస్తున్న సమాజంపై తనదైన మంచి ప్రభావాన్ని వేయాలి. ముహమ్మద్(స)వారు బాల్యం నుండి ప్రవక్త పదవి చేపట్టే వరకూ, ఆయనను నిజాయితీ పరుడు, సత్యవంతుడని సమాజంలో అందరూ ప్రశంసించేవారు. ముహమ్మద్(స) సత్యధర్మం గురించి బోధించడం మొదటు పెట్టేటప్పటికే, ఆయన తన చుట్టూ ఉండే సమాజాన్ని తన మంచి నడవడిక ద్వారా ప్రభావితం చేశారు.

### ఖదీజా(రజి) వారితో ముహమ్మద్(స)వారి వివాహం

ఖదీజా(రజి)వారు మక్కాలో ధనవంతురాలు. ఆమె భర్త చనిపోయాక మరలా మరో వివాహం చేసుకున్నారు. రెండవ సారి కూడా వైధవ్యం కలిగింది. ఇక ఆమె మరో వివాహం చేసుకోలేదు. ఆమెకున్న మంచి శీలం వలన ఆమెను ఎంతగానో ఖురైషీయులు గౌరవించేవారు.

ఆమె తన తరపున వ్యాపారం చేయడానికి, వ్యాపార దక్షత గలవారిని కుదుర్చుకుని వారిని వేరే ప్రాంతాలకు పంపి వ్యాపారం చేయించేవారు. ముహమ్మద్(స)వారి యొక్క నిజాయితీ, సత్యత గురించి ఆమెకు

తెలిసింది. సిరియాలో తన కొరకు వ్యాపారం చేయడానికి ముహమ్మద్(స) వారి ఆమోదంతో ఆయనకు వ్యాపార బాధ్యతలను అప్పగించారు.

ఖదీజా(రజి)వారి నౌఖరు పేరు మైసరా. ముహమ్మద్(స)వారు అతనితో కలిసి సిరియా బయలుదేరారు. అక్కడ తమతో పాటు తీసుకువెళ్ళినది అంతా అమ్మివేశాక, వేరే సామాగ్రి కొని, దానిని కూడా పూర్తిగా అమ్మివేసి, తిరుగు ప్రయాణం చేశారు. ఈ వ్యాపారం ద్వారా ఖదీజా(రజి)వారికి అధిక లాభాలు అందాయి. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా తన ఐశ్వర్యంలో అనుగ్రహాలు కలిగాయని గ్రహించారు.

ముహమ్మద్(స)వారు ఈ వ్యాపారం ద్వారా తనకు లభించిన సంపద కంటే, ఆయనకు ఈ ప్రయాణం ఎంతో మేలు చేసింది. ఈ ప్రయాణంలో ఆయన ఎన్నో ప్రాంతాల గుండా వెళ్ళారు. తరువాత కాలంలో ఇవన్నీ ఇస్లామ్ రాజ్యంలోకి వచ్చాయి.

అంతేకాకుండా ఈ ప్రయాణమే ఖదీజా(రజి)వారితో వివాహానికి దారి తీసింది. ఖదీజా(రజి)వారి నౌఖరు ముహమ్మద్(స)వారితో ఉండటం వలన, ముహమ్మద్(స)వారి యొక్క ఉత్తమ లక్షణాలు, గొప్పదైన ఆయన వ్యక్తిత్వాన్ని దగ్గరుండి చూడగలిగాడు. ఇతర చారిత్రక పుస్తకాలలో మైసరా ఈ ప్రయాణంలో ఎన్నో అద్భుతాలను చూశారని వ్రాయడం జరిగింది. మైసరా ద్వారా ముహమ్మద్(స)వారి మహోన్నత వ్యక్తిత్వాన్ని ఖదీజా(రజి)వారు తెలుసుకున్నారు.

ఖదీజా(రజి)వారు తన ఐశ్వర్యంలో గలిగిన శుభాలను గ్రహించి మరియు ముహమ్మద్(స)వారి గుణగణాలను తెలుసుకున్నాక ఆమెకు ప్రవక్త(స) వారిపై కలిగిన మంచి అభిప్రాయాన్ని తన సన్నిహిత సఖి అయిన నఫీసా బిన్త్ మునబ్బహ్‌కు చెప్పారు. నఫీసా ముహమ్మద్(స)వారి దగ్గరికెళ్ళి ఖదీజా(రజి)వారి తరపున పెళ్ళి ప్రస్తావన ముందుంచారు. ఆ ప్రతిపాదన ఆయనకు కూడా సంతోషం కలిగించింది. కాని ఆయన ముందుగా తన పినతండ్రుల దగ్గరకు వెళ్ళి వారి సలహాను అడిగారు. వారంతా ఒప్పుకున్నారు. ఎందుకంటే, ఆమె సభ్యతా సంస్కారాల గురించి, ఉత్తమ శీలం గురించి ఖురైషీయులకు బాగా తెలుసు. ఆమె చివరి భర్త మరణించాక దాదాపు మక్కాలోని ముఖ్యనాయకులు ఆమెను వివాహం చేసుకుంటామని ప్రతిపాదించారు. కాని ఆమె వారిని తిరస్కరించారు.

ముహమ్మద్(స)వారు ఖదీజా(రజి)వారిని వివాహం చేసుకున్నారు. ముహమ్మద్(స)వారు ఉండే అప్పటి సమాజంలో ఎన్ని వివాహాలైనా చేసుకోవచ్చు. **కాని ఆమె జీవించియుండగా ఆయన(స) మరొక వివాహం చేసుకోలేదు.**

ఈ దంపతులకు ఇద్దరు కుమారులు మరియు నలుగురు కుమార్తెలు కలిగారు. కుమారుల పేర్లు : అల్-ఖాసిమ్ మరియు అబ్దుల్లాహ్. వీరే వరుసగా అత్-తాహిర్ మరియు అత్తయ్యిబ్‌గా పిలువబడ్డారు.

ప్రయాణానికి ఉపయోగించే పశువుపై కూర్చోగలిగే వయస్సు వచ్చేసరికి ఖాసిమ్ మరణించారు. అబ్దుల్లాహ్ పసివానిగా ఉన్నప్పుడే మరణించారు. ఇదంతా ముహమ్మద్(స)వారు ప్రవక్త కాకమునుపే జరిగింది. ముహమ్మద్(స)వారి కుమార్తెలు: జైనబ్(రజి), రుఖయ్యా(రజి), ఉమ్మె కుల్సూమ్(రజి) మరియు ఫాతిమా(రజి).

**ముహమ్మద్(స)వారికి వివాహం జరిగే సమయానికి ఆయన వయస్సు 25 సంవత్సరాలు. వివాహ సమయానికి రెండుసార్లు వైధవ్యం పొందిన ఖదీజా(రజి)వారి వయస్సు 40 సంవత్సరాలు. అంటే ముహమ్మద్(స) వారికి తన భార్యకంటే 15 సం॥లు చిన్నవారు.**

- సత్యత, విశ్వసనీయత అనేవి జయప్రదమైన వ్యాపారస్తునికి ఉండే రెండు అతి ముఖ్య గుణాలు. వ్యాపారమనేది జీవనోపాధి మార్గాలలో ఒకటి, దాని ద్వారానే అల్లాహుతాలా ప్రవక్త పదవికి ముందు ముహమ్మద్(స)వారికి జీవనోపాధి కల్పించారు. ప్రవక్త(స)వారు తరువాయి కాలంలో చెప్పారు, ఓ ముస్లిమ్ వ్యాపారస్థుడు నమ్మకస్తుడు మరియు నిజాయితీపరుడు రెండూ అయితే, అతడు ప్రవక్తలు, నిజాయితీపరులు, షహీదులతో పాటు లేపబడతాడు. వ్యాపారం అనేది ముస్లిమ్‌కి ఆదర్శనీయమైన వృత్తి. ఎందుకంటే వ్యాపారస్థుడు ఇతరులకు గులామ్‌గా ఉండడు. అతనికి ప్రజల అవసరం కంటే, ప్రజలకే అతని అవసరం ఎక్కువగా ఉంటుంది.
- ఖదీజా(రజి) వారు ముహమ్మద్(స)వారికి భార్యగా లభించడం కూడా అల్లాహ్ యొక్క అనుగ్రహమే. ఆమె గురించి ఇదే శీర్షికలో ముందు ముందు చెప్పుకుందాం, ఇన్షా అల్లాహ్! ఆమె ఉత్తమ ఇల్లాలు అనే పదానికి ఉదాహరణ. కష్ట సమయాలలో ఆమె భర్తకిచ్చిన ఓదార్పు అమోఘం. ముహమ్మద్(స)వారు ఆమె గురించి చెప్పిన మాటలను బట్టి ఆమె అంటే ఆయనకు ఎంత గౌరవమో, ఎంత ప్రేమో తెలుస్తుంది. ఒకరికి భార్య కాబోయే ఏ స్త్రీ అయినా, ముందుగా ఖదీజా(రజి)వారి గురించి తెలుసుకుని ఆ ప్రకారం నడుచుకుంటే, ఆమె వైవాహిక జీవితం చాలా సంతోషంగా గడుస్తుంది, ఇన్షా అల్లాహ్. ఇస్లామ్ ధర్మాన్ని ప్రజలకు చేరవేయడంలో ముహమ్మద్(స)వారు శారీరకంగా, మానసికంగా ఎన్నో కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. అటువంటి సందర్భాలలో ఆమె సహచర్యం ఆయనలో నూతనుత్తేజాన్ని నింపేది.
- ముహమ్మద్(స)వారు బాల్యంలో తల్లిదండ్రులను కోల్పోయారు. వివాహం అయ్యాక కుమారులను కోల్పోయారు. వారు గనుక బ్రతికి ఉంటే, ప్రవక్త(స)వారి వారసులుగా వారిని కూడా ప్రజలు ప్రవక్తలుగా అతి చేసే ప్రమాదముండేదేమో! నిజం అల్లాహ్‌కే తెలుసు. కొందరు చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలౌతారు. కొందరికి తమ పిల్లలు ముక్కుపచ్చలారక ముందే మరణిస్తారు. కొందరికి మగపిల్లలే జన్మించరు. ఇటువంటి వారందరూ ముహమ్మద్(స)కి

ఏమి జరిగిందో తెలుసుకుంటే వారి హృదయాలకు ఓదార్పుగా ఉంటుంది. ముహమ్మద్(స)వారి కంటే ఎక్కువ కష్టాలు ఎవరు పడ్డారు?

**ప్రవక్తలు అందరికంటే తీవ్రంగా పరీక్షించబడ్డారు.**

- ముహమ్మద్(స)వారు చాలా అందంగా ఉండేవారు. బాల్యం నుండే ఆయన సత్యత, నిజాయితీలకు మారుపేరని అందరికీ బాగా తెలుసు. ఉత్తమ లక్షణాలు మాత్రమే కాకుండా, వ్యాపార దక్షత కలిగి ఉన్న వ్యక్తి. ఉన్నత వంశానికి చెందినవారు. ఇన్ని ఉత్తమ లక్షణాలు గల వ్యక్తిని భర్తగా చేసుకోవడానికి స్త్రీలు పోటీ పడతారు. అయినప్పటికీ ఆయన ఖదీజా(రజి)వారినే చేసుకున్నారు. అటువంటి అజ్ఞానకాలంలో కూడా "స్వచ్ఛమైన నిగ్రహంగల నిర్మలమైన స్త్రీ"గా తెలిసిన ఆమె కారెక్టర్‌ని పరిగణనలోకి తీసుకుని ముస్లిములకు ఓ గొప్ప ఉదాహరణగా నిలిచారు. శారీరక అందాల కంటే భర్తను ప్రేమగా చూసుకుంటూ, కష్టాలలో తోడుగా ఉండే స్త్రీ భార్య కావడం కంటే అదృష్టమేముంటుంది? మక్కాలోని ముఖ్యనాయకులు వివాహం చేసుకుంటామని ముందుకొచ్చినా సరే తిరస్కరించి, ఆమె ముహమ్మద్(స)వారి ఉత్తమ లక్షణాలకు ప్రభావితమై ఆయననే వివాహమాడదలిచారు.
- యుక్త వయస్సు వచ్చినవారు వివాహం కాకుండానే స్త్రీలతో శారీరక సంబంధాలు పెట్టుకున్నప్పటికీ, పెళ్ళైన తరువాత కూడా ఇతర స్త్రీలతో సంబంధాలు కలిగి ఉన్నప్పటికీ తప్పు పట్టని సమాజంలో, పెళ్లికి ముందే కాకుండా, పెళ్లి అయిన తరువాత కూడా పరస్త్రీని కన్నెత్తి చూడని ఆదర్శమూర్తి - ముహమ్మద్(స)వారు.
- ఖదీజా(రజి)వారు మరణించే సమయానికి ఆమె వయస్సు 65 సం॥లు. ముహమ్మద్(స)వారి వయస్సు 50 సం॥లు. ఆమె జీవించినంత కాలం మరో వివాహం చేసుకోలేదు. ఆమె మరణించాక ఆయన చేసుకున్న వివాహాలలో ప్రతీ ఒక వివాహం వెనుక ఒక గొప్ప లక్ష్యముంది. ఆ విషయం తెలిసినప్పటికీ, మత దురభిమానంతో ఈ మహనీయునిపై విషయం కక్కిన వారెందరో! ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం పుస్తకంలో ఈ విషయాలను చాలా వివరంగా తెలియజేశాము.

శారీరక వాంఛలు ఎక్కువగా ఉన్న ఏ వ్యక్తి అయినా సరే తన యుక్త వయస్సు నుండి 50 సం॥ల లోపే ఎక్కువ వివాహాలను చేసుకుంటాడు. కాని దానికి భిన్నంగా ఆయన ఆ కాలంలో తన కంటే వయస్సులో పెద్దవారైన మహిళను చేసుకుని మరో స్త్రీ వంక కన్నెత్తి చూడలేదంటే, ఆయన శీలం ఎంత గొప్పదో కనీస జ్ఞానమున్న ఎవరికైనా స్పష్టంగా అర్థమౌతుంది.

**(మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో)**

అబూహురైరా(రజి) చెప్పారు :

ప్రవక్త(స)వారు చేసే దుఆ లలో ఒకటి:

"అల్లాహుమ్మ ఇన్నీ అవూదుబిక మిన్ ఇల్‌మిన్ లా యన్‌ఫ'ఉ, వమిన్ దుఆ'ఇన్ లా యుస్‌మ'ఉ, వమిన్ ఖల్‌బిన్ లా యఖ్‌ష'ఉ, వమిన్ నఫ్‌సిన్ లా తష్‌బ'ఉ"

**("ఓ అల్లాహ్! ప్రయోజనం లేని జ్ఞానం నుండి, స్వీకరించబడని దుఆ నుండి, (అల్లాహ్‌కు) భయపడని హృదయం నుండి మరియు తృప్తినొందని ఆత్మనుండి నీ రక్షణను వేడుకుంటున్నాను"**

**(ఇబ్నెమాజా - సహీహ్, 250, పుస్తకం 1, అధ్యా. 23, సంపుటి 1)**

ఉమ్మె సల్మా (రజి) ఉల్లేఖనం.

ప్రవక్త(స)వారు ఫజర్ సలాత్(నమాజ్) చేశాక, ఆయన చెప్పేవారు:

"అల్లాహుమ్మ ఇన్నీ 'అస్‌అలుక ఇల్‌మన్ నాఫిహన్ రిజ్‌ఖన్ తయ్యిబన్ వ అమలమ్ ముతఖబ్బల"

**("ఓ అల్లాహ్! ప్రయోజనం ఉన్న జ్ఞానం కొరకు, మంచి ఉపాధి కొరకు మరియు స్వీకరించబడే ఆచరణల కొరకు నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను"**

**(ఇబ్నెమాజా - సహీహ్, 925, పుస్తకం 5, అధ్యా. 32, సంపుటి 2)**

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువ్వుదాం - 17

**ఫి'లె సులాసీ ముజర్రద్ (మూడు అక్షరాల క్రియా పదాలు)** نَصَرَ يَنْصُرُ فِعل ثلاثي مُجرَّد

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సాష్టాంగపడుట<br>to prostrate | سجدہ کرنا | سُجُود<br>(సుజూద్) | سَاجد<br>(సాజిద్) | اُسْجُدْ<br>(ఉస్‌జుద్) | يَسْجُدُ<br>(యస్‌జుదు) | سَجَدَ<br>(సజద) |
| గ్రహించుట<br>to perceive | سمجھنا | شُعُور<br>(షు'ఊర్) | شَاعِر<br>(షా'ఇర్) | اُشْعُرْ<br>(ఉష్'ఉర్) | يَشْعُرُ<br>(యష్'ఉరు) | شَعَرَ<br>(ష'అర) |
| కృతజ్ఞత చూపుట<br>to be grateful | شکر کرنا | شُكْر<br>(షుక్ర్) | شَاكِر<br>(షాకిర్) | اُشْكُرْ<br>(ఉష్కుర్) | يَشْكُرُ<br>(యష్కురు) | شَكَرَ<br>(షకర) |
| నిజం చెప్పుట<br>to say the truth<br>to be true | سچ کہنا | صِدْق<br>(సిద్ఖ్) | صَادِق<br>(సాదిఖ్) | اُصْدُقْ<br>(ఉస్దుఖ్) | يَصْدُقُ<br>(యస్దుఖు) | صَدَقَ<br>(సదఖ) |
| ఆరాధించుట,<br>సేవ చేయుట<br>to worship, to serve | عبادت کرنا | عِبَادَة<br>('ఇబాదహ్) | عَابِد<br>('ఆబిద్) | اُعْبُدْ<br>(ఉత్‌బుద్) | يَعْبُدُ<br>(యత్‌బుదు) | عَبَدَ<br>('అబద) |
| ఉల్లంఘించుట<br>to transgress | نافرمانی کرنا | فِسْق،<br>(ఫిస్ఖ్) | فَاسِق<br>(ఫాసిఖ్) | اُفْسُقْ<br>(ఉఫ్‌సుఖ్) | يَفْسُقُ<br>(యఫ్‌సుఖు) | فَسَقَ<br>(ఫసఖ) |
| చంపుట, హత్య చేయుట<br>to kill<br>to slay | قتل کرنا | قَتْل<br>(ఖత్ల్) | قَاتِل<br>(ఖాతిల్) | اُقْتُلْ<br>(ఉఖ్తుల్) | يَقْتُلُ<br>(యఖ్తులు) | قَتَلَ<br>(ఖతల) |
| కూర్చునుట, వెనుక ఉండుట<br>to sit<br>to remain behind | بیٹھنا | قُعُود<br>(ఖు'ఊద్) | قَاعِد<br>(ఖా'ఇద్) | اُقْعُدْ<br>(ఉఖ్'ఉద్) | يَقْعُدُ<br>(యఖ్'ఉదు) | قَعَدَ<br>(ఖ'అద) |
| వ్రాయుట<br>to write | لکھنا | كِتَابَة<br>(కితాబహ్) | كَاتِب<br>(కాతిబ్) | اُكْتُبْ<br>(ఉక్తుబ్) | يَكْتُبُ<br>(యక్తుబు) | كَتَبَ<br>(కతబ) |
| సత్యాన్ని తిరస్కరించుట<br>కృతఘ్నత చూపుట<br>to disbelieve, to be ungrateful | انکار کرنا، ناشکری کرنا | كُفْر<br>(కుఫ్ర్) | كَافِر<br>(కాఫిర్) | اُكْفُرْ<br>(ఉక్ఫుర్) | يَكْفُرُ<br>(యక్ఫురు) | كَفَرَ<br>(కఫర) |
| పన్నాగం పన్నుట<br>to plot | چال چلنا | مَكْر<br>(మక్ర్) | مَاكِر<br>(మాకిర్) | اُمْكُرْ<br>(ఉమ్కుర్)) | يَمْكُرُ<br>(యమ్కురు) | مَكَرَ<br>(మకర) |
| చూచుట, నిరీక్షించుట<br>to look, to wait | دیکھنا | نَظْر<br>(నజ్ర్) | نَاظِر<br>(నాజిర్) | اُنْظُرْ<br>(ఉన్‌జుర్)) | يَنْظُرُ<br>(యన్‌జురు) | نَظَرَ<br>(నజర) |

పై పదాల అర్థాలను ఎలా నేర్చుకోవాలో క్రిందటి సంచికలో ఇచ్చిన వివరణ చూడండి. ఈ నెల నేర్చుకున్న పదాలు 1198 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 897 చోట్ల చూడవచ్చు)

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువ్వుదాం - 18

**ఫి'లె సులాసీ ముజర్రద్ (మూడు అక్షరాల క్రియా పదాలు)** نَصَرَ يَنْصُرُ فِعل ثلاثي مُجَرَّد

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| **చేయుట** to do | کرنا | فِعْل (ఫి'అల్) పని | فَاعِل (ఫా'ఇల్) చేసేవాడు | اِفْعِلْ (ఇఫ్'ఇల్) నీవు చేయి | يَفْعِلُ (యఫ్'ఇలు) చేస్తాడు | فَعَلَ (ఫ'అల) చేశాడు |
| **ఎత్తుట** to strike | مارنا، مثال دینا | ضَرْب (జర్బ్) | ضَارِب (జారిబ్) | اِضْرِبْ (ఇజ్‌రిబ్) | يَضْرِبُ (యజ్‌రిబు) | ضَرَبَ (జరబ) |
| **మోయుట** to carry, to bear | اُٹھانا | حَمْل (హమ్ల్) | حَامِل (హామిల్) | اِحْمِلْ (ఇహ్మిల్) | يَحْمِلُ (యహ్మిలు) | حَمَلَ (హమల) |
| **సహనం వహించుట** to bear with patience | صبر کرنا | صَبْر (సబ్ర్) | صَابِر (సాబిర్) | اِصْبِرْ (ఇస్బిర్) | يَصْبِرُ (యస్బిరు) | صَبَرَ (సబర) |
| **దౌర్జన్యం చేయుట** to wrong | ظلم کرنا | ظُلْم (జుల్మ్) | ظَالِم (జాలిమ్) | اِظْلِمْ (ఇజ్‌లిమ్) | يَظْلِمُ (యజ్‌లిము) | ظَلَمَ (జలమ) |
| **గుర్తు పట్టుట** to recognize | پہچاننا | مَعْرِفَة (మఅ్‌రిఫహ్) | عَارِف ('ఆరిఫ్) | اِعْرِفْ (ఇఅ్‌రిఫ్) | يَعْرِفُ (యఅ్‌రిఫు) | عَرَفَ ('అరఫ) |
| **అర్థం చేసుకొనుట** to understand to comprehend | سمجھنا | عَقْل ('అఖ్ల్) | عَاقِل ('ఆఖిల్) | اِعْقِلْ (ఇఅ్‌ఖిల్) | يَعْقِلُ (యఅ్‌ఖిలు) | عَقَلَ ('అఖల) |
| **క్షమించుట, కప్పుట** to forgive, to cover | بخشش کرنا | مَغْفِرَة (మఘ్ఫిరహ్) | غَافِر (ఘాఫిర్) | اِغْفِرْ (ఇఘ్ఫిర్) | يَغْفِرُ (యఘ్ఫిరు) | غَفَرَ (ఘఫర) |
| **ఆదేశించుట, అధికారం కలిగి ఉండుట** to decree, to have power | قادر ہونا، کر سکنا | قَدْر، قُدْرَة (ఖద్ర్, ఖుద్‌రహ్) | قَادِر (ఖాదిర్) | اِقْدِرْ (ఇఖ్‌దిర్) | يَقْدِرُ (యఖ్‌దిరు) | قَدَرَ (ఖదర) |
| **అబద్ధం చెప్పుట** to lie | جھوٹ بولنا | كِذْب (కిజ్బ్) | كَاذِب (కాజిబ్) | اِكْذِبْ (ఇక్‌జిబ్) | يَكْذِبُ (యక్‌జిబు) | كَذَبَ (కజబ) |
| **సంపాదించుట** to earn | کمانا | كَسْب (కస్బ్) | كَاسِب (కాసిబ్) | اِكْسِبْ (ఇక్‌సిబ్) | يَكْسِبُ (యక్‌సిబు) | كَسَبَ (కసబ) |
| **యజమానౌట** to possess | مالک ہونا | مِلْك (మిల్క్) | مَالِك (మాలిక్) | اِمْلِكْ (ఇమ్‌లిక్) | يَمْلِكُ (యమ్‌లికు) | مَلَكَ (మలక) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.** ***ఈ 18 నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 65***

ఈ నెల నేర్చుకున్న పదాలు 905 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 905 చోట్ల చూడవచ్చు) source: www.emuslim.com




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## దైవప్రవక్త **ఆదమ్**(అ)

ఈ సంచిక నుండి అల్లాహ్ పంపిన ప్రవక్తల గురించి మీకు అందిస్తామని గత సంచికలో చెప్పడం జరిగింది.

ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలలో ప్రవక్తల గురించి చెప్పబడిన విషయాలను తీసుకుని మీకు అర్థయయ్యే రూపంలో ఒక క్రమంలో అందించే ప్రయత్నమే ఈ వ్యాసం.

సృష్టికి ముందే అల్లాహ్ ఉన్నారు. ఆయనే ఫరిష్తా(దేవదూత)లను, 'జిన్'లను మరియు మానవులను సృష్టించారు. ఫరిష్తాలు కాంతితో సృష్టించబడితే, జిన్‌లు అగ్నితో సృష్టించబడ్డారు. మానవ సృష్టికి ముందే వీరిని అల్లాహ్ సృష్టించారు. తొలి మానవుని సృష్టించడానికి 2000 సంవత్సరాలకు పూర్వం నుండే **జిన్**లున్నారు. వీరు రక్తపాతానికి కారణ మయ్యారు. కాబట్టి అల్లాహ్ వారిపైకి దేవదూతల సైన్యాన్ని పంపి, వారిని తరిమేశారు.

క్రింది రెండు ఖుర్'ఆన్ ఆయత్‌లు చదవండి.

**మరియు వాస్తవంగా మేము మానవుణ్ణి మ్రోగే మట్టి, రూపాంతరం చెందిన జిగట బురదతో సృష్టించాము.మరియు దీనికి పూర్వం మేము జిన్నాతులను మండే అగ్ని జ్వాలతో సృష్టించాము.** (ఖుర్'ఆన్ 15:26,27)

అల్లాహుతాలా మానవున్ని సృష్టించే ముందు దేవదూతలకు చెప్పారు.

**అల్లాహ్** : "వాస్తవంగా నేను భూమిలో ఒక (ఖలీఫాను) ప్రతినిధిని సృష్టించ బోతున్నాను!"

**ఫరిష్తాలు** (వినయంతో) : "ఏమీ? మీరు భూమిలో కల్లోలం రేకెత్తించే వానిని మరియు నెత్తురు చిందించేవానిని నియమించ బోతున్నారా? మేము మీ స్తోత్రం చేస్తూ, మీ పవిత్రతను కొనియాడుతూనే ఉన్నాము కదా!

**అల్లాహ్** : "నిశ్చయంగా, మీకు తెలియనది నాకు తెలుసు"

పై సంభాషణలో "మీకు తెలియనది నాకు తెలుసు" అని అల్లాహ్ చెబుతున్నారు కదా! మరి మానవుడు భూమిపై కల్లోలం రేకెత్తిస్తాడని ఫరిష్తాలకు ముందుగానే ఎలా తెలిసింది? అని మీకు సందేహం రావచ్చు. అప్పటికే వారు జిన్నులను తరిమారు. జిన్‌లు చేసిందేమిటో వారికి తెలుసు కదా! ఆ అనుభవం వలనైనా అలా అని ఉండవచ్చు లేదా అల్లాహ్ ద్వారా ముందుగానే వారు తెలుసుకుని ఉండవచ్చు. నిజం అల్లాహ్‌కే తెలుసు. ఇటువంటి ఆలోచనలు మనల్ని సందేహంలో పడవేసి మంచిమార్గం నుండి తప్పిస్తాయి. ఖుర్'ఆన్‌లోని 9వ వాక్యం లేదా రెండవ సూరహ్‌లోని 2 వ వాక్యంలో అల్లాహ్ ఇలా చెబుతున్నారు: "ఇది (అంటే ఈ ఖుర్'ఆన్) ఒక దివ్య గ్రంథం, ఇందులో ఏమాత్రం సందేహం లేదు. దైవభీతి గలవారికి ఇది మార్గదర్శకత్వము".

కాబట్టి ఎటువంటి సందేహాలు పెట్టుకోవద్దు.

మానవున్ని అల్లాహ్ మట్టితో సృష్టించాడు. ఖుర్'ఆన్ చదివిన వారికి బాగా పరిచయం ఉన్న ఇద్దరు దైవదూతల పేర్లు జిబ్రీల్(అ) మరియు మిఖాయిల్(అ). అల్లాహ్ నుండి జిబ్రీల్(అ)వారు దివ్య సందేశాన్ని తీసుకుని, భూమిపై నుండే ప్రవక్తలకు అందజేసేవారు. ప్రవక్తల పేర్లు గాని, ఈ దేవదూతల పేర్లు గాని వచ్చినప్పుడు 'అలైహిస్సలామ్" అని అనాలి. అంటే "అల్లాహ్ శాంతి వారిపై కలుగుగాక! అని అర్థం. 'అలైహిస్సలామ్' అనే పదాన్ని క్లుప్తంగా '(అ)' అని ఇవ్వడం జరిగింది. మీరు '(అ)' అని వచ్చిన చోట 'అలైహిస్సలామ్' అని చదవండి.

అల్లాహుతాలా జిబ్రీల్(అ)వారిని భూమినుండి మట్టి తీసుకు రావడానికి పంపారు. దేవదూత దిగి భూమి నుండి మట్టితీసుకుని మరలా పైకి వెళ్ళడానికి ఎంతో కాలం పడుతుంది అని మీకు అనిపించవచ్చు. కాని ఎంత తక్కువ సమయం పడుతుందంటే, అది సెకనులో చాలా చిన్న భాగమే కావచ్చు. అంత తక్కువ సమయాన్ని మీరు ఊహించనైనా ఊహించలేరు.

భూమికి ఈ విషయం తెలియజేయబడింది. 'భూమికి ఎలా తెలియ *జేయబడుతుంది? దానికి చెవులు లేవు కదా!*' అని అనుకోకండి. సృష్టిలోని ప్రతీ దానికి ఒక రకమైన కమ్యూనికేషన్ వ్యవస్థ ఉంటుంది. అది మనకు తెలియదు. మనకు అంత జ్ఞానం లేదు.

తనపై నుండి మట్టి తీసుకుపోవడం వలన తన రూపం మారి పోతుందేమోనని లేదా తన పరిమాణం తగ్గిపోతుందేమోనని భూమి భయపడింది. మట్టి తీసుకువెళ్ళడానికి వచ్చిన జిబ్రీల్(అ)వారితో, "నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను, నా పరిమాణం తగ్గడం నుండి/ రూపం మారడం నుండి". భూమి అల్లాహ్ రక్షణను పొందింది. జిబ్రీల్(అ) మట్టి తీసుకో కుండానే తిరిగి వచ్చేసారు.

ఈసారి 'మిఖాయిల్(అ)' వెళ్ళారు. మరలా భూమి అదేవిధంగా వేడుకుంది. ఆయనకు అదే పరిస్థితి ఎదురైంది. ఆ తరువాత మరణాన్ని తీసుకువచ్చే మృత్యుదూత వెళ్లడం జరిగింది. ఆ దైవదూతకు అదే విధంగా భూమి చెప్పింది. అల్లాహ్ ఆదేశాన్ని పూర్తి చేయకుండా తిరిగిపోయే పరిస్థితి నుండి ఆయన కూడా అల్లాహ్ శరణువేడుకున్నారు.

భూమిపైనుండి మట్టి తీసుకున్నారు. ఒకే ప్రాంతం నుండి కాకుండా వివిధ ప్రాంతాలనుండి తెలుపు, ఎరుపు, నలుపు మొదలైన రకరకాల రంగులు కలిగిన మట్టిని తీసుకోవడం జరిగింది. అన్నిరకాల మట్టి కలపబడింది.

ఆ దూత ఆ మట్టితో పైకి వచ్చారు.

ఆ మట్టి జిగురుగా అయ్యేలా నానబెట్టబడింది.

ఆ మట్టితో అల్లాహ్ మనిషి బొమ్మను తయారు చేశారు.

ఆ బొమ్మ ఆ విధంగా 40 సంవత్సరాలుంది. దైవదూతలు చూచి భయపడేవారు. ఇబ్లీస్ ఎక్కువగా భయపడ్డాడు. ఇబ్లీస్ ఆ బొమ్మ దగ్గరికి వెళ్ళేవాడు. చేతితో చరిస్తే పెంకులాంటి శబ్దం చేసేది.

"**ఆయన మానవుణ్ణి పెంకులాంటి శబ్దమిచ్చే మట్టితో సృష్టించాడు**"
(ఖుర్'ఆన్ 55:14)

భూమిపై మట్టి వివిధరంగుల్లో ఉంటుంది. అదేవిధంగా మట్టినుండి సృష్టించబడ్డ మనిషి కూడా వివిధ రంగుల్లో ఉంటాడు.

ఈ తొలిమానవునికి అల్లాహ్ పెట్టిన పేరు **ఆదమ్**(అ).

అల్లాహ్ స్వయంగా తయారు చేసిన తొలి మానవుడు - ఆదమ్(అ). ఆయన నుండి ఆయన జంట హవ్వాను కూడా తయారు చేశారు. ఈ జంట నుండే మానవజాతి మొదలై ఈ భూమిపై జీవనం సాగిస్తుంది. అందుకే ఖుర్'ఆన్‌లో మానవులను ఉద్దేశించి మాట్లాడినప్పుడు 'అల్లాహుతాలా' "**ఓ ఆదమ్ సంతానమా!**" అని సంబోధించడం జరిగింది. కాబట్టి మానవులంతా రక్త సంబంధీకులే!

అల్లాహుతాలా తన దూతలతో ఇలా అన్నారు :

"**ఇక ఎప్పుడైతే నేను అతని సృష్టిని పూర్తిచేసి అతనిలో నా తరపునుండి ఆత్మను (జీవాన్ని) ఊదుతానో అప్పుడు, మీరు అతని ముందు సజ్దాలో పడిపొండి**" (ఖుర్'ఆన్ 38:72)

ఆదమ్(అ)వారి ముందు దైవదూతలను అల్లాహుతాలా చేయమని చెప్పిన సజ్దా 'గౌరవార్థం' చేసిన సజ్దా. అంతేగాని అది ఆరాధన ఎంతమాత్రం కాదు. మనం అల్లాహ్‌కు చేసే సజ్దా వంటిది కాదు.

అల్లాహ్ ఆదేశించారు. వారు చేశారు. అంతే! అల్లాహ్ ఆదేశిస్తే వారికి మరొక ఆలోచనే రాదు.

ముహమ్మద్(స)వారు తన గౌరవార్థం కూడా అటువంటి 'సజ్దా'ను ముస్లిములను చేయమని చెప్పలేదు. బదులుగా అల్లాహ్‌కు తప్ప ఎవరి ముందూ సజ్దా చేయకూడదని బోధించారు. ఆదమ్(అ) తొలి మానవుడే కావచ్చు. కాని **ఆయన తొలి ప్రవక్త కూడా అని మనం గుర్తు పెట్టుకోవాలి**. ఆయన ప్రవక్తలందరికీ పితామహుడు. **ప్రవక్తల పితామహుడైన** ఆదమ్(అ)వారికి దేవదూతలు చేసిన సజ్దా గౌరవార్థం అని తెలుసుకోవాలి.

ముహమ్మద్(స)వారికి చెట్లు, రాళ్ళు, జంతువులు గౌరవార్థం సజ్దా చేసేవి. (ఈ విషయం కొరకు ఈ సంచికలోనే 33వ పేజీ చూడండి)

కాబట్టి అల్లాహ్ మట్టితో చేసిన బొమ్మలో ఆత్మను పంపగానే, అందులో చలనం రాగానే ఫరిస్తాలు సజ్దా చెయ్యాలి. అల్లాహ్ అందులో ఆత్మ(రూహ్) ఊదారు. ఆత్మ తలను చేరగానే ఆదమ్(అ) తుమ్మారు. దైవ దూతలు చెప్పారు : "అల్‌హమ్‌దులిల్లాహ్! అని చెప్పు". ఆదమ్(అ) దానినే తిరిగి చెప్పారు : "**అల్‌హమ్‌దులిల్లాహ్!**"

అప్పుడు అల్లాహుతాలా అతనితో అన్నారు : "**నీ ప్రభువు నీపై కరుణను అనుగ్రహించాడు**".

**మానవుడు తొందరపాటు జీవి**

ఆత్మ అతని కళ్ళను చేరగానే, ఆదమ్(అ) స్వర్గఫలాలను చూశారు. ఆత్మ ఉదరభాగాన్ని చేరగానే ఆకలి వేసింది. ఆత్మ అతని పాదాలను చేరకముందే వేగంగా ఆయన దూకారు - స్వర్గ ఫలాలను తినగలిగేందుకు.

అల్లాహ్ అన్నారు : "**మానవుడు ఆత్రగాడు** (తొందరపాటుజీవి)**గా పుట్టించబడ్డాడు**" (ఖుర్'ఆన్ 31:27)

దైవదూతలు ఆదమ్(అ)కు సజ్దా చేశారు.

అల్లాహ్ ఆదమ్(అ)తో అన్నారు : "ఓ ఆదమ్! దేవదూతల (ఫరిష్తాల) దగ్గరికి వెళ్ళి వారు ఏమి చెబుతారో చూడు". కాబట్టి ఆదమ్(అ) వారి దగ్గరికి వెళ్ళి సలామ్ చెప్పారు. వారు సమాధానం చెప్పారు "వ అలైకుమ్ అస్సలామ్ వరహమతుల్లాహి వబరకాతుహూ". "అల్లాహ్ చెప్పారు : ఓ ఆదమ్! ఇది నీకు మరియు నీ సంతానం పలకరించుకునే విధానం".

"మరియు ఆయన ఆదమ్‌కు సకల వస్తువుల పేర్లను నేర్పాడు, ఆ పిదప వాటిని దేవదూతల ఎదుట ఉంచి : "మీరు సత్యవంతులే అయితే, వీటి పేర్లను నాకు తెలుపండి" అని అన్నాడు. (ఖుర్'ఆన్ 2:31)

**దేవదూతలు** : "నీవు సర్వలోపాలకు అతీతుడవు, నీవు తెలిపినదే తప్ప మాకు మరేమీ తెలియదు. నిశ్చయంగా నీవే సర్వజ్ఞుడవు, మహా వివేక వంతుడవు".

**అల్లాహ్** : ''ఓ ఆదమ్! వీటి పేర్లను వీరికి తెలుపు''

ఆదమ్(అ) ఆ పేర్లను వారికి తెలియజేశాడు.

**అల్లాహ్** : ''నిశ్చయంగా, నేను మాత్రమే భూమ్యాకాశాల అగోచర విషయాలను ఎరుగుదునని మీతో చెప్పలేదా? మరియు మీరు ఏది బహిర్గతం చేస్తారో మరియు ఏది దాస్తారో కూడా నాకు బాగా తెలుసు!'' దేవదూతలను అల్లాహ్ సజ్దా చేయమని ఆదేశించినప్పుడు, ఒక్క ఇబ్లీస్ తప్ప మిగతా వారంతా సజ్దా చేశారు. అతడు నిరాకరించాడు మరియు దురహంకారానికి గురి అయ్యాడు మరియు సత్య తిరస్కారుల లోని వాడయ్యాడు.''

**అల్లాహ్:** ''(ఓ ఇబ్లీస్!) నేను ఆజ్ఞాపించినప్పటికీ, సజ్దా చేయకుండా నిన్ను ఆపింది ఏమిటీ?''

**ఇబ్లీస్:** ''నేను అతని కంటే శ్రేష్ఠుడను. నీవు నన్ను అగ్నితో సృష్టించావు మరియు అతనిని నీవు మట్టితో సృష్టించావు'' అని జవాబిచ్చాడు.

**అల్లాహ్:** (ఆజ్ఞ) ''నీవిక్కడి నుండి దిగిపో! ఇక్కడ గర్వపడటం నీకు తగదు, కావున వెళ్ళిపో! నిశ్చయంగా, నీవు నీచులలో చేరావు!''

**ఇబ్లీస్:** (వేడుకోలు) ''వారు తిరిగి లేపబడే దినం వరకు నాకు వ్యవధి నివ్వు!''

(అంటే ప్రళయం వచ్చి ఈ భూమిపై మానవజాతి నాశన మయ్యాక, తిరిగి వారికి అల్లాహ్ జీవమిచ్చి తీర్పుకొరకు లేపే వరకూ)

**అల్లాహ్:** ''నిశ్చయంగా నీకు వ్యవధి ఇవ్వబడుతోంది!''

**ఇబ్లీస్:** ''ఓ నా ప్రభూ! నీవు నన్ను అపమార్గం పట్టించావు, కావున నేను వారికి, భూమిలో (వారి చెడు పనులన్నీ) మంచివిగా కనబడే టట్లు చేస్తాను మరియు నిశ్చయంగా వారందరినీ అపమార్గంలో పడవేస్తాను.

''తరువాత నేను వారి ముందు నుండి, వారి వెనుక నుండి వారి కుడివైపు నుండి మరియు వారి ఎడమవైపునుండి, వారివైపుకు వస్తూ ఉంటాను. మరియు వారిలో అనేకులను నీవు కృతజ్ఞులుగా పొందవు''.

**అల్లాహ్:** జవాబిచ్చాడు : ''నీవిక్కడి నుండి అవమానింపబడి, బహిష్కృతుడవై వెళ్ళిపో వారిలో ఎవరైతే నిన్ను అనుసరిస్తారో! అలాంటి మీవారి అందరితో నిశ్చయంగా, నేను నరకాన్ని నింపుతాను.''

***

## ఆదమ్(అ)వారి జ్ఞానం

ఫరిష్తాలకు అర్థమైంది - 'ఆదమ్' అనే మానవునికి తెలిసిన విషయాలు తమకు తెలియవని. **జ్ఞానాన్ని నేర్చుకునే ఉత్తమ గుణం మానవునికి ఇవ్వబడింది.** జ్ఞానం అంటే అల్లాహ్ గురించి, ఇస్లామ్ గురించి తెలుసుకోవడమే కాకుండా భూమిపై జీవించడానికి మరియు భూమి గురించి తెలుసుకోవడానికి కావలిసిన జ్ఞానం. అంటే అన్నిరకాల ప్రాపంచిక జ్ఞానమూ ఇందులోని భాగమే!

ఆదమ్(అ)కి ప్రతీ దాని పేరూ తెలుసు. అప్పుడప్పుడు ఫరిష్తాలతో ఆయన మాట్లాడేవారు కాని వారు అల్లాహుతాలాను ఆరాధించడంలో నిమగ్నమై ఉండేవారు. కాబట్టి ఆదమ్(అ) ఒంటరితనం ఫీలయ్యేవారు. ఒకరోజు ఆయన పడుకుని ఉన్నారు. అతనికి మెళుకువ వచ్చినప్పుడు అతని తల దగ్గర తన ముఖం వంకే అందమైన కోమలమైన కళ్ళతో చూస్తున్న ఓ స్త్రీని చూసారు. నీవెవరని ఆమెను ఆదమ్(అ) అడిగారు. ఆమె తాను ఓ 'స్త్రీ'నని సమాధానం చెప్పారు.

ఆదమ్ : **నీవెందుకు సృష్టించబడ్డావు?**

హవ్వా : **'నాలో నీకు ప్రశాంతత దొరకడానికి'**

ఫరిష్తాలు అతని జ్ఞానపరిధిని పరీక్షించదలచి అడిగారు : ''**ఆమె పేరు ఏమిటి, ఓ ఆదమ్?**''

ఆయన సమాధానమిచ్చారు, ''హవ్వా'' (అర్థం: జీవం గలవి). వారు అడిగారు : ''**ఆమెకు ఎందుకు అలా పేరు పెట్టావు?**''

ఆయన సమాధానమిచ్చారు, ''ఎందుకంటే **ఆమె నా నుండి సృష్టించబడింది మరియు నేను జీవంగలవాడిని**''

క్రింది ఖుర్ఆన్ వాక్యంలో అదే విషయం చెప్పబడింది :

> **''ఆయనే, మిమ్మల్ని ఒకే వ్యక్తి నుండి సృష్టించాడు మరియు అతని నుండియే జీవిత సౌఖ్యం పొందటానికి అతని భార్యను పుట్టించాడు...''** (ఖుర్ఆన్ 7:189)

ఓ ఉల్లేఖనంలో ముహమ్మద్(స)వారు ఇలా చెప్పారు : ''.... **వారు** (స్త్రీలు) **మీ ప్రక్కటెముక నుండి సృష్టించబడ్డారు....''**

అల్లాహుతాలా ఖుర్ఆన్‌లో ఇలా చెబుతున్నారు :

''మరియు మేము (ఆదమ్‌తో) అన్నాము : ''ఓ ఆదమ్! నీవూ మరియు నీ భార్యా ఈ స్వర్గంలో నివశించండి మరియు మీరిద్దరూ మీకు ఇష్టమైనది యథేచ్ఛగా తినండి. కానీ ఈ చెట్టు దరిదాపులకు పోకండి, అలా చేస్తే మీరిద్దరూ దుర్మార్గులలో చేరిన వారవుతారు!'' (ఖుర్ఆన్ 2:35)

నిశ్చయంగా, ఇక్కడ నీవు ఆకలి గొనవూ మరియు **వస్త్రహీనుడవూ** (దిగంబరుడవూ) **కావు**. (20:118)

మరియు నిశ్చయంగా ఇందులో నీకు దాహమూ కలుగదు మరియు ఎండకూడా తగలదు (20:119)

ఆ పిదప షైతాన్ వారిద్దరి చూపులకు మరుగుగా ఉన్న వారిద్దరి మర్మాంగాలను వారికి బహిర్గతం చేయటానికి, రహస్యంగా వారి చెవులలో అన్నాడు : ''మీరిద్దరూ దైవదూతలు అయిపోతారని లేదా మీరిద్దరూ శాశ్వత జీవితాన్ని పొందుతారని మీ ప్రభువు, మీ

ఇద్దరినీ ఈ వృక్షం నుండి నివారించాడు!''

మరియు (షైతాన్) వారిద్దరితో ప్రమాణం చేస్తూ పలికాడు : ''నిశ్చయంగా, నేను మీ ఇద్దరి శ్రేయోభిలాషిని!''

ఈ విధంగా వారిద్దరిని మోసపుచ్చి, తన వైపునకు తిప్పుకున్నాడు. వారిద్దరూ ఆ వృక్ష (ఫల)మును రుచి చూడగానే వారిద్దరి మర్మాంగాలు వారికి బహిర్గతమయ్యాయి. అప్పుడు వారు తమపై స్వర్గపు ఆకులను కప్పుకోసాగారు. మరియు వారి ప్రభువు వారిద్దరినీ పిలిచి అన్నాడు : ''**ఏమీ? నేను మీ ఇద్దరినీ ఈ చెట్టు వద్దకు పోవద్దని నివారించలేదా? మరియు నిశ్చయంగా షైతాన్ మీ ఇద్దరి యొక్క బహిరంగ శత్రువని చెప్పలేదా?**''

''వారిద్దరూ ఇలా విన్నవించుకున్నారు : **''ఓ మా ప్రభూ! మాకు మేము అన్యాయం చేసుకున్నాము. మరియు నీవు మమ్మల్ని కరుణించకపోతే! మమ్మల్ని క్షమించకపోతే! నిశ్చయంగా, మేము నాశనమైపోయే వారిలో అయిపోతాము''**. (7:23)

ఆ తరువాత అతని ప్రభువు, అతనిని (తన కారుణ్యానికి) ఎన్నుకొని, **అతని పశ్చాత్తాపాన్ని స్వీకరించి, అతనికి మార్గదర్శకత్వం చేశాడు.** (20:122)

(అల్లాహ్) అన్నాడు : ''మీరిద్దరూ కలసి ఇక్కడి నుండి దిగిపోండి. మీరు ఒకరికొకరు శత్రువులై ఉంటారు. కాని **నా తరపు నుండి మీకు మార్గదర్శకత్వం తప్పక వస్తూ ఉంటుంది**, కావున **నా మార్గదర్శకత్వాన్ని అనుసరించేవాడు మార్గభ్రష్టుడూ కాడు** మరియు దురవస్థకూ గురికాడు. (20:123)

(అల్లాహ్) అన్నాడు : '' .......... మరియు మీరందరికీ ఒక నిర్ణీతకాలం వరకు భూమిలో నివాసం మరియు జీవనోపాధి ఉంటాయి''. (7:24)

ఇంకా ఇలా అన్నాడు : ''మీరందరూ అందులోనే జీవిస్తారు మరియు అందులోనే మరణిస్తారు మరియు దానినుండే మరలా లేపబడతారు'' (ఖుర్'ఆన్ 7:25)

ఆదమ్(అ) మరియు హవ్వా(అ) ఇద్దరికీ ఆ చెట్టు ఫలం వారి కొరకు నిషేధించ బడింది అని తెలుసు. కాని మానవులకు మరిచిపోయే గుణం కూడా ఉంది. మానవ బలహీనతను తనకు అనుకూలంగా చేసుకోవడంలో ఎల్లప్పుడూ షైతాన్ ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఎట్టకేలకు షైతాన్ ప్రయత్నం ఫలించింది. వారిద్దరినీ ఫలం తినేలా చేసి, అల్లాహ్‌కు చేసిన వాగ్దానం నుండి వారిని తప్పించాడు.

క్రింది ఖుర్'ఆన్ వాక్యం చూడండి :

''మరియు వాస్తవానికి, మేము ఇంతకు పూర్వం ఆదమ్‌తో ఒక వాగ్దానం చేయించి ఉన్నాము, కాని **అతడు దానిని మరచిపోయాడు** మరియు మేము అతనిలో స్థిరత్వాన్ని చూడలేదు.'' (ఖుర్'ఆన్ 20:115)

కొన్ని ఉల్లేఖనాల ప్రకారం స్వర్గాన్ని పోగొట్టుకున్నందుకు ఆదమ్(అ) 60 సంవత్సరాలపాటు మరియు చేసిన పొరపాటుకు 70 సంవత్సరాల పాటు బాధపడ్డారు.

ఆదమ్(అ), హవ్వా(అ) మరియు వారితో పాటు శపించబడ్డ షైతాన్ భూమిపైకి దింపబడ్డారు. మానవులచేత చెడ్డపనులు చేయించడమే షైతాన్ పని.

ఇబ్నె ఉమర్ ఉల్లేఖనాన్ని బట్టి, ఆదమ్(అ) సఫా పర్వతంపై మరియు హవ్వా(అ) మర్వా పర్వతంపై దిగారు. ఆ పర్వతాలు కాబా మస్జిద్‌కు దగ్గరలో ఉన్నాయి. ఆదమ్(అ) శుక్రవారంనాడు భూమిపైకి దిగారు. ఒక ఉల్లేఖనం ప్రకారం ఆదమ్(అ)వారు హజరే అస్వద్ (నల్లరాయి)ని తనతో పాటు తీసుకువచ్చారు. కాబా మస్జిద్ గోడలో ఉండే రాయి ఇదే. స్వర్గం నుండి కొన్ని విత్తనాలు కూడా తీసుకు వచ్చారు. వ్యవసాయం గురించి అల్లాహ్‌చే బోధించబడ్డారు.

స్వర్గంలో ఆదమ్(అ) ప్రారంభంలోనే మూడు ముఖ్య విషయాలు గమనించారు. అవి: ప్రేమ, కోపం మరియు ఆశ్చర్యం.

**ప్రేమ** అపారమైన అల్లాహ్ ప్రేమ - దేవదూతలచే తొలి మానవుడైన తన ముందు సజ్దా చేయించారు.

**కోపం** అల్లాహ్ తన కరుణ నుండి ఇబ్లీస్‌ను వెడలగొట్టారు.

**ఆశ్చర్యం** ఇబ్లీస్‌ను చూసి ఆదమ్(అ) ఆశ్చర్యపోయారు, మానవుడినైన తన గురించి పూర్తిగా తెలుసుకోకుండానే, మట్టి కంటే అగ్నికే శ్రేష్ఠత ఉంటుందని గర్వపడ్డాడు. ఏది శ్రేష్టమో కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు కదా! అంత జ్ఞానియైన ఇబ్లీస్‌కు ఈ విషయం ఎందుకు తెలియలేదు. అతని గర్వం అతని జ్ఞానాన్ని మూసేసింది.

ఇబ్లీస్ పొగరును మరియు అల్లాహ్ ఓర్పును చూశారు.

ఆదమ్‌ను సృష్టించిన వెంటనే అల్లాహుతాలా అతనికి అపారమైన స్వేచ్ఛ నిచ్చారు.

ఇబ్లీస్ అవిధేయత చూపుతాడని అల్లాహ్‌కు ముందుగానే తెలుసు. అల్లాహ్ తలచుకుంటే అతన్ని సమూలంగా నాశనం చేయవచ్చు. షైతాన్ అవిధేయత చూపేలోపే అతని నోటిద్వారా తిరస్కారం రాకుండా, అతని మనస్సు మార్చి దేవదూతలు చేసినట్లే సజ్దా చేయించి ఉండేవారు. కాని తనను కూడా తిరస్కరించేటంత మిక్కిలి స్వేచ్ఛను తను సృష్టించిన వాటికి అల్లాహ్ ఇచ్చారని మనకు స్పష్టంగా తెలుస్తుంది.

ఎవరు ఆయనను ఆరాధించినా, ఆరాధించకపోయినా సరే ఆయన ఘనతలో తగ్గుదల రాదు. ఇబ్నె అబ్బాస్ గారి ఉల్లేఖనం ప్రకారం, ఒకప్పుడు స్వర్గాన్ని జిన్‌లు కనిపెట్టుకుని ఉండేవారు. వారిలో గౌరవనీయుడు, బాగా జ్ఞానం కలవాడు మరియు చాలా ధర్మ పరాయణుడు మరెవరో కాదు - ఇబ్లీస్.

కాని అంతటి జ్ఞాని మరియు గౌరవనీయుడైన ఇబ్లీస్ గర్వంతో విర్రవీగి అల్లాహ్‌చే శపించబడి 'షైతాన్' అయ్యాడు.

÷÷÷

ఆదమ్(అ)వారు భూమిపైకి వచ్చాక స్వర్గంలో తిరిగినట్లు యథేచ్ఛగా

భూమిపై తిరిగే అవకాశం లేదు. స్వర్గంలో ఉన్నటు వంటి రక్షణ ఇక్కడ లేదు. తన భార్యాబిడ్డల్ని క్రూర జంతువుల నుండి కాపాడుకోవాలి. వస్త్రాలు కావాలి. వ్యవసాయం చేయాలి. ఇంకా ఎన్నో బాధ్యతులున్నాయి.

అంతేకాదు సంతోషంగా, స్వేచ్ఛగా బ్రతికే వారిద్దరిని స్వర్గం నుండి వెడలగొట్టించిన షైతాన్ కూడా ఇప్పుడు భూమిపైనే ఉన్నాడు. అల్లాహ్ అనుగ్రహాల నుండి మానవులను దూరం చేయడానికి ఎల్లప్పుడూ పనిచేసేది ఈ షైతానే. అల్లాహ్ ఆదేశాన్ని పాటించకుండా గర్వపడిన షైతాన్ గమ్యం నరకాగ్ని. మనలో కూడా గర్వాన్ని పెంచి, అల్లాహ్ ఆదేశాలను తిరస్కరించేలా చేస్తాడు.

మానవులందరూ నరకాగ్నిలో పడాలనేది షైతాన్ ప్రయత్నం.

మంచి మరియు చెడుల మధ్య యుద్ధం మొదలైంది. పునరుత్థాన దినం వరకూ ఇది కొనసాగుతూనే ఉంటుంది. అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసం గలవారు అల్లాహ్ కరుణతో మంచితో చెడుపై విజయం సాధిస్తూనే ఉంటారు.

**సంతానం**

ఆదమ్ మరియు హవ్వా లకు మొదటి సంతానం కవల పిల్లలు. కుమారుడు మరియు కుమార్తె కలిగారు. కుమారుని పేరు ఖాబీల్. ఆ తరువాత రెండవ కాన్పులో కూడా మరొక కవల పిల్లల జంట జన్మించారు. ఈసారి కూడా కుమారుడు మరియు కుమార్తె కలిగారు. కుమారుని పేరు 'హాబీల్'. హాబీల్ పశువులను చూసుకుంటే, ఖాబీల్ వ్యవసాయం చేసేవాడు.

ఆదమ్(అ) మరియు హవ్వా(అ) ఈ భూమిపై అడుగిడిన తొలి మానవ జంట. ఆ జంట నుండి వచ్చినవారమే మనమంతా. అది ఎలా సాధ్యమంటారా? ఆదమ్(అ) మరియు హవ్వా(అ) తరువాత, ఒక కాన్పులో పుట్టిన అబ్బాయికి మరియు మరో కాన్పులో పుట్టిన అమ్మాయికి వివాహం చేయాలి. ప్రారంభంలో ఆదమ్ సంతానానికి అల్లాహ్ చూపిన సాంప్రదాయం అదే. ఈ విషయాన్ని ఆదమ్(అ) తన సంతానానికి తెలియజేశారు. కాని ఖాబీల్‌కు ఈ ప్రతిపాదన నచ్చలేదు. ఎందుకంటే హాబిల్ యొక్క సోదరి ఖాబీల్ సోదరికంటే అందంగా ఉండక పోవడమే అందుకు కారణం. తండ్రి ఆదేశాన్ని తిరస్కరించాడు. మనిషికి అందంపై మక్కువ మొదటి నుండీ ఉందని ఈ వృత్తాంతం నుండి తెలుస్తుంది.

**అసూయ**

ఆదమ్(అ) సందిగ్ధంలో పడ్డారు. తన కుటుంబంలో శాంతి మరియు సామరస్యం కావాలి. అల్లాహ్‌కు దువా చేసుకున్నారు.

ఆదమ్(అ) కుమారులిద్దరినీ ఆదేశించారు కాబా దగ్గర ఖుర్బానీ ఇవ్వమని. వారు మక్కాకు హజ్జ్ చేశారు. ఆదమ్(అ) అక్కడి నుండి వెళ్ళిపోయాక, ఇద్దరూ ఖుర్బానీ ఇచ్చారు. హాబీల్ మంచి పుష్టిగా ఉన్న గొఱ్ఱె పిల్లను ఖుర్బానీ ఇచ్చారు. ఎందుకంటే అతడు పశువుల కాపరి. ఖాబీల్ వ్యవసాయం చూసుకునేవాడు. నాణ్యతలేని ధాన్యపు కట్టను ఖుర్బానీ ఇచ్చాడు. పై నుండి అగ్ని దిగి హాబీల్ ఖుర్బానీని గ్రహించుకుని తీసుకుపోయింది. ఖాబీల్ ఖుర్బానీని వదిలేసింది. ఖాబీల్‌కు చాలా కోపం వచ్చి అన్నాడు : "నేను నిన్ను ఖచ్చితంగా చంపేస్తాను నీవు నా సోదరిని వివాహం చేసుకోకుండా". హాబీల్ సమాధాన మిచ్చాడు "**అల్లాహ్ తనపై భయం గల వానిది మాత్రమే స్వీకరిస్తారు**".

హాబిల్ కొరకు తండ్రి(ఆదమ్) అల్లాహ్‌ను వేడుకోబట్టే అతని ఖుర్బానీ స్వీకరించబడిందని ఖాబీల్ అనుమానం. అదే విషయం తండ్రికి ఫిర్యాదు చేశాడు తన కొరకు వేడుకోలేదని. ఆ విషయాన్ని తామిద్దరే పరిష్కరించుకుంటామని తండ్రికి వాగ్దానం చేశాడు. ఒక రాత్రి, హాబీల్ అతని పశువులను తోలుకుంటూ ఆలస్యంగా తిరిగి వస్తున్నాడు. ఆదమ్(అ) ఖాబీల్‌ను పంపారు ఏమి జరిగిందో చూసి రమ్మని. అతను కనిపించాడు అతనివైపు తీక్షణంగా చూస్తూ "నీది స్వీకరించబడింది మరియు నాది కాలేదు". హాబీల్ సమాధాన మిచ్చాడు, "**అల్లాహ్‌కు భయపడినవారి నుండి మాత్రమే అల్లాహ్ స్వీకరిస్తారు**". అది విన్నాక ఖాబీల్ ఆగ్రహించి అతనిని కొట్టి చంపాడు. మరో ఉల్లేఖనం ప్రకారం అతడు పడుకుని ఉండగా కొట్టి చంపాడు.

ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేశారు :

"మరియు వారికి ఆదమ్ యొక్క కుమారులు (హాబీల్ మరియు ఖాబీల్)ల యథార్ధ కథను వినిపించు. వారిద్దరు (అల్లాహ్‌కు) ఖుర్బానీ ఇచ్చినప్పుడు ఒకని (హాబీల్) ఖుర్బానీ స్వీకరించబడింది మరియు రెండవ వాని (ఖాబీల్) ఖుర్బానీ స్వీకరించబడలేదు. (ఖాబిల్) అన్నాడు : "నిశ్చయంగా నేను నిన్ను చంపుతాను." (దానికి హాబీల్) అన్నాడు : "నిశ్చయంగా, అల్లాహ్ భయభక్తులు గలవారి (ఖుర్బానీ) స్వీకరిస్తాడు.

నీవు నన్ను చంపటానికి నీ చేయి నా వైపుకు ఎత్తినా! నేను నిన్ను చంపటానికి నా చేయి నీవైపుకు ఎత్తను. (ఎందుకంటే) వాస్తవానికి, నేను సర్వలోకాలకు పోషకుడైన అల్లాహ్‌కు భయపడుతున్నాను.

నీవు నీ పాపంతో సహా, నా పాపాన్ని కూడా భరించి నరకవాసులలో ఒకడవు కావాలని నా కోరిక. మరియు ఇదే దుర్మార్గుల ప్రతిఫలం."

"చివరికి అతడి మనస్సు అతనిని (తన సోదరుని) హత్యకు పురికొల్పింది, కావున అతడు తన సోదరుణ్ణి (హాబీల్‌ను) చంపి నష్టం పొందిన వారిలో చేరిపోయాడు. అప్పుడు అల్లాహ్ ఒక కాకిని పంపాడు, అది నేలను త్రవ్వి అతని సోదరుని శవాన్ని ఎలా దాచాలో చూపించింది. అతడు (ఖాబీల్): "అయ్యో, నా పాడుగాను! నేను ఈ కాకి పాటి వాణ్ణి కూడా కాలేకపోయాను! నా సోదరుని శవాన్ని దాచే (ఉపాయం) వెతకలేక పోయాను కదా!" అని వాపోయాడు. అప్పుడతడు పశ్చాత్తాపపడే వారిలో చేరిపోయాడు." (ఖుర్ఆన్ 5:27-31)

**భూమిపై మొదటి చావు మరియు మొదటి హత్య** : ఖాబీల్ మొదటి హంతకుడు. మొదటి మరణం హాబీల్‌ది.

ఆదమ్(అ)వారి కుమారులలో ఒకరు చనిపోయారు. రెండవ కుమారుడు షైతాన్‌చే గెలవబడ్డాడు. ఆ ఇద్దరి కుమారుల నష్టం

ఆదమ్(అ) వారిని కలిచివేసింది. ఆదమ్(అ) తన సంతానానికి, ఆ సంతానం యొక్క సంతానానికి అల్లాహ్ గురించి మరియు ఆయననే విశ్వసించాలని బోధిస్తూ ఉండేవారు.

ఇబ్లీస్ గురించి చెబుతూ, అతడే స్వర్గం నుండి తమను వెడల గొట్టించాడని, ఖాబీల్‌ను ప్రేరేపించి తన స్వంత సోదరుడిని చంపేలా చేశాడని చెబుతూ, వారిని హెచ్చరించేవారు ఆదమ్(అ).

**ఆదమ్(అ) వారసుడు**

సంవత్సరాలు గడిచాయి, ఆదమ్(అ)వారు బాగా వృద్ధులయ్యారు. మరియు అతని సంతానం భూమి అంతా వ్యాపించింది. ఇబ్నె ఇషాక్ గారు ఆదమ్(అ)వారి చివరి ఘట్టాన్ని వివరించారు.

ఆదమ్(అ)వారిని మరణం సమీపించేసరికి, ఆయన తన కుమారుడు సీత్‌ను అతని వారసునిగా నియమించి అతనికి పూర్తి సమయం ఆరాధన పద్ధతులను నేర్పారు.

అబూజర్(రజి)వారి ఉల్లేఖనం ప్రకారం అల్లాహ్ 104 ప్రార్థనా గీతాలను పంపారు. వాటిలో 50, సీత్ వారికే పంపబడ్డాయి.

**ఆదమ్(అ)వారి మరణం**

ఆదమ్(అ)వారి మరణం సమీపించే సరికి, ఆయన(అ) తన సంతానంతో అన్నారు, ''ఓ నా సంతానమా! వాస్తవానికి స్వర్గఫలాల కొరకు నేను ఆకలిగొన్నాను''. కాబట్టి వారు తండ్రి కోరిన దాని కొరకు వెతుకుతున్నారు. అలా వెళుతుండగా వారు దేవదూతలను కలిసారు. ఫరిష్తాలతో శవాన్ని కప్పే వస్త్రం మరియు పరిమళాన్ని కలిగించేవి ఉన్నాయి. ఫరిష్తాలు వారిని అడిగారు : **''ఓ ఆదమ్ సంతానమా! మీరు దేనికొరకు వెతుకు తున్నారు? మీకు ఏమి కావాలి? మీరు ఎక్కడికి వెళు తున్నారు?''**

వారు చెప్పారు: ''మా తండ్రిగారు జబ్బుపడ్డారు మరియు ఆయనకు ఆకలిగా ఉంది స్వర్గఫలాల కొరకు''.

దేవదూతలు వారితో చెప్పారు : ''వెనక్కి వెళ్ళండి, మీ తండ్రిగారు త్వరలోనే (జీవితాన్ని) ముగించబోతున్నారు''. కాబట్టి వారు వెనుతిరిగారు (దేవదూతలతో పాటు). హవ్వా(అ) దేవదూతలను చూచి గుర్తుపట్టారు. ఆమె తాను కనబడకుండా ఆదమ్(స) వెనుక ఉండాలని ప్రయత్నించారు. ఆదమ్(అ) ఆమెతో చెప్పారు, ''నన్ను ఒంటరిగా వదిలెయ్యి. నేను నీకంటే ముందు వచ్చాను, నాకు మరియు నా ప్రభువు దూతలకు మధ్య రావద్దు''. వారు ఆయన ఆత్మను తీసుకుని సుగంధ ద్రవ్యాలతో పరిమళం గావించి ఆయనను వస్త్రంలో చుట్టారు. సమాధి తవ్వి అందులో ఆయనను ఉంచారు. ఆయన కొరకు ప్రార్థన చేసి ఆయనను సమాధిలో ఉంచారు. వారు చెప్పారు, **''ఓ ఆదమ్ సంతానమా! మరణ సమయంలో ఇది మీ సాంప్రదాయం''.**

ఆదమ్(అ)వారు మరణించే ముందు తన సంతానానికి, అల్లాహ్ మానవులను ఒంటరిగా భూమిపై వదలరని, వారికి మార్గదర్శకత్వం చేయడానికి ప్రవక్తలను పంపుతారనే విషయాన్ని గ్రహించేలా బోధించారు.

ఎందరో ప్రవక్తలు వచ్చారు. అల్లాహ్ యొక్క మార్గాన్ని బోధించారు. అల్లాహ్‌ను తప్ప వేరొకరిని ఆరాధించకూడదని ఆదేశిస్తూ, చెడును నిరోధించారు.

ఆదమ్(అ) తన సంతానానికి చివరి బోధన పూర్తి చేసిన తరువాత కళ్ళు మూసుకున్నారు. దేవదూతలు ఆయన గదిలో ప్రవేశించి అతనిని చుట్టూ చేరారు. వారిలో మృత్యుదూతను గుర్తించాక, ఆదమ్(అ)వారి హృదయం ప్రశాంతంగా దరహాసం చేసింది.

తొలి మానవుడు మరియు తొలి ప్రవక్తయైన ఆదమ్(అ)వారి ఇహలోక జీవితం ముగిసింది. ఆయన తరువాత ఎందరో ప్రవక్తలు ఉద్భవించారు.

ఖుర్'ఆన్ మరియు హదీస్‌లలో చెప్పబడిన మిగిలిన ప్రవక్తల గురించి వరుసగా మీకు ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

**ఈ వ్యాసాన్ని చదివారు కదా! ఇందులో మీ కర్థమైన నీతి (మోరల్) ఏమిటి?**

తొలిమానవులు కూడా వస్త్రాలను ధరించి తమ దేహాలను కప్పుకున్నారు. తమ మర్మాంగాలు బహిర్గతం అయితే సిగ్గుపడేవారు. తొలి మానవులు అనాగరికులు అని చెప్పే నేటి మానవులే నిజానికి అసలైన అనాగరికులు. ఈ రోజుల్లో స్త్రీలు బట్టలు వేసుకున్నారా? లేదా? అని సందేహ పడే విధంగా చాలీచాలని, కనిపించీ కనిపించని దుస్తులు ధరిస్తున్నారు. అయినా సరే వారు సిగ్గుపడటం లేదు. వారిపై షైతాన్ ప్రభావం అంత ఎక్కువగా ఉంది.

అప్పుడు అన్నాము: ''ఓ ఆదమ్! నిశ్చయంగా, ఇతడు నీకు మరియు నీ భార్యకు శత్రువు, కాబట్టి ఇతడిని, మీ ఇద్దరిని స్వర్గం నుండి వెడలగొట్ట నివ్వకండి అలా అయితే మీరు దురవస్థకు గురి కాగలరు. (20:117)

**డియర్ చిల్డ్రన్! (ముఖ్యంగా అమ్మాయిలు!) మీరు చిన్నప్పటి నుండి టైట్ (బిగుతుగా ఉండే) టీ షర్ట్‌లు, జీన్స్ ఫ్యాంట్లు వేసుకోవడం అలవాటు చేసుకోకండి. బాలికలు వేసుకునేవి బాలురు, బాలురు వేసుకునేవి బాలికలు ధరించకండి. సిగ్గు కూడా విశ్వాసంలో ఓ భాగమే!**

వేసుకునే బట్టలు ఎలా ఉండాలో శాంతిబాట ఫిబ్రవరి 2010 సంచిక లో వివరించాము. చూడండి.

ఆదమ్(అ)వారు అల్లాహ్‌కు వాగ్దానం చేశారు చెట్టు ఫలాన్ని తిననని. కాని సంవత్సరాలు గడిచేసరికి షైతాన్ మాటలు నమ్మి అల్లాహ్‌కు ఇచ్చిన వాగ్దానాన్ని ఆయన మరిచిపోయారు. దాని ఫలితంగా ఎటువంటి కష్టనష్టాలు లేని బాధలేని సుఖవంతమైన స్వర్గ జీవితాన్ని కోల్పోయారు.

మరి మనం కూడా మరచిపోయామా?

ఒకవేళ మరచిపోయి ఉంటే ఏది మరచిపోయాము?

మనం కూడా అల్లాహ్ ఆదేశాలను మర్చిపోయాము. అల్లాహ్ మనకిచ్చిన ఆదేశాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. వాటిని రోజూ చదువుతూ ఉంటే మనకు జ్ఞాపకం ఉంటాయి. ఆ ఆదేశాలు చదవకుండా ఖుర్'ఆన్‌ను వదిలేస్తే షైతాన్ మన తల్లిదండ్రులను ఏ విధంగా

మోసగించాడో, అలాగే మనందరినీ కూడా మోసగిస్తాడు.

ఓ ఆదమ్ సంతానమా! వాస్తవానికి మేము మీ కొరకు వస్త్రాలను కల్పించాము. అవి మీ మర్మాంగాలను కప్పుతాయి. మరియు మీకు అలంకారమిస్తాయి. మరియు దైవభీతియే అన్నిటికంటే శ్రేష్టమైన వస్త్రం. ఇవి అల్లాహ్ సూచనలలో కొన్ని. బహుశా గుణపాఠం నేర్చుకుంటారేమోనని.

ఓ ఆదమ్ సంతానమా! షైతాన్ మీ తల్లిదండ్రుల నుండి (ఆదమ్ మరియు హవ్వాల నుండి) వస్త్రాలను తొలగించి, వారి మర్మాంగాలను వారికి కనబడేటట్లు చేసి, వారిని స్వర్గం నుండి వెడలగొట్టినట్లు మిమ్మల్ని కూడా ఆపదకు గురిచేయకూడదు. నిశ్చయంగా, వాడు మరియు వాని సంతతి వారు మిమ్మల్ని కనిపెట్టుకుని ఉన్నారు. కాని, మీరు వారిని చూడలేరు. నిశ్చయంగా, మేము షైతానులను, విశ్వసించని వారికి స్నేహితులుగా చేశాము. (7:26, 27)

మనం మాత్రం ఖుర్ఆన్‌ను మర్చిపోకుండా ఉండాలని అల్లాహ్‌ను వేడుకుందాము.

జ్ఞానం కావాలి.

ధార్మిక జ్ఞానంతో పాటు ప్రాపంచిక జ్ఞానమూ కావాలి.

మన సమాజానికి డాక్టర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, టీచర్లు, నిపుణులు మొదలైన ఎంతో మంది కావాలి. అందుకోసం చదువు కోవాలి.

వారు నిజాయితీగా పనిచేయాలంటే వారికి ధార్మిక జ్ఞానం కావాలి.

ముహమ్మద్(స)వారికి అల్లాహ్ నుండి అందిన తొలి సందేశ పదం: **"ఇఖ్రా"** (అంటే **'చదువు'**).

రోజూ ఖుర్ఆన్ చదవండి. మీ కాన్వెంట్/స్కూల్ చదువు కూడా అప్పుడు చాలా బాగా ఉంటుంది.

**ఇన్షా అల్లాహ్ మరో ప్రవక్తగారి చరిత్ర వచ్చే సంచికలో....**

.................................................................

- స్వర్గం నుండి ఆదమ్(అ) విత్తనాలు తీసుకువచ్చారు. వ్యవసాయం ఎలా చేయాలో అల్లాహ్ ఆదమ్(అ)కి నేర్పారు.
- శవాన్ని భూమిలో ఎలా ఉంచాలో అల్లాహ్ కాకిని పంపి చూపించారు.
- మానవుని 'జనాజా' ఏవిధంగా చేయాలో తెలపడానికి దైవదూతలను పంపి వారి చేత ఆదమ్(అ)వారిని సమాధి గావించేలా చేశారు.
- మానవునికి జ్ఞానమిచ్చేది మరియు మానవున్నిగైడ్ చేసేది అల్లాహ్‌యే
- తన దాసున్ని, షైతాన్ నుండి రక్షించేది అల్లాహ్‌యే!
- మనం చేసే చెడ్డ పనులను మనకు మంచివిగా అనిపించేలా చేసి, చెడ్డ పనులు చేయడానికి మనల్ని ప్రోత్సహించేది షైతానే.
- షైతాన్ అంటే సినిమాల్లో, టీవిలో చూపించే విధంగా భయంకరంగా ఉండి మనల్ని భయపెట్టేవాడు కాదు. మనం అల్లాహ్ చూపిన మార్గాన్ని తప్పే విధంగా మనలో చెడు భావనలు కల్పించేవాడు. బలవంతంగా మన చేయి పట్టుకుని ఏ చెడ్డపనీ చేయించడు. మన మనస్సులో చెడు భావం కలుగజేసి మన చేత ఆ పని చేయిస్తాడు.

ఉదాహరణకు మీరు హోమ్ వర్క్ చేయాలి. చదువుకోవాలి. మీకు టి.వి. చూడాలనే భావం కలుగజేస్తాడు. హోమ్ వర్క్ తరువాత చేసుకోవచ్చనే భావాన్ని కలిగిస్తాడు. అదే షైతాన్. అంతేగాని భయంకరమైన రూపంలో మీ ముందు ప్రత్యక్షమై టి.వి. చూడండి, చదవడం మానివేయండి అని చెప్పడం ఉండదు.

కాబట్టి మీకు ఎప్పుడైతే అటువంటి ఆలోచనలు వచ్చాయో అది షైతాన్ పనేనని వెంటనే తెలుసుకోవాలి. 'అవూజుబిల్లాహి మినష్ షైతానిర్రజీమ్' అని అల్లాహ్ రక్షణ కొరకు వేడుకోవాలి.

మీరందరూ బాగా చదవాలి. విద్యార్థులు బాగా చదవడం షైతాన్‌కి ఇష్టం ఉండదు. షైతాన్‌కి ఇష్టంకాని పనే మనం చేయాలి.

'అల్లాహ్'పై ప్రేమ మరియు భయం ఉంటే మనం దేనికీ భయపడనవసరం లేదు.

- స్వర్గం నుండి ఆదమ్(అ) నల్లరాయిని తీసుకువచ్చారు. అది మక్కాలోని కాబా మస్జిద్ గోడలో ఉంచారు. 'హజ్జ్' మరియు 'ఉమ్రా' చేసేవారు వెళ్ళి కాబా మస్జిద్‌కు ప్రదక్షిణ (తవాఫ్) చేస్తారు. ఒక్క కాబా మస్జిద్‌కే ప్రపంచంలోని ముస్లిమ్‌లు ప్రదక్షిణ చేస్తారు. ప్రపంచంలో ఏ మస్జిద్‌కు మరే ప్రదేశానికీ చెయ్యరు.

కాని ఓ మత ధర్మాన్ని అనుసరించేవారికి ఈ విషయం తెలియక, కాబాగోడలో ఉన్న ఆ రాయిని ముస్లిములు పూజిస్తున్నారని అనుకుని ప్రచారం చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది.

ఆ రాయి విషయంలో రెండవ ఖలీఫా 'అమీరుల్ మోమినీన్' ఉమర్(రజి) ఏమన్నారో తెలుసా?

"నిన్ను ప్రవక్త(స)వారు ముద్దు పెట్టుకోవడం చూశాను కాబట్టి నేను ముద్దు పెట్టుకుంటున్నాను. నీవొక రాయివి తప్ప ఇంకేమీ కాదు"

అల్లాహ్‌కు విధేయులు - ముస్లిములు. ఈ సృష్టిని తయారుచేసింది అల్లాహ్‌యే. సృష్టిలోని ఏ వస్తువునుగాని, ఏ ప్రాణిని గాని, ఏ పదార్థాన్ని గాని ముస్లిములు ఆరాధించరు. కేవలం అల్లాహ్‌నే ఆరాధిస్తారు. కొందరు తెలియక అల్లాహ్‌ను నిరాకారుడు అంటారు. కాని అల్లాహ్‌కు రూపం ఉంది. కాని ఆ రూపాన్ని మనం ఊహించు కోలేము. సృష్టిలో ఆయనను పోలినదేదీ లేదు.

**మరియు నీ ప్రభువు ఆదమ్ సంతతివారి వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, వారికి వారినే సాక్షులుగా నిలబెట్టి: "ఏమీ? నేను మీ ప్రభువును కానా?" అని అడుగగా వారు, "అవును (నీవే మా ప్రభువని) మేము సాక్ష్యమిస్తున్నాము" అని జవాబిచ్చారు. తీర్పు దినమున మీరు "నిశ్చయంగా, మేము దీనిని ఎరుగము" అని అనకూడదని".** (ఖుర్ఆన్ 7:172)

మూలం: ఖససుల్ అంబియా - ఇబ్నె కసీర్ సమర్పణ:శాంతిబాట టీమ్

# ఇల్మ్ [జ్ఞానం] علم

ప్రత్యేక వ్యాసం

ఇలా ప్రార్థించు: **"ఓ నా ప్రభూ! నా జ్ఞానాన్ని వృద్ధిపరచు!"** (ఖుర్'ఆన్ 20:114)

"ఆయనే (అల్లాహ్‌యే) **ప్రతీ విషయానికి సంబంధించిన జ్ఞానం గలవాడు**" (ఖుర్'ఆన్ 2:29)

"మరియు వారు నిన్ను రూహ్(ఆత్మ)ను గురించి ప్రశ్నిస్తున్నారు. వారితో ఇలా అను : "ఆత్మ! నా ప్రభువు ఆజ్ఞతో వస్తుంది మరియు (దానిని గురించి) **మీకు ఇవ్వబడిన జ్ఞానం అతిస్వల్పమైనది**" (ఖుర్'ఆన్ 17:85)

కాబట్టి అన్ని విషయాలపై జ్ఞానం ఉన్నది కేవలం అల్లాహ్‌కు మాత్రమే. అంతేకాకుండా, భూమ్యాకాశాలనూ, వాటి మధ్యనున్న సమస్తాన్ని సృష్టించిన అల్లాహ్ - మానవులకు ఇచ్చిన జ్ఞానం అతి స్వల్పం. అంటే ఈ ప్రపంచంలోని అత్యంత జ్ఞానాన్ని కలిగి ఉన్న జ్ఞానికి ఉన్న జ్ఞానం కూడా స్వల్పమే! అంతటి స్వల్పమైన జ్ఞానంలో కొంత జ్ఞానాన్ని అయినా మనం పొందవలసి ఉంది.

మనం ఏ పని చేయాలన్నా, ఆ పని గురించి జ్ఞానాన్ని కలిగి ఉండాలి. వినడం ద్వారాగాని, చదవడం ద్వారాగాని ఓ విషయం మనకు చేరింది అంటే, ఆ విషయంపై మనకు జ్ఞానం లభించినట్లు కాదు. మనకు చేరిన విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడే అది జ్ఞానం అవుతుంది.

## జ్ఞానం వలన కలిగే మేలు ఏమిటి?

జ్ఞానం వలన సృష్టికర్త మన కొరకు చేసిన హితబోధ అర్థమవుతుంది. ఏ సందర్భంలోనైనా, ఏ సమయంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా ధర్మ సమ్మతంగా ఎలా జీవించాలో తెలుస్తుంది. సకల లోకాల ప్రభువైన 'అల్లాహ్'పై భయం పెరుగుతుంది. ఈ భయం (తఖ్వా) మనల్ని సన్మార్గంలో ఉంచుతుంది. సన్మార్గం పరలోక సాఫల్యానికి దారి తీస్తుంది. మనం ఈ భూమిపై బ్రతికేది కేవలం ఆ సాఫల్యం కొరకే కదా!

జ్ఞానం వలన అల్లాహ్ మనకు చేసే మేలు స్పష్టంగా అర్థమౌతుంది. అల్లాహ్‌పై వర్ణించనలవిగాని ప్రేమ కలుగుతుంది. దాని వలన సర్వప్రాణులపై మనకు ప్రేమ కలుగుతుంది.

"నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో **జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు. ...**" (ఖుర్'ఆన్ 35:28)

"మరియు ఈ ఉదాహరణలు మేము ప్రజలకు ఇస్తున్నాము. మరియు **జ్ఞానం గలవారు తప్ప ఇతరులు వీటిని అర్థం చేసుకోలేరు.**" (ఖుర్'ఆన్ 29:43) (జ్ఞానంగలవారు అంటే 'ఆలిమ్'కోర్సు చదివిన వారు మాత్రమే అని అనుకోకండి. ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకున్నవారు)

"ఏమీ **విజ్ఞానులు మరియు అజ్ఞానులు సరిసమానులు కాగలరా?** వాస్తవానికి బుద్ధిమంతులే హితబోధ స్వీకరిస్తారు" (39:9)

మనకు జ్ఞానం ఇచ్చిన సర్వజ్ఞాని అయిన అల్లాహ్‌యే మనకు క్రింది వేడుకోలును కూడా నేర్పారు.

...ఇలా ప్రార్థించు: **"ఓ నా ప్రభూ! నా జ్ఞానాన్ని వృద్ధిపరచు!"** (ఖుర్'ఆన్ 20:114)

జునుదుబ్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. మేము ప్రవక్త(స) వారితో ఉన్నాము మరియు మేము బలమైన యువకులం. మేము ఖుర్'ఆన్ నేర్చుకోవడానికి ముందే విశ్వాసాన్ని నేర్చుకున్నాము (తెలుసుకున్నాము?) తరువాత **ఖుర్'ఆన్ నేర్చుకున్నాము మరియు మా విశ్వాసం దాని వలన పెరిగింది. (ఇబ్నెమాజా, సహీహ్, 61, పు.1, అధ్యా.9)**

## జ్ఞానం కోసం అన్వేషణ

జిర్ర్ బిన్ హుబైష్ చెప్పారు. "నేను సఫ్వాన్ బిన్ అస్సాల్ అల్-మురాదీ దగ్గరకు వెళ్ళాను మరియు అతను అడిగాడు: "**ఏ విషయం నిన్ను ఇక్కడకు తీసుకు వచ్చింది?**" నేను అన్నాను : "**నేను జ్ఞానాన్ని అన్వేషిస్తున్నాను**". ఆయన చెప్పారు: "నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను. "జ్ఞానం కొరకు ఇల్లు వదిలి వెళ్ళేవారు ఎవరూ ఉండరు, అతను చేసినపనిని ఆమోదిస్తూ దైవదూతలు తమ రెక్కలను దించనంత వరకూ" **(ఇబ్నెమాజా, హసన్, 226)**

దైవ దూతలు తమ రెక్కలను దించడం ద్వారా అతని జ్ఞాన అన్వేషణను ఆమోదిస్తారు.

కసీర్ బిన్ ఖైస్ చెప్పారు : "డమాస్కస్ మస్జిద్‌లో అబూదర్దా(రజి) వారితో కూర్చుని ఉండగా ఓ వ్యక్తి అతని దగ్గరికి వచ్చి చెప్పాడు: "ఓ అబూదర్దా! నేను మీ దగ్గరకు రసూలుల్లాహ్(స)వారి నగరం మదీనా నుండి ఓ హదీస్ కొరకు వచ్చాను (ఆ హదీస్‌ను) మీరు ప్రవక్త(స)వారి నుండి ఉల్లేఖించినట్లు నేను విన్నాను. ఆయన (అబూ దర్దా) అడిగారు : నీవు వ్యాపారం కొరకు రాలేదా?
అతను చెప్పారు : 'లేదు'
ఆయన అడిగారు : 'నీవు మరిదేనికొరకూ రాలేదు'
అతను చెప్పారు : 'లేదు'
ఆయన (అబూదర్దా) అన్నారు : నేను రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను, "ఎవరైతే జ్ఞానం కొరకు ఓ మార్గాన్ని

అనుసరిస్తారో, అల్లాహ్ అతనికి స్వర్గానికి వెళ్ళేదారిని సులభతరం చేస్తారు. దేవదూతలు తమ రెక్కలను దించుతారు జ్ఞానాన్ని అన్వేషించేవానికి నమ్మతిని తెలియజేనృ్తా మరియు భూమ్యాకాశాల్లో నున్న ప్రతీదీ (అల్లాహ్‌ను) ప్రార్థిస్తుంది జ్ఞానాన్ని అన్వేషించేవానిని క్షమించమని, సముద్రంలోని చేప సైతం (అల్లాహ్‌ను ప్రార్థిస్తుంది).

జ్ఞాని యొక్క ఆధిక్యత (కేవలం) ఆరాధించేవానిపై ఎలా ఉంటుందంటే (పౌర్ణమి) చంద్రుని ఆధిక్యత ఇతర ఖగోళ పదార్థాల పై ఉండే విధంగా. జ్ఞానులు ప్రవక్తల యొక్క వారసులు. ప్రవక్తలు వారి వెనుక దీనార్లు గాని, దిర్హములుగాని వదిలి వెళ్ళరు ప్రధానంగా జ్ఞానాన్ని వదిలి వెళతారు, కాబట్టి ఎవరైతే జ్ఞానాన్ని తీసుకుంటారో, వారు గొప్ప వాటాను తీసుకున్నట్లే. **(ఇబ్నెమాజా, 223, అబూదావూద్ 3641)**

పౌర్ణమి రోజున చంద్రుని వెలుగుతో పోలిస్తే, నక్షత్రాలు మొ။న వాటి వెలుగు చాలా తక్కువ. జ్ఞానం గలవారి ఆధిక్యత ఇతరులపై ఆ విధంగా ఉంటుంది.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స) చెప్పారు: ఎవరైతే జ్ఞానం పొందడానికి ప్రయాణిస్తారో (మార్గంలో ఉంటారో) అల్లాహ్ స్వర్గ మార్గాన్ని అతనికి సులభం చేస్తాడు **(సహీహ్ 2646, అధ్యా.2, తిర్మిజీ)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. ఎవరైతే తనకు తెలిసిన జ్ఞానం గురించి అడగబడతారో, తరువాత అతడు దానిని దాస్తాడో, అతడు అగ్ని కళ్ళెంతో కళ్ళెం వేయబడతాడు. **(తిర్మిజీ, 2649, అధ్యా.3)**

**జ్ఞానాన్ని అన్వేషిస్తున్నందుకే ఇన్ని అనుగ్రహాలు కలిగితే, మరి జ్ఞానాన్ని పొందితే ఇంకెన్ని అనుగ్రహాలు కలుగుతాయో!**

## సకల ప్రాణులలో మానవునికే జ్ఞానం ఎక్కువా?

భూకంపాలు, సునామీలు రాకపూర్వమే, ముందస్తుగా వాటి గురించి తెలుసుకుని జాగ్రత్త పడాలని శతాబ్దాలుగా మనిషి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ప్రయత్నించే వానికే అల్లాహ్ జ్ఞానమిస్తాడు. ఈ విషయంలో అల్లాహ్ నుండి మనం పొందిన జ్ఞానం అతి స్వల్పమే! అందువల్లనే భూకంపం వచ్చిన తరువాత జరిగిన నష్టాన్ని తెలుసుకోవడమేగాని, ముందుగా దాని జాడ తెలుసుకోలేక పోతున్నాము.

శతాబ్దాల కాలం కూడా అవసరం లేదు - ఈ మధ్యనే పుట్టిన జంతువులు, పక్షులలో చాలావాటికి ప్రకృతి వైపరీత్యాల గురించి ముందుగానే తెలియడం వలన, అవి జాగ్రత్తలు తీసుకుంటాయి. ముందుగా తెలుసుకోవడం ఈ ప్రాణులకు ఎలా సాధ్యమైంది? అవి మనం నేర్చుకుంటున్న విధంగా స్కూళ్ళకు వెళ్లి పాఠాలు నేర్చుకోలేదే!

**ఈ విషయంలో మన జ్ఞానం ఆ అల్పజీవుల జ్ఞానం కంటే చాలా తక్కువ.**

జ్ఞానాన్ని ఇచ్చేది అల్లాహ్‌యే కాబట్టి ఎంత పెద్ద జ్ఞాని అయినాసరే ఈ భూమిపై అహంకారంతో విర్రవీగ నవసరం లేదు. మనిషిలో జ్ఞానం పెరిగే కొద్దీ, తఖ్వా పెరుగుతుంది. దానివలన అణుకువ పెరుగుతుంది. **దైవభీతి లేనివాడికి జ్ఞానం లేనట్లే!**

## అల్-హిక్మా (వివేకం)

హమ్జా యొక్క తండ్రిగారి ఉల్లేఖనం:
అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "నేను పడుకుని ఉండగా, నన్ను నేను (పానీయం) త్రాగుతున్నట్లుగా చూశాను మరియు నాకు ఎంత ఆశ్చర్యం కలిగిందంటే దాని యొక్క తడి నా గోళ్ళ నుండి బయటికి వస్తున్నట్లుగా గమనించాను. తరువాత నేను (పానీయాన్ని) ఉమర్‌కు ఇచ్చాను. వారు (ప్రవక్త(స)వారి అనుచరులు) అడిగారు, "(ఈ కల యొక్క) అర్థమేమిటి?" ఆయన చెప్పారు, "**అది జ్ఞానం**".**(సహీహ్ బుఖారీ, 3681, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

ఉమర్(రజి)వారు ప్రవక్త(స)వారి దగ్గర పొందిన జ్ఞానంతో ఖలీఫాగా సగభూభాగానికి ఇస్లామ్‌ను వ్యాపింపజేసి పరిపాలించారు. నది ఒడ్డున ఆకలితో ఓ చిన్న జంతువు మరణించినా సరే, దానికి తనే బాధ్యుడనని చెప్పుకుంటూ, తన పరిపాలనలో సర్వప్రాణులకు న్యాయం చేకూర్చారు. మహాత్మగాంధీ గారు కూడా ఉమర్ వంటి నాయకుడు మన దేశంలో ఒకరుంటే, మన భారత దేశానికి నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని అభిప్రాయపడ్డారు.

జ్ఞానం వలన వివేకం కలుగుతుంది. అంటే వివేకం గలవాడు తాను నేర్చుకున్న జ్ఞానాన్ని ఉపయోగిస్తాడు. ధర్మాన్ని వివేకంతో బోధించ మన్నారు. అయితే ఈ **'వివేకం'** అనే పదాన్ని **అపార్థం** చేసుకున్నవారు మరెవరో కాదు - 'దాయీలు'గా పిలవబడే, కష్టపడి సంపాదించుకోలేని కొందరు నిర్భాగ్యులు.

కేవలం అనువాదాలపై ఆధారపడో, భాషాపరమైన అర్థాన్ని మాత్రమే తీసుకునే వారికి 'వివేకం' అంటే అర్థం కాదు. **అల్-హిక్మా(వివేకం) అంటే ఖుర్'ఆన్ మరియు సున్నత్‌పై జ్ఞానం.**

అలిఫ్-లామ్-ర. **ఇవి వివేకంతో నిండి ఉన్న దివ్యగ్రంథం యొక్క ఆయత్‌లు** (తిల్‌క 'ఆయాతుల్ కితాబిల్ హకీమ్) (ఖుర్'ఆన్ 10:1)

అలిఫ్-లామ్-ర. (ఇది) ఒక దివ్య గ్రంథం, దీని ఆయత్‌లు నిర్దుష్టమైనవి మరియు మహావివేచనాపరుడు, సర్వం తెలిసినవాడు అయిన (అల్లాహ్) తరపునుండి వివరించబడ్డాయి (ఖుర్'ఆన్ 11:1)

అలిఫ్-లామ్-మీమ్. ఇవి **వివేకంతో** నిండి ఉన్న గ్రంథ ఆయత్‌లు. (ఖుర్'ఆన్ 31:1)

యా-సీన్. **వివేకంతో** నిండి ఉన్న ఖుర్'ఆన్ సాక్షిగా (36:1-2)

హా-మీమ్. ఈ గ్రంథ అవతరణ సర్వశక్తిమంతుడు, **మహా వివేకవంతుడైన** అల్లాహ్ తరపునుండి జరిగింది. (45:1-2)

హా-మీమ్. ఈ గ్రంథ అవతరణ సర్వశక్తిమంతుడు, **మహా వివేకవంతుడైన** అల్లాహ్ తరపునుండి జరిగింది. (46:1-2)

ఆకాశంలో ఉన్న సమస్తమూ మరియు భూమిలో ఉన్న సమస్తమూ, అల్లాహ్ పవిత్రతను కొనియాడుతుంటాయి. మరియు ఆయనే సర్వ శక్తిమంతుడు, **మహావివేకవంతుడు.** (ఖుర్'ఆన్ 59:1)

ఆకాశంలో ఉన్న సమస్తమూ మరియు భూమిలో ఉన్న సమస్తమూ, అల్లాహ్ పవిత్రతను కొనియాడుతుంటాయి. మరియు ఆయనే సర్వ శక్తిమంతుడు, **మహావివేకవంతుడు.** (ఖుర్'ఆన్ 61:1)

"ఆకాశాలలోనున్నవి మరియు భూమిలో నున్నవి, సమస్తమూ విశ్వ సార్వభౌముడు, పరమ పవిత్రుడు, సర్వశక్తిమంతుడు, **మహా వివేకవంతుడు** అయిన అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి. (ఖుర్'ఆన్ 62:1)

పై ఆయత్‌లను గమనించారు కదా!

10వ సూరహ్‌లో ఆయత్‌లు **'వివేకం'**తో నిండి ఉన్నాయి అని చెప్పడం జరిగింది. 31వ సూరహ్‌లో కూడా ఇదే విషయం చెప్పడం జరిగింది. 36వ సూరహ్ మొదటి వాక్యం ప్రకారం ఖుర్'ఆన్ వివేకంతో నిండి ఉంది. 45వ సూరహ్ మరియు 46వ సూరహ్ మొదటి ఆయత్‌లు ఒక్కటే. అల్లాహ్ మహావివేకవంతుడని అవి తెలియ జేస్తున్నాయి.

పై ఆయత్‌ల ద్వారా అల్లాహ్ మహా వివేకవంతుడని, ఖుర్'ఆన్ ఆయత్‌లు వివేకంతో నిండి ఉన్నాయని స్పష్టంగా తెలుస్తుంది. మానవ మాత్రుడెవరూ ఖుర్'ఆన్‌లోని ఒక చిన్న సూరహ్ వంటి సూరహ్‌ను రచించలేడని పాఠకులకు బాగా తెలిసిన విషయమే!

కాబట్టి ఖుర్'ఆన్‌లోని వివేకాన్ని మించి మరొకటి ఉండదని తెలిశాక, ఖుర్'ఆన్ గ్రంథాన్ని వదిలి ఇతరత్రా వాటితో ఇస్లామ్ వైపునకు పిలుస్తామని చెప్పేవారి గురించి ఏమనాలో పాఠకుల విజ్ఞతకే వదిలేశాం.

పదవ తరగతి పల్లెటూర్లో చదువుకున్నారా? లేక నగరంలోని పెద్ద కార్పోరేట్ స్కూలులో చదువుకున్నారా? అనేది ముఖ్యం కాదు. చదువు కున్నది ఎంత బాగా అర్థం చేసుకున్నారో, ఆ అర్థంచేసుకున్న దానిని ఎంత బాగా పరీక్షల్లో వ్రాయగలిగారనే దానిపైనే వారి ఫలితం ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఇండియాలోని మదరసాలో చదివిన ఆలిమ్‌కి తక్కువ జ్ఞానముంటుందని, మదీనా లేక మక్కా యూనివర్శిటీలో చదివిన ఆలిమ్‌లకి జ్ఞానం ఎక్కువ ఉంటుందని అనుకోవడం భ్రమ మాత్రమే. **'అల్-హిక్మా' అంటే అర్థం కానివారు ఎక్కడ చదివితే మాత్రం ఏం ప్రయోజనం?**

మానవ జీవితంలోని అన్నిరంగాలకు సంబంధించి సంపూర్ణ జ్ఞానం ఖుర్'ఆన్ మరియు హదీస్‌లలో ఉంది. వీటినుండి పొందిన జ్ఞానంతో చెప్పమన్నారుగాని, స్వంత తెలివితేటలు ఉపయోగించమని కాదు.

## జ్ఞానం గలవారు చేతి సంపాదనతోనే తింటారు

ఈ పత్రికలో 'తిరిగి గూటికి' శీర్షికలో సల్మాన్ ఫార్సీ(రజి)వారి వృత్తాంతాన్ని పాఠకులు చదివే ఉంటారు. ఆయనకు గవర్నర్ హోదానిచ్చి, నెలకు 5వేల దిర్హముల జీతాన్ని ఏర్పాటు చేసినా సరే, ఆ డబ్బును ఉపయోగించుకోకుండా, దానిని పేదవారికి పంచివేసి బుట్టలు, చాపలు అల్లి, బజారులో వాటిని అమ్మడం ద్వారా వచ్చిన సంపాదనతోనే తినేవారు. ప్రవక్త(స)వారు ఆయనని లుఖ్మాన్ హకీమ్ (Luqman, the wise)గారితో పోల్చారు. అంత జ్ఞానం ఉంది కనుకనే ఆయన చాలా నిరాడంబరంగా బ్రతుకుతూ తన చేతులతో సంపాదించుకుని తినేవారు.

అల్లాహ్ యొక్క ప్రవక్త - దావూద్(అ) కష్టపడి పనిచేసేవారు.

"..... **ఆయన ఎన్నడూ తినలేదు తన స్వహస్తాలతో పనిచేసి సంపాదించిన దాని నుండి తప్ప.**" (సహీహ్ బుఖారీ, 3417, అధ్యా.37, పుస్తకం.60, సంపుటి 4)

హమ్‌జహ్ బిన్ అబ్దుల్లాహ్(రజి), తన తండ్రి నుండి ఉల్లేఖించారు: ప్రవక్త(స) చెప్పారు, "**మీలో ఒకరు అడుక్కుంటూనే ఉంటారు అతడు తన ముఖంపై కొంచెం కూడా మాంసం లేకుండా అల్లాహ్‌ను కలిసే వరకూ**". **(సహీహ్ ముస్లిమ్, 2396, పుస్తకం 12 అధ్యా. 35, సంపుటి 3)**

పై హదీస్‌ల ద్వారా కష్టపడి పనిచేసి సంపాదించుకుని, ఆ సంపాదన నుండే తినాలని, వేరెవరి పైనో ఆధారపడి బ్రతుకుతూ అడుక్కుని తినడం వలన ఏ విధంగా అల్లాహ్‌ను కలవడం జరుగుతుందో స్పష్టంగా తెలుస్తుంది.

దావూద్(అ)వారు ప్రవక్త మరియు ప్రజాపాలనా వ్యవహారాలు కూడా చూసుకునేవారు. ప్రవక్త కాబట్టి ప్రజలకు ధర్మ బోధన చేయాలి. అటువంటి ప్రవక్త గారే కష్టపడి సంపాదించుకుని తినేవారు. ఇటువంటి విషయాలను ఎన్నింటినో ప్రవక్త(స)వారి ద్వారా తెలుసుకుని జ్ఞానాన్ని సంపాదించుకున్న సల్మాన్ ఫార్సీ (రజి)వారు కూడా తన చేతి సంపాదన పైనే ఆధారపడ్డారు. ఇది జ్ఞానం కలవారు చేసేపని.

మరి ఈనాడు కష్టపడి పనిచేసేవారు, చేయగలిగేవారు కూడా తమ పనులను వదిలేసి, 'దాయీలు'గా ఇతరులపై ఆధారపడి బతుకు తున్నారంటే, వారు తమకు ఉండే కనీస జ్ఞానాన్ని కూడా పోగొట్టుకున్నట్లే కదా! ఇక వీరు ఇస్లామ్‌ని ఎలా బోధించ గలరు?

యుక్త వయస్సు వచ్చిన వ్యక్తి మొట్టమొదట ఆలోచించేది జీవనోపాధి గురించి. అటువంటి అతి ముఖ్యమైన జీవనోపాధి ఇస్లామ్ ప్రకారంగా ఎలా ఉండాలనేది తెలుసుకోవడం కనీస జ్ఞానమున్నవారు చేసే పని. ఆ విషయాలు స్పష్టంగా హదీస్ గ్రంథాలలో ఉన్నాయి. కాని ఆ ఉపాధిని ఎలా పొందాలని ప్రవక్త(స)వారు బోధించారో కూడా తెలుసుకోకపోవడం.

## అబద్ధాలు మాట్లాడటం వివేకమా?

**ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల జ్ఞానం (అల్-హిక్మా)** లేకపోవడం వలన కొందరయితే అబద్ధాలు మాట్లాడటం కూడా వివేకంగా చెప్పు కుంటున్నారని తెలిసింది. ఎంతటి మూర్ఖులు! ఇది అజ్ఞానానికి పరాకాష్ట కాకపోతే మరేమిటి?

అబ్దుల్లా ఉల్లేఖనం : "అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: మిమ్మల్ని నిజాయితీగా ఉండాలని ఆదేశిస్తున్నాను, నిజాయితీ ధర్మపరాయణతకు దారి తీస్తుంది మరియు ధర్మ పరాయణత స్వర్గానికి దారి తీస్తుంది. ఒక మనిషి నిజాన్ని చెప్పడం కొనసాగించవచ్చు మరియు నిజం పలకాలనే కృషి చేస్తుండవచ్చు. అల్లాహ్ దగ్గర అతడు నిజాయితీపరుడని వ్రాయబడేవరకూ. మరియు **అబద్ధాల విషయంలో జాగ్రత్తపడండి, అబద్ధాలు పలకడం దుర్మార్గానికి దారితీస్తుంది మరియు దుర్మార్గం నరకానికి దారి తీస్తుంది.** ఒక మనిషి అబద్ధాలు చెప్పడం కొనసాగించవచ్చు మరియు అతని కృషి అబద్ధాలు చెప్పడానికే కావచ్చు అల్లాహ్ దగ్గర అతడు అబద్ధాలకోరు అని వ్రాయబడేవరకూ.

**(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 6639, పుస్తకం 45, అధ్యా. 29, సంపుటి 6)**

జ్ఞానం లేకపోతే ప్రజలను మార్గభ్రష్టత్వం వైపు ఏ విధంగా తీసుకెళతారో ప్రవక్త(స)వారు ముందుగానే చెప్పారు. నేడు జరుగుచున్నది అదే!

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ 'ఆస్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : "అల్లాహ్ ప్రజల నుండి జ్ఞానాన్ని లాక్కొని తీసేసుకోరు. ముఖ్యంగా, ఆయన విద్వాంసులను తీసుకుపోవడం ద్వారా జ్ఞానాన్ని తీసేసుకుంటారు, ఒక విద్వాంసుడు కూడా లేనంత వరకూ. **ప్రజలు అజ్ఞానులను నాయకులుగా ఎన్నుకుంటారు.** వారు (అజ్ఞానులు) ప్రశ్నించబడతారు మరియు వారు (అజ్ఞానులు) జ్ఞానం లేకుండానే ఫత్వాలు జారీచేస్తారు. వారు మార్గభ్రష్టులౌతారు మరియు ఇతరులను మార్గభ్రష్టత్వం వైపు తీసుకెళతారు. **(సహీహ్ ముస్లిమ్, 6796, 47వ పుస్తకం-కితాబుల్ ఇల్మ్, అధ్యా.5, సంపుటి 7)**

హదీస్ జ్ఞానం ద్వారా ఎటువంటి వారికైనా వడ్డీ తీసుకోవడం ఎటువంటి పాపకార్యమో, వారి గుండెల్లో నాటుకునే విధంగా చెప్పవచ్చు. ఈ కుహనా ధర్మ ప్రచారకులు హదీస్‌లను వదిలేసి తమ (అ)వివేకాన్ని ఉపయోగించి ఆ విధంగా చెప్పగలరా? 'జకాత్' ద్వారా పేదరిక నిర్మూలన గురించి హదీస్‌లద్వారా అందిన జ్ఞానం కంటే, ఏ ఇతర విషయాలతోనైనా ఎవరైనా చెప్పగలరా?

### జ్ఞాన విషయాలను ఉన్నవి ఉన్నట్టుగా చెప్పాలి

అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ తన తండ్రి నుండి ఉల్లేఖించారు. ప్రవక్త(స) చెప్పారు : "అల్లాహ్ అతని ముఖాన్ని ప్రకాశవంతం చేయుగాక, ఆ వ్యక్తి మన నుండి హదీస్ విని దానిని తెలియజేస్తే, బహుశా **ఎవరికైతే తెలియజేయబడిందో అతడు బాగా గుర్తు పెట్టుకోవచ్చు దానిని (మొదట) విన్న వ్యక్తి కంటే**" (ఇబ్నెమాజా, 232, సహీహ్)

కాబట్టి చెప్పేవానికంటే, వినేవానికి జ్ఞానం ఎక్కువ ఉన్నప్పుడు, అతనే బాగా అర్థం చేసుకుంటాడు. ఉన్నది ఉన్నట్టుగానే చెప్పాలి.

ఉదాహరణకు పై హదీస్‌లో **'అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్'** అనే అరబీ పేరు ఉంది. ఈ హదీస్‌ను ఏ భాషలోకి అనువదించినా సరే, ఆ భాషలో పై అరబీ పేరును మార్చరు, అంటే ఆ భాషలోకి పేరును అనువదించకుండా అలాగే ఉంచుతారు.

Common Nounకి మరియు Proper Nounకి తేడా తెలియని వారు కొందరు 'అల్లాహ్' పేరును కూడా అనువదించ వచ్చని నమ్మించడానికి 'వాటర్, పానీ, నీళ్ళు' అంటూ చెప్పుకుంటున్నారు. కాని ఇవి Common Nouns. అల్లాహ్ పేరు Proper Noun. అల్లాహ్ పేరుని తొలగించడం ఎవరికీ సాధ్యం కాదు. తొలగించు కోగలమని అనుకోవడం వారి అజ్ఞానాన్ని తెలియజేస్తుంది.

దారుస్సలామ్ పబ్లికేషన్స్ వారి హదీస్ గ్రంథాల యొక్క ఇంగ్లీష్ అనువాదాలను గమనించాము. ఒరిజినల్ అరబీలో 'రసూలుల్లాహ్' అని ఉంటే, 'Messenger of Allah'అని, 'నబీ' అని అరబీలో ఉంటే 'Prophet' అని అనువదించారు. కానీ తెలుగులో అటువంటి తేడా ఏదీ చూపకుండా 'దైవ ప్రవక్త' అని అనువదిస్తూ, "**అల్లాహ్ సాక్షి**" అని ఉండవలసిన చోట 'దైవ సాక్షి' అని వ్రాస్తారు. ఇది హదీస్‌ల వరకే పరిమితం కాలేదు, వారు చేసిన ఖుర్'ఆన్ అనువాదాలలో కూడా 'అల్లాహ్' పేరుకు బదులుగా 'దేవుడు' అనే పదం ఉపయోగించారు.

ఇటువంటి ఖుర్'ఆన్ అనువాదాలను చదివిన ముస్లిమేతరులలో కొందరు, **'ఖుర్'ఆన్‌లో ఎక్కడైనా అల్లాహ్ పేరు ఉందా?'** అని ఓ బహిరంగ సభలో ప్రశ్నించడం జరిగింది. ఖుర్'ఆన్‌పై కనీస అవగాహన కలిగినవారు ఆశ్చర్యపోయే ప్రశ్న ఇది. 'అల్లాహ్' అనేది పేరు అని, అది proper noun అని ఆయా అనువాదకుల జ్ఞానానికి అందలేదా?

కాని ప్రచురించబడిన వారి పుస్తకాల మొదటి పేజీలో వారి పేరును అరబీలో చెప్పుకుంటారు గాని, వారి పేరును మాత్రం తెలుగులోకి అనువదించు కోరు. ఉదాహరణకు అరబీలో ఉండే విషయాలను తెలుగులోకి అనువాదం చేసిన వ్యక్తి 'అబ్దుల్ కరీమ్' అనుకోండి. మొదటి పేజీలో 'తెలుగు అనువాదం : అబ్దుల్ కరీమ్' అని అచ్చు వేయడం జరుగుతుంది. అంతేగాని 'తెలుగు అనువాదం : ఆ కరుణామయుని దాసుడు' అని అచ్చు వేయరు. ఎవరైనా తమ పేరును ఏ భాషలోకైనా అనువదించుకోవడానికి ఇష్టపడరు. కాని అల్లాహ్ పేరును మాత్రం అనువదిస్తారు. ఎందుకని?

హదీస్‌ను ఉన్నది ఉన్నట్టుగా చెబితే, చెప్పినవాని కంటే విన్నవాడు జ్ఞాని అయితే, దానిని బాగా అర్థం చేసుకుంటాడు. ఒకరికి అర్థం కాకపోతే ఎవరికీ అర్థం కాదు అనుకోవడం మూర్ఖత్వం అవుతుంది.

అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి) తన తండ్రి నుండి ఉల్లేఖించారు. ప్రవక్త(స)వారు చెప్పారు : నా మాటలను విన్న వ్యక్తిని అల్లాహ్ ప్రకాశవంతం చేయుగాక! అతడు దానిని అర్థం చేసుకుంటాడు, దానిని జ్ఞాపకం ఉంచుకుంటాడు మరియు దానిని అందజేస్తాడు. బహుశా అతడు జ్ఞానాన్ని తనకంటే ఎక్కువగా అర్థం చేసుకునే వ్యక్తి దగ్గరికి తీసుకువెళతాడు. మూడు ఉన్నాయి వాటి వలన ఓ ముస్లిమ్ హృదయం మోసగింపబడదు. అల్లాహ్ కొరకు చేసే ఆచరణలలో నిజాయితీ, నసీహ, ముస్లిముల ఆఇమ్మాకు మరియు జమఅత్‌ని అంటిపెట్టుకుని ఉండటం. వాస్తవంగా పిలుపు వారి వెనుక నుండి రక్షింపబడుతుంది. **(తిర్మిజీ, సహీహ్, 2658, పుస్తకం 39, అధ్యా.7, సంపుటి 5)**

క్రింది హదీస్‌ను గమనించండి :

ఇబ్న్ అస్-సా'ఇదీ అల్-మాలికీ గారిని, అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు 'జకాత్' సేకరణ కొరకు నియమించారు. సేకరణ పూర్తయ్యాక, ఆ మొత్తాన్ని ఆయన అందజేశారు. అప్పుడు ఉమర్(రజి)వారు ఇబ్న్ అస్-సా'ఇదీ గారికి కూడా వేతనమివ్వమని చెప్పారు. కాని ఆయన **'ఇది నేను అల్లాహ్ కొరకు చేశాను మరియు నా ప్రతిఫలం అల్లాహ్ దగ్గర ఉంటుంది'** అని సమాధానమిచ్చారు. అప్పుడు ఉమర్(రజి)వారు "నీకేది ఇవ్వబడిందో అది తీసుకో. ప్రవక్త(స)వారి కాలంలో కొంత పని చేయడం కొరకు నియమించి, నాకు కొంత వేతనమిచ్చేవారు. నీవు చెప్పినట్లే నేను (కూడా) చెప్పాను, కాని రసూలుల్లాహ్(స)వారు నాకు చెప్పారు, "దేని గురించి అయితే నీవు అడగలేదో, అది నీకిచ్చినప్పుడు, అది తీసుకుని తిను మరియు దానంగా ఇచ్చివెయ్యి' " **(సహీహ్ ముస్లిమ్ 2408, పుస్తకం 12, అధ్యాయం 37, సంపుటి 3)**. సహీహ్ ముస్లిమ్‌లోనే మరో ఉల్లేఖనం (నెం. 2405)లో ప్రవక్త(స)వారు ఉమర్(రజి)వారితో ఇలా చెప్పారు: **"తీసుకో, ఏ ఐశ్వర్యమైతే నీ దగ్గరికి వచ్చిందో దాని గురించి నీవు ఆశించనప్పుడు లేక దాని గురించి అడగనప్పుడు, దానిని తీసుకో. అలా కాకుండా దాని వెనుక పడకు"**.

పై హదీస్‌ను ఉదహరిస్తూ ఎంతోమంది మాకు చెప్పారు, "ఎవరైనా ఇస్తే తప్పనిసరిగా తీసుకోవాలని'. దాయీలు ఈ హదీస్‌నే చూపించి తమను తాము సమర్థించుకుంటున్నారు. వినేవారిలో ఎక్కువమంది ఇది సహీహ్ ముస్లిమ్ హదీస్ కాబట్టి, వారు చెప్పింది నిజమని అనుకుంటున్నారు.

క్రిందటి సంచికలో అబూజర్(రజి)వారి గురించి కొన్ని విషయాలను మీకు తెలియజేశాము. ఆయన కానుకలను, డబ్బును తీసుకోకుండా తిరస్కరించారు. అటువంటి ధర్మపరాయణుడైన సహాబీ, ఇచ్చే వాటిని తిరస్కరించి ప్రవక్త(స)వారి బోధనకు విరుద్ధంగా నడుచుకోరు కదా!

ఇప్పుడు మరోసారి పై హదీస్‌ను చదవండి. ఉమర్(రజి)వారికి ప్రవక్త(స)వారు కొంత పైకాన్ని ఇవ్వడానికి కారణం - ఆయన(రజి) జకాత్ సొమ్మును సేకరించి తీసుకువచ్చారు. ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం, సేకరించిన వారికి దానిలో నుండి కొంత సొమ్ము ఇవ్వాలి. అందుకని ప్రవక్త(స)వారు ఇచ్చారు. జకాత్‌ను సేకరించమని నాయకుడు ఆదేశించాలి. కాబట్టి పై హదీస్‌లో '**తీసుకో, ఏ ఐశ్వర్యమైతే నీ దగ్గరికి వచ్చిందో దాని గురించి నీవు ఆశించనప్పుడు**' అనే మాటలు జకాత్ సేకరణకు సంబంధించినవి.

**అబీ ఘరాజహ్ ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారి కాలంలో మేము బ్రోకర్లుగా పిలువబడేవాళ్ళము. అల్లాహ్ యొక్క సందేశహరులు మావైపు నుండి వెళ్ళారు మరియు మమ్మల్ని ఓ పేరుతో పిలిచారు, అది దాని కంటే ఉత్తమంగా ఉంది. ఆయన(స) చెప్పారు : 'ఓ వ్యాపారస్థులారా! అమ్మకంలో వ్యర్థపు మాటలు మరియు ఒట్లు కలిసి ఉంటాయి, కాబట్టి దానిని సదఖా(దానంతో) కలపండి." (అబూదావూద్, సహీహ్,3326, పుస్త.22, అధ్యా.1, సంపుటి 4)**

వ్యాపార లావాదేవీలలో తెలిసో, తెలియకో పలికిన వ్యర్థపు మాటల నుండి రక్షించుకోవడానికై సదఖా ఇవ్వమని బోధించారు ప్రవక్త(స)వారు. కాని ఆ విధంగా 'సదఖా' ఇవ్వడం వలన 'హరామ్'వ్యాపారం 'హలాల్' వ్యాపారం అయిపోదు. మాకు కొంతమంది తెలిపారు : 'వారు మాట్లాడేవి కూడా సహీహ్ హదీస్‌లే కదా! మీరెందుకు వారితో విభేదిస్తున్నారని'.

**వారు చెప్పారని వీరు చెప్పారని చెప్పి అల్లాహ్ దగ్గర తప్పించుకునే అవకాశం ఎవరికీ ఉండదు.**

మీరు స్వయంగా ఆ హదీస్‌లను చదివి, అసలు విషయమేమిటో ధృవపరచుకోండి. 'శాంతిబాట'లో ఇచ్చే హదీస్‌లకు రిఫరెన్స్ నంబర్లు ఉంటాయి. మీరు సులభంగా వెరిఫై చేసుకోవచ్చు.

అబ్దుల్లాహ్ (బిన్ మస్'ఊద్) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: "**ఎవరైతే తెలిసికూడా నాపై అబద్ధం చెబుతారో అతని స్థానం నరకాగ్నిలో ఉంటుంది**" (తిర్మిజీ, 2659, అధ్యా.8)

కాబట్టి ప్రవక్త(స)వారు చెప్పని వాటిని చెప్పినట్లుగా మాట్లాడటం నరకానికి దారితీస్తుంది. ప్రవక్త(స)వారి ఆదేశం మేరకు హదీస్‌లను ఉన్నవి ఉన్నట్లుగా గ్రంథస్థం చేశారు. హదీస్‌లను అధ్యయనం చేసేవారికి ఈ విషయం స్పష్టంగా అర్థమౌతుంది.

### ఖుర్'ఆన్ మాత్రమే సరిపోతుందా?

అల్-మిఖ్దామ్ బిన్ మ'దీకరిబ్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "జాగ్రత్త! (ఓ కాలం) రాబోతుంది. నా నుండి ఓ హదీస్ ఓ వ్యక్తికి అందజేయబడుతుంది అతడు తన దిండుకు ఆనుకుని ఉండగా. మరియు అతను చెబుతాడు, "మీకూ మరియు నాకు మధ్య అల్లాహ్ పుస్తకం (ఖుర్'ఆన్) ఉంది. కాబట్టి దానిలో మేము ఏదైతే ధర్మసమ్మతమని తెలుసుకున్నామో దానిని ధర్మ సమ్మతంగా పరిగణిస్తాము మరియు ఏదైతే దానిలో నిషేధం కావించబడిందో, మేము దానిని నిషేధించబడిందిగా పరిగణిస్తాము!" **వాస్తవానికి ఏదైతే రసూలుల్లాహ్(స) వారిచే నిషేధించబడిందో, అది అల్లాహ్‌చే నిషేధించబడినటువంటిదే** (హసన్ 2664, అధ్యా.10, తిర్మిజీ)

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స) చెప్పారు. నేను మీకు ఏదైతే వదిలానో దానితో నన్ను వదలండి. నేను మీకు ఓ హదీస్ ఉల్లేఖించినప్పుడు, దానిని నా నుండి తీసుకోండి. మీకు పూర్వపు ప్రజలు అతిగా ప్రశ్నించడం వలన మరియు ప్రవక్తలతో అంగీకరించక పోవడం వలన మాత్రమే నాశనమయ్యారు" **(సహీహ్, 2679, అధ్యా.17, తిర్మిజీ)**

కాబట్టి ఓ హదీస్ మీకు అర్థం కాకపోతే వదిలేయండి. తెలిసిన వారిని అడగండి. అప్పటికీ అర్థం కాకపోతే, దానిని అర్థం చేసుకునే జ్ఞానాన్ని అల్లాహ్ మీకు ఇచ్చే వరకూ వేచి ఉండండి.

నమాజ్, జకాత్, హజ్జ్, ప్రవక్తల జీవితచరిత్ర మొ॥న ఎన్నో విషయాలు హదీస్‌లనుండే తెలుస్తాయి. హదీస్ అంటే ఖుర్'ఆన్‌కు వివరణ మరియు ఖుర్'ఆన్ ఆదేశాలనకు అనుగుణంగా ముహమ్మద్(స)వారు చేసి చూపిన ఆచరణ.

## జ్ఞానం నేర్చుకోవడానికి సిగ్గుపడనవసరం లేదు

ముజాహిద్ చెప్పారు, "**సిగ్గుపడే వ్యక్తిగాని లేక అహంకారం గల వ్యక్తిగాని ధార్మిక జ్ఞానాన్ని నేర్చుకోలేడు.** మరియు ఆయిషా(రజి) చెప్పారు, "అన్సార్ మహిళలు ఎంత ఉత్తములు! సరియైన ధార్మిక జ్ఞానాన్ని నేర్చుకోవడంలో వారు సిగ్గు పడరు. **(సహీహ్ బుఖారీ, కితాబుల్ ఇల్మ్, అధ్యా. 50)**

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మె సలమహ్(రజి) ఉల్లేఖనం: ఉమ్మె సులైమ్(రజి) అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వద్దకు వచ్చి చెప్పారు : "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా(స)! సత్యాన్ని తెలుపడంలో అల్లాహ్ సిగ్గుపడడు. స్త్రీకి స్వప్న స్కలనం అయితే ఆమె గుసుల్ చేయాలా?" అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఔను, ఆమె నీటిని (ద్రవాన్ని స్రవిస్తే) చూస్తే" ఉమ్మె సలమహ్(రజి) అన్నారు : 'ఓ రసూలుల్లాహ్(స), స్త్రీకి కూడా స్వప్న స్కలనం అవుతుందా?" ఆయన అన్నారు: "నీ చేతికి మన్ను తగల, ఆమె బిడ్డకు ఆమె పోలికలు ఎలా వస్తాయి?" **(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 712, సంపుటి 1, పుస్తకం 3, అధ్యాయం 7)** మరో ఉల్లేఖనంలో **(సహీహ్ ముస్లిమ్ హదీస్ నెం. 710)**లో ఉమ్మె సలమహ్(రజి) చెప్పారు : "నేను అందుగురించి సిగ్గుపడి చెప్పాను: 'అది నిజంగా జరుగుతుందా?'. రసూలుల్లాహ్(స) అన్నారు : "పోలిక ఎలా జరుగు తుందనుకున్నావు?". పురుషుని (నుండి స్రవించే ద్రవం) నీరు చిక్కగా మరియు తెల్లగా, మరియు స్త్రీ నీరు పలుచగా మరియు పసుపురంగులో ఉంటుంది. వాటిలో ఏదైతే ప్రాబల్యం వహిస్తుందో లేదా ముందుగా వస్తుందో, పోలిక (దాని ప్రకారం) ఉంటుంది". (అంటే స్త్రీ నీరు ముందుగా స్రవించబడితే, బిడ్డకు తల్లి పోలిక వస్తుంది, లేదంటే తండ్రి పోలిక వస్తుంది)

(పైన తెలిపిన 'ఉమ్మె సులైమ్' మరియు 'ఉమ్మె సల్మా' పేర్లు వేరు వేరు. గమనించగలరు.)

ప్రవక్త(స)వారు చిన్న చిన్న విషయాలను కూడా నేర్పారు. మూత్ర విసర్జన చేసిన తరువాత ఏవిధంగా శుభ్రంగావించుకోవాలో వంటి అతి చిన్న విషయాలను కూడా నేర్పారు.

### ఖుర్'ఆన్ పఠనం మరియు అధ్యయనం

అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, "ఇద్దరి వ్యక్తులను తప్ప మరెవ్వరిలాగ ఉండాలని కోరుకోకండి. ఒక వ్యక్తికి అల్లాహ్ ఐశ్వర్యమిచ్చాడు మరియు అతడు దానిని సత్యమార్గంలో ఖర్చుపెడతాడు. ఒకరికి అల్లాహ్ అల్-హిక్మా (వివేకం - ఖుర్'ఆన్ మరియు సున్నత్ జ్ఞానం) ఇచ్చారు మరియు అతడు **దాని ప్రకారమే నిర్ణయించి (ఆచరించి) దానిని ఇతరులకు బోధిస్తాడు**" **(సహీహ్ బుఖారీ, 73, అధ్యా. 15)**

అబూహుర్రైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: 'ఎవరైతే ప్రాపంచిక కష్టం నుండి విశ్వాసిని కాపాడతారో, పునరుత్థాన దినమున అల్లాహ్ వారి కష్టాల నుండి ఒకదానిని తొలగిస్తాడు. ఎవరైతే (అప్పుల్లో ఉన్న వ్యక్తి) కష్టంలో ఉపశమనం కలిగిస్తారో అల్లాహ్ అతనికి ఈ లోకంలోనూ, పరలోకంలోనూ ఉపశమనాన్ని అనుగ్రహిస్తాడు. ఎవరైతే ఈ ప్రపంచంలోని ఓ ముస్లిమ్ (దోషాన్ని) బహిరంగపరచడో, అల్లాహ్ అతని (దోషాలను) ఈ లోకంలో మరియు పరలోకంలో బహిరంగ పరచరు. అల్లాహ్ ఓ వ్యక్తికి సహాయం చేస్తూ ఉంటాడు అతడు తన (తోటి) సోదరునికి సహాయాన్ని చేస్తున్నంతవరకూ. ఎవరైతే జ్ఞానాన్ని అన్వేషిస్తూ ఓ మార్గాన్ని అనుసరిస్తారో, అల్లాహ్ అతనికి స్వర్గానికి వెళ్ళేదారిని సులభం చేస్తాడు. అల్లాహ్ యొక్క గృహాలలో (మస్జిదలలో) ఒకదానిలో ప్రజలు చేరి అల్లాహ్ గ్రంథం (ఖుర్'ఆన్ని) పఠిస్తూ మరియు (అందరూ) కలిసి దానిని అధ్యయనం చేస్తూ ఉండరు - ప్రశాంతత వారిపై దిగేవరకూ, కరుణ వారికి నీడనిచ్చేవరకూ, దైవదూతలు వారి చుట్టూ చేరేవరకూ. మరియు అల్లాహ్ తనతో ఉన్నవారితో వారి గురించి (మస్జిద్‌లో ఖుర్'ఆన్ అధ్యయనం చేస్తున్నవారి గురించి) ప్రస్తావిస్తారు. **(సహీహ్ ముస్లిమ్, 6853, పుస్తకం 47, సంపుటి 7)**

**అంటే ప్రజలు అల్లాహ్ గ్రంథం పఠిస్తూ మరియు వారంతా కలిసి దానిని అధ్యయనం చేస్తూ ఉంటే వారిపై ప్రశాంతత దిగుతుంది, కరుణ వారిని నీడలా కప్పుతుంది. దైవదూతలు వారు చుట్టూ చేరతారు. అల్లాహ్ తనతో ఉన్నవారితో అటువంటి వారి గురించి ప్రస్తావిస్తారు.**

నాఫి' బిన్ అబ్దుల్ హారిస్, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారిని 'ఉస్ఫాన్‌లో కలిశారు. ఉమర్ ఆయనను మక్కాలో తన గవర్నర్‌గా నియమించి నప్పుడు ఎవరిని నీవు లోయ ప్రజలపై నీ ప్రతినిధిగా నియమించావు?" ఆయన చెప్పారు : "నేను వారిపై ఇబ్నె అబ్జాను నియమించాను. ఉమర్(రజి) అడిగారు : "ఎవరు ఇబ్నె అబ్జా?" నాఫి' చెప్పారు: స్వేచ్ఛ పొందిన మన బానిసలలో ఒకరు". ఉమర్(రజి) అడిగారు : "ఒక స్వేచ్ఛ పొందిన బానిసను వారిపై మీరు నియమించారా?" నాఫి' చెప్పారు: "అతనికి అల్లాహ్ పుస్తకపు గొప్ప జ్ఞానం ఉంది, వారసత్వ నియమాలు (ఫరా'యిజ్)లో జ్ఞానం గలవాడు మరియు తీర్పు ఇచ్చేవాడు". ఉమర్(రజి) అన్నారు : "మీ ప్రవక్త(స) చెప్పలేదా?" (స్థాయిలో) **కొంతమందిని ఈ పుస్తకం (ఖుర్'ఆన్)ద్వారా అల్లాహ్ పైకి లేపుతాడు మరియు దీని వలన క్రిందికి తీసుకువెళతాడు**" (ఇబ్నెమాజా; సహీహ్, 218)

## జ్ఞాని ఆధిక్యత

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు: ఎవరికైతే అల్లాహ్ మేలు చేయాలనుకుంటారో, అతనికి ధర్మాన్ని అర్థం చేసుకునే శక్తినిస్తాడు **(తిర్మిజీ - సహీహ్, 2645, పుస్తకం 39, అధ్యా.1, సంపుటి5)**

అబూ ఉమామా అల్-బాహిలీ (రజి) ఉల్లేఖనం. "రసూలుల్లాహ్(స)వారి దగ్గర ఇద్దరు మనుష్యులు ప్రస్తావించ బడ్డారు. వారిలో ఒకరు ఆరాధించేవాడు మరియు మరొకరు జ్ఞాని. కాబట్టి రసూలుల్లాహ్(స) చెప్పారు : ఆరాధించే వానిపై జ్ఞాని

కుండే ఆధిక్యత మీలోని అందరికంటే తక్కువ వారిపై నా ఆధిక్యత ఎలా ఉంటుందో అలా ఉంటుంది. తరువాత రసూలుల్లాహ్(స) వారు చెప్పారు, వాస్తవానికి అల్లాహ్, ఆయన దూతలు, భూమ్యాకాశాలలో ఉండేవారు, రంధ్రంలో ఉండే ఓ చీమ సైతం, చేప సైతం - ప్రజలకు మంచి చేయమని బోధించేవారిపై అల్లాహ్ అనుగ్రహాన్ని కోరుకుంటారు. **(తిర్మిజీ - హసన్, 2685, పుస్తకం 39, అధ్యా. 19, సంపుటి 5)**

ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు. మీలో ఉత్తమమైనవాడు అతనే ఎవరైతే ఖుర్ఆన్ నేర్చుకుని మరియు దానిని బోధిస్తాడో'' **(ఇబ్నెమాజా - సహీహ్, 212, పుస్తకం 1, అధ్యా.16, సంపుటి1)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు. ఎవరైతే జ్ఞానాన్ని పొందుతారో వారు దానితో అల్లాహ్ సంతోషాన్ని కోరతారు. కాని ప్రాపంచిక ప్రయోజనం కోసమే దానిని పొందితే, అతడు స్వర్గ సువాసనను పునరుత్థాన దినమున ఆఘ్రానించ లేడు'' (ఇబ్నెమాజా, హసన్, 252)

### నాయకునికి తప్పనిసరిగా జ్ఞానం కావాలి

ఉమర్(రజి) చెప్పారు, ''ప్రతి ఒక్కరూ లోతైన ధార్మిక జ్ఞానాన్ని సంపాదించు కోవాలి అతడు నాయకుడు కావడానికి ముందే. (అబూ అబ్దుల్లాహ్ చెప్పారు:) ప్రవక్త(స)వారి సహచరులు వయస్సులో పెద్దవారైనప్పటికీ అధ్యయనం చేశారు. (సహీహ్ బుఖారీ, అధ్యా 15 పరిచయం)

### జ్ఞానాన్ని ఏ విధంగా బోధించాలి?

**ఇబ్నె మస్ఊద్(రజి) ఉల్లేఖనం. ఒక అనువైన సమయాన్ని ఎన్నుకుని మాకు బోధించడంలో ప్రవక్త(స)వారు శ్రద్ధ తీసుకునేవారు. ఆ విధంగా మేము విసుగుచెందక పోవచ్చుని. (సహీహ్ బుఖారీ, 68, 3. కితాబుల్ ఇల్మ్, అధ్యా. 11, సంపుటి 1)**

ఎప్పుడుబడితే అప్పుడు ప్రజలకు జ్ఞానాన్ని బోధించడానికి ప్రయత్నిస్తే, వారికి విసుగు కలగవచ్చు. పరోక్షంగా వారిని ధర్మానికి దూరం చేసినట్లు అవుతుంది. అందరికీ అనువైన సమయం ఎన్నుకోవాలి. ఈ రోజున మనం చూస్తున్నాం - ఉదయం నుండి రాత్రి వరకూ పోగ్రామ్‌లు పెడుతున్నారు. రెండు, మూడు రోజులపాటు ఈ పోగ్రామ్‌లు జరుగుతాయి.

ప్రసంగాలే ప్రసంగాలు. కాబట్టి అవి సున్నత్‌కి వ్యతిరేకంగా జరిగే పోగ్రామ్‌లు. వీటివలన ప్రజలకు జరిగే మేలు ఏమీలేదు. దీనివలన అదనంగా జ్ఞానం లభించడానికి బదులు సమయం వృథా. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది.

అలీ(రజి) చెప్పారు, ''మీరు ప్రజల యొక్క మానసిక సామర్థ్యాన్ని బట్టి బోధించాలి. మీరు ఇష్టపడతారా వారు అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడిని తిరస్కరించడానికి? (సహీహ్ బుఖారీ, కితాబుల్ ఇల్మ్, అధ్యా. 49) అబూ అత్-తుఫైల్ (రజి) అలీ(రజి) చెప్పినదానినే ఉల్లేఖించారు **(సహీహ్ బుఖారీ, 127,సంపుటి 1)**

ప్రసంగించడాన్ని వృత్తిగా చేసుకున్నవారికి సున్నత్ జ్ఞానం లేకపోవడం వలన , వినేవారిని పట్టించుకోకుండా వారు కంఠస్థం చేసిన దానిని వదిలేస్తారు. అది వినేవారికి అర్థమౌతుందా? లేదా? అనే విషయం పట్టించుకోరు. కొందరి ప్రసంగాలు వింటూ ఉంటే, అసలు ప్రసంగించే వానికి చెప్పే విషయం అర్థమైందా? అని సందేహమొస్తుంది.

నోరు ఉంది కదాయని ప్రసంగించేస్తున్నారు. కనీసం పదవతరగతి కూడా ఉత్తీర్ణులు కానివారు బిగ్‌బేంగ్ థీరీ వంటి సైన్స్ విషయాలు మాట్లాడుతున్నారు. ఏమీ లేని శూన్యం నుండే విశ్వాన్ని సృష్టించానని అల్లాహ్ ఖుర్ఆన్‌లో చెప్పారు. బిగ్ బేంగ్ థీరీ కూడా ఆ వాక్యాన్ని సమర్థిస్తుంది.

కాని ఓ ప్రసంగీకుడు అయితే ఓ పదార్థం పేలి విశ్వం సృష్టించబడింది అని ఓ జుమ్మా ప్రసంగంలో చెప్పాడు. ఆ విధంగా చెప్పడం ఖుర్ఆన్‌కి వ్యతిరేకం. మరియు బిగ్ బేంగ్ థీరీకి వ్యతిరేకం. అతనికి సైన్స్‌పై జ్ఞానం లేదు. అతని ఎదురుగా స్పేస్ సైన్స్ ప్రొఫెసర్ కూర్చుని ఉన్నారు.

ఆయన ఏమనుకుంటారు? ఖుర్ఆన్‌లో తప్పుగా చెప్పబడిందా అని అనుమానపడతారు. అతను గనుక ఖుర్ఆన్ రిఫర్ చేయకపోతే, ఆ అనుమానం అతనిలో అలాగే ఉండిపోతుంది. ప్రసంగించే వానికి జ్ఞానం లేదు. వినేవారి మానసిక సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకోకుండా చెబితే, అవి అర్థం కాక వారు ఖుర్ఆన్ మరియు సున్నత్‌ను ద్వేషించే అవకాశం ఉంది.

అందుకనే కొద్ది మందిని ఓ ఇంట్లోగాని, ఓ మస్జిద్‌లోగాని సమావేశపరచి, వారి జ్ఞానపరిధి తెలుసుకుని తదనుగుణంగా చెబితే బావుంటుంది. చెప్పే సమయం కూడా ఓ గంటకి మించి ఉండకుండా ఉంటే వారికి కూడా సౌకర్యంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే అర్థమయ్యే విధంగా చెబితే నేర్చుకునేవారిలో ఆసక్తి పెరుగుతుంది. చెప్పడం కొరకు డబ్బు ఖర్చుపెట్టి, పారితోషికాలిచ్చి ఎవరినో, ఎక్కడి నుండో పిలుపించుకోవలసిన అవసరం లేదు. మీకు తెలియని విషయాలు తెలుసుకోవడానికి తెలిసిన వ్యక్తి దగ్గరికి వెళ్ళి తెలుసుకోండి. ఇటువంటి విషయాలలో నేటి దాయీలపై ఎట్టి పరిస్థితులలోనూ ఆధారపడకండి. ధార్మిక జ్ఞానం గల ఆలిమ్‌లను అడగండి.

అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, ''ప్రజలకు విషయాలను సులభతరం చేయండి మరియు వారికి విషయాలు కష్టతరం చేయకండి మరియు వారికి శుభవార్త నివ్వండి మరియు ద్వేషించేలా చేయకండి.**(సహీహ్ బుఖారీ, 69, 3. కితాబుల్ ఇల్మ్, అధ్యా. 11, సంపుటి 1)**

తమ సంపాదన కొరకు చాలామంది దాయీలు ఇతర ధర్మాల వారితో (ప్రత్యేకంగా ఓ మతధర్మం వారితో) ఖుర్ఆన్ మరియు సున్నత్‌కి వ్యతిరేకంగా డిబేట్లు పెట్టుకుని, ఇతర ధర్మాలవారికి ఇస్లామ్ పట్ల ద్వేషభావాన్ని కలుగజేస్తున్నారు. ఒక కారణం ఏమిటంటే ఆ డిబేట్‌ను వీడియో రికార్డ్ చేసి వేరే దేశానికి పంపి డబ్బు సంపాదించుకోవడం. రెండవ కారణం ఖుర్ఆన్ మరియు సున్నత్ జ్ఞానం లేకపోవడం.

అబూహురైరాగారి(రజి) ఉల్లేఖనం : గ్రంథప్రజలు 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : "**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము".

**(సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం:25)**

శాంతిబాట ద్వారా ప్రజలకు నిజాలు తెలిసి, నిలదీయడం వలన బహిరంగంగా కాకుండా ఇప్పుడు ఇళ్ళల్లో డిబేట్లు పెట్టుకుని సంపాదించు కుంటున్నారు.

ఈ పాపం కేవలం దాయీలకేనా? ఆ దాయీలకు సపోర్ట్‌గా నిలిచి, ఆ డిబేట్లకు హాజరయ్యే ముస్లిములకు కూడా లేదా? వారికి కూడా ఈ పాపంలో భాగముంది.

ప్రజలను ఖుర్'ఆన్ మరియు సున్నత్ జ్ఞానం నుండి దూరం చెయ్యడానికి ఒక పథకం ప్రకారం ప్రసంగాలతో ఖుర్'ఆన్ చదివే సమయాన్ని ముస్లిములకు లేకుండా చేసి, ముహమ్మద్(స)వారి బోధనల వైపు వెళ్ళనీయకుండా, వక్రీకరణ చేస్తూ ధర్మాన్ని తమ వ్యాపారంగా మార్చుకుంటున్నారు.

అబద్ధం ఆడటాన్ని, మోసం చేయడాన్ని వివేకం అని చెబుతున్నారు. ఇటువంటి వారిని అదుపులోకి తీసుకోవలసిన నాయకులు వారికి సపోర్ట్ నిస్తున్నారు. కాని అల్లాహ్ ఆగ్రహం నుండి ఈ సపోర్ట్‌లు రక్షించగలవా?

రోజూ కనీసం ఒక పావుగంట సేపు ఖుర్'ఆన్ చదవండి. ఓ పావుగంట ఒక హదీస్‌ను అధ్యయనం చేయండి. ప్రతీ ఆదివారం ఓ గంటసేపుగాని, ఓ అరగంట సేపుగాని ఖుర్'ఆన్ తఫ్సీర్ చదవండి. అర్థం చేసుకోండి. అర్థమైన దానిని ఆచరణలో పెట్టండి. సంతోషమయ జీవనాన్ని పొందండి.

- సంపూర్ణ జ్ఞానం అల్లాహ్‌కే ఉంది.
- జ్ఞానం కోసం హదీస్ గ్రంథాలుండే లైబ్రరీకి వెళ్ళి వాటిని చదువుకోండి లేదా ఓ జ్ఞాని లేదా ఆలిమ్ దగ్గరకి (దాయీ దగ్గరికి కాదు) వెళ్ళి తెలుసుకోండి. ఆ నియ్యత్‌తోనే మీరు వెళితే, మీరు ప్రయాణించి నంత సేపు, మీరు నడిచినంత సేపు మీకు ఎంత మేలు జరుగుతుందో ఈ వ్యాసంలో ఇచ్చిన హదీస్‌ల ద్వారా తెలుసుకుని ఉంటారు.
- వివేకం అంటే ఖుర్'ఆన్ మరియు సున్నత్‌పై జ్ఞానం. అంతేగాని అబద్ధాలాడటం మరియు మోసం చేయడం కాదు. అది దుర్మార్గం. దాయీల మాటలు నమ్మకండి.
- జ్ఞానం కలవారు కష్టపడి పనిచేసి, ఆ సంపాదనతోనే తింటారు.
- జ్ఞానం కలవారు మంచిని బోధిస్తారు మరియు చెడును నిరోధిస్తారు.
- కొన్ని విషయాలలో మానవుని కంటే పశువులకు, పక్షులకే జ్ఞానం ఎక్కువ.
- ఆవగింజంత అహంకారం ఉన్నా సరే, అటువంటి వానికి స్వర్గం లేదు. అహంకారం గలవాడు జ్ఞానం నేర్చుకోలేడు. లేదా అహంకారికి ఉన్నది జ్ఞానం కాదు.
- హదీస్‌ను ఉన్నది ఉన్నట్లుగానే చెప్పాలి.
- 'అల్లాహ్' పేరును అల్లాహ్‌గానే చెప్పాలి. ఆ పేరును ఏ భాషలోకి అనువదించ కూడదు.
- **ఖుర్'ఆన్ ఆయత్‌లను మరియు హదీస్‌లను తమకు అనుకూలంగా చెప్పుకునే దాయీల నుండి అల్లాహ్ రక్షణను వేడుకోండి.**
- మీరు మస్జిద్‌లో తోటి ముస్లిమ్‌లతో కూర్చుని ఖుర్'ఆన్ చదవడమే కాకుండా, అధ్యయనం (study) చేయండి. పైనుండి మీపై ప్రశాంతత దిగుతుంది. కరుణ నీడలా మిమ్మల్ని చుట్టేస్తుంది. దైవదూతలు మీ చుట్టూ చేరుతారు.

  సులభంగా పొందగలిగే ఇటువంటి గొప్ప అనుగ్రహాలకు మీరెందుకు దూరం అవుతారు?

  ఉనికిని కాపాడుకునే ప్రోగ్రామ్‌లు, వ్యాపారంకొరకు ఏర్పాటు చేసే ప్రోగ్రామ్‌లు, కేవలం క్లబ్‌ల మాదిరి పనిచేసే ఆర్గనైజేషన్‌ల వలన మనపై శుభాలు వర్షించవు.
- **మన ప్రాణం కంటే మరియు అన్నింటికంటే ఎక్కువగా ప్రేమించే ముహమ్మద్(స)వారికి ఏ పనులు అయితే సంతోషం కలిగించాయో, ఏ పనులయితే మన ప్రభువు మరియు పోషకుడైన అల్లాహ్‌కు సంతోషం కలిగించాయో వాటినే చేద్దాం, ఇన్షా అల్లాహ్!**

**క్రింది హదీస్‌ను చదవండి.**

జరీర్ బిన్ అబ్దుల్లాహ్ ఉల్లేఖనం : కొందరు ఎడారి వాసులు (పల్లెటూరి వాళ్ళు) అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారి దగ్గరకి ఉన్ని వస్త్రాలు ధరించి వచ్చారు. (వాటిని పేదవారు ధరించేవారు) మరియు ఆయన(స) వారి దీనస్థితిని చూసి, వారు అవసరంలో ఉన్నారని, దానం ఇవ్వమని ఆయన(స) (ప్రజలను) అడిగారు. కాని వారు చాలా నెమ్మదిగా ఉన్నారు. (ప్రవక్తగారి అసమ్మతి) ఆయన(స) ముఖంలో చూడగలిగాము. "తరువాత ఓ అన్సార్ వ్యక్తి చిన్న సంచి నిండా వెండి తీసుకువచ్చారు తరువాత మరొకరు వచ్చారు, ఆయన(స)వారి **ముఖంలో సంతోష సూచనలు కనిపించగలిగేటంత వరకూ.**

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: ఇస్లామ్‌లో ఎవరైతే మంచి ఆచరణను ప్రారంభిస్తారో, అతని తరువాత అది అనుసరించబడితే, అతని కొరకు వారికి లభించేటంత ప్రతిఫలం ఉంటుంది, వారి ప్రతిఫలం నుండి కాస్త కూడా తగ్గకుండా. ఎవరైతే ఇస్లామ్‌లో చెడుపనిని ప్రారంభిస్తారో, అతని తరువాత అది అనుసరించబడితే అతనిపై చేసినవారి పాపభారమంత భారం పడుతుంది వారి భారంలో కాస్తకూడా తగ్గకుండా".

# ధర్మ సందేశ ప్రచారం

## ఖుర్'ఆన్ మరియు సున్నత్ తెలుగులో

దావా (దావత్ - అల్లాహ్ మార్గంవైపు పిలవడాన్ని) జీవనోపాధిగా చేసుకో కూడదని, వ్యాపారంగా చేసుకో కూడదని, 'దాయి'గా పిలుపించుకోవడం కంటే 'ముస్లిమ్'గా పిలుపించుకోవడం ఉత్తమమని, దావా అనేది ప్రతి ముస్లిమ్ యొక్క బాధ్యత అని, ఆ బాధ్యతను ప్రవక్త(స)వారు సూచించిన సౌమ్యమైన విధానంలో, మంచి కారెక్టర్‌తో చేయవలసి ఉంది అని ఈ శీర్షికలో అందించిన తొలి 6 వ్యాసాలలో తెలియజేశాము. అవి మా వ్యక్తిగత అభిప్రాయాలు ఎంతమాత్రం కావు. **ప్రతీ విషయానికి ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను ఆధారంగా చూపాము.** మనకు ఖాళీ లేదని, డబ్బిచ్చి ఎవరిచేతో మన సలాత్(నమాజ్)ను చేయించుకుంటే, అది మన ఆరాధన ఏవిధంగా కాదో, అదేవిధంగా ఎవరికో డబ్బు ఇచ్చి మన తరపున అల్లాహ్ మార్గంవైపు పిలవమని చెప్పడం కూడా, మనం పిలిచినట్లు కాదని సోదరులు అర్థం చేసుకున్నారు. తులనాత్మక అధ్యయనాలు మరియు ఇతర గ్రంథాలతో దావా చేయడం వంటి ఇస్లామ్ వ్యతిరేక కార్యక్రమాల గురించి కూడా స్పష్టంగా తెలియజేయబడింది.

9 **కాఫిర్** ☑ **ముష్రిక్** ☑ **మోమిన్** ☑ ముసాఫిఖ్ ☐

# మునాఫిఖ్
### (కపట విశ్వాసి)
అంటే ఎవరు?

*అల్లాహ్ మార్గం వైపు పిలిచే ప్రతీ ముస్లిమ్ ముందుగా కొన్ని అరబీ పదాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. లేకపోతే ఎదుటివారి మనస్సు గాయపడే అవకాశముంది. అంతేకాకుండా, ఎవరెవరితో అల్లాహ్ ఏ విధంగా ప్రవర్తించమన్నారో ముందుగా తెలుసుకుంటే మన బాధ్యతను సక్రమమైన పద్ధతిలో నిర్వర్తించ గలుగుతాము. అందుకే కొన్ని ముఖ్య పదాలను ఒక దాని తరువాత ఒకటిగా ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.*

**'ముస్లిమ్'** అంటే అల్లాహ్‌కు విధేయుడు. బహిరంగంగా 'ముస్లిమ్'నని చెప్పుకుంటూ హృదయంలో మాత్రం అల్లాహ్ పట్లగాని ప్రవక్త(స)వారి పట్లగాని విధేయత లేనివానిని మునాఫిక్ (కపట విశ్వాసి) అంటారు. కపటి విశ్వాసిలో ఉండే కాపట్యం రెండు రకాలు :

- విశ్వాసంలో కాపట్యం
- చేసే పనులలో మరియు ఆచరణలలో కాపట్యం

### విశ్వాసంలో కాపట్యం

1. ప్రవక్త(స)వారి గురించి తప్పుడు అభిప్రాయం కలిగించడం
2. ప్రవక్త(స)వారు తీసుకొచ్చిన సందేశంలో కొంత భాగంపై తప్పుడు అభిప్రాయాన్ని కలిగించడం.
3. ముహమ్మద్(స)వారిని ద్వేషించడం.
4. ప్రవక్త(స)వారి సందేశంలో కొన్నింటిపై ద్వేషం కలిగి ఉండడం.
5. ఇస్లామ్ స్థాయి తగ్గడం లేదా ఇస్లామ్‌కి అవమానం కలిగితే సంతోష పడటం.
6. ముహమ్మద్(స)వారి యొక్క ధర్మం (ఇస్లామ్) విజయం సాధిస్తే ఇష్టపడకపోవడం

### ఆచరణలో మరియు చేసే పనులలో కాపట్యం

1. కపట విశ్వాసి - మాట్లాడితే అబద్ధమే మాట్లాడుతాడు
2. వాగ్దానం చేస్తే, దానిని భంగపరుస్తాడు.
3. మీరు అతనిపై నమ్మకం ఉంచితే, అతను నిజాయితీలేని వాడుగా నిరూపించబడతాడు (అమానతు తిరిగి ఇవ్వడు)
4. ఎప్పుడైనా అతడు గొడవపడితే, అహంకారంతో, చెడ్డగా, అవమానించే విధంగా మాట్లాడుతాడు.
5. ఎప్పుడైనా ఒప్పందం చేసుకుంటే, వంచన చేస్తాడు.

నిశ్చయంగా, **కపట విశ్వాసులు నరకంలో అన్నిటికంటే మిక్కిలి క్రింది అంతస్తులో పడి ఉంటారు.** మరియు వారికి సహాయం చేయగల వాడిని ఎవ్వడినీ నీవు పొందజాలవు. (ఖుర్'ఆన్ 4:145)

అంటే ముష్రిక్‌లు, కాఫిర్ల కంటే క్రింది స్థాయిలో ఉండేవాడే కపట విశ్వాసి. ముస్లిములకు శతృవు మరియు చాలా ప్రమాదకారి.

'మునాఫిఖ్' (కపట విశ్వాసి) గురించి వివరించే మరెన్నో ఆయత్‌లు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. ఒక సూరహ్ పూర్తిగా వీరి విషయంలోనే అవతరించింది (63వ సూరహ్ - 'మునాఫిఖూన్'). అయితే ఈ సూరహ్ అవతరణకు ముందు జరిగిన ఒక సంఘటన గురించి క్లుప్తంగా :

బనూ ముస్తలిఖ్ తెగ నాయకుడైన హారిస్ బిన్ దిరార్ యుద్ధ సన్నాహాలు చేస్తున్నాడని ముహమ్మద్(స)వారికి సమాచారం అందింది.

ముహమ్మద్(స)వారికి తమపై వ్యతిరేకంగా జరుగుచున్న యుద్ధ సన్నాహం గురించి సమాచారం అందగానే, వారిని ఎదుర్కోవడానికి ముస్లిమ్ సైన్యాన్ని సిద్ధం చేశారు. ముస్లిములతో పాటుగా చాలామంది కపట విశ్వాసులు కూడా యుద్ధంలో పాల్గొన్నారు. వారి సంకల్పం ఏమిటంటే, యుద్ధంలో విజయం సాధించాక లభించే యుద్ధసంపదలో కొంత భాగాన్ని పొందవచ్చనే ఆశ. కాని వారి హృదయంలో అల్లాహ్‌పై విశ్వాసం లేదు. ప్రవక్త(స)వారు అంటే వారి మనస్సులలో విధేయత ఎంతమాత్రం లేదు.

అల్లాహ్‌పై విశ్వాసం లేని అటువంటి కాపట్యం కలవారు ముస్లిములతో ఎలా యుద్ధానికి బయలుదేరారు? అని మీకు సందేహం రావచ్చు. ప్రవక్త(స)వారికి అల్లాహ్ తప్పక సహాయం చేస్తారని, ముస్లిములే విజయం సాధిస్తారనే విషయంలో మాత్రం కపట విశ్వాసులకు పూర్తి నమ్మకముంది.

యుద్ధం ప్రారంభమైంది. ముస్తలిఖ్ తెగలో కొందరు చనిపోయారు. కొందరు పారిపోయారు. మిగిలిన పురుషులు, స్త్రీలు ముస్లిములకు యుద్ధ ఖైదీలుగా చిక్కారు.

ముహాజిర్, అన్సార్ పదాల గురించి ఇక్కడ ఒకసారి గుర్తుచేస్తున్నాము. **ముహాజిర్** అంటే మక్కా నుండి వలస వచ్చిన ముస్లిమ్ మరియు **అన్సార్** అంటే ముహాజిర్‌కు సాయం అందించిన ముస్లిమ్. అంటే ఒకరు వలసవచ్చినవారు మరియు మరొకరు వారికి సాయం చేసినవారు.

ఈ యుద్ధం మురైసీ అనే బావి దగ్గర జరిగింది. నీటి విషయంలో అక్కడే ఓ ముహాజిర్ మరియు ఓ అన్సార్ మధ్య తగాదా జరిగింది. అంటే ఇద్దరు ముస్లిముల మధ్య జరిగిన తగాదా ఇది. ఒక ముహాజిర్, ఒక అన్సార్ పిరుదులపై తన్నాడు. అన్సార్ వ్యక్తి గాయపడ్డాడు. ఆ అన్సార్ తన తోటి అన్సారులను మరియు ముహాజిర్ తన తోటి ముహాజిర్లను పిలవడం జరిగింది. ఈ విషయం ప్రవక్త(స)వారికి తెలియజేయబడింది.

ఆయన(స) వెంటనే గొడవ జరిగిన చోటుకు వెళ్ళి "**అజ్ఞాన కాలపు నినాదం ఏమిటి?**' (అంటే రక్షణ కోసం ప్రాంతం, జాతి, తెగల ఆధారంగా పిలుస్తారా?)

**'ఆ నినాదాన్ని వదిలేయండి. అది ఏహ్యమైనది.'**

ప్రతీ ముస్లిమ్ తన తోటి ముస్లిమ్‌కు సహాయం చేయాలి. అతడు అణచివేసేవాడైనా లేక అణిచివేతకు గురైనా వాడైనా సరే. అణచివేతకు గురియైనవానికి సహాయం అందించడం అంటే స్పష్టంగా అర్థమౌతుంది. కాని అణిచేవాడికి సహాయం అందించడమంటే ఏమిటి? అతనిని ఆ పని నుండి ఆపడమే అతనికి చేసే సహాయం.

ప్రవక్త(స)వారి మాటల వలన ఆ తగాదా సమసిపోయింది. ఆ తగాదాకి కారణమైన ఇద్దరిలో ఒకరైన ఆ ముహాజిర్ పేరు జహ్జా (రజి) మరియు అన్సార్ పేరు 'ఇబ్నె వబ్రా అల్-జుహనీ' (రజి). ఈ తగాదాలో ముహాజిర్ దోషమే ఎక్కువ ఉంది. అన్సార్ వ్యక్తి గాయపడ్డాడు. ఉబాదా బిన్ సామిత్(రజి) అనే సహాబీ ఆ అన్సారీకి విషయాన్ని వివరించారు. అతను అర్థం చేసుకుని జహ్జా(రజి)ని క్షమించమని కోరాడు. ఈ సంఘటనలో అణచినవాడు మరియు అణిచివేతకు గురియైన వారిద్దరూ సోదరులైపోయారు.

ముందుగానే చెప్పుకున్నాం, కపట విశ్వాసులు యుద్ధసంపదలోని వాటాపై అత్యాశతోనే ముస్లిమ్‌లతో కలిశారని. ఆ కపట విశ్వాసులకు నాయకుడు - 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై'.

ఇతర కపటవిశ్వాసులు చెప్పుకునే విధంగానే ఇహలోక ప్రయోజనాల కోసమే ఇతను కూడా తనను ముస్లిముగా చెప్పుకుంటాడు . కాని అతడు తన హృదయంలో రసూలుల్లాహ్(స) మరియు ముస్లిములపై శతృత్వాన్ని కలిగి ఉన్నాడు.

ముహాజిర్లు మరియు అన్సారుల మధ్య జరిగిన తగాదాను గొప్ప అవకాశంగా భావించి వారి మధ్య ఘర్షణ పెంచాలనుకున్నాడు.

కాబట్టి అతడు కపట విశ్వాసులతో సమావేశం ఏర్పరిచాడు. అయితే, రెచ్చగొట్టే ప్రసంగం చేశాడు. అన్సార్‌ల నుద్దేశించి, "ఇదంతా మీపైకి మీరే తెచ్చుకున్నారు. వారిని మీ భూభాగంలో చేర్చుకున్నారు. మీ సంపదను వారితో పంచుకుని, వారు మీచే పోషించబడి బలంగా తయారై మీపైనే తిరగబడుతున్నారు. మీ జీవితాలను దయనీయంగా మార్చు కున్నారు'' అని చెప్పుకొచ్చాడు. "కాబట్టి భవిష్యత్‌లో ముహాజిర్లను వదిలేసి వారికి సహాయం చేయకుండా ఉంటే వారు ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతారని'' చెప్పాడు.

"అల్లాహ్ సాక్షి!, మనం మదీనా నగరానికి తిరిగి వెళ్ళిన తరువాత, నిశ్చయంగా గౌరవనీయులమైన (మనం), అక్కడ వున్న తుచ్ఛమైన వారిని తప్పక వెడలగొడ్దాం."

ఇతడు తన స్వంత కపట వర్గాన్ని మరియు అన్సారులను 'గౌరవనీయులు గాను', (అల్లాహ్ క్షమించాలి) ప్రవక్త(స)వారిని మరియు ముహాజిర్‌లను 'అల్పమైనవారు'గానూ వర్ణించాడు.

అక్కడే ఉన్న జైద్ బిన్ అర్ఖమ్(రజి) ఇతని ప్రసంగం విని, వెంటనే అతని మాటలను తిప్పి కొట్టారు. "అల్లాహ్ సాక్షి! నీవే అల్పబుద్ధి గలవాడివి. నీచమైన మరియు హేయమైనవాడివి. ముహమ్మద్(స)వారు అల్లాహ్ వలన గౌరవం పొంది మరియు ముస్లిములు చూపే ప్రేమతో విజేత అయ్యారు."

అబ్దుల్లాహ్ బిన్ ఉబై అతని కపటత్వాన్ని పైకి తెలియకుండా జాగ్రత్త పడేవాడు. కాబట్టి జైద్ బిన్ అర్ఖమ్(రజి) నుండి తీక్షణమైన ఎదురుదెబ్బ తగిలేసరికి, తన కాపట్యం బయటపడిపోతుందని అర్థం చేసుకుని జైద్ బిన్ అర్ఖమ్(రజి)ను క్షమాపణకోరి తను కేవలం తమాషాగా అన్నానని దాని అర్థం రసూలుల్లాహ్(స)వారికి వ్యతిరేకంగా చెప్పినట్లు కాదని సర్ది చెప్పాడు.

కాని జైద్ బిన్ అర్ఖమ్ ఆ సమావేశాన్ని వదిలి రసూలుల్లాహ్(స)వారికి ఈ విషయాన్ని చేరవేశారు. ఈ విషయం ప్రవక్త(స)వారిని కలత చెందేలా చేసింది. ఆ సమయానికి జైద్ బిన్ అర్ఖమ్(రజి) నవ యువకుడు. కాబట్టి

ప్రవక్త(స)వారు అడిగారు : ''ఓ అబ్బాయి! నీవు అబద్ధం ఆడటం లేదు కదా!'' జైద్ బిన్ అర్ఖమ్(రజి) అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెప్పారు: ''నేను ఈ మాటలను నా చెవులారా విన్నాను.''

ప్రవక్త(స) అతనితో అన్నారు : ''నీవు ఇది అనుమానంతో చెప్పడం లేదుగా?'' జైద్ బిన్ అర్ఖమ్(రజి) మరలా అదే సమాధానం చెప్పారు

ఈ వార్త ముస్లిమ్ సైన్యం అంతటా తెలిసిపోయింది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. జైద్ బిన్ అర్ఖమ్(రజి), తన జాతి గౌరవించే నాయకునిపై అపనింద వేశాడని మరియు అతనితో బాంధవ్యాన్ని వేరుచేసుకున్నాడని కొందరు అన్సారులు అన్నారు. జైద్ బిన్ అర్ఖమ్(రజి) అల్లాహ్‌పై ప్రమాణం చేసి '**ఖజ్‌రజ్ తెగ మొత్తంలో ఇబ్నె ఉబై (అంతవరకూ) తనకు చాలా ప్రియమైన వాడని, కాని అతడు రసూలుల్లాహ్(స)వారికి వ్యతిరేకంగా బాధకలిగించే పదాలు పలికినప్పుడు తాను తట్టుకోలేక పోయానని**' చెప్పారు. ''**అతను ఒకవేళ నా తండ్రియైనా సరే, నేను ప్రవక్త(స)వారికి అతను మాట్లాడినదానిని గురించి తెలియజేస్తానని**'' అన్నారు

ఈ విషయం ప్రవక్త(స)వారికి తెలియజేయ బడినప్పుడు, ఆయనతో ఉమర్(రజి) ఉన్నారు. **ఉమర్**(రజి) అన్నారు : **''ఓ రసూలుల్లాహ్!(స) ఈ కపట విశ్వాసి శిరస్సు ఖండించడానికి అనుమతి నివ్వండి.''**

''అతనిని వదిలేయి లేకపోతే ప్రజలు ముహమ్మద్(స) తన సహచరులను చంపుకుంటున్నాడంటారు'' అని ముహమ్మద్(స)వారు చెప్పారు.

ఆ కపట విశ్వాసనాయకుని కుమారుని దగ్గరకి వెళ్ళి ఉమర్(రజి) చెప్పారు. కొడుకు మాత్రం నిజాయితీ పరుడు మరియు నిజమైన ముస్లిమ్. అతడు వెంటనే రసూలుల్లాహ్(స)వారి వద్దకు వెళ్ళి చెప్పారు:

**'నా తండ్రి అతను మాట్లాడిన మాటలకు చంపబడాలని మీరు కోరితే, అతనిని చంపడానికి నాకు అనుమతి నివ్వండి మరియు ఇక్కడ నుండి మీరు లేవడానికి ముందే అతని తలను మీ ముందుకు తీసుకువస్తాను. నా తల్లిదండ్రులకు ఎంతో విధేయుడుగా మరియు సేవ చేసేవాడిగా నాకంటే ఎక్కువ ఎవరూ లేరనే విషయానికి మొత్తం ఖజ్‌రజ్ తెగే సాక్షి! కాని నేను అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరుని(స)కి హానిచేసినవాడిని సహించలేను. మీరు గనుక మరెవరినైనా నా తండ్రిని చంపమని అనుమతిస్తే, అతడు ఆయనని చంపుతాడు. తరువాత నేను నా తండ్రిని చంపిన వ్యక్తి స్వేచ్ఛగా నడిచి వెడుతుండగా చూసినప్పుడు, తెగ అసూయ నన్ను జయించి అతనిని చంపడానికి నన్ను ప్రేరేపించవచ్చు. అది నన్ను శిక్షకు గురిచేస్తుందని నేను భయపడుతున్నాను.'**

రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : ''అతనిని చంపే ఉద్దేశ్యం నాకు లేదు, అతనిని చంపమని మరెవరికీ నేను ఆదేశించలేదు''.

యుద్ధం నుండి తిరుగు ప్రయాణంలో సర్వసాధారణంగా ప్రవక్త(స)వారి అలవాటు ఏమిటంటే ఓ నిర్ణీత సమయంపాటు ఆగుతారు. అయితే ఈ సంఘటన జరిగాక, రసూలుల్లాహ్(స)వారు అలవాటుకు భిన్నంగా అసాధారణ సమయంలో వెంటనే మదీనా వైపు ప్రయాణం ప్రారంభించారు. ఆయన(స) తన ఒంటె ఖస్వా పై కూర్చుండి బయలుదేరారు. అందరూ అనుసరించారు.

ప్రవక్త(స)వారు కపట విశ్వాస నాయకున్ని అడిగారు ''నీవు ఇది చెప్పావా?'' అతడు ప్రమాణం చేసి తనపై ఆరోపించబడిన ప్రతీ విషయాన్ని ఖండించాడు మరియు ఆ నవ యువకుడైన 'జైద్ బిన్ అర్ఖమ్'ని అసత్యవాది అని ప్రకటించాడు.

అబ్దుల్లాహ్ బిన్ ఉబై తన తెగ వారికి గౌరవనీయమైన నాయకుడు కాబట్టి, ఆ తెగవారు 'జైద్ బిన్ అర్ఖమ్'(రజి) 'ఇబ్నె ఉబై'ని అపార్థం చేసుకున్నాడని భావించారు. ఇబ్నె ఉబై చేసిన ప్రమాణాన్ని రసూలుల్లాహ్(స) స్వీకరించారు కాబట్టి, జైద్ బిన్ అర్ఖమ్(రజి)పై ప్రజల మందలింపు ఎక్కువైంది. ఇది ఆయనను కలవర పరిచింది. ఆయన ఇతరులకు కనిపించకుండా ముఖం చాటేసారు. తన మొత్తం సైనికులతో ప్రవక్త(స) వారు ఆ పగలు, రాత్రి మరియు తరువాతి రోజు ఉదయం కూడా ప్రయాణం చేశారు. సూర్యుడు బాగా తీక్షణం అయ్యాక, ఆయన(స) ఓ ప్రదేశంలో విడిది చేశారు. అందరూ బాగా అలసి పోవడంతో, ఎంతో సుదూరమైన మరియు పట్టువదలని ప్రయాణం వారు నేలను తాకగానే, గాఢ నిద్రలోకి వెళ్ళిపోయేలా చేసింది.

ఈ అసాధారణ మరియు సుదూర ప్రయాణానికి కారణమేమిటంటే, జరిగిన సంఘటన గురించి పూర్తి సమయం పదే పదే అందరూ చెప్పుకోకుండా ముగింపు పలకడానికే కావచ్చు. విశ్రాంతి అనంతరం అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తిరిగి ప్రయాణం ప్రారంభించారు.

ఉబాదా బిన్ సామిత్(రజి) అనే సహాబీ ఈ ప్రయాణంలో కపట విశ్వాసి, ఇబ్నె ఉబైని చేరి అతని తప్పును ప్రవక్త(స)వారి ముందు ఒప్పుకుంటే ఆయన(స) అతని క్షమాపణ కొరకు అల్లాహ్‌ను ప్రార్థిస్తారని మరియు అతనికి మోక్షం కలుగుతుందని చెప్పి ఆ కపట విశ్వాసి మేలుకోరి సలహా ఇచ్చారు.

అతడు ఈ సలహా విని తన తలను (దూరంగా) తిప్పుకున్నాడు. అప్పటివరకూ కపట విశ్వాసి అయిన ఇబ్నె ఉబైకు వ్యతిరేకంగా ఏ ఖుర్'ఆన్ ఆయత్ కూడా అవతరించబడ లేదు. కాని అతడు అహంకారంతో పొగరుతో తలతిప్పు కోవడంతో ఉబాదా బిన్ సామిత్(రజి) అన్నారు : ''ఖచ్చితంగా, ఆ తిరస్కారానికి సంబంధించి ఖుర్'ఆన్ ఆయత్‌లు తెలియజేస్తాయి'' (చూడండి: ఖుర్'ఆన్ 63:5).

ప్రవక్త(స)వారు ప్రయాణంలో ఉండగా, జైద్ బిన్ అర్ఖమ్(రజి) ప్రవక్త(స)వారి సమీపంలోకి మాటిమాటికి వచ్చేవారు. మరియు అతని ధృఢ విశ్వాసమేమిటంటే, ఆ కపటవిశ్వాసి తన జాతి మొత్తం ముందు తనను కలవరపడేలా చేసి, తనను అసత్యవాది అన్నాడు కాబట్టి, అల్లాహ్ నిశ్చయంగా తన నిజాయితీని బయటపెడతారని.

ఇదే విషయంపై ప్రవక్త(స)వారిపై దివ్య సందేశం అవతరించ బడింది. జైద్ బిన్ అర్ఖామ్(రజి)కి కబురు పంపబడింది. ప్రవక్త(స)వారు

జైద్(రజి)వారి చెవి పట్టుకుని అన్నారు : "ఓ అబ్బాయి! నీ మాటల సత్యతని అల్లాహ్ ధృవీకరించారు."

మొత్తం **'సూరహ్ మునాఫిఖూన్'**ను - ప్రారంభం నుండి చివరి వరకూ - ఇబ్నె ఉబయ్ సంఘటనకు సంబంధించి అవతరించబడింది."

ఒక ఉల్లేఖనంలో (సహీహ్ బుఖారీ, 4906, సంపుటి6), ఎవరో అనస్(రజి)వారిని జైద్ బిన్ అర్ఖమ్(రజి)వారి గురించి అడిగారు. అనస్(రజి)వారు ప్రవక్త(స)వారు జైద్(రజి)వారి నుద్దేశించి చెప్పిన మాటలు చెప్పారు : "అతడే ఎవరు వినిన(మాటలనైతే) అల్లాహ్ ధృవీకరించారో"

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత**
**అయిన అల్లాహ్ పేరుతో**

(ఓ ప్రవక్తా!) ఈ కపట విశ్వాసులు (మునాఫిఖూన్) నీ వద్దకు వచ్చినప్పుడు, ఇలా అంటారు : 'నీవు అల్లాహ్ యొక్క సందేశహరుడవని మేము సాక్ష్యమిస్తున్నాము''. మరియు నిశ్చయంగా, నీవు ఆయన సందేశహరుడవని అల్లాహ్‌కు తెలుసు మరియు ఈ కపట విశ్వాసులు నిశ్చయంగా అసత్యవాదులని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు.

**వారు తమ ప్రమాణాలను డాలుగా చేసుకున్నారు. ఆ విధంగా వారు (ఇతరులను) అల్లాహ్ మార్గం నుండి నిరోధిస్తున్నారు. నిశ్చయంగా, వారు చేస్తున్న చేష్టలు ఎంతో నీచమైనవి.**

ఇది నిశ్చయంగా, వారు విశ్వసించిన తరువాత సత్యతిరస్కారులు అవటం మూలంగానే జరిగింది కావున వారి హృదయాల మీద ముద్ర వేయబడి ఉంది. కనుక వారు ఏమీ అర్థం చేసుకోలేరు.

మరియు నీవు గనుక వారిని చూస్తే! **వారి రూపాలు నీకు ఎంతో అద్భుతమైనవిగా కనిపిస్తాయి.** మరియు **వారు మాట్లాడినప్పుడు, నీవు వారి మాటలను వింటూ ఉండిపోతావు.** నిశ్చయంగా, వారు గోడకు ఆనించబడిన మొద్దులవలే ఉన్నారు. వారు ప్రతి అరుపును తమకు వ్యతిరేకమైనదిగానే భావిస్తారు. **వారు శత్రువులు**, కావున వారి పట్ల జాగ్రత్తగా ఉండు. **అల్లాహ్ వారిని నాశనం చేయుగాక!** వారెంత పెడ మార్గంలో పడివున్నారు.

మరియు వారితో : "రండి అల్లాహ్ ప్రవక్త మీ క్షమాపణ కొరకు (అల్లాహ్‌ను) ప్రార్థిస్తాడు.'' అని అన్నప్పుడు, వారు తలలు త్రిప్పు కోవటాన్ని మరియు దురహంకారంతో మరలి పోవటాన్ని నీవు చూస్తావు.

(ఓ ప్రవక్తా!) **నీవు వారి కొరకు క్షమాపణ కోరినా లేక క్షమాపణ కోరకపోయినా వారి విషయంలో రెండూ సమానమే!** (ఎందుకంటే) **అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించడు.** నిశ్చయంగా, అల్లాహ్ అవిధేయులకు మార్గదర్శకత్వం చేయడు.

వారే ఇలా అంటూ ఉండేవారు : "అల్లాహ్ సందేశహరుని వద్ద నున్న వారిపై మీరు ఖర్చుచేయకుండా ఉంటే! చివరకు వారే చెల్లాచెదురై పోతారు.'' **వాస్తవానికి ఆకాశాలలో మరియు భూమిలో నున్న సమస్త కోశాగారాలు అల్లాహ్‌కే చెందినవి.** కాని ఈ కపట విశ్వాసులు అది గ్రహించలేరు.

వారు (కపట విశ్వాసులు) ఇంకా ఇలా అంటున్నారు : **"మనం మదీనా నగరానికి తిరిగి వెళ్ళిన తరువాత, నిశ్చయంగా గౌరవనీయులమైన (మనం), అక్కడ వున్న తుచ్ఛమైన వారిని తప్పక వెడలగొడ్డాం."** మరియు గౌరవమనేది అల్లాహ్‌కు, ఆయన సందేశహరునికి మరియు విశ్వాసులకు మాత్రమే చెందినది. కాని ఈ కపట విశ్వాసులకు అది తెలియదు.

ఓ విశ్వాసులారా! మీ సంపదలు, మీ సంతానం మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుండి నిర్లక్ష్యంలో పడవేయరాదు సుమా! ఎవరైతే ఇలా నిర్లక్ష్యంలో పడతారో అలాంటి వారే నష్టపడేవారు.

మరియు మీలో ఎవరికైనా మరణ సమయం సమీపించి : "ఓ నా ప్రభూ! నీవు నాకు మరికొంత వ్యవధి ఎందుకివ్వలేదు! నేను దానధర్మాలు చేసి, సత్పురుషులలో చేరిపోయే వాడిని కదా?'' అని పలికే స్థితి రాకముందే, మేము మీకు ప్రసాదించిన జీవనోపాధి నుండి ఖర్చు చేయండి.

కాని ఒక వ్యక్తికి (మరణ) సమయం ఆసన్నమైనప్పుడు అల్లాహ్ అతనికి ఏమాత్రం వ్యవధినివ్వడు. మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్ బాగా ఎరుగును. (ఖుర్‌ఆన్ 63:1-11)

రసూలుల్లాహ్(స)వారు అఖీఖ్ లోయ దగ్గర మదీనా సమీపించి నప్పుడు, కపట విశ్వాసి అబ్దుల్లాహ్ బిన్ ఉబై కుమారుడైన 'అబ్దుల్లాహ్' అన్ని వాహనాలు తనిఖీ చేస్తూ, తన తండ్రి ప్రయాణిస్తున్న వాహనాన్ని కూర్చోబెట్టి ఒంటె మోకాళ్ళపై అతని పాదాన్ని ఉంచి తండ్రితో చెప్పాడు: **"అల్లాహ్ సాక్షి! నీవు మదీనాలోకి అడుగుపెట్టలేవు, రసూలుల్లాహ్(స)వారు అనుమతిస్తే తప్ప మరియు గౌరవనీయులైన మదీనా నివాసులెవరో, వెడలగొట్టబడే తుచ్ఛమైన వారెవరో స్పష్టం చేస్తే తప్ప. చెప్పు! ఎవరు గౌరవనీయుడు, రసూలుల్లాహ్? లేక నీవా?''** తన తండ్రితో అతను అంత నిర్దయగా వ్యవహరిస్తున్నందుకు తోటి ప్రయాణీకులు 'అబ్దుల్లాహ్'(రజి)వారిని మందలించారు. అప్పుడే రసూలుల్లాహ్(స)వారి ఒంటె అక్కడికి వచ్చింది. ఆయన(స) అడిగారు ఏమి జరుగుతుందని. ప్రజలు చెప్పారు అబ్దుల్లాహ్ తన తండ్రి మదీనా ప్రవేశాన్ని అడ్డుకున్నారని, రసూలుల్లాహ్(స)వారు అనుమతిస్తే తప్ప వదలనంటున్నారని తెలియ జేశారు. ప్రవక్త(స)వారు చూస్తుండగా ఆ కపట విశ్వాసి తన కుమారునితో, **తనే స్వయంగా మదీనా ప్రజలలో స్త్రీలు మరియు పిల్లల కంటే కూడా తుచ్ఛమైన వాడినని, మరియు ప్రవక్త(స)వారు వారందరిలోకి ఎక్కువ గౌరవనీయులని ప్రకటించాడు.**

అప్పుడు, రసూలుల్లాహ్(స)వారు అతని కుమారునితో చెప్పారు : "అతనికి దారి వదులు, అతనిని ప్రవేశించ నివ్వు''. కుమారుడు అతనిని మదీనాలో ప్రవేశింపనిచ్చాడు.

యుద్ధఖైదీలుగా చిక్కిన బనూ ముస్తలిఖ్ తెగవారిలో ఆ తెగ నాయకుని కుమార్తె జువైరియా(రజి)వారు కూడా ఉన్నారు. ఈ యుద్ధంలో ఆమె భర్త చనిపోయారు. ఈమె తన తెగకు చెందిన ఎంతోమంది స్త్రీలతో పాటు యుద్ధ ఖైదీగా చిక్కారు. ఈమె కలిమా చదివి ముస్లిం అయ్యారు. ఆమె తెగ వారందరూ ముస్లిములకు బానిసలయ్యారు.

అయితే, ముహమ్మద్(స)వారు ఈమెను వివాహం చేసుకోవడం వలన, మిగిలిన అనుచరు లందరూ కూడా తమకు బానిసలుగా చిక్కిన ఆమె బంధువులందరికీ స్వేచ్ఛ నిచ్చేసారు. **ఈమె చలువ వల్ల వందలాది కుటుంబాలు స్వేచ్ఛా వాయువులు పీల్చగలిగాయని** విశ్వాసుల మాతృమూర్తి 'ఆయిషా(రజి)' ఈమెను కొనియాడేవారు.

ఈ వివాహం వలన **బనీ ముస్తలఖ్ తెగ**వారంతా ప్రవక్త(స) వారికి బంధువు లయ్యారు. దాదాపు 100 మందికి స్వేచ్ఛ లభించింది. జువైరియా(రజి)వారి తండ్రి ఈ అద్భుతాన్ని చూచాక, ఆయన కూడా ఇస్లామ్ స్వీకరించారు.

**కపట విశ్వాసులకు సంబంధించి ఖుర్'ఆన్‌లో చెప్పబడిన కొన్ని ఆయత్‌లు :**

మరియు వారితో: "అల్లాహ్ అవతరింపజేసిన (ఆదేశాల వైపునకు) మరియు ప్రవక్త వైపునకు రండి." అని చెప్పినపుడు, నీవు ఆ కపటవిశ్వాసులను విముఖులై తొలగిపోవటాన్ని చూస్తావు! (4:61)

(ఓ విశ్వాసులారా!) మీకేమయింది, కపట విశ్వాసుల విషయంలో మీరు రెండు వర్గాలుగా చీలిపోయారు. అల్లాహ్ వారి కర్మల ఫలితంగా, వారిని వారి పూర్వ (అవిశ్వాస) స్థితికి మరలించాడు. ఏమీ? అల్లాహ్ మార్గభ్రష్టులు చేసిన వారికి మీరు సన్మార్గం చూపదలచారా? వాస్తవానికి, అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో పడనిచ్చిన వానికి నీవు (ఋజు)మార్గం చూపలేవు. (4:88)

**కపటవిశ్వాసులకు, నిశ్చయంగా! బాధాకరమైన శిక్ష ఉందని తెలుపు.** (4:138)

మరియు వాస్తవానికి, (అల్లాహ్) మీ కొరకు ఈ గ్రంథంలో అవతరింపజేశాడు : "**ఒకవేళ మీరు అల్లాహ్ ఆయత్‌లను గురించి తిరస్కారాన్ని మరియు పరిహాసాన్ని వింటే! అలాచేసేవారు, (ఆ సంభాషణ వదలి) ఇతర సంభాషణ ప్రారంభించ నంతవరకు మీరు వారితో కలిసి కూర్చోకండి!" అలా చేస్తే నిశ్చయంగా, మీరు కూడా వారిలాంటివారే!** నిశ్చయంగా అల్లాహ్ కపట విశ్వాసులను మరియు సత్య తిరస్కారులను అందరినీ నరకంలో జమచేస్తాడు. (4:140)

వారు (కపట విశ్వాసులు) మీ విషయంలో నిరీక్షిస్తున్నారు. ఒకవేళ మీకు అల్లాహ్ తరపునుండి విజయం లభిస్తే! వారు (మీతో) అంటారు : "ఏమీ? మేము మీతో కలిసి లేమా?" కాని ఒకవేళ సత్యతిరస్కారులదే పైచేయి అయితే (వారితో) అంటారు : "ఏమీ? మీతో గెలిచేశక్తి మాకు లేకపోయిందా? అయినా మేము మిమ్మల్ని విశ్వాసుల నుండి కాపాడలేదా?" కాని అల్లాహ్ పునరుత్థాన దినమున మీ మధ్య తీర్పు చేస్తాడు. మరియు అల్లాహ్! ఎన్నటికీ సత్యతిరస్కారులకు విశ్వాసులపై (విజయం పొందే) మార్గం చూపడు. (2:141)

నిశ్చయంగా, ఈ కపట విశ్వాసులు అల్లాహ్‌ను మోసగించగోరుతున్నారు. కాని ఆయనే వారిని మోసంలో పడవేశాడు. మరియు **ఒకవేళ వారు సలాత్ (నమాజ్) కొరకు నిలిచినా శ్రద్ధాహీనులై కేవలం ప్రజలకు చూపటానికే నిలుస్తారు. మరియు వారు అల్లాహ్‌ను స్మరించేది చాలా తక్కువ!** (4:142)

వారు (విశ్వాస-అవిశ్వాసాల) మధ్య వ్రేలాడుతున్నారు. వారు పూర్తిగా ఇటు (విశ్వాసులు) కాకుండా, పూర్తిగా అటు (సత్య తిరస్కారులు) కాకుండా ఉన్నారు. మరియు ఎవడినైతే అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో వదులుతాడో అలాంటి వాడికి నీవు (సరైన) మార్గం చూపలేవు. (4:143)

నిశ్చయంగా, కపట విశ్వాసులు నరకంలో అన్నిటికంటే మిక్కిలి క్రింది అంతస్తులో పడి ఉంటారు. మరియు వారికి సహాయం చేయగల వాడిని ఎవ్వడినీ నీవు పొందజాలవు. (4:145)

కపట విశ్వాసులు మరియు ఎవరి హృదయాలలో రోగముందో వారు: "వీరిని (ఈ విశ్వాసులను) వారి ధర్మం మోసపుచ్చింది." అని అంటారు. కాని అల్లాహ్ యందు నమ్మకం గలవాని కొరకు, నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేచనాపరుడు. (8:49)

తమ హృదయాలలో ఉన్న (రహస్యాలను) స్పష్టంగా తెలియజేసే టటువంటి సూరహ్ వారికి విరుద్ధంగా అవతరింప జేయబడు తుందేమోనని, ఈ కపట విశ్వాసులు భయపడుతున్నారు. వారితో అను: "**మీరు ఎగతాళి చెయ్యండి, మీరు (బయట పడుతుందని) భయపడుతున్న విషయాన్ని, అల్లాహ్ తప్పక బయటపెడ్తాడు.**" (9:64)

**కపట** విశ్వాసులైన **పురుషులు** మరియు **కపట** విశ్వాసులైన **స్త్రీలు** అందరూ ఒకే కోవకు చెందినవారు! **వారు అధర్మాన్ని ఆదేశిస్తారు. మరియు ధర్మాన్ని నిషేధిస్తారు.** మరియు తమ చేతులను (మేలు నుండి) ఆపుకుంటారు. **వారు అల్లాహ్‌ను మరచిపోయారు**, కావున ఆయన కూడా వారిని మరచిపోయాడు. నిశ్చయంగా, ఈ కపటవిశ్వాసులే అవిధేయులు. (9:67)

మరియు కపటవిశ్వాసులైన పురుషులకు మరియు కపట విశ్వాసులైన స్త్రీలకు మరియు సత్య తిరస్కారులకు అల్లాహ్ నరకాగ్ని వాగ్దానం చేశాడు. వారందులో శాశ్వతంగా ఉంటారు. అదే వారికి తగినది. మరియు **అల్లాహ్ వారిని శపించాడు** (బహిష్కరించాడు). మరియు వారికి ఎడతెగని శిక్ష ఉంటుంది. (9:68)

మరియు మీ చుట్టుప్రక్కల ఉండే బద్దూలలో కొందరు కపట విశ్వాసులున్నారు. మరియు నగరంలో కూడా ఉన్నారు. వారు తమ కాపట్యంలో నాటుకుని ఉన్నారు. కాని (ఓ ప్రవక్తా!) నీవు వారిని ఎరుగవు. మేము వారిని ఎరుగుతాము. మేము వారికి రెట్టింపు శిక్షను విధించగలము. తరువాత వారు ఘోరశిక్ష వైపుకు మరలింపబడతారు. (9:101)

మరియు నిశ్చయంగా, **అల్లాహ్ విశ్వసించిన వారిని స్పష్టపరుస్తాడు** మరియు **ఆయన కపట విశ్వాసులను కూడా స్పష్టపరుస్తాడు.** (29:11)

ఓ ప్రవక్తా! **అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండు** మరియు సత్యతిరస్కారుల మరియు **కపటవిశ్వాసుల యొక్క అభిప్రాయాన్ని లక్ష్యపెట్టకు.** నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు. (33:1) మరియు నీ ప్రభువు తరపు నుండి నీపై అవతరింపజేయబడిన

**దివ్యజ్ఞానం (వహీని) మాత్రమే అనుసరించు.** నిశ్చయంగా, అల్లాహ్ మీరు చేసేదంతా ఎరుగును. (33:2) కావున అల్లాహ్ పైననే నమ్మకం ఉంచుకో మరియు కార్యసాధకుడుగా అల్లాహ్ చాలు. (33:3)

మరియు ఆ సమయంలో, కపట విశ్వాసులు మరియు తమ హృదయాలలో రోగమున్నవారు : "అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు మాతో చేసిన వాగ్దానాలన్నీ బూటకాలు మాత్రమే!" అని అనసాగారు. (33:12)

**మరియు నీవు సత్య తిరస్కారుల మరియు కపట విశ్వాసుల మాటలకు లోబడకు మరియు వారి వేధింపులను లక్ష్యపెట్టకు మరియు కేవలం అల్లాహ్‌నే నమ్ముకో. మరియు కార్యకర్తగా కేవలం అల్లాహ్‌యే చాలు!** (33:48)

ఓ ప్రవక్తా! నీవు సత్యతిరస్కారులతో మరియు **కపట విశ్వాసులతో** ధర్మ యుద్ధం చెయ్యి. మరియు వారి విషయంలో **కఠినంగా వ్యవహరించు.** మరియు **వారి ఆశ్రయం నరకమే!** అది అతి చెడ్డ గమ్యస్థానం. (66:9)

## కపట విశ్వాసుల గురించి మనం ఎందుకు తెలుసుకోవాలి?

పైన అందించిన ఖుర్‌ఆన్ ఆయత్‌లలో మార్క్ చేసిన వాటిని శ్రద్ధగా అధ్యయనం చేయండి. ఆ ఆయత్‌ల సారం :

కపట విశ్వాసుల పట్ల కఠినంగా వ్యవహరించమని అల్లాహ్ ఆదేశిస్తున్నారు. వారు శతృవులని, అల్లాహ్‌వారిని నాశనం చేయుగాక! అని అల్లాహ్ చెప్పారు. వారు అల్లాహ్ ఆయత్‌లను తిరస్కరిస్తారు మరియు పరిహసిస్తారు. వారు తిరస్కారం, పరిహాసం ఆపేవరకూ వారితో కూర్చోవద్దని ఆదేశించారు. వారు అలా పరిహాసం చేస్తున్నా లేక వారు తిరస్కరిస్తున్నా సరే వారితోనే మనం కూర్చుంటే, మనం కూడా వారిలాంటి వారమే అన్నారు. అంటే అలా కూర్చుంటే మనం కూడా సత్యతిరస్కారులతో లేదా కపట విశ్వాసులతో సమానమై పోతాము. అల్లాహ్ కపట విశ్వాసులను శపించాడు. మరియు వారిని ఎంత మాత్రం క్షమించడు.

అల్లాహ్ మనల్ని పైన ఆదేశించినట్లుగా మనం చేయాలంటే కపట విశ్వాసి (మునాఫిఖ్) అంటే ఎవరో ముందుగా తెలుసుకోవాలి. ఈ వ్యాసం ప్రారంభంలో కొంత వివరించడం జరిగింది.

### కపట విశ్వాసి లక్షణాలు :

ముస్లిములతో ఉన్నప్పుడు, "మేము పరిపూర్ణమైన ముస్లిములమని", హిందువులతో ఉన్నప్పుడు "మేము పరిపూర్ణమైన హిందువులమని", క్రైస్తవులతో ఉన్నప్పుడు "మేము పరిపూర్ణమైన క్రైస్తవులమని", ఈ విధంగా ఎవరితో ఉంటే వారితో వారి వాళ్ళమని చెబుతారు. క్రింది హదీస్‌లో వీరి పోలిక వర్ణించబడింది :

ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు : కపట విశ్వాసి యొక్క పోలిక రెండు మందల మధ్య గందరగోళంతో తిరుగుతూ ఉండే గొఱ్ఱెలా ఉంటుంది. (ఒకసారి) ఒక మంద దగ్గరకు వెలుతుంది మరియు తరువాత మరొక మంద దగ్గరకు వెళుతుంది. **(సహీహ్ ముస్లిమ్, 7043, పుస్తకం 50, అధ్యా.1, సంపుటి 7)** తరువాయి ఉల్లేఖనం (7044)లో ఇలా ఉంది : ఒకదానితో కలిసి ఉంటుంది మరియు తరువాత మరొక దానితో కలిసి ఉంటుంది.

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ ఉల్లేఖనం.

రసూలుల్లాహ్(స) చెప్పారు : నాలుగు లక్షణాలున్నాయి ఎవరైతే అన్నింటిని కలిగి ఉంటారో అతడు పూర్తిగా కపటవిశ్వాసి. మరియు ఎవరైతే దానిలో ఒక లక్షణాన్ని కలిగి ఉన్నారో, అతడు కపటత్వపు లక్షణాలలో ఒకటి కలిగి ఉన్నాడు, అతడు దానిని వదిలేసేవరకూ :

1. అతను మాట్లాడినప్పుడు అబద్ధాలు చెబుతాడు
2. అతను ఒప్పందం చేసుకుంటే మోసం చేస్తాడు.
3. అతడు వాగ్దానం చేస్తే దానిని భంగపరుస్తాడు. మరియు
4. అతడు గొడవపడితే అశ్లీలమైన (అహంకారపు, చెడ్డవైన, అవమానకరమైన) మాటలు మాట్లాడుతాడు.

సుఫ్యాన్ (ఉల్లేఖకులలో ఒకరి) ఉల్లేఖనంలో ఇలా ఉంది: మరియుఅతడు వాటిలో ఒకదానిని కలిగి ఉంటే, అతడు కపటత్వపు లక్షణాలలో ఒకటి కలిగి ఉన్నాడు. **(సహీహ్ ముస్లిమ్, 210, పుస్తకం 1, అధ్యా. 25, సంపుటి 1, సహీహ్ బుఖారీ, 33, సంపుటి 1)**

అబూ హురైరా(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స) చెప్పారు:

కపటి విశ్వాసికి 3 సూచనలున్నాయి :

1. అతడు మాట్లాడితే, అబద్ధాలు చెబుతాడు.
2. అతడు వాగ్దానం చేస్తే, అతడు దానిని భంగపరుస్తాడు.
3. అతనికి ఏదైనా నమ్మకంతో అప్పగిస్తే నమ్మకాన్ని వమ్ము చేస్తాడు. **(సహీహ్ ముస్లిమ్, 212, పుస్తకం 1, అధ్యా. 25, సంపుటి 1)**

(తరువాయి ఉల్లేఖనంలో (213)లో) అలా బిన్ అబ్దుర్రహ్మాన్ ఇదే పరంపరతో ఉల్లేఖించారు. కపట విశ్వాసి సూచనలు మూడు, అతడు, **ఉపవాసమున్నా, సలాత్(నమాజ్) చేసినా మరియు 'ముస్లిమ్'నని ప్రకటించుకున్నా సరే.**

**ఉదాహరణకు :**

కొందరు ధర్మం విషయంలో అబద్ధం ఆడటాన్ని కూడా హిక్మత్ (వివేకం) అంటున్నారు, అది ఇస్లామ్‌కి పూర్తి విరుద్ధమైనా సరే.

కొందరికి ఖుర్‌ఆన్ కాపీలు ప్రజలకు ఉచితంగా పంచమని ఇచ్చామనుకోండి. అంటే అమానతుగా ఇచ్చి దాని హక్కుదారులకు ఇవ్వమని చెబితే, ఉచితంగా పంచకుండా వాటిని అమ్ముకుంటారు.

ఫలానా రోజు రమ్మని కొందరిని ప్రజలు కోరతారు. అందుకొరకు కొంత పైకాన్ని ఇవ్వడానికి వారు సిద్ధపడతారు. ఆహ్వానం అందుకుని వాగ్దానం చేస్తారు వస్తామని. కాని వేరెవరైనా అంతకంటే ఎక్కువ పైకం ఇస్తామంటే, ఈ వాగ్దానాన్ని భంగపరిచి అక్కడికి వెళ్ళిపోతారు. పై మూడు లక్షణాలు కలిసి ఉన్నవారు మన చుట్టూ ఎంతోమంది ఉన్నారు.

### వారిని మనం కనుగొనలేమా?

విశ్వాసులను స్పష్టపరుస్తానని మరియు కపట విశ్వాసులను స్పష్టపరుస్తానని ఖుర్'ఆన్‌లో అల్లాహ్ చెబుతున్నారు.

కపట విశ్వాసుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై, జైద్ బిన్ అర్ఖమ్(రజి)వారికి దొరికిపోయాడు. అతను కపటివిశ్వాసి అని అల్లాహ్ తెలపక ముందే, ఉమర్(రజి)వారు ఆ 'మునాఫిఖ్' శిరచ్ఛేధం కొరకు ప్రవక్త(స)వారి అనుమతి నడిగారు.

కపట విశ్వాసులు అల్లాహ్‌ను మరచిపోయారు. మరచిపోవడమే కాదు, వారు మరపింప జేయడానికి కూడా విపరీతంగా ప్రయత్నిస్తున్నారు. 'అల్లాహ్' పేరు ఈ దేశంలో పలక వలసిన అవసరం లేదంటారు. ఇక్కడ భాషలోకి పేరును కూడా అనువదించాలి అంటారు. అంటే 'అల్లాహ్' నామస్మరణ నుండి ముస్లిములను దూరం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు. కపట విశ్వాస పురుషులు, కపట విశ్వాస స్త్రీలు అధర్మాన్ని ఆదేశిస్తారు మరియు ధర్మాన్ని నిషేధిస్తారు. వీరు క్రింది ఆయత్‌ను చదివి వినిపిస్తారు:

**"... ఒకవేళ నీవు వారితో, 'ఆకాశాలను మరియు భూమినీ సృష్టించి సూర్యచంద్రులను ఉపయుక్తంగా చేసింది ఎవరు?' అని అడిగితే, వారు తప్పక : "అల్లాహ్" అని అంటారు. అయినా వారు ఎందుకు మోసగింప బడుతున్నారు?..."** (ఖుర్'ఆన్ 29:61)

మీరు బయటకి వెళ్ళి ఎవరినైనా అడిగితే ఏమని సమాధానం వస్తుందని అని అడుగుతారు. 'దేవుడు' అనే సమాధానం వస్తుంది కదా అని వారే చెబుతారు. ఇక్కడ వారి ఉద్దేశ్యం ఏమిటంటే (1) 'అల్లాహ్' అంటారని ఖుర్'ఆన్ చెబుతుంది కాబట్టి, ఆ విధంగా 'అల్లాహ్' అని అనకుండా 'దేవుడు' అన్నారు కాబట్టి, ఖుర్'ఆన్ వాక్యం తప్పు అనే అనుమానాన్ని వినేవారిలో కలిగించడం (2) అల్లాహ్ పేరుని వదిలేసేలా చేయడం.

ఖుర్'ఆన్‌పై అవగాహన లేని ముస్లిమ్‌లు ఇది నిజమేననుకుంటారు. కాని వారు క్రింది ఆయత్‌ను చదివితే అసలు విషయం బోధపడుతుంది.

వారిని ఇలా అడుగు : మీకు ఆకాశాల నుండి మరియు భూమి నుండి జీవనోపాధిని సమకూర్చేవాడెవడు?" వారికి తెలుపు : "**అల్లాహ్!**" (ఖుర్'ఆన్ 34:24)

అంటే అడగడమే కాకుండా, వారికి జవాబు కూడా తెలియజేయాలి.

అరబీ, హెబ్రూ, అరమాయిక్ భాషలు మాట్లాడే వారందరికీ అంటే ముస్లిమ్‌లకు మరియు గ్రంథప్రజలకు భూమ్యాకాశాల సృష్టికర్త 'అల్లాహ్' అని తెలుసు కాబట్టి వారు 'అల్లాహ్'యేనని అంటారు.

ఇతరులకు తెలియదు కాబట్టి వారికి మనమే 'అల్లాహ్' అని చెప్పాలి.

పై ఆయత్‌లను బట్టి 'అల్లాహ్' అని గుర్తు చేసుకోమని, 'అల్లాహ్' అని అనమని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు. అంటే అది ధర్మ ఆదేశం. కాని ధర్మాన్ని నిషేధించడానికి కపట విశ్వాస స్త్రీలు, కపట విశ్వాస పురుషులు ప్రయత్నిస్తున్నారు.

### పరిహాసం :

కొందరు కపట విశ్వాసులు చేసే పరిహాసం అర్థం కావాలంటే ముందుగా క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లు తెలియాలి.

**"ఇది (ఈ ఖుర్'ఆన్) సర్వలోకాలకు ఒక హితోపదేశం" (81:27)**

**"మరియు మేము నిన్ను (ఓ ముహమ్మద్) సర్వలోకాల వారి కొరకు కారుణ్యంగా మాత్రమే పంపాము" (21:107)**

**"అల్లాహ్‌ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించని, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నిషేధించినవి, నిషిద్ధమని భావించని, సత్యధర్మాన్ని తమ ధర్మంగా స్వీకరించని గ్రంథప్రజలతో - వారు స్వయంగా తమ చేతులతో జి'జ్‌యా ఇచ్చి లోబడి ఉండే వరకూ పోరాడండి." (9:29)**

పై ఆయత్‌లు చదివారు కదా! ముహమ్మద్(స)వారు సకల లోకాలకు బోధించడం కొరకు కారుణ్యంగా పంపబడ్డారు. ఆయనపై అవతరించిన గ్రంథం - ఖుర్'ఆన్. కాబట్టి ఆయన(స) ఖుర్'ఆన్ సందేశాన్నే బోధించారు. దాని ప్రకారమే ఆచరించాలని బోధించారు.

వాస్తవం ఇలా ఉంటే ఈ రాష్ట్రంలో ఓ అజ్ఞాని ముస్లిమ్ జ్ఞానులకు కూడా సవాల్ విసిరి, ముహమ్మద్(స)వారు ఒక మతధర్మం వారితో వారి గ్రంథమే చదువుకోమన్నారని, ఖుర్'ఆన్ కాదని చెప్పాడు. ఇది పరిహాసం. (ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం పుస్తకంలో వివరంగా చాలా విషయాలు తెలియజేశాము).

ఇంకా ఎన్నో రకాలుగా ఇటువంటి అజ్ఞానులు ముస్లిమ్‌ల ముసుగులో ఖుర్'ఆన్ ఆయత్‌లను పరిహాసం చేస్తున్నారు. అల్లాహ్ తప్పక శిక్షిస్తారు. అయితే అల్లాహ్ శిక్షను వెంటనే పంపరు కదా! కాని ఇహపరలోకాల్లో వారు శిక్ష నుండి తప్పించుకోలేరు.

జాబిర్(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు ఓ ప్రయాణం నుండి వచ్చారు మరియు ఆయన(స) మదీనా సమీపానికి వచ్చినప్పుడు ఓ బలమైన గాలి వీచింది ఓ రౌతు ఇసుకలో కూరుకుపోయేటంత. అతను చెప్పారు - ప్రవక్త(స) చెప్పారు : **ఈ గాలి ఒక కపట విశ్వాసి మరణం కొరకు పంపబడింది.** ఆయన మదీనా చేరినప్పుడు కపట విశ్వాసుల్లో బాగా పెద్దవాడు మరణించాడని తెలుసుకున్నాము **(సహీహ్ ముస్లిమ్, 7041, పుస్తకం 50, అధ్యా. 1, సంపుటి 7)**

### ఖుర్'ఆన్ ఆయత్‌లను వక్రీకరించడం

"నిశ్చయంగా, మా ఆయత్‌లకు వికృత అర్థం అంటగట్టేవారు మాకు కనిపించకుండా ఉండలేరు" (41:40)

ఖుర్'ఆన్ ఆయత్‌లను ఏ విధంగా వక్రీకరిస్తున్నారో అర్థం కావడానికి ఒక ఉదాహరణను ఇక్కడ అందిస్తున్నాము.

**ఇలా అను : "ఓ గ్రంథ ప్రజలారా! మీరు తౌరాతును, ఇంజీలును మరియు మీ ప్రభువు తరపునుండి మీపై అవతరింపజేయబడిన (ఈ ఖుర్'ఆన్‌ను) ఆచరించనంత వరకూ మీరు అసలు దేనిమీద కూడా ఉండనట్లే! ..."** (ఖుర్'ఆన్ 5:68)

పై ఆయత్‌లో 'ఖుర్ఆన్' అని ఉండవలసిన చోట ఓ మతవర్గం వారి యొక్క గ్రంథం పేరును ఉంచి ఖుర్'ఆన్ ఆయత్ అర్థాన్ని మార్చేస్తూ కపట విశ్వాసులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

అమాయకులు వీరి మాటలు విని మోసపోయి నాశనమౌతున్నారు. అందుకే ముహమ్మద్(స) ముందుగానే చెప్పారు - ఈ ఖుర్'ఆన్ ద్వారా ఒక వ్యక్తి ఉన్నత స్థానాన్ని చేరుకుంటాడు. మరొకడు ఈ ఖుర్'ఆన్ ద్వారా

అధ్వాన్న స్థాయికి జారిపోతున్నాడు (దానిని అపార్థం చేసుకుని). ఎందుకంటే ఖుర్ఆన్ గ్రంథాన్ని మాటిమాటికీ చదివేవానికి తెలుసు - ఆ ఆయత్‌లో తౌరాత్, ఇంజీల్ తరువాత వచ్చేది ఖుర్ఆన్ మాత్రమేనని. ఎందుకంటే ఆ వ్యక్తి **సూరహ్ తౌబా** కూడా చదువుతాడు కాబట్టి.

క్రింది ఖుర్ఆన్ ఆయత్ చదవండి :

**"... మరియు ఇది తౌరాత్, ఇంజీల్ మరియు ఖుర్ఆన్‌లలో, ఆయన (అల్లాహ్) చేసిన వాగ్దానం ..."** (ఖుర్ఆన్ 9:111)

పై ఆయత్‌లో స్పష్టంగా తౌరాత్, ఇంజీల్ తరువాత ఖుర్ఆన్ అని తెలపబడింది. అంతేకాకుండా, ముందరి ఆయత్ (5:68)లో అది ఖుర్ఆన్ గ్రంథమేనని చెబుతూ 18వ శతాబ్దపు 'ఖుర్ఆన్' ఇంగ్లీష్ అనువాదా లు కూడా ఉన్నాయి. అవి ముస్లిమేతరులు చేసినవే.

ఈ కపట విశ్వాసులు ముహమ్మద్(స)వారిపై ద్వేషాన్ని పెంచుతున్నారు. ముహమ్మద్(స)వారిని ఇతరులచే దూషించబడేలా చేస్తున్నారు.

ఇస్లామ్ స్వీకరించిన తరువాత ఎందరో మోమిన్‌లకు, మోమినాలకు ప్రవక్త(స)వారు వారికుండే పూర్వపు పేర్లను మార్చారు. ఈ విషయంలో కూడా కొందరు తప్పుడు సందేశాలను అందిస్తున్నారు.

## కపట విశ్వాసులు ఎందుకు తయారౌతున్నారు?

ఎడారివాసులు "**మేము విశ్వసించాము**" అని అంటారు. (ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను: "మీరు ఇంకా విశ్వసించలేదు. కావున: '**మేము ముస్లిముల మయ్యాము**' అని అనండి. ఎందుకంటే ఈమాన్ (విశ్వాసం) మీ హృదయాలలోకి ఇంకా ప్రవేశించలేదు..." (ఖుర్ఆన్ 49:14)

(ఓ ముహమ్మద్!) వారు ఇస్లామ్‌ను స్వీకరించి, నీకు ఉపకారం చేసినట్లు వ్యవహరిస్తున్నారు. వారితో ఇలా అను: "మీరు ఇస్లామ్‌ను స్వీకరించి నాకు ఎలాంటి ఉపకారం చేయలేదు. వాస్తవానికి, మీరు సత్యవంతులే అయితే మీకు విశ్వాసం వైపునకు మార్గదర్శకత్వం చేసి, అల్లాహ్‌యే మీకు ఉపకారం చేశాడని అనుకోండి" (ఖుర్ఆన్ 49:17)

పై ఆయత్ బనూ అసద్ తెగవారి విషయంలో అవతరించింది. వారు కరువు సమయంలో మదీనాకు వచ్చారు. ముస్లిమ్‌ల ఫండ్స్ నుండి ఆర్థిక సహాయం కోసం. వారికి ఇస్లామ్ ఆదేశాల గురించి గాని, ఇస్లామ్ నేర్పిన సంస్కారం గురించిగాని ఏమీ తెలియదు. ఎక్కడ పడితే అక్కడ కాలకృత్యాలకు పాల్పడి మదీనా వీధులను పాడు చేశారు. వారు ప్రవక్త(స)వారితో అన్నారు : "మేము ఎటువంటి ఘర్షణ లేకుండానే ఇస్లామ్ స్వీకరించాము. ఇతర తెగలు సుదీర్ఘ కాలం యుద్ధం చేసినట్లు మేము మీతో యుద్ధం చేయలేదు. ముస్లిములమయ్యాము. కాబట్టి మీరు మాకు విలువ ఇవ్వాలి."

యుద్ధప్రాప్తి కొరకు బనూ ముస్తలఖ్ తెగవారు ఏమి చేశారో ముందుగా చెప్పుకున్నాం. పై ఆయత్ ద్వారా బనూ అసద్ తెగవారు ముస్లిముల 'బైతుల్‌మాల్'నుండి ఆర్థికంగా సహాయం పొందడానికి 'ముస్లిములు' అయినట్లు తెలుస్తుంది.

మరి ఇప్పుడెందుకు మన రాష్ట్రంలో కపట విశ్వాసులు తయారు అవుతున్నారు? ఇక్కడ కూడా డబ్బు కోసమే. విదేశాల నుండి మరియు స్వదేశం నుండి పేద ప్రజల ప్రయోజనార్థం అందే 'జకాత్' సొమ్మును 'దావా' పేరుతో కొల్లగొట్టడానికి. కొందరైతే ముస్లిములుగా సర్టిఫికెట్ సంపాదించుకుని, గల్ఫ్ దేశాలలో ఎక్కువ వేతనాన్ని పొందడానికిగాని, లేదా సులభంగా ఆయాదేశాలలో వీసా సంపాదించుకోవడానికి కపట విశ్వాసులుగా మారుతున్నారు. అమాయక ముస్లిమ్ అమ్మాయిలను ధర్మం ముసుగులో కపట విశ్వాసులతో పెళ్ళిళ్లు జరపడం కూడా జరుగుతున్నట్లు విశ్వసనీయుల ద్వారా సమాచారం అందింది.

ముస్లిమ్ సమాజం నిద్రపోతూ ఉండడంతో మన రాష్ట్రంలో ఒక సంస్థ ఇటువంటి కాపట్య కార్యక్రమాలను చాపక్రింద నీరులా, అన్ని ప్రాంతాలకు పాకేలా చేస్తుంది.

ముస్లిమ్ సమాజం ఇప్పటికైనా కళ్ళుతెరిచి మనదేశ చట్టానికి ఇటువంటి వారిని అప్పగిస్తే, తమ బాధ్యతను కొంతైనా నెరవేర్చు కున్నట్లు అవుతుంది.

**కపట విశ్వాసులతో మనం ఎలా వ్యవహరించాలి :**

వారు శతృవులు. వారితో మనం కఠినంగా వ్యవహరించాలి.

జైద్ బిన్ అర్ఖమ్(రజి) తాను ఎంతగానో అభిమానించిన తన తెగ నాయకుడు 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై' ముహమ్మద్(స)వారికి వ్యతిరేకంగానూ, ఆయన గురించి హీనంగా మాట్లాడిన మాటలను విని సహించలేక అతనికి ఎదురు తిరిగారు. విశ్వాసం (ఈమాన్) అంటే అది.

ఉమర్(రజి)వారు మునాఫిఖ్ శిరచ్ఛేధానికి అనుమతి నివ్వమని కోరితే ప్రవక్త(స)వారు అనుమతి నివ్వలేదు. 'ఇబ్నె ఉబై'ని ఎంతో ప్రేమగా చూసుకునే అతని కుమారుడే, ప్రవక్త(స)వారి గురించి తక్కువచేసి మాట్లాడి నందుకు చంపడానికి సిద్ధమై ప్రవక్త(స)వారి అనుమతి కోరారు.

ముహమ్మద్(స)వారి గురించి గౌరవంగా చెప్పి, ఆయన(స) అనుమతి నిచ్చేదాకా మదీనా నగరంలోకి తండ్రి ప్రవేశం జరగకుండా కొడుకు ఆపాడు. ఇది విశ్వాసం.

'అల్లాహ్ వారిని నాశనం చేయుగాక!' అని ఖుర్ఆన్‌లో అల్లాహ్‌యే స్వయంగా అన్నారు.

క్రింది ఖుర్ఆన్ ఆయత్ చూడండి :

అల్లాహ్ మరియు పరలోకాన్ని విశ్వసించే జనులలో (మోమిన్‌లలో) **అల్లాహ్ మరియు ఆయన సందేశహరుణ్ణి వ్యతిరేకించే వారిని ప్రేమించటాన్ని నీవు ఎన్నడూ చూడలేవు. ఆ వ్యతిరేకించే వారు, తమ తండ్రులైనా లేదా తమ కుమారులైనా లేదా తమ సోదరులైనా లేదా తమ కుటుంబంవారైనా సరే! అలాంటి వారి హృదయాలలో ఆయన విశ్వాసాన్ని స్థిరపరచాడు.** (ఖుర్ఆన్ 58:22)

కపట విశ్వాసి తండ్రియైనా, ఇతర బంధువైనా సరే వారిపట్ల మన వైఖరి ఒక్కటే! కపట విశ్వాసులు మాట్లాడుతూ ఉంటే వింటూ ఉండిపోతామని ఖుర్ఆన్ ద్వారా తెలుస్తుంది. కాబట్టి జాగ్రత్త! **కొన్ని తీపి ప్రసంగాలు మనల్ని తప్పుదారి పట్టించవచ్చు.** పాఠకులకు కపట విశ్వాసులపై ఓ అవగాహన వచ్చి ఉంటుందని భావిస్తున్నాము. మరిన్ని వివరాలు వచ్చే సంచికలో ఇన్షా అల్లాహ్, ఖుర్ఆన్ తఫ్సీర్‌లో అందిస్తాము.

# పాఠకుల అభిప్రాయాలు

### తిరిగి గూటికి - అబూజర్(రజి) ...

అబూజర్(రజి)వారి వృత్తాంతాన్ని చదివి, చాలా మంది స్పందించారు. చాలా బాగుందని చెప్పారు. సహాబాల గొప్ప నడవడిక అందరికీ నచ్చుతుంది. ఆయన నడివడికను సరియైన విధంగా అందించడానికి మా శక్తిమేర ప్రయత్నించాము. ప్రవక్త(స)వారి అనుచరుల గురించి వివరించి చెప్పే ఇటువంటి విషయాలు, ఇంతవరకూ ఎందుకు బయటకు రాలేదు? అని కొందరు అమాయకంగా ప్రశ్నించారు.

బయటకు రాకపోవడమేమిటి? వందల సంవత్సరాల నుండి ఎన్నో భాషలలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కాని ఈ రోజుల్లో ప్రజలు దురదృష్టవశాత్తూ వీధి ప్రోగ్రామ్స్‌లో జరిగే ప్రసంగాలపై ఆధారపడిపోయి, పుస్తక పఠనానికి దూరం అయిపోయారు. ప్రసంగీకులు ఏది చెబితే అదే ఇస్లామ్ అనుకునే పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. ఈ ప్రసంగీకులకే స్వయంగా ఇస్లామ్‌పై సరియైన అవగాహన లేదు. వీరు ఏమి చెప్పగలరు? ఎలా చెప్పగలరు?

కారణమేమిటంటే, అబూజర్(రజి) చాలా నిరాడంబరంగా బ్రతికేవారు. కానుకలు ఆయన తీసుకోలేదు. కష్టపడి పనిచేసేవారు. ఇవన్నీ చెబితే, అసలు విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని, అందువలన తమకు అందే కానుకలు కూడా ఆగిపోతాయని, కష్టపడి పనిచేసి బ్రతకమని తమకు ప్రజలు సలహా ఇస్తారని భయపడి దాయీలు ఇటువంటివి చెప్పరు. నిజంగా అంత జ్ఞానమే గనుక వారికుంటే వారు దాయీలు ఎందుకు అవుతారు? తిరిగి గూటికి శీర్షికలో నవముస్లిముల సమస్యలకు సూచించే పరిష్కారంలో భాగంగా అబూజర్(రజి)వారి గురించి చెప్పడం జరిగింది. కాని అది ఆయన పూర్తి జీవిత చరిత్ర కాదు. ఇంకా ఎన్నో వివరాలున్నాయి.

అబూజర్(రజి)వారు ఒంటరిగా చనిపోయారు. ఊరిలో జనాజా నమాజ్ కొరకు పురుషులు ఎవరూ లేరు. అంటే ఆ ఊరిలో కేవలం ఈ ఒక్క కుటుంబం మాత్రమే నివశిస్తుందని కాదు, అది హజ్జ్ చేసే కాలం. హజ్జ్ కొరకు ఊరంతా ఆ సమయంలో ఖాళీ అయిపోయి ఉంది.

ముహమ్మద్(స)వారి సహచరుల జీవితాలు మనకు ఓదార్పునిస్తాయి. ముహమ్మద్(స)వారు ఏ అనుచరులకు అయితే స్వర్గ శుభవార్తను అందించారో, ఆ అనుచరులు మరింత అణుకువతో అతి నిరాడంబర జీవితాన్ని గడిపారు. ముహమ్మద్(స)వారు తనను పేదవాడిగానే మరణించేలా చేయమని అల్లాహ్‌ను కోరుకున్నారంటే, ఆ నిరాడంబరతలో ఎంత ప్రశాంతత ఉందో ఆలోచించండి!

ఈ సంచికలో మరో సహాబీ 'సల్మాన్ అల్-ఫార్సీ(రజి)' గురించి అల్లాహ్ దయవలన కొన్ని ముఖ్య వివరాలను అందించగలిగాము. ఈ వ్యాసం కూడా మీకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

ముహమ్మద్(స)వారు కానుకలు ఇచ్చి పుచ్చుకోమన్నారు. కాబట్టి అబూజర్(రజి)వారు తన దగ్గరికి తీసుకువచ్చిన కానుకలను తిరస్కరించడం అంటే ప్రవక్త(స)వారి బోధనను తిరస్కరించి నట్లు కాదు.

అబూజర్(రజి)వారి పేదరికాన్ని చూచి, కానుకలు తీసుకువచ్చేవారు. కాని ఆయన ఆత్మ విశ్వాసం వాటిని సున్నితంగా తిరస్కరించేలా చేసింది. ప్రవక్త(స) అనుచరులందరూ కష్టపడి పనిచేయమని చెప్పి, ఆ విధంగా ఆచరించిన వారే! 'శాంతిబాట' పాఠకులు తమ ఏరియాల్లో తిరిగే దాయీలను "ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల" ద్వారా సంస్కరించి వారు తమ చేతి సంపాదనపైనే ఆధారపడేలా చేయడానికి మీ వంతు కృషి చేయమని కోరుతున్నాము.

### సామాన్యుడు ఎవరి మాట స్వీకరించాలి ?

"మీరేమో ఒకటి చెబుతున్నారు. ఫలానా దాయిగారు మరియు ఫలానా మదనీగారు మరోలా చెబుతున్నారు. మేము దేనిని స్వీకరించాలి? మేము సామాన్యులం. అన్ని పుస్తకాలు చదివే సమయం మాకుండదు కదా!"

ఏదైనా విషయంలో ఏది నిజమో ఏది నిజం కాదో అని మీకు సందేహం ఉంటే, దానికి దూరంగా ఉండమని ప్రవక్త(స)వారు బోధించిన ఓ హదీస్ గురించి ఈ మధ్యకాలంలోనే శాంతిబాటలో అందించాము.

ఇంతకీ ఈ సోదరుల సమస్య ఏమిటంటే - **3 లేదా అంతకంటే ఎక్కువ గ్రంథాలతో ఇస్లామ్ వైపు ప్రజలను పిలవవచ్చా? లేదా?**

'శాంతిబాట' డిశంబర్'09 - జనవరి'10 సంచికలో ఖుర్'ఆన్ ఆయత్‌ల ద్వారా, ప్రామాణిక హదీస్‌ల ద్వారా ఈ అంశంపై వివరాలను అందించాము. పూర్తిగా వివరించాము. మేము ఇచ్చిన ఖుర్'ఆన్ ఆయత్ యొక్క తెలుగు అనువాదం సరియైనదో, కాదో తెలుసు కోవడం ఎవరికైనా కష్టమైన పనికాదు. చాలా సులభంగా పరీక్షించుకోవచ్చు. తెలుగు అనువాదాలు అందుబాటులో ఉన్నాయి. మరియు మేమిచ్చే హదీస్‌లను కూడా సులభంగా వెరిఫై చేసుకునే విధంగా, వాటి పూర్తి రిఫరెన్స్ వివరాలను కూడా అందించాము.

ఏదైనా ఒక సంఘటన జరిగితే, నేడు న్యూస్ పేపర్లలో మరియు టి.వి.న్యూస్ ఛానళ్ళలో ఆ విషయాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం కడపలో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఒకే సంఘటనపై వివిధ చానళ్ళవారు ప్రసారం చేసే న్యూస్ చూసే ఉంటారు. ఇంతకు పూర్వమయితే కేవలం రాజకీయ నాయకులే ఒకరినొకరు విమర్శించు కునేవారు. నేడు ఛానళ్ళవారు కూడా మరో ఛానల్‌ను విమర్శిస్తూ ఆ ఛానల్ క్లిప్పింగ్స్ చూపుతున్నారు. అన్నీ వింటే, ఆలోచించగలిగే వారికి నిజమేమిటో సులభంగా అర్థమౌతుంది. వినేవారికి మరియు చూసేవారికి మాట్లాడే నాయకుల చరిత్ర గురించి తెలుసు. ఏయే న్యూస్ ఛానళ్ళు ఎటువంటివో కూడా తెలుసు. కాబట్టి ఏది నమ్మాలో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**మదీనా యూనివర్శిటీలో చదివినా, మన ఊరి మదరసాలో చదివినా 'సత్యం' మారిపోతుందా? ఇతర గ్రంథాలతో చేయవచ్చా? లేదా? అని మీకు సందేహముంది కదా! అటువంటప్పుడు అవి మానేయండి. ఖుర్'ఆన్‌తో మరియు హదీస్‌లతో చేయవచ్చని మీకు స్పష్టంగా తెలుసు కాబట్టి, వాటిని స్వీకరించండి.**

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.**

క్రింది ఖుర్ఆన్ వాక్యం చదవండి :

> ఆయనే ఆ నిరక్షరాస్యులైన వారిలో నుండి ఒక సందేశహరుణ్ణి లేపాడు. అతను వారికి ఆయన ఆయత్‌లను చదివి వినిపిస్తున్నాడు మరియు **వారిని సంస్కరిస్తున్నాడు మరియు వారికి గ్రంథాన్ని మరియు వివేకాన్ని బోధిస్తున్నాడు** మరియు వాస్తవానికి వారు, అంతకు పూర్వం స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడిఉండేవారు. (ఖుర్ఆన్ 62:2)

పూర్తి మార్గభ్రష్టత్వంలో ఉన్నవారిని సైతం సంస్కరించడానికి ఖుర్ఆన్ ఉపయోగ పడుతుందని, అల్లాహ్‌యే స్వయంగా చెబుతూ ఉంటే "ఎవరి మాట నమ్మాలి?" అని అడిగే బదులు మీకు అల్లాహ్‌పై విశ్వాసముంటే అల్లాహ్ మాటనే నమ్మాలి.

ఒక హిందూ సోదరుడు గాని, ఒక క్రైస్తవ సోదరుడుగాని ఖుర్ఆన్ గ్రంథం తీసుకువచ్చి 'వడ్డీ వ్యాపారాన్ని మీ అల్లాహ్ నిషేధించారని మీ గ్రంథంలో ఉంది కాబట్టి ఆ వ్యాపారం మానుకోండి" అని వడ్డీ వ్యాపారం చేసుకునే ఓ 'ముస్లిమ్'కి ఖుర్ఆన్ గ్రంథాన్ని చూపిస్తే, అతను వడ్డీ వ్యాపారం మానేస్తాడా? చెప్పండి.

వారు 'అబద్ధం చెప్పకండి' అని సలహా ఇస్తూ ఇదే విషయం మీ హదీస్ గ్రంథాలలో ఉంది అని హదీస్ గ్రంథాలను నేటి దాయీలకు చూపిస్తే, దాయీలు అబద్ధం చెప్పడం మానేస్తారా? అబద్ధం చెప్పడం 'హిక్మత్' అని చెప్పేటంత నీచ స్థితికి దిగజారిపోయిన ఆ ధర్మప్రచారకులే సత్యాన్ని స్వీకరించడం లేదంటే, ఇతర గ్రంథాలతో ఇతరులను పిలవాలి అని చెప్పడం మూర్ఖత్వం కాక మరేమిటి?

**సత్యాన్ని స్వీకరించేవారు మంచి ఎవరు చెప్పినా స్వీకరిస్తారు.**

సత్యాన్ని తిరస్కరించేవారు ఎంతో స్పష్టంగా ఉన్నవాటిని చూపించినా, స్వీకరించరు.

ఖుర్ఆన్ గ్రంథం అల్లాహ్ పంపిన గ్రంథమని మీకు విశ్వాసం ఉంటే, 1400 సం॥లు గడిచినా ఒక అక్షరం కూడా మారకుండా అల్లాహ్ రక్షణలోనే ఆ గ్రంథం ఉందనే విశ్వాసముంటే ఆ గ్రంథం మీకు సరిపోతుంది.

దాదాపు 23 సంవత్సరాల కాలంలో అరేబియా సమాజంలోని సకల దురాచారాలను రూపుమాపి ప్రజలలో ఉత్తమ నడవడికకు కారణం - ముహమ్మద్(స)వారి బోధనలే అని మీకు నమ్మకం ఉంటే ఆ బోధనలను స్వీకరించండి.

**ఇస్లామ్‌లో ఎటువంటి బలవంతం లేదు.**

అల్లాహ్ మిమ్మల్ని కేవలం 'దావా' ఒక్కటే చేయమన్నారా? దావా ఒక్కటే అవసరమైతే ఖుర్ఆన్ గ్రంథం ఎందుకు?

మమ్మల్ని ప్రశ్నించిన సోదరులకు కొన్ని ప్రశ్నలను అందిస్తున్నాము. ఆ ప్రశ్నలను వారు స్వయంగా వారిపైనే వేసుకుని సమాధానం చెప్పగలుగుతారో లేదో ప్రయత్నించుకోవాలి.

1. ఖుర్ఆన్ అంటే ఏమిటి? దానిని అల్లాహ్ ఎందుకు అవతరింపజేశాడు?
2. తఫ్సీర్ అంటే ఏమిటి? ఏదైనా తఫ్సీర్ గ్రంథం ఎప్పుడైనా చదివారా?
3. ఖుర్ఆన్ గ్రంథాన్ని అర్థం చేసుకుంటూ, దానిని పూర్తిగా మీ జీవితంలో కనీసం ఓ మూడు సార్లయినా చదివి ఉంటారా?
4. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్, అబూదావూద్, తిర్మిజీ, నసాయీ, ఇబ్నెమాజా మొదలైన హదీస్ గ్రంథాలలో ఏ ఒక్కటైనా పూర్తిగా చదివి ఉన్నారా?

జీవితం చాలా చిన్నది. ఎదుటివారికి ఏదైతే బోధించాలని మీరు అనుకుంటున్నారో, దానిని ముందుగా మీరు తెలుసుకోవాలి కదా! ఎవరినో సన్మార్గంలోకి తెస్తామని చెబుతూ, మీరే ప్రవక్త(స)వారి బోధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించి మార్గభ్రష్టత్వం వైపు పోతే ఎలా? ఇది వివేకమా?

కష్టపడి పనిచేస్తూ, ఖుర్ఆన్ మరియు హదీస్‌ల ప్రకారం మిమ్మల్ని మీరు సంస్కరించు కున్నప్పుడు, మీకు తెలియకుండానే మీ ద్వారా 'దావా' జరుగుతూ ఉంటుంది.

న్యూస్ పేపర్‌ని ఎదురుగా పెట్టుకుని, దానిని చదివి అర్థం చేసుకో గలిగేవారు కూడా, దానిని చదవకుండా అందులో ఏముందో వేరే వ్యక్తిని చదివి వినిపించమని అంటున్నారు. వారు చదివి మీకు వినిపిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా చెబుతున్నారు. మేము ఏది నమ్మాలి అంటున్నారు.

ఈ డ్రామా అంతా ఎందుకు?

మీరే స్వయంగా చదివి తెలుసుకోవచ్చు కదా!

ఈ ప్రశ్నకు బహుశా మీ జవాబు : "అంత సమయం లేదు".

ప్రోగ్రామ్స్‌కి వెళ్ళడానికి ఎంతో సమయాన్ని వెచ్చిస్తారు. ప్రసంగాల సిడిలు చూడటానికి ఎంతో సమయం వెచ్చిస్తారు. 'అల్లాహ్ ప్రసంగ పాఠానికి కూడా కొంత సమయం వెచ్చించండి. మీకు ఉపయోగపడేది ఇది మాత్రమే!

**కొత్తగా చేరిన చందాదారులకు విజ్ఞప్తి**

మార్చి 28వ తారీఖున పోస్ట్ చేసిన అక్టోబర్ - నవంబర్, 2010 సంచిక అందుకున్న ఓ సోదరుడు, ప్రొద్దుటూరు నుండి ఫోన్ చేసి, 6 నెలల కొకసారి ప్రింట్ చేస్తారా? అంటూ కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు కూడా చేశారు, చెప్పే విషయాలు పూర్తిగా వినకుండానే. పత్రిక ప్రారంభంలో వచ్చిన కొన్ని సమస్యల వలన పత్రిక ఆలస్యమైంది. ఆ ఆలస్యాన్ని కవర్ చేయడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నించాము. అయితే కొన్ని ముఖ్యమైన విషయాలపై పరిశోధనకు అధిక సమయం అవసరం కావడంతో ఆలస్యాన్ని తగ్గించలేక పోయాము. మార్చి 28, 2011న ప్రింట్ అయింది కనుక 'మార్చి' అని పత్రిక కవర్‌పై ప్రింట్ చేసేస్తే సమస్య రాదు కదా అని అనవచ్చు. కాని అట్లా చేస్తే మధ్య కాలంలో పత్రిక ప్రింట్ చేయనట్లు ఉంటుంది. రెండేసి సంచికలను కలిపి జూలై నెలాఖురకు ఆలస్యాన్ని పూర్తిగా తగ్గించి, ఏ నెలకు ఆ నెల మొదటి వారంలో 'శాంతిబాట' విడుదల అయ్యేలా ప్రయత్నిస్తున్నాము. ప్రతీ నెలా 28వ తారీఖున పత్రిక పోస్ట్ అవుతుంది. ఒకొక్కసారి టెక్నికల్ ప్రోబ్లమ్స్ వలన వారం పదిరోజులు ఆలస్యమయ్యే పరిస్థితి కూడా ఉంది. కాబట్టి కొత్తగా చేరిన చందాదారులు పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరుతున్నాము. పత్రిక ప్రారంభం నుండి ఉన్న చందాదారులకు అన్ని విషయాలు తెలుసు.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

حدَّثَنَا اِبْرَاهِيمُ بنُ المُنْذِرِ قالَ: حدَّثني مَعْنٌ، عَنْ مالكٍ، عَنِ ابنِ شِهابٍ، عَنْ مُحَمَّدِ بنِ جُبَيْرِ بنِ مُطْعِمٍ، عَنْ أبِيهِ رَضِيَ اللهُ عَنْهُ قالَ: قالَ رَسُولُ اللهِ ﷺ: ((لي خَمْسَةُ أسماءٍ: أنا مُحَمَّدٌ، وأحْمَدُ، وأنا المَاحِي الَّذِي يَمْحُو اللهُ بِيَ الكُفرَ. وأنا الحَاشِرُ الَّذِي يُحْشَرُ النّاسُ على قَدَمي، وأنا العاقِبُ)).

**Narrated Jubair bin Mutim:**

**Allah's Apostle ﷺ said, "I have five names: I am Muhammad and Ahmad; I am Al-Mahi through whom Allah will eliminate infidelity; I am Al-Hashir who will be the first to be resurrected, the people being resurrected there after; and I am also Al-'Aqib (i.e. There will be no prophet after me)."**

**జుబైర్ బిన్ ముత్'ఇమ్ ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: నాకు 5 పేర్లు ఉన్నాయి. నేను ముహమ్మద్ మరియు అహ్మద్. నేను అల్-మాహీ నా ద్వారా అల్లాహ్ అవిశ్వాసాన్ని చెరిపేస్తాడు, నేను అల్-హాషిర్ పునరుథ్థాన దినమున మొట్టమొదట లేపబడతాను, ఆ తరువాత ప్రజలు లేపబడతారు. మరియు నేను అల్-'ఆఖిబ్ (నా తరువాత మరో ప్రవక్త ఉండరు).**

(సహీహ్ బుఖారీ, 3532, 61. మనాఖిబ్, అధ్యా. 17, సంపుటి 4)

అల్లాహ్‌కు తోడుగా మరొక ఆరాధ్య దైవాన్ని కల్పించకు, అలా చేస్తే
నీవు అవమానింపబడి సహకారాలు పొందని వాడవవుతావు.
మరియు నీ ప్రభువు : తనను తప్ప ఇతరులను ఆరాధించ కూడదనీ
మరియు తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించాలనీ,
ఆజ్ఞాపించి ఉన్నాడు. ఒకవేళ వారిలో ఏ ఒక్కరు గానీ, లేదా
వారిరువురు గానీ, ముసలివారైతే, వారితో విసుక్కుంటూ
"(ఉఫ్)" అని కూడా అనకు మరియు వారిని గద్దించకు మరియు
వారితో మర్యాదగా మాట్లాడు.
మరియు వారిమీద కరుణ మరియు వినయ విధేయతల రెక్కలను
చాపు. మరియు వారి కొరకు ఇలా ప్రార్థించు : "ఓ నా ప్రభూ! వారు ఏ
విధంగా నన్ను బాల్యంలో పెంచారో అదే విధంగా నీవు వారి యెడల
కరుణను చూపు!" (ఖుర్'ఆన్ 17:22-24)




SAANTHIBAATA MONTHLY *Special Issue* December, 2010-January, 2011
Samalkot-533440 (East Godavari Dist.)
Registered with Registrar of News Papers for India
RNI Reg. No. APTEL/2009/29650